# ఆషామాషి

తెలుగువారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్లు

రావూరు వెంకట సత్యనారాయణ రావు



శ్రీ
కౌముది
మీ మునివేళ్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 160

కౌముది మాసపత్రికలో

జనవరి 2011 సంచిక నుంచి డిసెంబర్ 2015 సంచిక వరకూ వచ్చిన

# ఆషామాషీ

ముఖచిత్రం: బాలి

(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

1

(జులై 7, 1972, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**ఏ సంసారంలో చూచినా, ఏదో** ఒక సమస్య, ఏ వ్యక్తిని పలకరించినా ఏదో ఒక వేదన, ఏ యువకుణ్ణి చూచినా ఏదో ఒక సరిక్రొత్త సాధన.. ఏ ప్రసంగం విన్నా ఏదో ఒక అర్థంకాని బోధన!

ఈ ప్రపంచంలో హాయిగా బ్రతుకుతున్నట్లు నటించడమేగాని, అలాటి అదృష్టం నిజంగా ఉన్న వాళ్ళు చాలా తక్కువ మంది.

"అంతా కులాసా?" అని ప్రశ్నిస్తే

"ఏం కులాసా లెండి! అలాగే కుంటుకుంటూ పోతున్నా ముందుకు" అని జవాబు చెప్పేవారే ఎక్కువమంది కనిపిస్తారు. వారి గొడవలే ఎక్కువగా వినిపిస్తాయి!...

అయితే కొరతలు కొన్ని జీవితాలలో ఉన్నా "కొందరు కోరరాని కోరికలు కోరి" తీరని ఆవేదన చెందుతూ ఉండటం కూడా కద్దు. ఇదో రకం ప్రారబ్ధం.

ఎంత సంపాదన ఉన్నా - సంతృప్తి లేక పోవడం వల్ల చాలామంది బాధపడుతూ ఉంటారు. ఏదో భగవంతుడు అన్నం ఇళ్ళూ ఇచ్చాడు. ఎలాగో అలా తిని పరుంటే సరిపోతుందనుకోకపోవడం... లేనిపోనిదాన్ని ఒకటి తలుచుకుని తలబాదుకోవడం ఇలాటి కళలో ఒకటి అయింది.

### *గ్యాస్ పొయ్యి మీద అంతులేని విరహం!*

కుంపట్లో పండునిప్పులమీద కూరలు వగైరాలు చక్కగా ఉడుకుతాయి, తినడానికి ఎంతో రుచిగా కూడా ఉంటాయి. కాని అలా వండుకుని తినే మనఃశ్శాంతి ఎక్కడిది? మధ్య మధ్య గ్యాస్ పొయ్యి మీద విరహం, చేస్తున్న పనిమీద నిర్లక్ష్యం, కొనలేదని అప్పట్లో పడి కొట్టుకు చచ్చే భర్త మీద నింద.. ఇలా నీళ్ళు కారిపోతూ ఉంటారు కొందరు ఇల్లాళ్ళు.

ఇలా ఎన్నెన్ని కారణాలతోనో ప్రజలు జీవితంలో గల సరదా పోగొట్టుకుంటున్నారు. సరదా కూడా చాలా ఖరీదు గల వస్తువైపోయింది. మొన్న ఒక యువకుడు కనిపించాడు. బజారులో భార్య కూడా వెంట ఉంది. ఆయన పలకరించాడు

"సినిమాకా?" అన్నాను.

ఆయన తేరిపార చూచి "అలా అన్నారేం?" అన్నాడు.

"ఏదో సరదాకు వెడుతున్నారేమోనని అన్నాను!"

"అంత సరదా ఎక్కడుంది జీవితాలలో? సినిమా అయిదు రూపాయలు వదిలిస్తుంది. ఇంట్లో చింతపండులేదు. మిరపకాయలు లేవు. కాఫీ పొడుం అయిపోయింది. సరదాగా సినిమా చూచి, ఇంటికి వెళ్ళి పడుకుంటే - తెల్లారి ఏ అమ్మ బదులిస్తుంది?... ఈ రోజుల్లో వాకిట్లోకి వెడితే పొమ్మనే వారేగాని - రమ్మనేవారు లేరు" అని అతగాడు ఎంతో దైన్యంగా తన స్థితిగతుల్ని వర్ణించాడు.

నిజమే. ఈ రోజుల్లో సరదాలు నశించి పోయాయి. భార్యాభర్తలు కానివ్వండి, తండ్రీ బిడ్డలు కానివ్వండి. తల్లీపిల్లలు కానివ్వండి ఒక్క అరగంట నవ్వుతూ సరదాగా కాలక్షేపం చేసే అవకాశాలు కల్పించుకోలేకుండా ఉన్నారు. అంతగా కావాలంటే డబ్బుతో సంపాదించుకోవలసి వస్తోంది.

***పొరుగూరు నుంచి వచ్చిన పున్నయ్యలాగా..***

పుట్టెడు బాధలతో ఇంటికి చేరిన పురుషుడు - రెండు మెతుకులు తిని దిండు మీద తలవాల్చడం తప్ప ఏం ఆలోచించగలడు? భార్యతో సరదాగా ఏం మాట్లాడగలడు? నవ్వుల సంతర్పణ లేం చెయ్యగలడు? పొరుగూరు నుంచి వచ్చిన పున్నయ్యలాగా పడుకుని నిద్రపోవడం తప్ప!

నలుగురు పిల్లలున్న ఇంట్లో నారీమణులు మాత్రం ఏం కులాసాగా ఉంటున్నారు - వాళ్ళ పోట్లాటలు, గొడవలు, కొట్టుకోవడాలు, ఇంట్లో వస్తువులు పాడు చెయ్యడాలు... అన్నిటినీ మించి చెవులు బద్దలయేటట్లు మోత మోగుటాలు, ఇవన్నీ భరిస్తూ ఆ ఇల్లాలు పనులు చేసుకోవాలంటే ఎంత అవస్థ!

ఈ అవస్థలో నుంచి తప్పించుకుని బయటపడటమే చాలని వెయ్యి దేవుళ్ళకు మొక్కుకుంటుంటే - ఇంకా సరదాలెక్కడ? సరసమెక్కడ? "ఈ రోజు గడిచింది ప్రభూ!.." అనుకుంటూ వంటిల్లు తాళం పెట్టడంలో ఎంతో శాంతి పొందే పరిస్థితులేర్పడ్డాయి.

***సరదాలు లేని సంసారాలు... వరదలో చెట్లు!***

సరదాలు లేని సంసారాలు వరదలో పడికొట్టుకుపోయే చెట్లలాంటివి. సరదాలు లేనిదే సహనమే కాదు, సరిఅయిన ఆలోచనే రాదు. "సర్వం దైవాధీనం" అన్నట్లు పడి ఉండవలసిందే...

ఆ భగవంతుడు మాత్రం ఎంత పని ఉన్నా సరదాలు మానుకున్నాడా! అబ్బో! అంతులేని సరదాలు. చుట్టూ నవ్వుల పరదాలు. అత్యవసరమైన పనులు కూడా మాని సరదాలు ఎప్పుడో కరీంద్రుని విషయంలో ఒక్కమాటు సరదాలు వదిలి వచ్చాడు గాని - తక్కిన సమయాలలో వాటికే ప్రాధాన్యం.

నారదముని ఒకసారి వైకుంఠానికి వెడితే ఆయనగారు లక్ష్మితో ఆటలాడుతున్నాడుట. "ఇదేమిటి స్వామీ!" అని ఆ బ్రహ్మచారి ఆశ్చర్యంగా అడిగాడుట.

ఆ అరవిందాక్షుడు చిరునవ్వు నవ్వి "ఏదో తోచక పాచికలు!" అన్నాడుట!

(జులై 13, 1976, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

## ఆశ..ఆశ..ఆశ!!

**చిన్నపిల్లలు ఏ బిళ్ళో,** బిస్కెట్టో తింటున్నప్పుడు ప్రక్కవాళ్ళు "కాస్త పెట్టవు " అని అడగడం - తింటున్నవాళ్ళు ఆ వస్తువు దాచి "అమ్మో! ఆశ!" నేనెందుకు పెడతాను" అనడం మామూలు.

"అమ్మో! ఆశా" అనడంలో ఆ పసివాళ్ళకు "తమ వస్తువు మరొకరికి ఎందుకు పెట్టాలనే స్వార్థం ఉంది - ఇంకోళ్ళ వస్తుకోసం ఆశపడవద్దని హెచ్చరించడం ఉంది. చిన్నతనంలో ఆ తినే వస్తువుమీద ఆశపుట్టడంలో అమాయకత్వం గోచరిస్తుంది.

పెద్దవాళ్ళయిన తర్వాత ఆశ అనేక రూపాలుగా మారుతుంది. ఆశపడటం తప్పని తెలిసినకొద్దీ ఆశ పడుతూ ఉండటం సహజమవుతుంది. ఆశలో సురచి అనేక అనర్థాలు పుట్టుకు వస్తాయి. అవి అనేక అకృత్యాలు చేయిస్తూ ఉంటాయి.

"ఆశించడంలో శక్తి ఉంది" అనే సామెత కూడా ఉంది మనకు. అయితే పరుల వస్తువులను ఆశించడం కాదు దీని అర్థం. ఏదైనా జీవితంలో కొన్ని ఆశలు కల్పించుకో... అని దురాశలుగా మాత్రం ఉండకూడదు. బరువు తీర్చేవిగా ఉండకూడదు. ఇష్టమైన వాటిని కష్టపడి సంపాదించుకోవాలి సంతృప్తిగా అనుభవించాలని అర్థం.

'బ్రతికి ఉండగా' ఈ కోరిక తీరుతుందా!" అని కొందరు అంతులేని తాపత్రయం పడుతుంటారు. ఆ కోరిక ఎలాంటిదన్న విషయం ఆలోచిస్తే - వింతగానూ ఉండవచ్చు - వెర్రిగానూ ఉండవచ్చు. అయినా ఆ వ్యక్తికి తీరడమే ప్రధానం.

***<u>బ్రతికి ఉండగా ఫిలిం యాక్టర్ని కావాలి..</u>***

నేను ఫిలుములలో పనిచేస్తున్న కాలంలో చాలామంది ఫిలుములలో నటించాలని వచ్చేవారు. ఒక్కసారి వెండితెర మీద నా బొమ్మ కనిపిస్తే చాలునంటూ ఉండేవారు. ధన సంపాదన కోసం కొందరు వచ్చి ప్రయత్నిస్తుంటే ... ఫిలిములో కనిపించడమే మహద్భాగ్యమని కొందరు వచ్చేవారు.

పొట్టిగా, దట్టంగా ఉన్న ఒక ధనవంతుడు వేషం కోసం వచ్చి - ఒక హోటల్లో దిగాడు. చాలా మందిని పిలిచి టీపార్టీలు చేస్తూండేవాడు. 'ఒక్క వేషం వేసి వెళ్ళిపోతానండీ!... ఛాన్సు చూడండి" అని ప్రతివాళ్ళతో చెప్పేవాడు. ఇంత వ్యామోహమేమిటని అడిగితే "మా పెదనాన్న కొడుకు నాటకాల్లో వేషాలు వేసి పేరు సంపాదించాడండి! వాడికి సన్మానం కూడా జరిగింది. ఇద్దరం సమాన భాగస్వాములం. ఇంటి ప్రక్క ఇల్లు. వాడికి సన్మానం జరిగితే ఊకుకుంటా నా! నేను ఫిలిం నటుడుగా సన్మానం పొందాలి. అందరూ అంటున్నారు - నే వేషం వేస్తే శివాజీగణేశన్‌లాగా ఉంటానని. కొద్ది రోజుల్లో 'ఆంధ్రాశివాజీ' అనిపించుకోవాలి. అప్పుడు మా పెదనాన్న కొడుకు ముఖాన్ని పాతగొడుగు లాగా ముడిచి మూల పెట్టాలి" అనేవాడాయన ఎంతో గర్వంతో.

రెండేళ్ళు అలా హోటల్ నివాసిగా ఉండిపోయాడు. టాక్సీలలో తిరగడం, మంచి ఠీవిగా ఉండడం.. టీ పార్టీలు చెయ్యడం - వీటితో చాలా ఖర్చయింది పాపం. చివరకు ఒక సినిమాలో నృత్యం సీనులో ప్రేక్షకుడిగా నిలబడే ఛాన్సు వచ్చింది. పొట్టివాడు గనుక ముందుగా నిలబెట్టారు.

ఒక సన్నివేశంలో ఉప్పొంగిపోయి అతడు కుప్పిగంతులు వేస్తుంటే వెనకవున్న మరో ప్రేక్షకుడు - మాడుపట్టున గట్టిగా కొడతాడు. ఈయన 'ఏడిశావులే' అన్నట్లు వెనక్కి చూచి ఊరుకొన్నాడు. దర్శకుడు "అలా కాదయ్యా! దెబ్బకు కూలపడాలి" అన్నాడు. అలాగే కూలపడ్డాడు. కాని ఫిలిం రంగంలో నిలబడలేదు 'ఆంధ్రశివాజీ' - ఆంధ్రభావాజీ'గా కొన్నాళ్ళు కాలం గడిపి స్వగృహానికి చేరాడు.

ఆ చిత్రం విడుదల అయినప్పుడు ఊళ్ళో వాళ్ళకు చాలా మందికి ఆయనే టిక్కెట్లు కొని ఇచ్చాడని చెప్పుకున్నారు. "పడ్డపుడు క్లోజ్ అప్ తీశారోయ్... అదైనా మనకి కొత్తకాబట్టి. కొత్త వాళ్ళకసలు కొట్టుకు చచ్చినా తియరు.. ". అని ఆయన చెప్పుకునేవాడు.

***<u>పడ్డందుకే మూడు వేలు.. పరుగెత్తితే. ఎంతో!</u>***

అక్కడివాళ్ళు "అయ్యా! తమరికి ఎంత ఇచ్చారు అలా పడ్డందుకు అని అడిగితే - "మూడు వేలు ముందే అక్కడ పెట్టారు" అని ఆయన గర్వంగా చెప్పాడుట. ఆ రోజుల్లో ఆ పల్లెటూళ్ళో అంతా నమ్మారు పాపం. ఒక రైతు వచ్చి "తమరు పడితేనే మూడువేలిచ్చారన్నమాట. పరుగెత్తితే ఎంత ఇచ్చేవారు" అన్నాడట.

''పరుగెడితే పదివేలు.. పాట పాడితే అయిదువేలు. మాటలు చెపితే పాతిక దాకా ఉంటుంది. నేను శాంపుల్ చూపించి చక్కా వచ్చా. అక్కడికే 'ఆంధ్ర శివాజీ గణేషన్' అని పేరు వచ్చింది. ఇక వాళ్ళే వస్తారు మనవూరు వెతుక్కుంటూ'' అనేవాడట ఆయన. అరవై అడుగుల ఫిలిముతో ఆయన వెండి తెర జీవితం ముగిసింది. అసలు జీవితాన్ని ఆయన ఇంకా అలా ఈడుస్తున్నాడని విన్నా.. ''ఫిలిం నటుడు'' అనిపించుకున్నానన ధీమా ఆయనలో ఇంకా మిగిలే ఉందేమో!

ఆయనగారు ఫిలింలో నన్నా ఓసారి పడిలేచిపోయాడు. చాలామంది నటులు కావాలని వచ్చి - స్టూడియోల వెంటపడి, పాండీ బజారులో నిలబడి, నిలబడి, వీధుల్లో కూలబడి - ఇళ్ళకు చేరినవారున్నారు. ఆశ వారిని తరుముకిని రావడం.. నిరాశ స్వంత నివాసాలకు చేర్చడం జరుగుతూ ఉంటుంది.

ఫిలిములలో పరుగెత్తితే ఎన్నివేలిస్తారో అనే విషయం అలా ఉంచి ఫిలిములలో ప్రవేశించడానికి మద్రాసు, హైదరాబాదులకు పరుగెత్తే వారికి ఎన్నో వేలు కావలసి వస్తాయి వాటిని ఆశ పేరిటి సుడిగుండంలో గ్రుమ్మరించి చక్కా వస్తుంటారు. ఫిలిములు తీయాలని పరుగెత్తే వారి సంగతీ అంతే! అర్ధరహితంగా పరుగుల తీసి వేలు తిరిగి వచ్చి - వేలు కొరుక్కుంటూ కూర్చోవడం కూడా కద్దు.

***బ్రతికి ఉండగా డైరెక్టర్ని కావాలి...***

కొంతమందికి దర్శకత్వం మీద ఎంతో మోజు. జీవితంలో ఒక్కసారన్నా దర్శకత్వం వహించాలనే ఆపేక్షతో తంటాలు పడుతూ ఉంటారు. సహాయ దర్శకులుగా నైనా చేరి ఏ పుష్కరం తర్వాతనో దర్శకత్వం ఛాన్సు వస్తుందనే ఆశతో కొందరు పనిచేస్తూ ఉంటారు.

ఇలా ఆశలు పడుతూ అరవయ్యో పడిలో పడిన ఒకాయనకు ఎలాగో దర్శకత్వం ఛాన్సు వచ్చింది. ఆయన ప్రతిభవల్ల కాదు - చౌకగా వస్తాడనీ నియమించారొక కంపెనీవారు. చిత్రానికి మాటలు పాటలు వ్రాయడానికి నన్ను ఎన్నుకున్నారు.

ఆ దర్శకుని ఆనందం అప్పుడు చూశాను. ఏ ఇరవై సంవత్సరాలో, ఘోర తపస్సు చేయగా పైన పుట్టలు మొలవగా, విష్ణుమూర్తి ప్రత్యక్షమై, పుట్టమీద మట్టి తీసివేసి - ''భక్తుడా! నీ తపస్సుకు మెచ్చితి, వరముకోరుకొనుము'' అన్నట్లుగా ప్రొడ్యూసర్ ఆయనకు ప్రత్యక్షమై వరమివ్వడం జరిగింది.

నేను సీనులు వ్రాసి తీసుకు వెడితే ''నేచూపేందేం లేదు - త్వర త్వరగా వ్రాసి వెయ్యండి చరచరా పిక్చర్ తీసి వేద్దాం. ఆలస్యం చేస్తే ఏం అవాంతరాలు వస్తాయో! ఇది ఫిలిం ప్రపంచం. నా పేరు వెండితెరమీద - దర్శకుడని - ఎప్పుడు చూద్దామా అని ఉంది'' అనేవారాయన.

నేను ఆయన కోరినట్లే త్వరగా వ్రాసి ఇవ్వడం ప్రారంభించాను. ఆయనగారు ఏ రోజుకారోజు షాట్ డివిజన్ చేసుకుంటూ ఉండేవాడు. ఆయన కోరిక సిద్ధింపచెయ్యమని నేను కూడా భగవంతుణ్ణి ప్రార్థిస్తూ ఉండేవాణ్ణి. పైగా చిత్రం త్వరలో విడుదల కావాలంటున్నాడు. అది నాక్కూడా సంతోషమేగా!

ఒక రోజు నేను బంధువుల ఇంటికి వెళ్ళవలసి వచ్చింది. ఆయన నేనున్న చోటుకి ఫోను చేశాడు. ''కులాసాగా ఉన్నారా?'' అని పదిమాట్లు అడిగాడు. ''ఉన్నానండీ! ఏమిటి అలా అడుగుతున్నారు? '' అన్నాను. ''ఏమీ లేదు లెండి! కులాసాగా ఉంటేసరి'' అని ఫోను పెట్టేశాడు.

మర్నాడు కలుసుకున్నప్పుడు చెప్పాడు - ''నాకు ఇదివరలో దర్శకత్వం ఛాన్సులు ఒకటి, రెండు వచ్చాయి. ఒకటి మొదలు పెట్టిన కొద్ది రోజులకు ప్రొడ్యూసర్ పోయాడు. మరో చిత్రంలో మాటలు, పాటలూ వ్రాస్తూ, వ్రాస్తూ కవి మరణించాడు. ఆ భయం నాకు ఒకటి ఉంది. అందుకని అడిగాడు'' అన్నాడాయన అతి దీనంగా.

అక్కడితో నాకు భయం పట్టుకుంది - ఈ మాట తెలిస్తే ఒప్పుకోకుండా ఉండేవాణ్ణి. బ్రతికి ఉంటే బలుసాకు తిని బ్రతకొచ్చు అని. ఆ తర్వాత ప్రతిరోజు భగవంతుణ్ణి ప్రార్ధించడం మొదలుపెట్టాను - ప్రభూ! ఈ చిత్రం ఎలాగో అలా బయటపడెయ్యి - నన్ను మాత్రం కాపాడు అని. ఆయన దయవల్ల ఆయనకు దర్శకత్వం లభించింది. నేను కులాసాగా బైటపడ్డాను.

ఆయన మళ్ళీ ఒకసారి కనిపించి "సార్! ఇంకో పిక్చర్ వచ్చేలాగా ఉంది. మళ్ళీ మనం కలసిపనిచేద్దాం" అన్నారు. నేను నమస్కరించి "ఈసారి మరొకర్ని చూసుకొండి.. మొన్ననే నాకు మనుమడు పుట్టాడు. వాడితో కొన్నాళ్ళు ఆడుకోవాలి" అన్నాను.

***బ్రతికి ఉండగా మంత్రి పదవి అలంకరించాలి***

వెనుకటికి ఒకాయన మంత్రి కావాలని చాలా తంటాలు పడ్డాడు. శాసనసభ్యుడైతే తప్పకుండా మంత్రిత్వం వస్తుందని ఆయన నమ్మకం. పదేళ్ళకు ఎలాగో ఆ పదవి అలంకరించాడు. మంత్రిత్వపు కుర్చీలో ఖాళీ లేకపోయినది. మనిషి  గుండె జబ్బుదాకా వచ్చింది.

ఎలాగో వైద్యం చేయించుకుని బయటపడ్డాడు. కాని కోర్కె అలాగే ఉండిపోయింది. చివరకు మంత్రిగానన్న నటించాలని - ఒక నాటకంలో మంత్రి వేషం వేశాడు. తర్వాత ఒక సన్మానసభ ఏర్పాటు చేయించుకున్నాడు.

అదే నాటకం పది ఊళ్ళల్లో వేయించారు స్వంత ఖర్చులమీద. దాంతో ఆయనకు "మంత్రి మంగారావు" అనే పేరు మ్రోగిపోయిందా ప్రాంతంలో.

"మంత్రిపదవి అయిదేళ్ళే - ఈ కితాబు బ్రతికి ఉన్నంతకాలం ఉంటుంది" అని ఎంతో గర్వంతో చెప్పుకున్నాడు.

**(అక్టోబర్ ౨, ౧౯౭౧, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**కొందరు మాట్లాడటంలో** చాలా పొదుపుగా మాట్లాడుతూ ఉంటారు. అలాంటివారు మాట్లాడుతున్నప్పుడు పలుకే బంగారమా అన్నట్లుంటుంది.

"ఎక్కువగా మాట్లాడడం వల్ల వచ్చే ప్రయోజనం ఏం ఉంటుంది! మన భావం అవతలవారికి అందించడమే కదా ముఖ్య ఉద్దేశ్యం!.. పైగా అవతలవారు ఒక చిన్న విషయాన్ని పెద్ద ఉపన్యాసంగా మార్చి చెప్పవలసిన స్థితిలో ఉండరు కదా - అలా ఉన్నారనుకుని మనం మాట్లాడటం మనం చేసే అపచారమే అవుతుంది కదా!" అని ఒక మితభాషి నిర్వచించాడు.

ఆయన భావాలతో ఏకీభవించకపోవడం కూడా అపచారమే అవుతుంది. మనకు మాటలమీద మక్కువకొద్దీ ఎక్కువ మాట్లాడటమే కానీ - భావాన్ని అందిస్తే, మన పని అయిపోతుందన్నమాట సత్యమే కదా!..

***సంజ్ఞలు చాలు సకలం గ్రహించడానికి***

ఎవరో అన్నట్లు అసలు మాట్లాడటం చాలా శ్రమతో కూడిన పని. సంజ్ఞలతో సకల భావాలూ వెలువరించవచ్చు... సంజ్ఞలు అద్భుతమైన సాంకేతికాలు... వాటిని ప్రదర్శించడం, అందుకోవడం కూడా చక్కటి కళే...

మూగవారు ఈ విధానానికి గురువులు... నాతో వారు పాపం మాట్లాడాలని తాపత్రయం కలవారైనా నోరులేకపోవడం వల్ల - ఎన్నో సాంకేతికాలూ, సంజ్ఞులూ అలవాటు చేసుకోవలసి వస్తుంది. వారి స్థితిని చూస్తే జాలివేస్తుంది. నోరుండి పొదుపుగా వాడుకునేవారిని చూస్తే ఎంతో సంతోషం కలుగుతుంది.

"ఆయన మూడు ముక్కల మనిషి" అని కొందర్ని ప్రశంసిస్తూ ఉంటారు. పైమాటకు చీట్లాటలో అభిలాష గలవాడనే అర్థం ఒకటి ఏర్పడింది గనుక కొంచెం మార్చి చెప్పడం అవసరమవుతోంది.

"మితభాషులకు సంఘంలో ఎక్కువ గౌరవం ఉన్నద"నే మాట సత్యం.. ఇంకా కొంచెం మాట్లాడితే బాగుండుననిపిస్తుంది.

అతిగా మాట్లాడేవారు చటుక్కున ఆపితే బాగుండును - మహోపకారం చేసినట్లవుతుందనిపిస్తుంది.

కొంచెం చనువుగలవారలా మాట్లాడుతున్నప్పుడు "అంత సోది దేనికి!.... అసలు విషయం చెప్పరాదూ.. ఆ మాత్రం మర్యాద తెలియదూ" అని విసుక్కోవడం జరుగుతూ ఉంటుంది. అవతలివారు తమ విసురులో ఇవతలివాళ్ళ విసుగు ఎంత మాత్రం గమనించరనేది కూడా మనం గమనించాలి.

అలా మాట్లాడేవారి విషయం అలావుంచి కొద్దిమాటలతో సరిపెట్టుకునే వారిలోగల చాకచక్యం కొంతవరకు పరిశీలిద్దాం.

***మీ ఇష్టం... మీకేం తోస్తే అది.. నాదేం ఉంది?***

భర్త ఏదైనా విషయం తనంతట తను తేల్చుకోలేక భార్యను సలహా అడుగుతాడనుకోండి. ఆవిడ ఒక్క ముక్కలో చెప్పేస్తుంది. "మీ ఇష్టం", "మీకేం తోస్తే అది", "నాదేం ఉంది", "అసలు నన్నడగాలేమిటి" - "ఇదేమి చిత్రం.. నాకేం తెలుసు", "మీదంతా సోద్యం - ఆ మాత్రం తెలియదేమిటి" - ఇత్యాదులు ఒక జాబితాలో చేరిన జవాబులు.

"ఇంకా నయం నన్నడగడమేమిటి?" "అంతదాన్నేమిటి నేను" - "అన్ని అతితెలివి తేటలు నా దగ్గర ఎక్కడున్నాయి?" - "ఆ మాత్రం ఆలోచనే ఉంటే ఇలా ఎందుకుంటాను?" - "మీకు పుణ్యం ఉంటుంది. నా మీద ఇలాంటివేమీ పెట్టకండి.. ఇలా బ్రతకనియ్యండి" - "ఇదో నాటకమేమిటి! "నా సలహా ఇప్పుడూ కావలసి వచ్చిందేమిటి ఎప్పుడూ లేనిది.

***భగవంతుడంత బుర్ర పెట్టలేదండీ***

"ఊరుకోండి ఎవరన్నా పోతారు"

"నన్ను పరీక్ష చేస్తున్నారేమిటి - నాతో సరసమేమిటి?" - "భగవంతుడు అంత బుర్రపెట్టలేదండీ" - ఇత్యాదులు కొంచెం ఉద్రేకంతో చెప్పే జవాబుల క్రింద జమకడతాయి.

కొందరు పురుషులు ఇంటికి వచ్చి ఎంతో ఆప్యాయంగా "అది కాదే! అసలేం జరిగిందంటే.." అని తన అనుభవాన్ని ఒకపావుగంటో, పది నిముషాలో ఎంతో హృదయానికి హత్తుకునేట్లుగా భార్య సానుభూతికోసం తాపత్రయం పడుతున్నట్లుగా చెప్పి ఆమె సమాధానం కోసం పుట్టెడు ఆశతో ఎదురు చూస్తారు..

ఆమెగారా విషయం అంతా శ్రద్ధగా వింటున్నట్లు అభినయించి అవతలనుంచి వచ్చే వాగ్ధాటి ఆగిపోయినదానికి గుర్తుగా "అలాగా అలా జరిగిందా!" అని ఒక్క ముక్క అని ఊరుకుంటారు. గుక్క తిప్పకుండా గుండెలో గాలిని అంత తోడిపోసిన వ్యక్తికి ఆ ముక్క ఏమంత సంతృప్తినిస్తుంది.

మరో ముక్కను ఆమె పెదవులనుంచి ఎలాగైనా రప్పించాలనే కోరికతో "అలాగా అంటావేమిటి! అచ్చంగా అంతే జరిగింది. ఇంకా కొన్ని విషయాలు చెప్పలా నీకు ఎందుకొచ్చిందని" అంటాడు. అప్పుడు కూడా ఆమె నోటినుంచి "బాగుంది" అనే పసిడి తునకలాంటి

ఒక్క ముక్కే బయటపడుతుంది అవతల వ్యక్తి చెప్పే విషయాన్ని బట్టి ఆమె మాటలు పెరగవు కాని అదే మోతాదులో కొంచెం మారుతూ ఉంటాయి... "అసలెందుకలా వెళ్ళారు?" - "మరీ విచిత్రంగా ఉందే" - "మనకేం పనిలేదేమిటి!" "ఇంకా నయం అంతటితో వదిలాడు." - "ఏమిటో గొడవ మనకన్నీ ఇలాటివే వస్తాయి" - "లేకపోతే మీదగ్గరా వాడి బడాయి" - ఇత్యాదులు సమయానుకూలంగా సందర్భ శుద్ధిగా వాడుతూ ఉంటాయి.

***పోనీ అలా అనకపోయావు బాగుండేది.***

మా బంధువుల్లో ఒకాయన ఉన్నాడు. ఆయన అతి మితభాషి. ఆవిడ అన్నివేళల్లో అనర్గళంగా మాట్లాడుతూ ఉంటుంది. తొణకదు - బెణకదు... మాట్లాడుతూ మధ్య మధ్య పెద్దగా నవ్వుతూ ఉంటుంది. ఆయనగారు ఆలోచించి ఆలోచించి ఒకసారి చిరునవ్వు నవ్వి "పోనీ అలా అనకపోయావు" అంటారు. ఆ మాట అందుకుని 'అలా ఎలా అనమంటారండి. నేనేం వెర్రిదాన్నా' అంటూ మరో గంభీర ఆవృత్తం.

కొంతసేపటికి మళ్ళీ ఆయనగారు తెగించి ఎవరీమాట అన్నది? మిసెస్ చలపతా? అంటాడు. "అయ్యోరామా ఆవిడేనండి. అక్కడ ఉండడానికి అందరూ ఉన్నారు. మిసెస్ సుబ్బరామయ్యా, మిసెస్ రామనాథం, మిసెస్ భానోజీరావు, మిసెస్ జంబులింగం, మిసెస్ ఆర్తనాదం, మిసెస్ డి.కె.యం.టి రావు అందరూ ఉన్నారు. అందరూ ఊరుకున్నారు. మిసెస్ చలపతే అలా కల్పించుకుని మాట్లాడింది" అంటుందామె.

"ఆవిడది కొంచెం లూజు టంగ్" అని ఆయన మందహాసం చేస్తాడు. ఆవిడ గుణం తన భర్త అంత తేలికగా కనిపెట్టినందుకావిడ ఎంతో మురిసిపోతుంది. పాపమాయన అందరి "టంగ్"ల విషయమన్నా ఎత్తుతాడుగాని, ఆవిడ "టంగ్" సంగతి మాత్రం పొరపాటునన్నా ఎత్తడు. అంత ధైర్యం ఉంటే ఎప్పుడో కత్తిరించి పారేసి ఉండేవాడు.

***ఊరంతా వచ్చినా ఊకొట్టేవారు రాలేదు***

కొందరు ప్రతిమాటకు ఊరికే "ఊ"లు కొట్టి ఎంత సంభాషణన్నా తేలిగ్గా నడిపించగలరు.. ఎదుటివారు "ఊ" అంటుంటే చెప్పేవారి మనస్సు ఉయ్యాలలా ఊగిపోతూ ఉంటుంది. ఆ ఉత్సాహం ఇక చెప్పక్కర్లేదు.

మా చిన్నతనంలో మా ఊర్లో రాత్రిపూట కొందరు తమాషా తమాషా కథలు చెపుతూ ఉండేవారు. గ్రామంలో స్త్రీ పురుషులు ఎందరో చేరేవారు. కథ రెండు మూడు గంటలు సాగేది. కథ చెప్పేవారు ముందుగా "ఊ" కొట్టేవారిని ఎన్నుకునేవారు. దాని మీద నుంచే కాబోలు "ఊరందరూ వచ్చినా ఊ కొట్టేవాడు రాలేదు" అనే శాస్త్రం వచ్చింది.

**(జూలై ౧౧, ౧౯౭౬, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**"మనం ఎక్కదలచిన రైలు ఒక్క జీవితకాలం లేటు" అన్నాడు ఆరుద్ర కవి చంద్రుడు.** ఇందులో ఎంతో వేదాంతం ఉంది. ఎంతో జీవిత సత్యం దాగి ఉంది.

'జీవిత కాలం లేటు' అనడం బాగుంది. పై జన్మలోనూ మాత్రం ఆ రైలు ఎక్కగలమని ఎలా చెప్పగలం! ఈ జీవి ఎక్కడో - ఆ రైలెక్కడో!.. అసలు పుడతాడో లేదో! పుడితే ఏ రైలు స్టేషను దగ్గిర పుడతాడో? అక్కడికే రైలు వస్తుందో ....

పూర్వం సర్కస్ రైళ్ళు కొన్నివస్తూ ఉండేవి. అందులోనూ మానవులతోపాటు మృగాలు వగైరాలు కూడా ప్రయాణం చేస్తూ ఉండేవి. అలాటి రైలన్నా అందుతుందో లేదో. ఎవరు చెప్పగలరు! ఈ జన్మలో మాత్రం రైలు తప్పిపోవడం నిజం.

మానవ కోటిలో రైలు తప్పిన వాళ్ళూ, బస్సు తప్పినవాళ్ళూ - చివరకు రెండెడ్ల బళ్ళు తప్పినవారూ ఎంతమందో ఉంటారు. ఎవడి కాళ్ళమీద వాడు నడిచిపోకుండా 'రైళ్ళు' వగైరా లెక్కడం కోసం తాపత్రయపడటమే తప్పు.. ఆశలు లేకపోతే ఎలాటి ముప్పూ లేదు. పొట్టకూటికి ఆశపడేవారికి ఇలాటి తిప్పలు తక్కువ. కడుపునిండిన వారికి ఏవో రైళ్ళు ఎక్కాలనీ, ఎక్కడెక్కడికో ప్రయాణాలు చెయ్యాలనీ ఆశ!..

***"ముందుగానే వచ్చింది ముసలితనం!... ఎందుకనో!!..."***

మా ఊరిప్రక్క ఒక పెద్ద ఆసామీ ఉండేవాడు. అప్పటి ఆసాములకందరికీ పెద్ద పెద్ద మీసాలుండేవి. ముంచేతికి మురుగులుండేవి. వెండి మొలత్రాడుండేది. రొంటిన పొడుంకాయ ఉండేది. చేతిలో వెదురుబెత్తం ఉండేది. అదీ ఆసామి స్వరూపం.

బంగారం మూటగట్టుకునేవాడు. శృంగారం బయట పెట్టుకునే వాడు. దశకంఠుడి లాగా పదితలలు లేకపోయినా ఆడవాళ్ళు కనపడితే ఇరవై కళ్ళతో చూసేవాడు. వాళ్ళ నవ్వులు వినాలని ఇరవై చెవులూ చేటంత చేసుకునేవాడు.

నడివయస్సు దాటగానే నడుం వంగిపోయింది. బెత్తాం పోయి లావుపాటి పన్నుకర్ర నెగ్గించుకుంటూ వచ్చాడు. హఠాత్తుగా పలుకుబడి తగ్గింది. అరుపులు మిగిలినాయి గెలుపులు పోయి.

అప్పుడప్పుడూ - అరుగుమీద స్థంభానికి జార్లగిలబడి కూర్చుని "ముందుగానే వచ్చింది నాకీ ముసలితనం... ఎందుకనో!!" అనుకుని దిగులు పడుతూ ఉండేవాడు. అతగాడికీ - ఎన్ని కోర్కెలున్నాయో ఎంత పాపం చేయదలచింది మిగిలిపోయిందో!. 'పడుచుతనపు' రైలులో నుంచి, కనిపించని టిక్కెట్టు కలెక్టర్ హఠాత్తుగా దింపేసినట్లయింది ఆయన పని.

ఏళ్ళు గడిస్తే వచ్చే ముసలితనం వేరు - కీళ్ళు తలిస్తే వచ్చే వృద్ధాప్యం వేరు - మొదటి ముసలితనంలో మోసం లేదు. రెండోదాంట్లో - మోసం, ఆయాసం, విషాద రంగ ప్రవేశం ఇత్యాదులన్నీ ఉంటాయి. ఆ ఆసామి అలాటి వృద్ధుడు.

***"అరవై దాటినా అనుకున్నది కాలేదు"***

మా ఊళ్ళో ఎదురు బొదురు రైతులిద్దరికి ఎందుకో చెప్పరాని పగ ఏర్పడింది. రెండూ పచ్చటి సంసారాలే! ఒకరింటిమీద ఒకరు చిచ్చులు విరజిమ్మడం ప్రారంభించారు. ఒకరికి నష్టం వస్తే రెండోవారికి పండగ. ఇలా సంవత్సరం పొడవునా ఎదుటివారి దండగలను బట్టి 'పండుగలు' చేసుకుంటూ ఉండేవారు.

ఇద్దరి ఆశయం ఒకటే - రెండోవారికి అన్నం నీళ్ళు లేకుండా పోవాలి. వాళ్ళ ఇంటి స్థలంలో జిల్లేళ్ళు మొలవాలి. ఇదే కోరిక. ఈ ఫలితాల కోసం ఇద్దరూ శాయశక్తులా కృషి చేశారు. ఎన్నో విషపు గాలులు విసురుకున్నారు. ఆస్తిపాస్తులను లంకా దహనం చేసుకుంటూ వచ్చారు.

అయినా పూర్తిగా నాశనం కాలేదిద్దరూ. అంతలో ఒకాయనకు విసుగుపుట్టింది. షష్టిపూర్తి కాలేదు. ఇతర విషయాలన్నీ మరచిపోయాడు. విరోధి నాశనమొక్కటే మనసులో పెట్టుకున్నాడు. ఆయువు తీరిపోతుంది - ఇంకా ఎప్పుడు నా అభీష్టం తీరదని విలపించడం ప్రారంభించాడు. చిలికి చిలికి చివరకు మరణించాడు.. ఏ లోకానికి పోయాడో, ఏమి ఆలోచిస్తున్నాడో!...

అదేం విచిత్రమో! యాభై దాటినా ఇంకా చాలాకాలం ఉంటాం - అనుకున్నది సాధించేందుకు చాలా వ్యవధి ఉంది అని ధైర్యంగా ఉంటారు. అరవై దగ్గరకి పోగానే - "అనుకున్న పనులు కాలేదు - ఆయువు తరిగిపోతోంది" అనే దిగులు పట్టుకుంటుంది పాపం.

ఏ ఉద్యోగంలోనో ఉండి... జీతం రాళ్ళు బండెడు సంపాదించుకుంటున్నవాళ్ళు - "నాకు వయసు మళ్ళింది గాని - నా మేధస్సు మామూలుగానే ఉంది. పైగా ఇంకా ఎక్కువైంది. ఈ లోకం నుంచి నిష్క్రమించేదాకా పదవి నుంచి నిష్క్రమించక్కరలేదు" అని డంబాలు చెప్పుకుంటూ.

***డంబాలు చెబుతుండగానే డింగీ ఒడ్డుకు తోస్తారు***

పసతప్పిన వాళ్ళ పలుకులు చల్లారిన వసరులో బియ్యం పోసినట్లవుతాయి. పొంగు వస్తుందా! గింజ ఉడుకుతుందా! పాపం చాలామందికి మంచంలో పడుకుని మరఫిరంగులు పేల్చాలని ఉంటుంది. కంచం మంచందాకా లాగితేనేగాని - ఆరగించలేని తరుణంలో.. కూడా మల్లయుద్ధం, చేద్దామని మనసుపడుతూ ఉంటారు.

రంగులు పడవలాగా నడిచే జీవితం - డింగీలాగా మారిపోయిందనే సత్యం గుర్తించరు. దాంతోనే సముద్రంలో ఈదాలనుకుంటారు. కాని ఎవరో చూచి ఆ డింగీని ఒడ్డుకు తోస్తారు... ఆ తర్వాత అడ్డం పెంచుకుని తలదించుకుని కూర్చోవలసిందే!

వెనుకటికి ఒకామె అందిట - "మావారు మరో రెండు సంవత్సరాలు బ్రతికినట్లుంటే కోటీశ్వరులయ్యేవారుట... ఏడాదికి లక్షచొప్పున సంపాదించేవారుట... ఏడూ అంతస్థుల మేడ కట్టేవారట... అయిదారు కార్లు కొనేవారుట ఆయనెలా ఉండేవారో! నేనెలా ఉండేదాన్నో!

'కొద్దిలో తప్పిపోయింది అదృష్టమంతా. ఆయన చక్రం మొన్న ఒకాయనకు చూపిస్తే ఈ వ్యక్తి బ్రతికినప్పటికంటె పోయిన తర్వాత గ్రహబలం చాలా బాగుంది. మంచి ఉచ్చస్థితిలో ఉంది. కాస్త ముందుగా పోవడం వల్ల పొందవలసిన సిరిసంపొందలేకపోయాడ'ని చెప్పాడు.

నేను కళ్ళనీళ్ళు పెట్టుకుంటుంటే ఆయన నాకంటె ఎక్కువగా దుఃఖించటం ప్రారంభించాడు. తర్వాత అడిగితే చెప్పాడు - ఆయన బ్రతికి ఉంటే నాకీ జ్యోతిష్యం చెప్పినప్పుడు ఎలాటి గౌరవం చేసేవాడో! ఆయన పోకముందే నేను మీ ఇంటికి రావలసింది అన్నాడు. " ఆయన విచారానికి కారణం అది పాపం!

ప్రతివాడు తన బ్రతుకు నావలో బంగారు స్థంభాలు నిలబెట్టి - వాటికి పట్టు తెరచాపలెత్తి - పల్లెపాటలు పాడుకుంటూ విజయశంఖాలు ఊదుకుంటూ పయనం సాగించాలనే ఉంటుంది. కాని ఆశాపరులకు ఎలాటి ఫలితాలు దక్కకుండానే ఏ రూపంలోనూ కలలు నిజం కాకముందే డింగీలు ఒడ్డుకు చేరుతూ ఉంటాయి...

***"అది ముందుపుట్టి ఇది తర్వాత పుడితే.. అహహా!"***

చాలామందికి మరదళ్ళమీద చనువూ సరసం ఏర్పడుతూ ఉంటాయి. పూర్వం కాపరానికి రాకముందు ఆడపిల్లలు భర్తలతో మాట్లాడేవారుకాదు. ఈ లోపల అల్లుడు అత్తవారింటికి వెడితే - కాలక్షేపం కోసం మరదళ్ళతో, బావమరదులతో పరిహాసాలాడుతూ ఉండేవారు. మరదళ్ళ చిలిపితనం బావలకు పన్నీటి జల్లుగా ఉండేది.

ఒకానొక బుద్ధిమంతుడికి మరదలు అందగత్తె కావడం వల్ల - ఆ చూపు అలాగే నిలిచి పోయిందా అమ్మాయి మీద. ఆయన భార్య కాపరానికి వచ్చింది - ఇద్దరు బిడ్డల తల్లికూడా అయింది. ఎంతసేపు ఆయనగారు భార్యను మరదలితో పోల్చి చుసుకునేవాడు.

అలాటి సందర్భాలలో తాను తొందరపడి పెళ్ళిచేసుకున్నాననిపించేది. కాని పెళ్ళికాకుండా ఎన్నాళ్ళుంటాడు..? పోనీ మరదలు ముందు పుట్టి తన భార్య తర్వాత పుట్టినా బాగుండేదనిపించేది. అప్పుడు మరదలే భార్య అయ్యేదనే ఆశ ఆయనలో మెదిలేది.

ఎపుడు మరదల్ని చూచినా, తలుచుకున్నా ఈ బాధ మనస్సులో ముల్లులాగా గ్రుచ్చుకునేది. అందువల్ల మనశ్శాంతికోసం ‘అది ముందుపుట్టి - ఇది తర్వాత పుడితేనా అహహా! జీవితం ఎంత హాయిగా ఉండేది, ఆ రంభను తరుముతూ మా సావిట్లో కొయ్యి స్థంభాల చుట్టూ దాగుడుమూతలాడేవాణ్ణి‘ అనుకునేవాడు. పాపం ఆయనకు.. రైలు జీవితం లేటు -

***"దడికట్టించి పోయాడు... గుడికట్టించాలి - ఎలాగైనా‘***

ఒకసారి బంధువుల ఊరికివెళ్ళాను. అపుడు ఆంధ్రప్రభలో భద్రాద్రిరామాలయ పునరుద్దరణకు విరాళాల వివరాలు ప్రకటిస్తున్నారు. నేను మా బంధువులతో ఆ విషయం మాట్లాడుతుండగా ఒక పెద్ద మనిషి ఆయనగారు చందాల విషయం విని ఎంతో చింతా క్రాంతుడయ్యాడు.

"ఏమిటి మీరలా ఖిన్నులవుతున్నారు? " అన్నాను. ఆయన మనస్సు సరిచేసుకుని "ఏం లేదు. మా నాన్నగారు గుడికట్టించాలని ఎంతో ప్రయత్నించారు. స్థలం నిర్ణయించారు. దాని చుట్టూ దడి కట్టించారు వెంటనే గుడికోసం ప్రయత్నం ప్రారంభించారు. చందాలు ఆ రాముడే తెస్తాడనుకున్నారు. రోజూ దడి దగ్గరికి వెళ్ళి "రామా! ఎప్పుడు కట్టిస్తావు గుడి?" అంటూ ఉండేవారు. అంటూ అంటూనే పోయారు. దడికూడా పడిపోయింది తర్వాత" అన్నారు.

"మీరు పూనుకుంటారా?" అన్నాను.

"పూనుకోవడం ఎంతసేపు! అందులో పుణ్యకార్యం! కాని ధర్మాత్ములు ముందుకు రావడంలేదు... ప్రస్తుతం ఆ స్థలంలో ఒక స్థంభం పాతి - ఇది రామాలయ స్థలం‘ అని బోర్డు కట్టాలి" అన్నాడు.

"అక్కడో గంగాళం కూడా పెట్టండి. విరాళాలు వేసిపోతూ ఉంటారు. చిన్న చిన్నవైతే లాభం లేదు. " అన్నాడు మా ప్రక్కన ఉన్నాయన.

(జూలై 20, 1976, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

‘**జీవితం నీకోసం కాదు..** ఇతరుల సేవ కోసం‘ అంటారు వేదాంతులు. నువ్వు ఒకరికి మేలు చేస్తే - ఇతరులు నీకు చేస్తారనే దాంట్లో నమ్మకం ఉండేది పూర్వకాలపు వాళ్ళకు.

ఇప్పుడలాంటి హామీలేమీ ఉండటం లేదు."నాకీపని నువ్వు చేసిపెట్టాలి" అని గట్టిగా దబాయించి చేయించుకోవడం అలవాటు చేసుకున్నారందరూ. మళ్ళీ ఏదైనా అవసరం వచ్చి "చూడు నాయనా కొంచెం ఈ పని చేసి పెట్టాలి నువ్వు" అని అడిగితే - "నాకు తీరికలేదు! ఇవన్నీ చేస్తూ కూర్చుంటే నా పనులు సున్నా చుడతాయి." అని వినిపించుకోకుండా విసురుగా వెళ్ళిపోవడం నేర్చుకున్నారు చాలామంది.

కొందరు తాము చెప్పడం బాగుండదని కుటుంబ సభ్యులచేత చెప్పిస్తూ ఉంటారు. ఒకరింటికి వెళ్ళి "గోపాలంగారూ.. మీరీ సహాయం కొంచెం చెయ్యాలి ఫలానా వారితో మీరొక్క ముక్క చెప్పి చక్కా చేస్తే నా పని పూర్తి అవుతుంది. శ్రమ అనుకోకండి" - అని ప్రాధేయపూర్వకంగా అడుగుతారనుకోండి. ఆయన ఆ గోపాలంగారికి అదివరలో అంతులేని సేవ చేసినవాడే అయివుండవచ్చు కూడా!

కాని ఆయన స్వయంగా చెయ్యనని చెప్పలేని స్థితిలో పడటం తటస్థించినప్పుడు - తన తరపున మాట్లాడేందుకు కొన్ని నోళ్ళు ఏర్పాటు చేసుకోవడం జరుగుతూ ఉంటుంది.

*మా వారికి రాత్రంతా కీళ్ళు నొప్పులండీ....*

ఆయన భార్యా రత్నమే ఒకప్పుడు పూనుకుని జవాబు చెప్పడం జరిగితే, కొంత అభినయం కూడా తోడు చేసుకోగలదు. భర్త ఆరోగ్యం అందరికంటే ఆవిడకు ముఖ్యం కనుక ఆ విషయాన్నే ఆధారం చేసుకుని మాట్లాడుతుంది.

"రాత్రంతా కీళ్ళ నిప్పులతో బాధపడ్డారు. కాళ్ళు జాచలేరు - ముడుచుకోలేరు. కళ్ళు మూసుకుని పడుకోలేరు - తెరిచి మాట్లాడలేరు. కాళ్ళ క్రింద దిళ్ళు కాసేపు ఉంచుకుంటారు - కాసేపు తోసిపారేస్తారు. మూలగలేరు.. మూలుగు ఆపలేరు - అలా అవస్థపడిపోయారు తెల్లవార్లూ. కోడి కూసే వేళకు కొంచెం కునుకు పట్టింది. ఇప్పుడే లేచి గుక్కెడు కాఫీ త్రాగి కూర్చున్నారు. ఈ పూటకూడా చూసి డాక్టరు దగ్గిరకు వెడతానంటున్నారు" అంటుంది.

"ఎవర్ని చూసి వెడతాడు?" అని అడగాలనిపిస్తుంది. కాని మర్యాదకు లోపం గనుక - ఆవిడతోపాటు మనం కూడా జాలిపడటం.. కొన్ని ప్రశ్నలు వేయడం జరగాలి. ఇవతలి వాళ్ళు వెళ్ళిన పని మరిచిపోయి - ఆమెతో ప్రతివిషయంలో ఏకీభవిస్తూ, మధ్య మధ్య దీర్ఘనిశ్వాసాలు విడుస్తూ ఉండవలసిందే! ఈ సంభాషణ ఆలకిస్తూ ఆయన రోగిష్టి మొహం పెట్టుకుని కూర్చోవలసిందే!

మోకాళ్ళు మాత్రమేనా!..

"అలాగా అంత బాధపడ్డారా!.. కాళ్ళనొప్పులంటే మోకాళ్ళు మాత్రమేనా? అని ప్రశ్నించగా.

"అబ్బే! మోకాళ్ళయితే ఎలాగో అలా భరించవచ్చు. మోకాళ్ళు.. మోచేతులు, ముంజేతులు, మణికట్లు, వేళ్ళు, మెడనరాలు" అని ఆవిడ జాబితా చదువుతుంటే, ఆయన మరీ మౌనంగా ఉండటం మంచిది కాదనో, అనుభవించినవాడు చెప్పడంలో మరింత బలం ఉందనో, అర్ధాంగి చెప్పలేక అలసిపోతోందనో - తాను కూడా కల్పించుకుని,

"పిక్కలు, డొక్కలు, ముక్కుదూలం, కణతలు, భుజాలలో జాయింట్లు , వెన్నుపూసలో కొన్ని పాయింట్లు -" అని జాబితా తన పరంగా పూర్తిచేస్తాడు.

ఇదంతా విన్నవాళ్ళు "అయ్యో! చాలా బాధపడ్డారన్నమాట! అయితే ఇలా రావడం ఇదే మొదటిసారా? ఇదివరలో కూడా వచ్చేదా?" అని ప్రశ్నించక తప్పదు.

"వచ్చేదనుకోండి.. కానీ ఇంతగా ఉండేది కాదు" అంటాడాయన.

"ఆ! అక్కరలేని పనులన్నీ పెట్టుకుంటారండీ! అసలే ఆరోగ్యం మంచిది కాదు.. ముక్కుమూసుకుని ఇంట్లో కూర్చోమంటే - అలా అయితే ఎలా మనకు మేలుచేసిన వాళ్ళకు, మళ్ళీ చెయ్యొద్దా? అది సమాజ ధర్మమా! అంటారు. ఓపిక ఉంటే కదా ఏ పని చేసినా, కొంచెం కూడగట్టుకు చెయ్యండి స్వామీ అని సలహా చెపితే మాత్రం వింటారా!..."

"ఓపిక వచ్చేదాకా పనులుంటాయేమిటే?" అని గదమాయిస్తారు. చప్పగా పడిపోతే ఎలా చెప్పండి. ఇప్పుడు చూడండి.. మీరేదో పనిమీద వచ్చారా! ఈ స్థితిలో ఉన్నారా! మీరడుగుతుంటే - నాకే ఎంతో ఇదిగా ఉంది" అని ఆమె హావభావ విన్యాసాలతో చెపుతుంది.

వెళ్ళిన పెద్దమనిషి ఏం చేస్తాడు? "మీరు తప్పకుండా విశ్రాంతి తీసుకోవాలి.. వైద్య సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలి.. నా పనికేం లెండి... తర్వాత చూసుకోవచ్చు" అని తీరాలి.. అంటూనే అక్కడనుంచి నిరాశతో బయటికి జారుకోవాలి..

*ఆ విష్ణుమూర్తి చూడు,*

చాలామందికి 'పరోపకారం' అంటే ఎలర్జీ తమకు ఎవరన్నా సేవచేయడానికి అంగీకరిస్తే - వారి అవసరాన్ని బట్టి - తమ అవతారాలు మారుస్తూ ఆ సేవలందుకోవడానికి అనుగ్రహిస్తూ ఉంటారు. ధన, కనక, వస్తు, వస్త్ర, వాహనాదులలో ఏదైనా సరే స్వీకరించడానికి ఎల్లవేళలా చిరు నవ్వులతో సంసిద్ధత ప్రకటించే వరకు పురుషులు మనకు చాలామంది ఉన్నారు.

తిరిగి ఏ చిన్ని వరంకూడా కోరకూడదు. అలా ఎవరైనా కోరితే, వారిని అమర్యాద చేసినట్లు. తప్పించుకోవడానికి వారు ఎన్నో ఉపాయాలు ఆలోచించుకుంటూ ఉంటారు. దేశమంతా వాలంటీర్లుగా మారిపోవాలని వారికి అవసరమైన సేవలన్నీ చెయ్యాలని కొందరు అభిప్రాయపడుతూ ఉంటారు. వీరు సాక్షాత్తూ విష్ణు అంశతో జన్మించిన మహనీయులు.

ఒక ఆంజనేయులు అనే పేరుతో ఉన్న వ్యక్తి - ఎవరికన్నా సహాయం చేద్దామని, వారు సంతోషిస్తే కొంత సంతృప్తి చెంది నిద్రపోవచ్చుననీ ఆయన ఆశ. ఆ సంతోషం కోసం ఆయనగారు తను స్వంతపనులన్నీ మానుకుని పరోపకారం చేస్తూ ఉంటారు. భర్తృహరి చెప్పినట్లు "తమకార్యాలు మరచి ఇతరుల కార్యాలు చెయ్యడం మంచిది' అన్న భావం బాగా వంట పట్టించుకున్నాడు.

ఆయనగారికి పనులు చెప్పడం కోసం ఎన్ని ఇళ్ళవాళ్ళో ఎదురుచూస్తూ ఉంటారు. ఒకరు ఆయన్ని చూడగానే "నమస్కారమండీ! కులాసాగా ఉన్నారా! ఈ మధ్య కనిపించడంలేదు" అని ఎంతో నమ్రతతో పలకరిస్తారు.

***ఆంజనేయదండకం దొరుకుతుందా?***

ఇలాటి సేవాపరాయణుడొకాయన ఉన్నాడు. పాపం అందరికీ ఆయన పనులు చెపుతూ ఉంటారు. ఒకామె - ఆంజనేయులుగారూ!.. మా వారికి ఒంట్లో అట్టే ఇదిగా లేదు. పైగా నాకు రాత్రిళ్ళు దినం విడిచి దినం పీడకలలూ వస్తున్నాయి. ఏదో పోనీ రోజూ ఆంజనేయ దండకం చదువుకొందామనిపించింది. ఆరు రోజులనుంచి వెతుకుతున్నాను. ఎక్కడా దొరకలేదు. పట్టిగా ఆంజనేయుణ్ణి తలుచుకొంటున్నాను. ఇంతలో ఇవ్వాళ మీరు కనిపించారు? అన్నది.

ఆ ఆంజనేయులుగారు పరోపకారపరాయణుడన్నమాట నిజమేగాని కొంచెం మాటలో చమత్కారంగలవాళ్ళు, మనిషి కూడా కొంచెం విడ్డూరపు పోకడలోనే ఉంటాడు. ఆయనగారు పైన చెప్పిన ఇల్లాలి దండకం అంతా విని.. "ఆంజనేయ దండకం మాటసరే.. మీకు రోజు విడిచి రోజూ పీడకల రావడం విచిత్రంగా ఉందే!.. ఈ రోజుల్లో పీడలు కూడా "పెరియాడికల్"గా వస్తున్నాయన్నమాట.. వాటికీ తీరుబడి ఉండడంలేదు. క్లయంట్సు ఎక్కువయ్యారల్లే ఉంది" అంటాడు.

అవతల ఇల్లాలు అందులో ఉన్న వ్యంగ్యాన్ని సరిగా అర్థం చేసుకోలేక.. 'నిజంగా ఆంజనేయులుగారు! లెక్క ప్రకారం వస్తూన్నాయి ఆ పీడకలలు. అవి రానిరోజున హాయిగా నిద్రపడుతోంది. మనస్సు ఉల్లాసంగా కూడా ఉంటుంది" అని ఆవిడ అన్నది.

"అయితే పీడకల పడుకోగానే వస్తోందా? అర్థరాత్రివేళా.. తెల్లవారు ఝామునా?" అని ఆంజనేయులుగారి ప్రశ్న.

"అబ్బే అర్థరాత్రికాదండీ.. పడుకోగానే వస్తున్నాయి. దాంతో నిద్రంతా పోతోంది" అని జవాబు.

"అయితే అదేదో మోడరన్ ట్రెండ్! వెనుకటి పీడలు అర్థరాత్రి వేళకు తప్ప ముందుగా బయలుదేరేవి కావు.. సామాన్యంగా సినిమా సెకండుషో వదిలిపెట్టే వేళకు - ఇవి సంచారం సాగించేవి" అని ఆంజనేయులగారు విషయాన్ని విపులీకరించారు.

ఆవిడ అంతా విని "ఇంతకీ ఆంజనేయ దండకం చదవడం వల్ల ఆ కలలు తగ్గుతాయంటారా?" అని మళ్ళీ మొదటికి వస్తుంది." ఆంజనేయులు చెయ్యలేని సహాయం ఏం ఉంది?" అన్నారు అతి వ్యంగ్యంగా.

ఆయన వెడుతూ వెడుతూ "ఇవ్వాళ పీడకలలరోజా.. సెలవురోజా" అని ప్రశ్నించారు. 'సెలవురోజే' అన్నదామె. మరునాడు ఉదయానికి ఎక్కడ పట్టారో పట్టి ఆంజనేయ దండకం ఆవిడ చేతిలో పెట్టాడు. అప్పుడామె ఎంతో సంతోషించి దాని ఖరీదు అందచేసింది.

అందరూ 'అవి తెమ్మనీ, ఇవితెమ్మనీ ఆర్డర్లివ్వడమేగాని డబ్బు చేతులో పెట్టరు. తెచ్చిన తర్వాత వి.పి. పార్సిల్సు తీసుకున్నట్లు తీసుకుంటారు. అయితే ఇక్కడ పోస్టల్ ఛార్జీలు కూడా ఆయనవే పాపం. ఈ ఆంజనేయులుక్కూడా గగనతలాన ఎగిరి వెళ్ళే శక్తి ఉందని అందరి అభిప్రాయం అయివుంటుంది.

***<u>మళ్ళీ చెపితే మండిపడతారు</u>***

ఈ ఆంజనేయులు - దండకం తెచ్చి అందించిన ఆవిణ్ణే .. ఒక చిన్న సహాయం అడిగాడు. ఆయన పనిచేసేచోట ఏదో కాగితం ఉంది. దాని వివరాలు కొంచెం తెలుసుకోమనండి అని అడిగాడు. నాలుగు రోజుల తర్వాత "ఏమైంది" అడిగాడు వచ్చి. "చెప్పానండీ" కనుక్కుంటామన్నారు" అన్నది ఎంతో నిర్లిప్తంగా.. "ఇంకో మాటలు చెప్పండి రేపువస్తాను" అన్నాడాయన్ని.

ఆవిడ వెంటనే ముఖం చిట్లించుకుని "మావారికి మళ్ళీ చెపితే మండిపడతారు. ఆయనంతట ఆయనవచ్చి నాకు చెపితే నేను మీకు చెపుతాను.." అని గట్టిగా చెప్పింది.

ఆంజనేయులుగారేమంటారు.. "ఈవిడకు పీడకలలు తగ్గినాయిగావచ్చు" అనుకుని ఉంటాడు. ఆంజనేయులుగారి సేవా ధర్మాలు చాలా ఉన్నాయి. వీలైతే మరోసారి.

**(జూలై 22, 1976, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

'నిష్కామని ప్ర' - అంటారు మన పెద్దలు.

ఇలాటి త్యాగం ఉండటం మానవ ధర్మాల్లో ఒకటి అన్నమాట నిజమే కావచ్చు. కానీ అంత త్యాగానికి పూసుకునే వ్యక్తి, ముందుగానే సర్వసంగ పరిత్యాగిగా మారడానికీ, అంత సంస్కారం లేకపోతే బైరాగిగానో, పకీరుగానో తయారుకావడానికి సంసిద్ధుడై ఉండాలి.

ఆర్థికస్థితిని దృష్టిలో పెట్టుకుని మాట్లాడితే - ఉన్నదంతా నోరెత్తకుండా దోచి పెట్టడమనన్న స్థితికి సంసిద్ధ పడటం - సేవాధర్మం దృష్ట్యా ఆలోచిస్తే శక్తినంతా ధారపోయడం... ఇతరులను సహాయం చేశామన్న ఆనందాన్నే పరమావధిగా పెట్టుకుని బ్రతకడం అవుతుంది. ఈనాటి జనాభాకు అసాధ్యమా అనేది ప్రశ్న.

గతంలో ఒక వ్యాసంలో ఆంజనేయులుగారి సేవా ధర్మాన్ని గురించి కొంత చెప్పాను. ఆయన నిజంగా నిష్కామయోగే!... ఎవరికైనా సహాయపడకపోతే ఆయనగారికి తోచదు. మళ్ళీ ఎవరేమి చెయ్యకపోయినా బాధపడను.

ఒకసారి ఇద్దరం ఆటోలో వస్తూండగా పెద్దవాన వచ్చింది. దానికి తోడు ఆటోలో పెట్రోలు అయిపోయింది. ఒకచోట ఆగిపోయాం. వాన వెలవలేదు. తడుస్తూ మరో ఆటో తీసుకువచ్చారు. ఇద్దరి ఇళ్ళూ చెరో వైపునా ఉన్నాయి. నన్ను ఆ ఆటోలో వెళ్ళమన్నారు. "మీ ఇంటి దగ్గిర మిమ్మల్ని దింపి వెడతా"నన్నాను.

"అబ్బే మీరు వెళ్ళండి.. మా ఇంటికి నేను కొంచెం ఆలస్యంగా వెళ్ళినా ఫర్వాలేదు. మీరు వెళ్ళండి" అన్నారు. ఆయనగారు వాన వెలిసిన దాకా ఉండి - తర్వాత ఇల్లు చేరారట. మర్నాడు నవ్వుతూ చెప్పారా విషయం. ఇంతకీ మేం వెళ్ళింది నా పనిమీద. వానలో తడిసి ముద్ద అయింది ఆంజనేయులు గారు.

"ఎందుకండీ! ఆంజనేయులుగారు మీరిలా పరోపకారంలో మునిగి అక్కరలేని అవస్థలు పడతారు?" అన్నాను. అలాటి ప్రశ్నలు వేసినప్పుడాయన అదోరకంగా నవ్వుతారు.

***<u>నొప్పించడం తేలిక మెప్పించడం కష్టం.</u>***

"ఎవరికోసం వారు తాపత్రయ పడటం మామూలే.. మరొకరికి కొంచెం సేవచేస్తే మనస్సు బాగుంటుంది. మన కోసం చేసుకుంటే - డ్యూటీచేసుకున్నట్లుంది. అందులో బ్యూటీ ఏం వుంది?.." అన్నారు.

"అవునులెండి మీరు కష్టపడకుండా నష్టపడకుండా ఏదైనా సహాయం చెయ్యవచ్చు. కాని ఇలాగా?" అంటే మళ్ళీ ఒక నవ్వు నవ్వి.

"నష్టకష్టాలను గురించి ఆలోచిస్తూ ఉంటే - ఒక జీవితం నష్టంలో పడిపోతుంది. ఏదో చెయ్యాలి" చేతనైనంతవరకు.. అన్నారు.

"మీకు ప్రతిఫలం ఏం ఉంటుందండి? నేను మీకు శ్రమ కలిపిస్తున్నందుకు చింతిస్తున్నాను. అంతకంటే చేసేదేం లేదు. మరి, మీరు ఇలాటి త్యాగాలు కొంతవరకూ తగ్గించుకోవడం మంచిది" అన్నాను.

"ఒక్క విషయం ఆలోచించండి.. ఒకర్ని నొప్పించడం తేలికా, ఒప్పించడం తేలికా చెప్పండి.." అన్నారాయన.

"మెప్పించడమే!" అన్నాను.

"అందుకేనండి ప్రయత్నం.. ఇతరులు నాకేమి సేవచేయకపోయినా - ఒకరిని సేవించి మెప్పించడం జీవితధర్మం అని కొందరన్నా తెలుసుకుంటే మంచిదని నా భావం" అన్నారాయన.

"మరి ఇతరులు మీ సేవాభావాన్ని గుర్తించి మీకు తిరిగి ఏదైనా మంచి చెయ్యకపోతే మీరు బాధపడ ఆంజనేయులుగారూ!" అన్నాను.

"అలా ఆలోచిస్తూ కూర్చుంటే ఇతరులకు సేవేం చేస్తాం.. దేశానికి, సంఘానికి సేవచేసిన పెద్దల్ని తలుచుకుని హాయిగా నిద్రపోవలసిందే"

"అసలెవరినైనా నా ప్రత్యుపకారం కోరారా మీరు?" అన్నాను. మళ్ళీ అదే నవ్వు..

"ఎప్పుడన్నా అడగవలసి వస్తుంది. చాల తక్కువేననుకోండి. అయినా నెరవేరవని బాధపడను. కొంతకాలం క్రింద ఒక అమ్మాయి బి.ఏ తెలుగు పరీక్షకు వెడుతోందంటే - మూడు నెలలు పాఠాలు చెప్పాను.

చాలా కాలం క్రింద చదివినవి గనుక నేను ముందుగా చదువుకోవలసి వచ్చేది. సంశయాలుంటే మరొకళ్ళను అడగవలసి వచ్చేది. అలాగే చెప్పాను. అదృష్టవశాత్తూ ఫస్టు క్లాసులో ప్యాసయింది.

నా మూలంగా ఒకరు పర్మనెంటుగా ఉండే డిగ్రీ సంపాదించారు. అంతకన్నా కావలసిందేం ఉంది- అని గర్వపడ్డాను. అసలు నేను కాలేజీలో చదివే రోజుల్లో తెలుగు ఎం.ఏ చదివి ఏ కాలేజీలోనో చేరి తెలుగు పాఠాలు చెప్పాలని ఉవ్విళ్ళూరుతూ ఉండేవాణ్ణి. అది నెరవేరలేదు. జర్నలిజంలో చేరి పాళీలు అరగదీయవలసి వచ్చింది. పోనీ ఆ అమ్మాయికి చెప్పడం ద్వారా.. వెనుకటి కోర్కె. నెరవేరింది కదా - అనుకున్నాను. కొంతకాలం తర్వాత అర్జంటుగా ఏవో కాగితాలు కాపీ చేసి పెట్టవలసి వచ్చింది. కనిపిస్తే అడిగాను - కొంచెం శ్రమమపడి కాపీ చెయ్యాలి - కొద్దికాగితాలున్నాయి - అని. ఆమె నను ఏదో కొత్తవాణ్ణి చూచినట్లు చూచి - "ఏమిటి ఏం చెయ్యాలి?" అన్నది.

'కాగితాలు కాపీ' చెయ్యమ్మా. అన్నాను. ఆమె అతి విసుగ్గా చూచి "నా కసలు కాపీ చెయ్యడం అలవాటులేదు. అయినా నా తెలుగు దస్తూరీ బాగుండదు. అందులో నా వంట్లో సుస్తీగా ఉంది" అంది.

"అలాగా. సుస్తీగా ఉందా! దస్తూరి మాత్రం బాగానే ఉంటుంది. మీరు నోట్సు వ్రాసున్నప్పుడు చూశాను కదా" అన్నాను.

"అప్పుడు సంగతా! - ఇప్పుడు వేళల్లో అంత బలం లేదు. కలం సరిగ్గా సాగదు -" అని ఏదో సంజాయిషి చెప్పింది. సుస్తీగా ఉందంటోంది. వేళ్ళల్లో అంత బలం లేదంటోంది - బహుశః వేవిళ్ళేమోనని బయలుదేరాను ఇంటికి వచ్చేద్దామని.

***మార్కులు బావ వేయించాడు***

తీరా వస్తున్న వాణ్ణి ఆవిడ మళ్ళీ పిలిచింది. 'ఏమిటమ్మా?' అని అడిగాను. ఆవిడ అదోరకంగా, అంటే అతి చులకనగా ఒక చూపు చూసి "మీరు పాఠాలు అన్ని రోజులు చెప్పారు, నోట్సు చెప్పారు. చచ్చిచెడి చదివాను. కాని మీరు చెప్పిందాంట్లో ఒక్కటీ రాలేదు.

మా బావంటూ ఒకాయన ఉన్నాడు కనుక ఆయన మార్కులు వేయించాడు. ఫస్ట్ క్లాసు వచ్చింది. బ్రతికి బయటపడ్డాను" అన్నదామె.

"ఎలాగైతేనేం? మీరు ప్యాసయ్యారు.. ఫస్ట్ క్లాసు వచ్చింది. మీ బావ దయవల్ల" అన్నాను.

"అవునండీ నిజం" అన్నదామె.

మాట్లాడకుండా తిరిగి వచ్చాను. ఆ రాత్రి నిద్రపోవాలను నిద్రపోవాలనుకుంటున్నప్పుడు "బావంటూ ఒక్కడున్నాడు గనుక" అనే మాటే పది మాట్లు జ్ఞాపకం వచ్చింది.

- ఇలాటి సందర్భాలు కొన్ని ఉంటూ ఉంటాయి. అంతమాత్రంతో మన సేవాధర్మాన్ని ఒదులుకుంటామా?" అన్నారు ఆంజనేయులుగారు -

నేను మద్రాసులో ఉండగా - కొంచెం పెద్ద ఇల్లు తీసుకున్నాను. ఒక మిత్రుడు ఇల్లు ఖాళీ చేయవలసి వచ్చింది. నా దగ్గరికి వచ్చి "ఇల్లు దొరికేదాకా మీ సావిట్లో ఉంటాం.. పదిరోజుల్లో ఇల్లు దొరుకుతుంది. లేకపోతే పిల్లల్ని ఇంటికి పంపించాలి. సామాన్లు ఎక్కడో వెయ్యాలి. ఖర్చులు అంతులేకుండా అవుతాయి. మీరు సహకరించాలి" అన్నాడు.

మద్రాసు మహానగరంలో ఇళ్ళ ఇబ్బంది విషయం తెలుసు. అందులో నేను క్రొత్తగా వెళ్ళిన వాణ్ణి - అందుకని వెంటనే అన్నాను "అదేవిటండీ! అలా అంటారు - సావిడి మీదే అనుకోండి.. పదిరోజులు మేము ఎలాగో అలా సర్దుకొంటాం. మీతో ఈ కొద్ది రోజులూ కలసి ఉండటం.. నాకెంతో ఆనందదాయకం" అన్నాను.

ఆయన పిల్లా జెల్లాతో వచ్చి చేరాడు. ఇల్లు వెతుకుతున్నాడు కాబోలు ననుకుంటూ ఉండేవాణ్ణి ప్రతిరోజు. రోజులు గడిచాయి. ఇంకో పది... ఇంకో పది... మనసు ఒప్పలేదు. అద్దె అంతా కట్టక తప్పలేదు. ఆయన అసలు విషయమేమీటో మనసు విప్పి చెప్పలేదు. అలా రెండు నెలలు గడిచినాయి. మాట్లాడడం తగ్గించాడు. విష్ చేసి వెళ్ళిపోయేవాడు. ఇంకో నెల గడిచింది.

చివరకు ధైర్యం చేసి "మావాళ్ళు వస్తున్నారు. కొంచెం ఇల్లు ఇబ్బంది అవుతుంది" అన్నాను.. దానికి ఆయన ముఖం చిట్లించి "ఇప్పుడు పొమ్మంటే ఎక్కడికి పోను. మా ఆవిడ నీళ్ళు పోసుకుంది. ఒకళ్ళ కాళ్ళు పట్టుకుని బ్రతిమాలాల్సిన అవసరం వచ్చింది. మా ఊర్లో పది గదుల ఇల్లుంది. కావాలంటే ఈ నెల నుంచీ ఒక పాతిక ఇస్తాను - మమ్మల్ని ఇబ్బంది పెట్టకండి" అన్నాడు.

నేను ఎలాటి ముఖం పెట్టవలసి వచ్చిందో చెప్పలేను. ఇలాటి సందర్భాల్లో ఫోటోలు తీసి దాచుకోవడానికి ప్రతి ఇంట్లో ఒక హాండ్ కెమెరా ఉండి తీరాలి.

గత్యంతరం లేక నేను ఇల్లు ఖాళీ చెయ్యవలసి వచ్చింది. ఇంటి యజమాని ఆయన్ని కూడా వెళ్ళగొట్టి అప్పగించమన్నాడు. రెండు నెలలు నేను లేకుండా ఇంటి మొత్తానికి అద్దెకట్టి - ఆయన్ని బయటకు పంపడం జరిగింది.

అప్పటినుంచీ ఎవరికన్నా ఏదైనా సహాయం చేద్దామన్నా, చోటు ఇద్దామన్నా "సావిడి సాంబశివరావుకు ఇచ్చినట్లు" అనేది సామెతగా మనస్సులో మెదులుతూ ఉంటుంది.

❦❦❦

(సెప్టెంబర్ ౦౨, ౧౯౭౧, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**పరిపూర్ణత, ప్రతిభ - కళల విషయంలో సాధించవలసిన విజయాలు.** అవి వ్యక్తికేకాదు, కళాలోకానికే విజయాలు... అందువల్ల వాటిని జాగ్రత్తగా కాపాడటం నేర్చినవారు నిజమైన కళాపోషకుల క్రింద జమకట్టబడతారు..

దేశంలో కోట్లాదిమంది ప్రజలుండగా - కొద్దిమందే కళాకారులుగా భాసించడమేమిటి? కొద్దిమందే గాయకులుగా నిలబడగలగడం దేనివల్ల?.. పరిపూర్ణతా, ప్రతిభా - ఆ కొద్దిమందికే లభ్యమైంది గనుక - భగవంతుడు వారినిలా దీవించి పంపాడు గనుక.

***<u>ఒక్క ఘంటసాల, ఒక్క బాలమురళీ</u>***

అందుకని గాయకుల్ని ఏ దేశం ఒక్కసారిగా చూడలేదు. మన సినిమా ప్రపంచంలో చెప్పుకోతగ్గ గాయకులు వేలాది పాటలు పాడినా విసుగు పుట్టని గాయకుడు - ఒక్క ఘంటసాలే ఉండట మేమిటి మరి!.. ఆంధ్రదేశంలో ఒక్క బాలమురళియే ఉండటమేమిటి? ఆ పేరుగలవాళ్ళంతా పాటకచ్చేరీలు చేయవచ్చుగా!

స్త్రీలలో ఒక్క భానుమతి, ఒక్క సుశీల, ఒక్క గోపాలరత్నం లభించడమేమిటి! ప్రతి వారికీ "రాల్ కరిగించు విమల గాంధర్వం" లభించదేం..! సాంప్రదాయ గాయకులలో లలిత సంగీతంలో ఆరితేరిన వాళ్ళు ఏకొద్దిమందో ఉన్నారు. అందరినీ కలిపి ఆలోచించినా కోటికో నలుగురు అయిదుగురు గానసుధను అందించగలవారుంటారు. వారినే మనం పూజిస్తున్నాం.. గౌరవిస్తున్నాం.. సంగీతం కోసం వారి మీద ఆధారపడే ఉంటున్నాం.

***<u>ఒక్క లత, ఒక్క ముఖేష్, ఒక్క రఫీ, ఒక్క తలత్</u>***

హిందీ ఫిలింరంగంలో ఎందరో గాయకులు, గాయనీమణులు ఉన్నారు. కాని ఒక్క లత, ఒక రఫీ, ఒక్క ముఖేష్, ఒక్క తలత్ - మనల్ని ముగ్ధుల్ని చేయగలుగుతున్నారు.. వారి సంగీతం కోసం మనం ఎంతో ఆశతో ఎదురు చూస్తూ ఉంటాం..

దేశంలో సాంస్కృతిక సంపదలు సజీవంగా ఉండాలంటే కళలన్నీ పరిపూర్ణమైన స్థితిలో పోషించబడాలి. తక్కినవారి గానాలు లెక్కలోకి రావు.. 'నీ సంగీతానికి నా సహనమే సరిపోయింది. తల అంతగా తిప్పినందుకు నీ తంబురా ఇలా పెట్టి పోవయ్యా గాయకోత్తమా' అన్నట్లు ఉండవచ్చు.

"మీ వారు పడుకోబోయే వేళ ప్రతిరాత్రీ అలా సంగీతం పాడతారు. మీకేమైనా హాయిగా ఉంటుందా?" అని ఒక ఇల్లాలు ప్రక్కింటి ఇల్లాల్ని అడిగిందట.

"నాకు మాత్రం హాయిగా ఉంటుంది. తక్కినవాళ్ళు సంగతి నాకెందుకు? ఆయనగారు ఒకవేళ బద్దకించినా నేను అరుగుమీద కూర్చుని కాస్సేపు రాగాలాపన చెయ్యండని బ్రతిమాలుతాను" అన్నదట ఆ ఇల్లాలు.

"అలాగా! మీరు కోరి కూడా పాడిస్తూ ఉంటారా? అందులో రహస్యమేమిటో చెప్పండి.. మేము కూడా తెలుసుకుంటాం. ఆయన పాట ఆపేదాకా మా ఇంట్లో పసిపిల్ల బాలాది ఎలాగూ నిద్రమేల్కొంటున్నాం... కాలం వృధాగా పోతోందనుకుంటున్నాం. ఆ రహస్యం మాక్కూడా చెప్పండి. - ఆ హాయి మేము కూడా అనుభవిస్తాం" అని ప్రక్క ఇంటి ఇల్లాలు అడిగిందట ఎంతో ఆత్రంగా.

***<u>అలవాటయిన కంఠం కప్పలకంటే నయంకాదూ!</u>***

"రహస్యం ఏమీలేదమ్మా.. అందరికీ తెలిసిన విషయమే.. మన ఇళ్ళ వెనకవున్న నీళ్ళగుంటలో కప్పలు బెకబెకలాడుతూ ఉంటాయి ఎప్పుడూ? రాత్రిళ్ళు ఆ శబ్దం మరీ ఎక్కువ. తక్కినప్పుడు భరించినా నిద్రవచ్చేటప్పుడు ఆ మోతను తలబ్రద్దలయినట్లుంటుంది. కునుకు

పట్టదు వానాకాలంలో ఈ బెడదా తప్పదు.. అందుకని మా వారిని కొంచెం సేపు పాడమని అడుగుతా.. ఎరుగున్న గొంతు కనుక ఎలాగో అలా భరించకలుగుతున్నా.. కప్పల బెకబెకలు వినిపించవు కనుక కాస్త కన్ను మూసి నిద్రపోతున్నా" అని చెప్పిందట.

మేమెరుగున్న ఒకరి ఇంట్లో రాత్రిపూట ఆ ఇల్లాలు జోలపాట ప్రారంభించేది. ఆ పిల్ల నిద్రపోవడం కోసం ఆవిడ చేసే ప్రయత్నంలో చుట్టుపట్ల నాలుగు ఇళ్ళల్లో వాళ్ళు మేలుకునేవారు. భర్త ఎంతో గిజగిజలాడిపోయే వాడు. "కొంచెం ఆపవే పుణ్యం ఉంటుంది" అని బ్రతిమాలేవాడు..

"అదేమిటండీ! పిల్లకు నిద్రవస్తోంది. మధ్యలో ఆపమంటారేమిటి! చూడండి అయిదు నిముషాల్లో నిద్రపోతుంది" అనేది.

**నీ పాటకు నిద్రపోవడంలా.. భయపడి!**

"పిల్ల నీ పాటకు నిద్రపోతుందనడం కలలో వార్త. ఆ అరుపులకు అదిరి, బెదిరి, హడలిపోయి భయంతో నిద్రపోతుంది" అనేవాడాయన.

మేము మద్రాసులో ఉండగా ఒక ఆంధ్ర మహిళ అక్కడగల సంగీత వాతావరణం చూసి తనుకూడా సంగీతం నేర్చుకోవాలని ఎంతో ముచ్చటపడింది. "నేను ఇంట్లో లేనప్పుడు నేర్చుకో పాటాలు - అలా అయితే నాకేం అభ్యంతరం లేదు" అన్నాడు ఆమె భర్త. ఆవిడక్కడికే సంతోషించింది. ప్రయివేటు మాష్టర్ని కుదుర్చుకుంది.

మంచి ప్రౌఢ వయస్సు. నలుగురు పిల్లలు. ఒక్కడు బడికి వెళ్ళేవాడు. తక్కిన ముగ్గురు పిల్లికూనలల్లే ఇంట్లోనే తిరుగుతూ ఉండేవాళ్ళు. మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రయివేటు...

గొంతుమంచిది. అభిలాష తక్కువలేదు. అందువల్ల త్వరలోనే కీర్తనల్లోకి వచ్చింది.

కాని ఆవిడ అవస్థ ఇలా ఉండేది.

"రామా సుజన జీవనా. ఆ..ఆ."

కుర్రాడు "అమ్మా కాలికి దెబ్బ తగిలిందే! "

"ఎందుకు ఏడుస్తావు!.. గూట్లో టించర్ ఐడిన్ ఉంది రాసుకో...సుజన జీవనా - సుగుణ భూషణా అజనందిత శ్రిత నందన దశతురంగ.. "

***దశ తురంగమా పరుపు క్రింద బిస్కెట్లున్నాయి!***

పిల్ల: "అమ్మా ఆకలవుతోందే. కడుపులో మండిపోతోంది. "

"మండిపోతే పరుపు క్రింద బిస్కట్ పొట్లం ఉంది. రెండు తిని మంచి నీళ్ళు త్రాగు. మాంచి పుష్టినిస్తాయి రుచిగా ఉంటాయి. ఇక నాకు అడ్డురాకు. చారునేత్రా శ్రీకళత్రా శ్రీ రమ్యగాత్రా.. "

పిల్లాడు: అమ్మోయి! చిట్టి చెల్లాయి లేచిందే.

"లేస్తే అక్కడ పాలసీసా ఉంది త్రాగించు.. అదే ఊరుకుంటుంది.. నన్ను పాడుకోనీ."

ప్రయివేటు మాష్టారు. అమ్మా పాడబోయేది. "శాంతమూ లేక..."

ఇల్లాలు: "అలాగే మాష్టారూ!"

సంగీతంలో ఎన్ని అవాంతరాలో చూడండి. అయినా అభిలాష అలాగే ఉంటుంది. కమ్మటి పాటలో మధ్య మధ్య గందరగోళాలుంటే ఫలితమేం దక్కుతుంది!?

రేడియోలో మొదట్లో పేర్కొన్న మహాగాయకుల గానాన్ని ఆస్వాదిస్తూ మధ్య మధ్య వర్తక ప్రకటనలు వింటుంటే - కళాపోషణకు దోహదం చేసే ప్రభుత్వం ఎంత తెలివైన పనిచేస్తోందో అనిపిస్తుంది...!

**(జూలై 25‘76, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**"అసలు మీ అంత వారెవరున్నారు?..** మీకీపాటికి వంద సన్మానాలు జరగవలసింది. మీరు అడ్డం చెప్పకండి. ఇరవై రోజుల్లో గజారోహణం ఏర్పాటు చేస్తాం. సన్మాన సంచిక వెయ్యడానికి సమయం చాలదు. సన్మానం అయింతర్వాత అయితే.. ఆ ఫోటోలతో కూడా వెయ్యొచ్చు" అని పొగడటం..ఆకాశానికి ఎగర వెయ్యడం కొందరికి అలవాటు..

"అంత శక్తి నాలో ఏం ఉందండీ! నే వ్రాసింది మూడు పుస్తకాలు.. ఒకటి అచ్చు అయింది. తక్కినవి బీరువాలో దాగుడు మూతలాడుతున్నాయి.. నన్ను మీరంతగా పొగుడుతుంటే ఏదో ఇదిగా ఉంది" అని అవతల వ్యక్తి అనడం కూడా సమంజసం!

"మీ కెందుకు మీరు ఊరుకోండి అసలు సన్మానం విషయం మరిచిపోండి.. సన్మాన సంఘంవారు ఏనుగు తెచ్చి వాకిట్లో నిలబెట్టినప్పుడు - దయచేసి ఎక్కండి.. తక్కిన పనంతా మేం చూచుకొంటాం"..

"నాకు భయంగా ఉంది మీరలా అంటూంటే - పాండిత్యం గల వాళ్ళు, త్యాగమూర్తులు, దేశ సేవకులు చాలామంది ఉన్నారు దేశంలో. వారిలో ఎవరికైనా ఒకరికి తలపెట్టండి" అని సన్మానం పొందడానికి సిగుపడుతున్న పెద్దమనిషి సమాధానం చెప్పడం జరుగుతుంది.

***"మీరు ఏనుగెక్కండి మా ముక్కువ తీర్చండి"***

"మీరు నమ్రతవల్ల అలా మాట్లాడుతున్నారు గాని - నిజంగా మీకంటే ఉత్తములు ఎవరున్నారండీ! మీరు వ్రాసి అచ్చువేసిన ఒక్క పుస్తకం చాలు. ఏనుగు మీద ఎన్ని ఊళ్ళయినా తిప్పవచ్చు. అది హిందీలోకి అనువదించి ఉంటే - ఎంత పేరు వచ్చేదో ! మీరు అనుమతించండి. ఆహ్వాన సంఘం రేపీపాటికి ఏర్పాటు చేస్తాం.. అసలు అయిదు రోజులు చెయ్యాలని ఉంది ఉత్సవం. మిమ్మల్ని అంత ఆయాస పెట్టడం బాగుండదని ఊరుకుంటున్నాం." అని మరింత గొప్పగా మాట్లాడుతాడు మొదట వ్యక్తి.

సన్మానం పొందడంలో గల ఆనందం గ్రహించినా ఇవతల వ్యక్తి - తహ తహలాడుతున్నట్లు కనిపించకుండా ఉండాలని - నీళ్ళు నమలడం కూడా సహజమే!

"అన్నట్టు మీ పేరున ఒక విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖలో ప్రథమంగా ఉత్తీర్ణులైనవారికి ఏటా బంగారు పతకం ఇచ్చేందుకు కొంత నిధి కూడా ఏర్పాటు చేస్తున్నాం. మనకు చాలా విశ్వవిద్యాలయాలున్నాయి గనుక - మీకిష్టమైంది కోరుకోవచ్చు" - అని అడుగుతాడు సన్మాన సంధాత!

‘అదంతా మీ ఇష్టం‘ అని ఆ రచయిత అనడంతో కొంత మెత్తపడటం కనిపిస్తుంది..

***ఏనుగుమీద మీ కుటుంబం అంతా ఎక్కాలి***

"అన్నట్టు ఇంకో చిన్న విజ్ఞప్తి. ఎలాగూ ఏనుగు వస్తుంది గనుక - మీరొక్కరే ఎక్కడం కంటే మీ కుటుంబాన్నంతటినీ ఎక్కించడం మంచిది. మీకు గల గజారోహణ దశను అందరూ పంచుకుంటారు. ఇలా ఇంతవరకు ఎక్కడా జరగలేదు కూడా"

"ఎందుకులెండి! మీ ఆవిడ సిగ్గుపడుతుంది. పైగా భయం కూడా ఎక్కువ. అసలు నేనెక్కుతానంటేనే భయపడి పోవచ్చు.. పోనీ ఏనుగును తీసివెయ్యరాదూ? " అని ఆయన ప్రాధేయపూర్వకంగా అడగడం కూడా సహజమే!

"ఏనుగు లేకపోతే హుందాతనమే ఉండదు. మీ అర్హత తగ్గించడం ఎంత మాత్రం మాకు సమ్మతం కాదు" అని రూఢీగా చెపుతాడు వచ్చిన పెద్ద మనిషి

ఇక తప్పదనుకుంటాడా కవీశ్వరుడు. ఈ ఉత్సవం విషయం ఇంట్లో వాళ్ళకు చెపుతాడు. వాళ్ళు తాము కూడా ఏనుగెక్కాలని కుతూహలపడతారు. 'మిమ్మల్ని చేసుకున్నందువల్ల నాకిలాటి అదృష్టం పట్టింది' అని భార్య ఎంతో కొనియాడుతుంది భర్తను. పిల్లలు ఉప్పొంగిపోతారు.

కుటుంబం అంటే - కూతుళ్ళు, అల్లుళ్ళూ కూడా ఉంటారా? ఉండరా? అనే సందేహం వస్తుంది. అసలు ఏనుగు అంబారీ మీద ఎంతమంది పడతారనే సంశయం వస్తుంది. ఆహ్వాన సంఘం వారిని ముందుగా అడిగి తెలుసుకోవాలని నిశ్చయించుకుంటారు. కానీ మనస్సు ఆపుకోలేక అల్లుళ్ళకు శుభవార్త అందిస్తారు

***"ఏనుగు ఒక వేళ బెదిరితే"***

భార్యకో, పిల్లలకో అనుమానం వస్తుంది. "ఏనుగు ఒకవేళ జనాన్ని చూచి బెదిరితే ఏమవుతుంది.?" అని. పాపం ఆ కవీశ్వరుడు మాత్రం ఏం చెపుతాడు? ఎలా హామీ ఇస్తాడు. బెదిరితే ఒక్కచోటే కుప్పగా కూలిపోవడం మంచిది అని కొందరి అభిప్రాయం. ఇలా ఏనుగు అంబారీ వృత్తాంతంతో కాలం గడిచి పోతూ ఉంటుంది కవీశ్వరుని గృహంలో.

కవీశ్వరుని భార్య అడుగుతుంది "ఒక వేళ నాకు కళ్ళు తిరిగితే ఎలాగండీ! చప్పున దిగడానికి వీలుండదుగదా! పైగా ఊరేగింపులో వారంతా చూచి నవ్వుకోరుకదా ఎలా?" అని. మరి కవిపుంగవుడేం చెపుతాడు. ఆలోచిస్తానంటాడు..

మర్నాడు ఆహ్వాన సంఘం ఏర్పరుస్తానన్న పెద్ద మనిషిని కలుసుకుని "మా ఆవిడ ఇలా భయపడుతోంది. దీనికి ఏమన్నా ఉపాయం ఉందా? లేకపోతే కొంచెం పొట్టి ఏనుగును తీసుకువస్తారా?" అని అడగడం జరుగుతుంది..

దానికా పెద్ద మనిషి పకపక నవ్వి "ఇంత అట్టహాసం చేస్తూ, పొట్టి ఏనుగును తీసుకురావడమేమిటండీ అంతగా అయితే మీ భార్య కళ్ళకు గంతలు కడదాం. ఏం బాగుందా? " అంటాడు. కవీశ్వరుడేమంటాడు తలవూపి ఊరుకుంటాడు.

ఆహ్వాన సంఘానికి చెందిన వ్యక్తికి మరి కొంచెం సేపైన తర్వాత "మరి కాదూ కూడదూ అంటే డమ్మీ ఏర్పాటు చేద్దాం లెండి" అంటాడు.

"మా మరదల్ని మించిన డమ్మీలేదు.."

డమ్మీ అంటే వట్టి తెలివి తక్కువ వ్యక్తి అనే అర్థంతో కవిశ్వరుడు అన్నమాట "డమ్మీ విషయంలో మీరు ఆలోచించవలసిన పనిలేదు. ఆలోచించినా మా మరదల్నిమించిన డమ్మీని మీరు తీసుకు రాలేరు. కావాలంటే ఆవిణ్ణి పిలిపిస్తాను. అక్కకు తోడుగానూ, ఉంటుంది. దాని ముక్కువా తీరుతుంది" అని సంబరపడుతూ చెబుతాడు కవిశ్వరుడు.

మొత్తానికి గజారోహణ మహోత్సవానికి సంబంధించిన సంభాషణలన్నీ జగుతాయి.. ఆరునెలలు గడుస్తాయి కూడా... ఆ ఆహ్వాన సంఘాన్ని చేకూరుస్తానన్న పెద్దమనిషిని ఎప్పుడు కలుసుకున్నా, "సంఘం ఏర్పటైపోతోందండి! ఢిల్లీలో కొందరు పెద్దలక్కూడా వ్రాశాం - సంఘంలో పేర్లు చేర్చడానికి అనుమతి ఇవ్వమని, వాటికోసం ఎదురు చూస్తున్నాం. అని కూడా ఉంటే మీ సన్మానానికి అఖిల భారత స్థాయి అందుతుంది. అందుకని ఆలస్యం చేస్తున్నాం" - అని చక్కగా నచ్చచెప్పడం, కవీశ్వరుడు సంతోషించడం జరుగుతుంది..

మరో మూడు నెలలు గడిచిపోతాయి. కానీ ఆహ్వాన సంఘం ప్రకటించబడదు. కవీశ్వరుడికీ, ఆయన కుటుంబంలో వారికి ఏనుగు ఎక్కడాన్ని గురించిన ఉబలాటం ఎక్కువవడం వల్ల కలలో ఏనుగు కనిపించడం కూడా ప్రారంభమౌతుంది..

ఒకరోజు అలాటికల కవీంద్రుల భార్యకు వచ్చి - భయంతో గజన్నర ఎత్తు మంచం మీద నుంచి దభాలున క్రింద పడటం మొఖాన బొప్పికట్టడం కూడా జరుగుతుంది..

***ఏనుగు బొప్పి మిగిలిపోయింది.***

కారణాంతరం వల్ల ఆ ఉత్సవం ఆగిపోవడం జరుగుతుంది.. కవీంద్రులు చాలా ఖిన్నులౌతారు. అందరి దగ్గరనుంచీ చాలా హేళన చేస్తూ జాబు వస్తుంది.. భార్య మొఖాన బొప్పిచూసినప్పుడల్లా ఏనుగు గుర్తుకు రాక తప్పదు. రాను రాను ఆ బొప్పెకు ఏనుగు బొప్పి అనే పేరు కూడా వచ్చినా ఆశ్చర్యపాడాల్సిన పనిలేదు..

సన్మానం ఆగిపోయినా, ఆయన పుస్తకం "కోటిమంది బ్రహ్మచారులు" అనే గ్రంథం రెండో ముద్రణకు వస్తుంది. కుటుంబ నియంత్రణకు సంబంధించిన సూచనలతో నిండిన పుస్తకమది.

ఇదంతా ఒకరు ఫిలిం తీస్తామనీ సంభాషణలు వ్రాయమని వచ్చి చెప్పిన కథలో ఒక ఘట్టం.

కాపీ రైటు కథ చెప్పిన వారిదే, ఆషామాషీ వ్రాసేందుకు మాత్రం వారి వద్ద అనుమతి తీసుకున్నాను.

(సెప్టెంబర్ 27 '76, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

## *చేసిన పాపాలకు పెట్టిన దీపాలు సరి*

ఈ నెలలో - సామెతలలో హాస్యం కొంత వివరిస్తాను.. వారెంతగా ఆలోచించి లోక సత్యాలను చక్కటి మాటల్లో పొదిగారో గమనించాలి! ఒక్కొక్క సామెత మీద ఒక గ్రంథం వ్రాయవచ్చు.

స్త్రీలకు స్వతంత్ర్య జీవనం అవసరమనీ, భర్తలకు తొత్తులుగా పడి ఉండడం వల్ల చాలా హీనత ఉందనీ - స్త్రీ పురుషుల ప్రతిపత్తి నశించిపోతుందనీ - భర్తకు దాస్యం చేసి బడుగులు కావడం తథ్యమని పూర్వులు గ్రహించారు. అది ఈనాడు మరింతగా రుజువై నగ్న సత్యంగా మారింది.

***కూలీ నాలీ చేసుకుని కుదురుగా ఉండకుండా మొగుణ్ణి కట్టుకుని సగమై పోయాను*** - అని ఒకామె ఎంతో విలపించింది. ఇది ఏనాటి అనుభవమో! అర్ధాంగి కోరేది భర్త జీవితంలో కష్టసుఖాలు పంచుకోవడంలో, భోగభాగ్యాలు, దాన ధర్మాలు అందుకోవడంలో అర్ధాంగి కావాలనేది అసలు సూత్రం కాని - బానిస చాకిరీ చేసి శుష్కించి పోవడం కాదు. శూన్యంలోకి చూపులు పోనివ్వడం కాదు.

అందుకనే సామెతలో స్త్రీ హృదయం పలికింది - ఎక్కడో అక్కడ ఏ కూలినాలో చేసుకుని, కుదురుగా - అంటే ఒకరికి బెదరకుండా, మనస్సు చెదరకుండా, గౌరవం తరక్కుండా ఉండవలసిన దాన్ని - ఇలా పెళ్ళాడి, అతని పాదాలు పట్టుకు వ్రేళ్ళాడి - ఎంత చేసినా అతనికి తృప్తి కల్పించలేక, మనశ్శాంతి పొందలేక, తను సగం కావలసి వస్తుందని ఎంతో విలపించింది. అలా భర్తల పరంగా, శాంతిని, పోగొట్టుకుని, బలహీనులైనవారికి ఆనవాలుగా ఈ సామెత వెలిసింది.

ఆడవాళ్ళు అందరూ వంటలో మునిగి ఉండటం, ఇంటెడు చాకిరీ చెయ్యడం మామూలే! నిజంగా వారెంతో అవస్థపడితేగానీ అందరి కడుపులూ నిండవు. అవస్థ పడి అమృతంలాగా భోజనం తయారు చేసి అందరికీ వడ్డించి, తర్వాత తింటారు చాలామంది ఇల్లాండ్రు.

అందువల్లనే ***"అన్నం అడిగేవారే గానీ, అడ్డిగ అందించే వారెవరూ ఉండరు."*** అనే శాస్త్రం కూడా ఉంది మనకు. అన్ని వస్తువులు తామే సంతరించుకుని, సకాలంలో అన్నదానం చెయ్యాలనే ఆపేక్షతో అవస్థపడుతూ ఉంటారు స్త్రీలు.

అయితే కొందరు వంటింట్లో చేరడమే గాని - వంట మాత్రం ఎంతసేపటికీ అవదు. ఇంట్లో వాళ్ళు ఆకలి ఆకలు అని కేకలు పెడుతుంటే - 'అవుతోంది, అవుతోంది. అన్నం మెత్తపడుతోంది' అంటూ జవాబు మాత్రం ఎప్పటికప్పుడు అందిస్తూ ఉంటారు వంటింట్లో నుంచి.

పరాయివాడెవడో భోజనం కోసం వచ్చి "గృహిణి చిత్తం" అని వాకిట్లో కూర్చున్నట్లుగా కూర్చోవాలి యజమానికూడా! "ఏం! ఎంతవరకొచ్చింది! శోష వస్తోంది" అని చెప్పుకున్నా - ఆమెగారికి తొందర పుట్టదు. "ఫలహారం చేశారుగా - అలా పసిపిల్లవాడిలాగా గొడవ చేస్తారేం! కూర మగ్గుతోంది. పచ్చడి నూరి కేకేస్తా.. నాకు మాత్రం వంటింట్లో పడివుండాలని సరదా ఏమిటి? ఎప్పుడు నడుం వాల్చుకుందామా? అని ఉంది" - అని జవాబు.

చివరకు పొద్దు పడమర వాలి - భర్త మంచం మీద తూర్పుకు తిరిగి లోలోపల దైవాన్ని ప్రార్థిస్తుండగా.. "పది నిముషాల్లో లేవవచ్చు. అన్నం నైవేద్యం పెట్టడం వడ్డించడం" అని సువార్త వినిపిస్తుంది.

ఇంటివారిని బట్టే ***"కాకి కూయగా లేచి, కాటుక మాదిరిగా అన్నం, కాకరకాయ మిరియం(అంటే తెగమాడ్చి) చేసి, పసువులొచ్చే వేళకు (అసలు సందెవేళకు) పరుగెత్తి పరుగెత్తి వడ్డించిందట"*** - అనే సామెత

పాపం, ఈ ఇల్లాలిలో కూడా ఒక సుగుణం ఉంది. ఎంత ఆలస్యం చేసిన వడ్డన మాత్రం అతి చురుకుగా లేడిలాగా చిందులు వేస్తూ వడ్డిస్తుంది. ఆ చిందులూ, వయ్యారం చూసి చేసుకున్న వాడు - ఆకలితో మధ్యాహ్నం నుంచి పడ్డ బాధ మరచిపోతాడు.

దుర్వ్యసనాలలో చిక్కుకున్నవారు చిన్న చూపు చూడటం సహజం. ఇంటి విషయం పట్టించుకుంటే వ్యసనాలకు సొమ్ము ఉండదు. అందువల్ల వాటికోసమే ఉన్న సొమ్మంతా తగలబెడతాడు. మళ్ళీ అక్కడ మోజు తగ్గకూడదు. ఖర్చుకు లోపించకూడదు. జీవితాన్ని నాశనం చేసే కల్లు - చిప్పలో తాగితేనేం, దొప్పలో త్రాగితేనేం? కానీ దానికి మాత్రం కళాయి ఉండాల్సి ఆపేక్ష - వారిని జీవితాలను చక్కగా వర్ణించే సామెత ఇది - ***"కాలు కడుగ ముంత లేదు - కల్లు త్రాగడానికి కళాయి గిన్నె"*** అనేది.

వ్యసనాలకు లోనైన వాళ్ళందరూ ఇలాటి షోకులకు పోయి - సంసారాన్ని సన్యాసి మఠంగా మార్చివేస్తారు.. ఉన్న కాస్త సుఖాన్ని దూసివేస్తారు. ఇల్లాలికీ, పిల్లలకూ రవ్వంత వెలుతురు అందకుండా అన్ని కిటికీలు మూసివేస్తారు. సంఘ ద్రోహుల్ని లెక్క వేసుకుంటూ ఉంటాం గానీ - సంసార ద్రోహులెంతమందో ఉంటారు. వారిని ఎలా శిక్షించాలో తెలియదు - ఎవరు శిక్షిస్తారో తెలియదు.

పాపం చెయ్యడానికి వెనుకపడమంటూ ఉండదు. అని అలా నిర్వహిస్తూనే పోవాలి. కానీ వాటిని క్షాళన చేయడానికి దేవుడి దగ్గర దీపాలు వెలిగిస్తూ ఉండాలి. ఒకటి ఎక్కువ వెలిగించానని సంతోషించడానికి తావు ఉండదు. ఎందువల్లనంటే - ఎన్ని దీపాలు వెలిగించినా పాపాల చీకటిని పారద్రోలలేవు. అవి ఆపితేగా - ఇవి లెక్కలోకి వచ్చేది.

ఎంత పాపం చేసినా ఆపి దీపాలు వెలిగిస్తే - ఆ దేవుడు కరుణిస్తే కొంత పుణ్యం అందుకునే అవకాశం ఉంటుంది. అవి ఆపడం శక్యం కాదు.. అందువల్ల ఎన్ని దీపాలు వెలిగించినా చాలవు. ఒకవేళ ఎక్కువ వెలిగిస్తే - పాపానికి సరిపడ్డన్ని అవుతాయి అక్కడికి చాలా మేలే.

అంటే ఏమన్నమాట ***"పాపాలు చేస్తూ ఉండటం.. దీపాలు వెలిగిస్తూ ఉండటం."*** ఇది కొని జీవితాలలో జరిగే తమాషా!... ఎక్కడ తగ్గుతుందా హృదయంలో ఘోష?

(అక్టోబర్ ౩ '76, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

## *దసరా పండుగ విశేషం*

**దసరా చాలా పస గల పండగ అంటారు.** ముసలితనాన్ని మూడు పల్టీలు కొట్టించే పండుగ అంటారు కొందరు. దీనిమీద సామెతలు కూడా ఏర్పడ్డాయి. కాలం చల్లగా ఉంటుంది. మనస్సు ఉల్లాసంగా ఉంటుంది. పిల్లలు విల్లంబులూ, కోతి బొమ్మలతో ఆడుగుకుంటూ ఉంటారు. అవి కొని పారేస్తే కొంపలో అట్టే గల్లంతు ఉండదు.

ఇల్లాళ్ళు వేడుకగా కాలం గడుపుతూ ఉంటారు. మగరాయుళ్ళు - పల్లెటూళ్ళలో అయితే - వ్యవసాయం పనులు పూర్తి చేసుకుని - సంవత్సరం పొడవునా దాచుకున్న 'క్యాజుయల్ లీవు' వాడుకుంటూ ఉంటారు. వ్యక్తుల్లో ఏదో తాజాతనం వస్తుంది. కొందరిలో మోజులు కూడా మోసులెత్తుతూ ఉంటాయి. అందుకనే అన్నారేమో దసరా చాలా పస గల పండగ అని. పల్లెటూళ్ళలో పూర్వం - దసరా వేడుకలు ఎక్కువగా ఉండేవి. ముఖ్యంగా పిల్లలకు అంతులేని ఆనందం, పంతుళ్ళు దసరా పాటలు, పద్యాలు నేర్పడం.. పండుగ రోజుల్లో - ఇంటింటికీ తీసుకుపోవడం.. పిల్లలచేత 'జయాభి జైభవా' అనిపించడం.. ఇదంతా ఎంతో ఆనందంగా ఉంటుంది - ఉండేదు మరి!

'ధర సింహాసనమై నభంబు గొడుగై' అన్న పద్యం విని మా ఊళ్ళో ఉండే చిన్న కరణంగారు "పతి లంబోధరుడై, సుతుండు బడుగై, ప్రారబ్ద మాసాంతమై" అంటూ పారడీ వ్రాసి చదువుతూ ఉండేవాడు. 'అదేమిటండీ! కరణంగారూ! అలాటి దైవ వర్ణన నిలా మారుస్తారు? తప్పుకాదా?" అంటే - 'పద్యం మారిస్తే ఆయన రూపం మారుతుందా?.. మన సంసార లక్షణాలు కొన్నిటిని చందస్సులో బిగించి అట్టి పెడదామనే గానీ - ఆ పరమాత్ముని పరిహాసం చెయ్యాలని కాదు సుమండీ' అనేవాడు.

దసరాకు సంబంధించిన విశేషాలు కూడా కొన్ని నిత్యకృత్యంలో వాడకానికి వచ్చినాయి. ఇంకా రావచ్చు కూడా "ఆ పడుచుపిల్ల బుగ్గ లెప్పుడూ బుక్కాయి కొట్టినట్లుంటాయి... చేసుకున్న వాడి అదృష్టం' అంటూ ఉంటారు.

ఒక బీద ఇల్లాలు అంటుంటే విన్నాను - 'ఆయనకు ఉన్నదదే ఒక్క తెల్ల చొక్కా.. ఉతుక్కు వేస్తే దాన్నిండా బుక్కాయ రంగు చేసుకువచ్చాడు రజక సోదరుడు... దాచుకుని దసరాలో తొడుక్కోండి ఏం చేస్తాం అన్నాను'.

తెల్లచొక్కా తొడుక్కుని భర్త దేదీప్యమానంగా వెలుగుతుంటే చూడాలని ఆవిడ ఎంతో ఉవ్విళ్ళూరి ఉంటుంది. కానీ అదృష్టవశాత్తు ఆ చొక్కాకు బుక్కాయి రంగు అంటడం వల్ల అది ప్రత్యేకించి 'దసరా ముస్తాబు' క్రింద వాడమని పురమాయించడంలో ఆమె అభిలాష కొంతవరకు నెరవేరే అవకాశం లభించింది.

ఎవరైనా కొత్తగా కాపురానికి వచ్చిన పిల్లల్ని గురించి పెద్దవాళ్ళు వర్ణించి చెప్పేటప్పుడు.. "పిల్లకేం రంగు రంగుల విల్లంబల్లే ఉంది. పిల్లలో లోపంలేదు - వంచే తాడు మంచిదై ఉండాలి.. బుట్టలో గులాం ఎప్పటి కప్పుడు మంచిది నింపాలి.. బుట్టదేం ఉంది? గులాం జిమ్మమంటే గులాం జిమ్ముతుంది - పేలపిండి జిమ్మమంటే ఆ పిండే జిమ్ముతుంది' అంటూ వర్ణిస్తారు.

భర్తను తన చెప్పుచేతల్లోకి తెచ్చుకుని, తన ఇష్టప్రకారం నడిపించుకోవడం నేర్చిన ఇల్లాల్ని గురించి ముచ్చటిస్తూ 'ఆయనదేం ఉంది. వట్టి దసరా కోతిబొమ్మ. తాడెంత విసురుగా లాగితే అంత విసురుగా ఆడతాడు. గడ చిన్నదైందిగానీ - ఆవిడగడుసుతనం పెద్దదే కాళ్ళూ చేతులూ కట్టి ఉంటాయి. ఆ తాళ్ళు బద్దకు చుట్టీ ఉంటాయి. ఇంకెక్కడికి పోతాడు?.. ఆ జానెడు దూరంలోనే - జై భార్యామణి, జై ప్రాణేశ్వరీ అంటూ ఎగురుతూ ఉంటాడు' అని చెప్పుకుంటారు.

‌‌‘ఆ ముందు భాగంలో ఉన్న కాంతమ్మగారు ఎప్పుడైనా వచ్చిందంటే వరసాగ్గా నాలుగు గంటలు మాట్లాడుతుంది. ఒక్క క్షణం వదలదు.. తనకు వచ్చిన మాటలో ఒక్కటీ వదలదు.... అదేం ఖర్మమో.. దసరా ముసురు పట్టినట్లు పడుతుందనుకోండి.. మన మనస్సులు తడిసి ముద్దయినా పిడిచి ఎండవేస్తానంటుంది గానీ - అవతలకు మాత్రం పోదు... మాకు వారానికో రెండు దసరా ముసుర్లు‘ అంటూ ఉంటారు.

కాలం మారింది గనక దసరా పాటలు కూడా కొంచెం మార్చడం మంచిది. బడిపంతుళ్ళు అంటే పూర్వం ఒక్క పల్లెటూరివారికే అంకితమయేదా మాట! ఇప్పుడు కాలేజీలక్కూడా అన్వయిస్తోంది. ఆ దృష్టితో

"అయ్యవారికి చాలు
అయిదు వరహాలు
పిల్లవాళ్ళకు చాలు
పప్పు బెల్లాలూ -

అనే పాటను ఈ క్రింది విధంగా మార్చుకోవచ్చు.

"అయ్యగార్లకు చాలు
యు.జి.సి.స్కేళ్ళు,
పిల్లవాళ్ళకు చాలు
ఫ్రీ ఎంటరెన్సులు -

ఇలా పాటలన్నీ మార్చుకుని దసరా క్కూడా మనం క్రొత్త తనం కలిపించవచ్చు. కాలం చాలా వడిగా నడుస్తోంది. మరి పాతతనాన్ని రవంత మార్చకపోతే ఎలా!

ఈ కాలంలో మన జాతీయంగా అన్ని రంగాల్లో ముందడుగు వేస్తున్నాం. కనుక అన్నిటినీ తలచి జయాభి జైభవా! విజయాభవా‘ అనుకోవచ్చు. పోతే తక్కువ సంతానం విషయంలోనే క్రొత్తపాటలు వ్రాయాలి.

"ముగ్గురైతే చాలు
ముద్దు బిడ్డల్లు...
చక్కగా మెరిసేను
పసిడి విల్లంబుల్లు...
కోతి బొమ్మలు మాకు
వద్దు వద్దండీ.
కోదండ వాణుల్లు
కొద్దిమందే చాలు...
వరలక్ష్మి దేవతా
ఒకతయినా చాలు...
అధిక సంతానమ్ము కోరేది లేదు.
ఆర్థిక క్షోభమ్ము పొందేది లేదు.

తక్కువ సంతతి - మ్రొక్కేము మేము
చక్కన్ని గృహములు నిలిపేము మేము జయాభి జై భవా
దిగ్విజైభవా.

(సెప్టెంబర్ 26, 1976, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం )

# ఏ ఉదయమైనా అవే పాదాలుగా..!!

**"పోయింది! పోయింది! ఎలా పోయిందో పోయింది"**

"ఏమి పోయిందే! ఎందుకంత గాబరా పడుతున్నావు!.. మెడలో గొలుసు అలాగే ఉంది. చెవులకు దిద్దులు అతుక్కునే ఉన్నాయి. గాజులు లెక్క చూడనీ"

"అక్కరలేదండి! అవి సరిగా ఉన్నాయి. పోయింది వేరు!"

"ఏమిటది! నాతో కూడా చెప్పరాదూ! నేకూడా వెతుకుతాగా?"..

"మీ కెందుకు శ్రమ?.. నే పోగొట్టుకున్నది నే వెతుక్కోలేను?... మీరు గడ్డానికి సబ్బు రాసుకున్నారుగా? ఆ పని సొంతం కానియ్యండి!.."

"నా పని కేమిలేవే! నువ్వలా విచారపడుతూ వెతుకుతూంటే నేను నీట్‌గా షేవ్ చేసుకుని తిరగనా!"

"మరేం ఫర్వాలేదు.. అది మన సొమ్మయితే దొరుకుతుంది. లేకపోతే అంతే గతి! లేచిన వేళ మంచిది కాదు."

"అబ్బబ్బ! అంత విలువైన వస్తువు ఏం పోయిందే! "

"విలువలకు అంతేముంది? పది నయాపైసలకూ విలువ ఉంది. పది లక్షల మూటకూ విలువ ఉంది. అది ఆయా సందర్భాలను బట్టి ఉంటుంది. ఇంతకీ.. పోయింది.. అవకాశం పోయింది.. చక్కటి అవకాశం.."

"ఏమిటి ఏం చేద్దామనుకున్నావు! ఎలా మరిచిపోయావు.. మళ్ళీ అదే అవకాశం వచ్చే అవకాశంలేదా?

"ఏదైనా రావచ్చు. కానీ ఈ రోజు ఉదయం రేపు రాదు. కాదండీ! ఆ ఉదయం ఇంతకన్నా మంచిది కావచ్చు. నా ఆశయం మరింత గొప్పగా నెరవేరవచ్చు. కాని, ఈ రోజు పోయినట్లేగా.. ఇంతకీ అమూల్యమైన ఉదయాన్ని ఆశించిన ఉదయాన్ని పోగొట్టుకున్నానండీ!" అని ఆమె ఎంతో విచారం వెలిబుచ్చింది.

"ఏం ఆశించావు?.. ఏం పోగొట్టుకున్నావు? నువ్వంత చింతాక్రాంతురాలివై ఉంటే - నాకేంతోస్తుంది చెప్పు? అర్ధాంగివి - నా ఆత్మను పంచుకున్నదానివి.. నా ప్రాణాలు నీవిగా భావించిన దానివి. చెప్పు పోనీ ఈ రోజు ఆఫీసుకి సెలవు పెడతా" అని ఆయనగారు ఎంతో దీనత్వం వహించాడు.

"మీరలా బిగలాపడుతూంటే - చెప్పకుండా ఉంటానా! చెబుతాను.. కానీ మీరేమీ అనుకోకుండా ఉండాలి. "

"ఏమీ అనుకోను. వీలైతే నువ్వు పోగొట్టుకున్నది నే వెదికి పెడతా. నువ్వు చెయ్యలేనిపని నేను చేసిపెడతా. నీ మనసు సంతోషంగా ఉంచడమే నాక్కావలసింది. తప్పక చేస్తా - చప్పున చెప్పు"

"చెబుతాగాని, మీరు మాత్రం ఆ పని చేయడానికి ప్రయత్నించకండి. అది ఫక్తునే చెయ్యవలసిన పని. నేను తరించేపని.. పెద్దలు, వారి తర్వాత దేవతలు సంతోషించే పని" –

"అంత మంచిపని అయితే చెబుదూ.. సంతోషిస్తాను. నీకేదైనా బహుమానం ఇస్తాను."

"చెయ్యలేదుగా... ఏం బహుమానం ఇస్తారు. ఏం లేదండీ! ఇవ్వాళిటినుంచీ నిద్రలేవగానే మీ పాదాలకు నమస్కారం చేద్దామనుకున్నానండీ. ఆరునెలలు అలా వ్రతంలాగా, నియమంలాగా నిర్వహిద్దామనుకున్నానండీ! మీ కంటే ముందుగా నిద్రలేచి – మీకు తెలియకుండానే పాదాలు కళ్ళకు అద్దుకుందామనుకున్నా. ఒకవేళ మీరు ముందు లేచినా మళ్ళీ కాసేపు మంచం మీద వ్రాలమని బ్రతిమాలి పాదాలు కళ్ళకు అద్దుకుని `ఇకలేవండి` అందామనుకున్నాను. మొదటిరోజునే వ్రతభంగమైంది. ఇప్పుడు ఎనిమిది కూడా అయింది. ఏం లాభం?" అన్నదామె.

"అంతేకదా!.. పోనీ ఇప్పుడు మళ్ళీ కాసేపు పడుకుంటాను. నీ వ్రతం ప్రారంభించు. దానికి ఆటంకం రావడం దేనికి? కాకపోతే కొంచెం ఆలస్యమైంది. అయినా ఎంత పొద్దెక్కినా అవే పాదాలు కదా! అంత విచారపడటం దేనికి" అన్నాడు భర్త.

"ఇంకో ఉదయం ప్రారంభిస్తాలెండి. ఇవ్వాళకి అవకాశం జారిపోయింది" అన్నదామె.

"ఉదయాలన్నీ ఒక్కటే! మన ఉభయులం ఉభయులమేగా! మరి నీ కంత అభిలాష కలిగినప్పుడు ఎందుకు ఆలస్యం?" అన్నాడాయన.

"అలా ఎలాగండి? ఎప్పుడు పడితే అప్పుడు కాళ్ళు పట్టుకుంటే ఏదో తప్పు చేసి కాళ్ళు పట్టుకున్నట్టు ఉంటుంది గానీ – భక్తితో, ఆసక్తితో అందుకున్నట్టుండదు. అందులో మీరు అడిగినప్పుడు నేను పట్టుకోవడమా! మరి ఒకసారి ప్రయత్నిస్తాలెండి" అని ఆవిడ వాయిదా వేసిందట. పోనీలే నీతో వాదన దేనికని ఆయన ఊరుకున్నాడుట.

పూర్వకాలంలో ఒకాయన వయస్సులో ఉండగా మనస్సు గతితప్పి ఒక వయ్యారితో సయ్యాటలు ప్రారంభించాడట. ఆ విధంగా ఆయనకోసం కాలం ఉయ్యాలలూగిందట. ఇంతలో పెళ్ళిచేశారు పెద్దవాళ్ళు. మొదట చెప్పిన వయ్యారికి నగలు చేయిస్తాననీ, నట్ర చేయిస్తానని ఎన్నో బాసలు చేశాడుట. కానీ, నెరవేర్చలేదు. పెళ్ళి చేసుకుని దూరంగా వచ్చేశాడు.

వయ్యారికి వళ్ళు మండింది. ధర్మమైన పెళ్ళిళ్ళు జరిగితే కుళ్ళు పుట్టే కుబుద్ధులుంటారు – అందులో కులటలుండటంలో ఆశ్చర్యమేం ఉంది. వాగ్దానాలు నెరవేర్చలేదని అలనాటి వలపుకాని వెంట పడిందట. అతను సరి అయిన జవాబు చెపుతాడా!

కొందరైతే అంతకు ముందే హృదయాలు ఒకరికిచ్చేసి పెళ్ళి సమయంలో జామీను మీద విడుదలయ్యైన ఖైదీలలాగా సంచరిస్తారు. మళ్ళీ వెళ్ళి ఆ బందీలో పడతారు.

ఈ వయసుకాడు కొంచెం గడుసు కాడు. భార్యమీదకు మనస్సు మళ్ళించుకున్నాడు. అందువల్ల ప్రియురాలివంక చూడలేదు. ఆమె ఒకసారి కనిపించి "నాకు సొమ్మన్నా ఇయ్యి – నా స్వంతమనిషిని కావుగా" అందిట.

దానికి అతడు పక పక నవ్వి "కొంతకాలం సొంతమే! అసొంతం ఇంత దబ్బున సొంత అయిపోతుందనుకోలేదు. నిజం చెబుతున్నాను. నువ్వు నా పెళ్ళికి ధైర్యం చేసి వచ్చినట్లయితే, నా కట్నంలో నుండి తీసి వెయ్యిమాట పదహార్లు నీకిచ్చేవాణ్ణి. అప్పుడిస్తే బహుమానం క్రింద ఉండేది. ఇప్పుడిస్తే భయపడి ఇచ్చినట్లుంటుంది. అవకాశం పోయింది. ఏం చేస్తాం?" అన్నాడట.

కొందరిలా ఏదో చేద్దామనీ, అవకాశాలు పోవడం వల్ల విరమించామనీ, నిర్వచిస్తూ ఉంటారు. మా బంధువుల్లో ఒక కుర్రవాడున్నాడు. అతడొకరి ఇంటికి వెళ్ళాడు. వాళ్ళ అమ్మాయిని చూశాడు. మంచిగా మాట్లాడింది. మర్యాదలు చేసింది. అప్పుడు తెలిసింది ఆమెకు అప్పటికే పెళ్ళి ఐపోయిందని! మరి ఇతడు చింతాక్రాంతుడయ్యాడు.

కానీ ఒక్క సంతోషం మాత్రం మిగుల్చుకున్నాడు మనస్సులో. ఏమిటి.. ఆ అమ్మాయి పెండ్లికి ముందే తను వారి ఇంటికి వెళ్ళినట్లయితే - ఆ అమ్మాయి తప్పకుండా తనను వరించి వివాహమాడేదని. తను వెళ్ళక పోవడం లోపమైంది. అవకాశం పోయింది. కొందరికి ఇదోరకం తృప్తి.

## *నిద్రోపనిషత్..!*

**(ఆగస్ట్ 15 '76, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**"ఏమిటీ? నేనిప్పుడు నిద్రపోయానా? ఎక్కడ?** నే నిద్రపోందే! మీరు ఏదో చెపుతారు - వింటున్నాను" అని ఒకామె పావుగంట కొకసారి నిద్రపోతూ మధ్య మధ్య పైన చెప్పిన విధంగా డబాయిస్తూ ఉండేది.

"నిద్రపోలేదన్నావుగదా? ఎంత వరకు నేను చెప్పానో కొంచెం చెప్పు" అని అడిగితే - 'అదే భీముడు ద్రౌపదితో ఏదో సరసమాడుతూ మాట్లాడారన్నారుగా' - అనేది.

"అలాగా! భీముడి సరసం అయిపోయి అరగంట అయింది. తర్వాత ధర్మరాజు నీతులు చెప్పడమైంది. అర్జునుడూ, సుభద్రా తగువులాడుకోవడమైంది. సత్యభామ వచ్చి ద్రౌపదితో తన అన్నల గొప్పతనం చెపుతోందిప్పుడు. మీరు భీముని సరసం సమయంలో కళ్ళు మూసి సత్యభామ సంభాషణతో కళ్ళు తెరిచారన్నమాట" అనడం.

ఆవిడగారు "ఏమిటో పాడు ఒక్క కునుకు వచ్చింది మధ్యలో.. చెవులప్పగించి ఎంతో శ్రద్ధగా వింటున్నా కూడా అలా రెప్పలు మూసుకుపోతాయి. గోడనానుకుని కూర్చుంటా! తక్కింది చెప్పండి" అనడం జరిగేది.

అంతకు ముందు హడావుడిగా ఇంట్లో పనులుచేస్తూ ఉండేది. ప్రొద్దుటి నుంచీ చేసిన ఖర్చు వ్రాసుకుంటూ ఉండేది. చీరలు మడత పెట్టుకుంటూ ఉండేది. ఎన్నో కార్యక్రమాలు చాకచక్యంతో నిర్వహిస్తూ ఉండేది. కానీ, ఏదైనా విషయం చెప్పడం ప్రారంభిస్తే - తొట్టిలో పెట్టి వూపు వేసినట్లు హాయిగా కునుకు తీసేది. 'మీ వాగుడు మీరు వాగండి! నాకేం లెక్కా?' అన్నట్లుగా.

ఆవిడ నిద్ర చూస్తుంటే గొర్రెకాపరి రామాయణం వినడం సంగతి జ్ఞాపకం వచ్చేది - ఒక్క గొంగళి మాత్రం ఉండేదికాదావిడ దగ్గర.

***రామాయణం సగం చల్లగా - సగం వెచ్చగా***

వెనుకటికి ఒక పల్లెటూర్లో వీధి నాటకం ఏర్పాటుచేశారుట. రామాయణ నాటకమంది. ఊరంతా వచ్చారు. ఒక గొర్రెల కాపరి కూడా వచ్చాడు. భార్య పురిటిలో ఉండటం వల్ల భర్తను అడిగిందట. ''రామాయణం వినాలని ఉంది. బయటికి వెళ్ళడానికి వీలులేదు కనుక - నువ్వెళ్ళి కథంతా విని రావాలి నాకు పూసగుచ్చినట్లు చెప్పాలి' అని.

అతగాడికి రామాయణం మీద కంటే భార్యమీద ఎక్కువ అభిమానం. వరుసగా ముగ్గురు కొడుకుల్ని కన్నదట ఆమె. అందువల్ల - ఆవిడ చాలా పుణ్యాత్మురాలనీ, ఆవిడ మాట కాదనడం మంచిది కాదనీ అతని అభిప్రాయం.

అందువల్ల రామాయణానికి బయలుదేరి వెళ్ళాడు. గొంగళీ ఎప్పుడూ భుజాన ఉంటుంది గదా! అందరి మధ్యా ఎందుకని ఒక ప్రక్కగా కూర్చున్నాడు. నాటకం వేసేవారు ప్రార్థన పాడటం ప్రారంభించారు. చల్లటి పిల్లగాలి వీస్తోంది.

అతగాడు హాయిగా నిద్రపోయాడు. అర్ధరాత్రి వేళకు బాగా చలివేసింది. అంతవరకు పక్క వేసుకున్న గొంగళీ తీసి కప్పుకున్నాడు. మరింత దిట్టంగా నిద్రపట్టింది. తెల్లవారే వేళకు నాటకం అయిపోయింది. అందరూ లేచి వెళుతూ అతణ్ణి చూచి లేపారు. లేచి తూలుతూ ఇంటికి చేరాడు.

భార్య అడిగింది ''ఎలా ఉంది రామాయణం'' అని. అతగాడు ''ఆ! ఎలా ఉంది చెప్పడానికి - సగం చల్లగా ఉంది, సగం వెచ్చగా ఉంది'' అన్నాడట.

''కథ చెప్పమంటే ఇదేమిటి - చల్లగా వెచ్చగానంటావు'' అన్నది భార్య దిగులుగా.

''నాకు ముంతలో గంజిపొయ్యి తీసుకెళ్ళాలి. సాయంత్రం వచ్చి సాంతం చెపుతాలే'' అన్నాడు. అతడు కొంకి కర్రకు ముంత తగిలించుకుని గొర్రెలున్నచోటికి వెళ్ళిపోయాడు.

కొంచెం ప్రొద్దెక్కిన తర్వాత ఉపాదానం బ్రాహ్మణుడు వచ్చాడు. ఆ ఇల్లాలు ఇన్ని బియ్యం పెట్టి 'అయ్యా.. ఒక మాట అడుగుతాను. కొంచెం చెపుతారా?' అంది.

''అడగవమ్మా! రోజూ మీ ఇంటికి వస్తున్నాను. లేదనకుండా ఉపాదానం వేస్తున్నావు. నీ మాటకు జవాబు చెప్పకుండా ఉంటానా?' అన్నాడు.

''మా ఆయన రామాయణ నాటకం చూసివచ్చి సగం చల్లగా సగం వెచ్చగా ఉన్నదన్నాడు! దీంట్లో అర్థమడిగితే సాయంత్రం వచ్చి చెపుతానన్నాడు - మీరు చెప్పగలరా దాంట్లో ఉన్న అర్థమేమిటో'' అని అడిగిందామె.

''చాలా అర్థం ఉందమ్మా.. శ్రీ రామచంద్రమూర్తి సోదరులు జనించడం వద్దనుంచీ సీతాకల్యాణం వరకూ కథంతా చల్లగా గడిచిపోతుంది. అందువల్ల మొదటి సగం చల్లగా ఉన్నదన్నాడు మీ ఆయన. తర్వాత సీతారాముల వనవాసం, సీతాపహరణం, రామరావణ యుద్ధం ఇదంతా విచారకరంగా ఉంటుంది గనుక వెచ్చగా ఉన్నదన్నాడు'' అని ఆ ఉపాదానానికి వచ్చిన బ్రాహ్మణుడు వ్యాఖ్యానించాడు. ఆ ఇల్లాలు ఎంతో సంతోషించింది భర్త తెలివి తేటలకు.

సాయంత్రం అతడు వచ్చే వేళకు అలాగే ఓపిక చేసుకుని తీపి తింటే మంచిదని - బూరెలొండి ఉంచింది. రాగానే పెట్టింది.

***<u>చెప్పకుండా బూరెలు! చెప్పకుండాబుద్దులు</u>***

''ఇదేమిటి చెప్పకుండా బూరెలొండావు. అందులో పచ్చి మనిషివి కదా. ఇంత శ్రమ ఎందుకు పడ్డావు'' అన్నాడట.

''శ్రమేమిటి? చేసుకున్నవాడికి చేసిపెట్టడమే శ్రమ అయితే ఇంకా శ్రమలేని పనులు ఏం ఉంటాయి. తిను తర్వాత చెపుతా నా కథ. అది విన్న తరువాత నీ కథంతా చెపుదువుగాని'' అన్నదామె.

సరే అతడొక అరడజను బూరెలు నమిలి బుంగమీసాలు గొంగళితో తుడుచుకున్నాడు. "ఇక చెప్పు నీ కథేమిటో" అన్నాడు. ఉపాదానపు బ్రాహ్మణుడు రావడటం, చల్లన, వెచ్చనా అన్నమాటలకు అర్థం చెప్పడం - మీ ఆయన బుద్ది గొప్పదని మెచ్చుకోవడం అంతా చెప్పి, 'నీకు చెప్పకుండా అంత బుద్ది ఒక్కమాటుగా పుట్టుకువచ్చినప్పుడు నే బూరెలు చెప్పకుండా చెయ్యడం తప్పేమిటి' అన్నదట. పాపమా గొర్రెలకాపరి కల్లాకపటం ఎరుగనివాడు గనుక 'నాకు కథా తెలియదు - గంగరావి పువ్వూ తెలియదు. నాటకం వాళ్ళు దరువు మొదలు పెట్టగానే నాకు నిద్రకూరుకొచ్చింది. ముందు మామూలుగా పడుకున్నా.. తర్వాత గొంగళి కప్పుకున్నా - చల్లగా, వెచ్చగా అంటే అదీ అర్థం' అని చెప్పి కుక్కిమంచం వాల్చుకుని కునుకులో పడ్డాడుట.

## ***గుమ్మంలో నిద్రా? కుర్చీలో నిద్రా***

మేము చదువుకుంటున్న రోజుల్లో మా ప్రక్క భాగంలో ఒక గుమాస్తాగారు ఉండేవారు. పిల్లలు లేరు. సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చి ఇంత ఫలహారం చేసి - కాసేపు భార్యతో కబుర్లు చెప్పి 'ఇప్పుడే వస్తా' నని బయలుదేరి బైటకి వెళ్ళేవాడు.

ఆవిడ వంటచేసి, అక్కడ పెట్టి వాకిలి తలుపు తీసి భర్త రాకకోసం ఎదురు చూస్తూ కూర్చునేది. ఎవరన్నా వెళ్ళి కాసేపు మాట్లాడి చక్కా వచ్చేవారు. తర్వాత ఆవిడకు కునికిపాట్లు వచ్చేవి. దానికి తోడు ఆకలి కూడా అయ్యేది.

కానీ, భర్తకంటే ముందు భోజనం చెయ్యడం మహాపాపమని ఆరోజుల్లో ఇల్లాళ్ళ అభిప్రాయం. అభిప్రాయాలేమిటి - అంతులేని భయం కూడా! పైగా తలుపు వేసుకుని లోపల కూర్చుంటే ఒకవేళ నిద్రవస్తుందేమో! అలా నిద్రపోవడం కూడా మహాపరాధాల్లో ఒకటిగా గణించబడేది.

అన్నిటికీ మించి భర్త అర్థరాత్రికి వచ్చినా సరే - కన్నులలో ఒత్తులు వేసుకుని - స్వాగతమివ్వడం కోసం అలా గుమ్మంలో కూర్చోవడం అలనాటి మర్యాద. లోపలెక్కడో గుడ్డి లాంతరు వెలుగుతూ ఉండేది. అది తెచ్చి గుమ్మం దగ్గరగా పెట్టి, రైలుకు జెండా చూపించే ఊరి బయట గేటు కాపలా పోర్టరులాగా ఆమె అలా కూర్చోవాలి.

ఆయనగారు వచ్చిన తరువాత ఉలిక్కిపడిలేవడం ఆయన భోజనం అయిన తర్వాత తను తినడం.. ఇల్లు సర్దుకోవడం - ఏ అర్ధరాత్రికో నడుం వాల్చడం పరమ ధర్మంగా భావించబడుతూ ఉండేది.

## ***పోలీసుగారూ ఆవిడ మా ఆవిడే!***

ఒక రోజున భర్త బాగా ప్రొద్దుపోయి వచ్చాడింటికి. ఆయన గారికి నిద్రకూరుకు వచ్చింది. వెళ్ళి మడత కుర్చీలో పడుకున్నాడు. ఆయన వచ్చినట్లావిడకు తెలియదు. ఆవిడ తలుపువేసి వచ్చి తనను లేపి అన్నం పెడుతుంది గదా - అని ఆయన అనుకున్నాడు.

మరి కొంచెం ప్రొద్దు పోయింది. ఇద్దరికీ నిద్రపట్టి పోయింది. ఆ సమయంలో లాంతరు కూడా కునికిపాట్లు పడి ఆరిపోయింది. ఇంతలో గస్తీ పోలీసు వచ్చాడు.

కర్రపెట్టి అరుగు మీద బాదాడు. ఆవిడ ఉలికిపడి లేచింది. ఇల్లంతా కటిక చీకటి. ఖంగారుగా పరుగులెత్తడం ప్రారంభించింది. అటూ, ఇటూ పోలీసు - బ్యాటరీలైటు వేసి 'ఏయ్! ఎవరు నువ్వు?' అని కేకపెట్టాడు.

ఈ హడావుడికి భర్తలేచాడు. "ఆవిడ నా భార్యేనండి. దొంగకాదు" అని అరిచాడు. పోలీసు " భార్య అయితే అర్ధరాత్రి వేళ ఇలా తలుపు తీసుకుని కూర్చోవడమెందుకు? వేసుకోండి తలుపు వేసుకోండి. భార్యాభర్తలకు సలహాలు కూడా ఎక్కడ చెప్పగలం?" అంటూ బయలుదేరుతూ బీడీ ముట్టించాడు.

ఆ ఇంటియజమాని "పోలీసుగారూ! ఒక్కసారి అగ్గిపెట్టె ఇవ్వండి. లాంతరు వెలిగించుకుని ఇస్తాం" అని అడిగి పుచ్చుకున్నాడు.

# అయిదు పైసలకు ఆనంద భాష్పాలు

(సెప్టెంబర్, ౨౪- 1976, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

"ఏది ధర్మం? ఏది అధర్మం? ఏది సత్యం? ఏదసత్యం - ఓ మహాత్మా!"

ధర్మాన్ని గురించి వ్రాయాలన్నా, చెప్పాలన్నా - ఎన్ని గ్రంథాలో వ్రాయాలి - ఎన్ని సంవత్సరాలో ఉపన్యాసమివ్వాలి. అదైనా ఎవరికి తోచింది వారు చెపుతారు గాని - అందరికీ పనికివచ్చే ధర్మాలు చెప్పలేరు. అందరికీ ఆచరణ యోగ్యంగా ఉండేవి - ఆమోదకరంగా ఉండేవి అంతకన్నా చెప్పలేరు.

పెద్ద పెద్ద ధర్మాల్ని గురించి ఇక్కడ ప్రస్తావించలేంగాని - నిత్యజీవితంలో అనుకోకుండా జరిగే ధర్మాలను గురించి విచారిద్దాం.

చాలామంది ఎంతో ఆప్యాయంగా కాస్త అవకాశం దొరికితే - ఆలింగనం చేసుకునే వరిలాగా కనిపిస్తారు. ఆదిలో అతిమర్యాద - బలవంతపు అతుకులాగా కనిపిస్తుంది.

కానీ ఒక మానవుడు మాట్లాడుతుంటే రెండో మానవుడు ఎలా నమ్మకుండా ఉండగలడు? ఏ నాలుక తాటాకో, ఏ నాలుక చివురాకో ఎలా తెలుస్తుంది ముందర. రెండుమూడుసార్లు రుజువయిన తర్వాత గాని ఈ 'మాట నమ్మకురా మానవుడా?' అనే ఉద్బోధ బయలుదేరదు.

ఇలా మొదటి ఒకమాట, తర్వాత మరోమాటా మాట్లాడేవాళ్ళ జాబితాలు తయారుచెయ్యడం కష్టం. ఎవరికి వారే ఇలాటి వారిని గురించి, గ్రహించి, 'మాట నమ్మకూడదు' అనుకుంటూ ఉండడం మంచిది.

రిక్షా ఎక్కుదామని వెడతామనుకోండి. "రండి అయ్యా! రండి! ఎక్కండి. మీ దయవచ్చినంత ఇవ్వండి" అంటారు. ఎందుకైనా మంచిదని అర్ధరూపాయి ఇస్తాం. అది మామూలు. కనుక ముందే చెప్పుతున్నా - అని ఎక్కేవారు మనస్సును దిటవు చేసుకొని సీటులో చేరతారు.

రిక్షా గమ్యానికి కొంచెం కొంచెం దూరముండగానే

'ఎక్కడయ్యా? ఇంకెక్కడ?' అని ప్రశ్న వస్తుంది.

'కొంచెం ముందు' అంటాం.

'ఇంకేం ముందు మరో పేటకు వెడుతున్నాం' అనడం.

దిగిన తర్వాత అర్ధరూపాయి చేతిలో పెడితే

'చాల్లేవయ్య ఇంతదూరం తీసుకొచ్చి అర్ధరూపాయి ఇస్తున్నావా! తే - తే ఇంకో ఇరవై పైసలు' అనడం. - తగాదా ప్రారంభం! చివరికో పది పైసలు ఎక్కువ ఇవ్వడం అవతల వ్యక్తి 'పోవయ్యా పో ఇచ్చావుగాని పది పైసలు. ' అని విసుక్కుపోతూ ఉంటారు.

ఇందులో ఏది ధర్మం? ఏది అధర్మం? బాగా ఆలోచిస్తే, అడిగి ఇంకో పదిపైసలు తీసుకోవడం ధర్మం అవుతుందేమో.

నేనొక ముసలి వాడి రిక్షా తొక్కుతున్నంతసేపూ "అయ్యో! అతడికి కూడా నా వయస్సు ఉందే! నేను రిక్షాలో కూర్చుని అతణ్ణి బాధపెడుతున్నానే" అనిపించింది. ఎందుకింత వయస్సులో కూడా అవస్థ పడుతున్నాడనిపించింది.

"తాతా! కుమారుళ్ళున్నారా? అన్నాను

"ఉన్నారు బాబూ" అన్నాడు.

తర్వాత ప్రశ్న వేయలేకపోయాను. అంతా అతని గొంతులోనే అర్థమైపోయింది. ఇలాంటి సందర్భాలలో - నాకు కుమారుళ్ళు లేరనే అసంతృప్తి తొలిగిపోయి - అంతులేని సంతోషం వస్తూ ఉంటుంది.

రిక్షా మా ఇంటి దగ్గర ఆగిన తర్వాత ఆ తాతను అడిగాను. "కొడుకులు సంపాదించడం లేదా? అని.

"లేదు బాబూ వాళ్ళకూ నేనే పెట్టాలి. నేనూ, ముసలిదీ తినాలి. మొన్న మా చిన్నాడు వంట్లో జబ్బుగా ఉందని దాచిన ఇరవైరూపాయలు తీసుకుపోయాడు" అన్నాడా తాత.

జేబులో నుంచి చిల్లర తీశాను. అతనికిస్తానన్నదానికన్నా అయిదు పైసలు ఎక్కువ ఉన్నాయి. అవి కూడా ఇచ్చేశాను - పెద్ద త్యాగం చేసినట్లు, అతడు ఎంతో ఇదైపోయాడు. 'మీ దయ' అని నమస్కరించాడు. అతని కళ్ళల్లో ఆనందబాష్పాలు చూశాను. అవి అయిదుపైసల వల్లనే కాదు - ఆదరణగా మాట్లాడినందుకై ఉండాలి.

ఆ తాతను కుమారుళ్ళు వదలడం ధర్మమా! వాళ్ళ అనారోగ్యం కోసం ఇంకా తాపత్రయం పడుతూ ముసలి నరాల్ని మెలిపెట్టి సంపాదించడం ధర్మమా!. దేనికదే ధర్మం. ఎవరు చేసేది వారికే ధర్మం.

మొన్న ఒకాయన కుమార్తె వివాహం విషయంలో నానా అవస్థా పడుతూ, కనిపించిన వాళ్ళనల్లా సంబంధాల విషయం అడుగుతూ, తిరుగుతున్నాడు. ఎక్కడో ఒక సంబంధం ఉన్నదని తెలిసి - వారి ఇంటికి వెళ్ళి - వచ్చి తన కుమార్తెను చూడమని ప్రార్థించాడు.

పెళ్ళికొడుకు ఏదో నాలుగైదు వందలు సంపాదిస్తున్నాడు. 'ఫర్వాలేదు - ఫామిలీ ప్లానింగ్ ఆచరణలో పెడితే - ఇంటి అద్దె కట్టి ఇంత రేషన్ తెచ్చి ఇంట్లో పడేస్తాడు' అనుకున్నాడు తండ్రి.

సరే పెళ్ళికూతుర్ని చూడటానికి వచ్చారు. ఆ అమ్మాయి బి.ఏ పార్టు తప్పి మూడు పరీక్షలకు హాజరై ముక్తి పొందడానికి ప్రయత్నిస్తోంది. అవతల వాళ్ళు డిగ్రీ మాట ఎక్కువ పట్టించుకోలేదు. పాణిగ్రహణానికే ప్రాధాన్యమిచ్చారు.

సరే వాళ్ళు వచ్చారు. పిల్లను చూశారు. వీళ్ళు పిల్లవాణ్ణి చూశారు. కేకులు తిన్నారు. టీ సేవించారు. వక్కపొడి నమిలారు. అలవాటున్న వాళ్ళు సిగరెట్లు కాల్చారు లేనివాళ్ళు ఆ ధూపం ఆఘ్రాణిస్తున్నారు.

పిల్లవాడి తండ్రి 'మాకు అమ్మాయి నచ్చింది. తక్కిన వివరాల తర్వాత మాట్లాడుకుందాం' అన్నారు. పిల్ల తండ్రి ముఖం పిండి జల్లడంత అయింది. ఆయన భార్య 'అమ్మయ్యా' అని ఒక పెద్ద నిట్టూర్పు విడిచింది.

ఇంతలో పెళ్ళి కుమార్తె లేచి నిలబడి గంభీరమైన కంఠంతో 'పెళ్ళి కుమారుడు నాకు నచ్చలేదు. సినిమా హీరోలాగా ఉండాలి నేను చేసుకో తలచిన పిల్లవాడు' అంది. అంతా తెల్లముఖం వేశారు. పెళ్ళి కొడుకు తండ్రి కళ్ళు ఎర్రచేశాడు. పెళ్ళికొడుకు ఫోజు పెట్టి లేచాడు.

పెళ్ళికుమారుడు తల్లిమాత్రం 'కావాలంటే ఎపుడో అయ్యేవాడు. దిష్టి కొడుతుందని మేమే వెళ్ళనియ్యలే' అన్నది. అప్పటికే తక్కినవారు వెళ్ళి టాక్సీలో కూర్చున్నారు.

రూపం ధర్మమా? గుణం ధర్మమా? ఆపేక్ష ధర్మమా? ఆశయం ధర్మమా?

(ఆగస్టు 17,'76, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**"ప్రతివాళ్ళకీ ఊరికే మాట ఇచ్చేస్తారు.** ఆ పనులు కాకపోతే మర్యాదగా ఉంటుందా! చెయ్యగలవాటికే మాట ఇవ్వాలి. లేదా 'నా వల్లకాదని చల్లగా చెప్పేస్తే' వాళ్ళు మెల్లగా జారుకుంటారు. మాట ఇచ్చి వాళ్ళనిలా తిప్పడం దేనికండీ! దుప్పటి కప్పుకుని పడుకుంటే హాయిగా గుర్రుకొట్టి నిద్రపోవచ్చుగదా?" అని ఒకామె భర్తని మందలించటానికి ప్రయత్నించింది.

కానీ అలా చెపితే వింటారా! కొందరికి అలా మాట ఇవ్వడంలో ఎంతో సరదా ఉంటుంది. "ఫలానా పని మీ వల్ల అవుతుందా?" అంటే చాలు. "దానిదేం ఉంది. మీకు ఎవరితో పనివుందో ఆయన ఇప్పుడే వచ్చివెళ్ళాడు. అరగంట క్రిందట మీరు వస్తే ఆ పని ఇక్కడే అయిపోయేది" అంటూ ఉంటారు.

"బయలుదేరడం గంటకు ముందే బయలుదేరామండీ! దోవలో కొంచెం కాఫీ కోసం కక్కుర్తిపడ్డాం. అందువల్ల వచ్చింది ఆలస్యం. అరరే!" అని అవతలవాళ్ళు ఎంతో పశ్చాత్తాపం చెందుతారు. తాగిన కాఫీని - దాన్ని అందించిన హోటల్నీ ఎంతగానో దుమ్మెత్తి పోస్తారు.

"సరేలెండి అయిన దానికేం చేస్తాం! ఆయన మళ్ళీ రేపు సాయంత్రం వస్తాడు. వచ్చి తీరతాడులెండి. ఆయనకు నాతో చాలా పని ఉంది. రాగానే చెప్పి చేయిస్తాను. మళ్ళీ ఎప్పుడు కనపడం?" అంటారు.

అసలు ఆ వ్యక్తి చెప్పవలసిన జవాబు "మీ రోగం కుదిరేదాకా" అని. కానీ అలా చెప్పడు. నిజానికి ఆయన మాట నమ్మి తిరగాలంటే బ్రతికి ఉన్నంత కాలం తిరగాలి. లేదా ఎవరితో పని ఉన్నదో ఆయన కీర్తిశేషుడన్నా కావాలి. అందాకా తిరగడమే ఆయన కర్తవ్యం.

***<u>బదిలీల నుంచి బారసాల బ్రాహ్మడిదాకా</u>***

అలా ఆ వ్యక్తులు చేసి పెడతామని ఇచ్చే హామీలలో ఎన్నిరకాలు ఉంటాయి. ఏ ఒక్క శాఖకూ పరిమితమై ఉండవు. తనకు తెలిసిన విషయాలకు మాత్రమే పరిమితమై అంతకన్నా ఉండవు.

"కొంచెం మా వాడికి బదిలీ కావాలండీ! చాలా అవస్థపడుతున్నాడు. పెళ్ళాం ఒకచోట, పిల్లలు ఒకచోటా - అతడొక చోటా.. విసిరేసినట్లు పడివున్నారు. విసుగుపుట్టి ఉద్యోగం మానేస్తానంటున్నాడు. ఎలాగైనా మీరు పుణ్యం కట్టుకోవాలి అంటే - 'అదెంతపనిలెండి. అయితే ఒక్క వారం వ్యవధి ఇవ్వండి. నాకీ వారంలో అయిదునిముషాలు తీరుబడిలేదు. తర్వాత ఆర్డరు వేయించి, మీ ఇంటికి పంపిస్తా. అక్కడున్న వాళ్ళంతా ఎరుగున్నవాళ్ళే. మొన్ననే అడిగిపోయారు - "ఏమీ చెప్పడం లేదేం సార్! మా విషయంలో మొహమాట పడకండి. మీకు చెయ్యకపోతే ఎవరికి చేస్తాం" అని? అంటూ వచ్చిన వాళ్ళనోట్లో దోసెడు పంచదార పోస్తాడు.

వాళ్ళు తియ్యగా చప్పడిస్తూ చేతులు ముకుళించి, కళ్ళు పెద్దవి చేసుకుని ఏం చెప్పాలో తోచక కుర్చీకి అతుక్కుపోతారు గోడమీద బల్లుల్లాగా. తడికి కంతలో కాలు ఇరుక్కుపోయిన పిల్లుల్లాగా!

ఈ హామీలివ్వడం - ఒక్క బదిలీల విషయంలోనే కాదు. బారసాల తలపెట్టాం అనగానే "అలాగా అయితే బ్రాహ్మణ్ణి నేను పిలుచుకు వస్తాను. చక్కగా మంత్రాలు చెపుతాడు. నీత్రిగిత్తీ ఏంలేదు. మొన్ననెప్పుడో చెప్పాడు - ఇప్పటికి నాలుగువందల యనభై మూడు బారసాలలు చేయించాడు. " ఎన్ని ఉపనయనాలు చేయించిందీ, ఎన్ని బారసాలలు చేయించిందీ - అంతా పద్దు ఉంటుంది.

"పైగా నోటివాసి మంచిది. మంత్రం చెప్పాడంటే ఎంతో మంగళప్రదంగా సాగిపోతోంది అవతలవాళ్ళ జీవితం. ఒక్క బారసాలకు మంత్రం చెప్పాడంటే - పదిబారసాళ్ళదాకా బండి సాగిపోవలసిందే పైగా ఆయన బారసాల చేయించిన పిల్లలందరూ పెద్ద వాళ్ళయి చదువుతున్నారా! వాళ్ళ ఆదరణ - అదే తమాషా కాలేజి ఫస్టో, యూనివర్సిటీ ఫస్టో.. అలా రావలిసిందే" అంటూ హామీ ఇస్తాడు - అతి ధైర్యంగా నిజంగా తీసుకు వస్తాడుగావన్ను. అలాటి బ్రాహ్మణ్ణి - సంతాన నిరోధకాలంలో, ఏమి బెడద తెచ్చి పెడతాడోననే భయం ఏర్పడినా - ఆయనగారి సేవాభావం చూసి - మౌనముద్ర వహించక తప్పదు.

## తాత్కాలిక శాంతికి మాటలు మాత్రలు

మాట ఇచ్చాంగదా అనే బాధ చాలామందికి ఉండదు పాపం. తాత్కాలిక శాంతి కోసం. డోకుమందు, తలనొప్పి మందు కడుపునొప్పి మందూ వాడినట్లు - ఆ మాటల్ని మాత్రలు చేసి - చక్కగా మింగిస్తారు. ఈ రకం వైద్యంలో వారు సిద్ధహస్తులు. రోగ నివారణ విషయం వారు ఆలోచించనూ లేరు, ఆ రోగం కుదర్చనూ లేరు. అయితే మరో రకంగా కుదురుస్తారనుకోండి. అది వేరే ప్రక్రియ.

నిజానికి ఇలాటి వైద్యం కోరే వారుకూడా కొందరుంటారు. ప్రతి చిన్న విషయానికి గోడకూలిపోయినట్లుగా, మేడలు పడిపోతున్నట్టుగా గొడవ చేస్తూ బయలుదేరుతుంటారు. వారికి పైన చెప్పిన రకం చిట్కా వైద్యం వల్ల కొంత మనశ్శాంతి కలుగుతుంది. కొంత రొద తగ్గుతుంది.

మనిషికొక రకం వెర్రి ఉండటం దాన్ని తెచ్చి ఎదుట వాళ్ళకు రుద్దడం - వాళ్ళు చలికాలంలో కూడా చెమటతో ముద్దముద్దయి పోవడం జరుగుతూ ఉంటుంది. అలాటి వాళ్ళను చూస్తే సామాన్యంగా అందరికీ భయమే గాని - పైన చెప్పిన రకం ప్రయివేటు డాక్టర్లు చక్కగా - క్షణంలో కుదిర్చి పంపుతారు.

కొందరు అసలు డాక్టర్లు కూడా మాటలతో సగం రుగ్మతను పోగొట్టగల శక్తి గలవారుంటారు. ఆదరణతో, కొంచెం హాస్యంతో, ఆప్యాయతతో మాట్లాడి - తర్వాత మందిచ్చి పంపుతారు.

అలాటి డాక్టర్ల వద్దకు చాలామంది మందుకోసం కంటే మాటలకోసం ఎక్కువ వెడుతూ ఉంటారు. మరికొందరు ఆ మాటలకోసం ఏవో చిన్న చిన్న జబ్బులు వెతుక్కుని వెళ్ళి కూర్చుంటారుకూడా? అలాటివారి విషయంలో "మందు గొప్పో మాట గొప్పో" అనే సందేహం కూడా ఏర్పడుతూ ఉంటుంది.

## నత్తి మాటలతో తలనాదు రాదనా?

మా మల్లినాథసూరిగారొకసారి డాక్టరు గారి దగ్గరకు వెళ్ళి "సార్.. మా ఆవిడకు త..త..తల నా..నా..నా..నాదుగా ఉంది. ట. మ..మ...మందు ఇ..ఇ..ఇ..ఇస్తారా" అన్నారుట.

డాక్టరు అంతవరకూ ఓపిక పట్టి విని "ఈ కాసేపట్లో నాకే వచ్చింది తలవాదు. నీతో కాపరం చేసే ఆవిడకు ఎందుకు రాదూ - అందులో ఇవ్వాళ ఆదివారం కాదూ. ఆఫీసుకు పోలేదు గావను.. నత్తి మాటలు విని, అర్థంచేసుకోవడంలో అంత తలనాదు ఉంది. పైగా ఆవిడ ఏదో పనిలోనో పరధ్యానం లోనూ ఉండగా - చెప్పడం ప్రారంభిస్తావుగావున్ను" అన్నాడట డాక్టరుగారు.

ఆ మాటతో మల్లినాథులకు కోపం వచ్చిందిట. దానితో పాటు నత్తి హెచ్చిందిట. ఆయన అన్నారుట "మా..మా.ఆ..ఆఆ..విడకు. పర..పర..పర..ధ్యానం..ధ్యాన్న..న్నమే..ట..ట..టండి..న్నే..అంటే ఎంత... ఎంత... భయభక్తో... క్తో తెలుసా" అని.

డాక్టరుగారు నవ్వి "భక్తి అయితే మాత్రం పరధ్యానం ఉండకూడదుటయ్యా. ఏ కూరవిషయమో అందులోకి కావలసిన కారం విషయమో మరో ఇతర విషయమో ఆలోచిస్తూ ఉండకూడదూ.. భర్తనని నిన్ను తలుచుకుంటూ సంసారాన్ని, సంతానాన్ని వదులుకోమంటావేమిటి" అన్నారుట.

మల్లినాథులు గోడగడియారం వంక చూచి "ఇం..ఇం..తకీ.. మా..మా..త్రలిస్తారా లేదా?" అన్నాడుట. డాక్టరుగారు అయిదు మాత్రలు పొట్లం కట్టి ఇచ్చి నువ్వు ఇంట్లో ఉన్నప్పుడే ఇవి వాడు. బయటకు వచ్చేముంది ఆమెగారికి తలనాదుగా ఉన్నా వాడక్కరలేదు. నువ్వు ఇవతలకు రాగానే ఆగిపోతుంది. ఆవిడకు బాగా పట్టిచ్చే మందదే' అన్నారుట.

"మాత్ర..లకం...టె.. మాటలు.. ఎక్కువ.. నేర్చారు.. డా..డా..డా" అంటూ బయటకు వచ్చారుట.. వీధి గుమ్మం దాటినప్పుడు తక్కిన మాట 'క్షరు' బయటకు రావడం వాక్యం పూర్తికావడం జరిగిందట.

"మాటలతో విందు.. మాటలతో మందూ" అనే సామెత ఉంది. దీని క్రింద అనేక ఉదాహరణలివ్వచ్చు.

(సెప్టెంబర్ 19,1971, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**దేశంలో అనేకరకాల ప్రారంభోత్సవాలు జరుగుతూ ఉంటాయి.** ఏ చిన్న విషయం ప్రారంభించినా దానికో పెద్ద ప్రారంభోత్సవం జరపడం ఆచారమైంది. దానికోసం ప్రసిద్ధులైన వారిని ఆహ్వానించడం, సత్కరించడం - వారి హస్తవాసిని పొగడటం, ఒక విందు చేయడం, ఫోటోలు తీయడం - ఇదంతా పెద్ద తతంగంగా జరుగుతూ ఉంటుంది. భగవంతుని దయవల్ల ఆ పని నిర్విఘ్నంగా కొనసాగితే - ఆ ప్రారంభోత్సవం చేసిన పెద్ద మనిషి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందొక శిలాఫలకం మీద. లేదా - అక్కడక్కడే సుళ్ళు తిరిగి ధూళిలో కలిసిపోతూ ఉంటుంది.

***ఉన్న కొద్ది పేరూ పునాదిలో చిక్కుకొంది.***

సామాన్యంగా ఇలాటి పరిస్థితులు దాపరించవనుకోండి. జరిగినవి కొద్ది అయినా కొట్టొచ్చినట్లు నిలిచిపోయి ప్రారంభం జరిపిన పెద్దమనిషిని వెక్కిరిస్తూ ఉంటాయి. చాలామంది అందువల్లనే ప్రారంభోత్సవాలకు, శంకుస్థాపనలకూ అంగీకరించరు. "ఉన్న కొద్దిపేరు ఈ పునాదిలో వేసి చక్కాపోతే ఎలాగండీ! - దయచేసి నన్ను పిలవకండి!" అని బ్రతిమాలుతూ ఉంటారు కొందరు.

కానీ, పదవిలో ఉంటే తప్పించుకోవడానికి అవకాశం ఉండదు. ఎట్టి షరాలు, షరతులూ లేకుండా అంగీకరించవలసిందే! మంచి జాతకం కాకపోతే అనుకోని పదవి ఎలా వస్తుంది? కనుక పదవిలో ఉన్నంతకాలం జాతక ప్రభావం గొప్పగానే ఉంటుంది.

ఆ సమయంలో చేసిన పనులు జయప్రదం కాకమానవు - అనేభావంతోనే వారు ముందుకు వచ్చి ఆ పనులు నిర్వర్తిస్తూ ఉంటారు. లోలోపల గర్విస్తూ ఉండవచ్చుకూడా!

మా చిన్నతనంలో ఒక జమిందారుగారిని కాఫీ హోటల్ ప్రారంభోత్సవానికి పిలిచారు. మర్నాడు ఉదయం తొమ్మిందింటికి అని చెప్పారు. జమిందారు గారు మామూలు ప్రకారం కొంచెం పొద్దెక్కి నిద్రలేచారు. హోటల్ యజమానులు వచ్చారని ఆయనగారికి చెప్పారు.

***అన్నీ సిద్ధం చెయ్యమను - వెళ్ళగానే వెలిగిస్తాను***

"తొమ్మిదింటికన్నారుగా! ఇప్పటినుంచీ దేనికి? వెళ్ళమను. పొయ్యిలో కట్టెలు అవీ పెట్టి, కిర్సనాయిల్ పోసి సిద్ధంగా ఉంచమను. వెళ్ళగానే వెలిగిద్దాం. మంటపెట్టడం ఎంతసేపు? వెళ్ళమను" అన్నారుట.

జమిందారుగారి గుమాస్తా తూచా తప్పకుండా ఆ మాటే హోటల్ వాళ్ళతో చెప్పాడుట. వాళ్ళు బయటికి నవ్వితే ఎక్కడతంటా వస్తుందోనని - నవ్వంతా లోపల కుక్కుకుని, "వారు వచ్చి చెయ్యవలసిందల్లా - టేపు కత్తిరించడం ఒక్కటే! పొయి రాజెయ్యడం ఫలహారాలు తయారు చెయ్యడం అయిపోయింది. వారు టేపు కత్తిరించగానే ఫలహారాల విందు ప్రారంభమవుతుంది" అని సవినయంగా చెప్పుకున్నారుట.

గుమాస్తా ఆ వార్త మళ్ళీ లోపలికి అందించాడు - ఆ అందించడంలో హోటల్ యజమానులు చెప్పిన మాటకు కట్టుపడకుండా జమిందారుగారు చేయవలసిన పని వాళ్ళే చేసివేశారనే భావం గోచరించేటట్లు అభినయించాడుట.

ఇంకేవుంది? జమిందారుగారికి కోపం రానేవచ్చింది. "ఏమిటి! మనతో నిమిత్తం లేకుండా పొయ్యి అంటించి వేశారా? ఫలహారాలు కూడా తయారుచేశారా? అంతకాడికి మనల్ని ఎందుకు ఆహ్వానించాలి? వాళ్ళ కోసం పెందరాళ నిద్రకూడా లేచాను. పొమ్మను. మళ్ళీ పడుకుని నిద్రపోతున్నారని చెప్పు' అన్నాడుట.

గుమస్తా మళ్ళీ కొంచెం జాలి అభినయిస్తూ "పాపం వాళ్ళు ఏదో టేపు కత్తిరించడం అంటున్నారు?" అన్నాడుట.

"టేపా! మనం కత్తిరించడమా! మకేం పట్టింది? మన మెప్పుడైనా కత్తెర చేతపట్టామా? ఎవరైనా దర్జీలుంగారుని వెళ్ళమను. పొయ్యి అంటుంచుకోవడం వాళ్ళుట - టేపు నేనుట" అని లోపలకు వెళ్ళిపోయారట.

గుమస్తా కొంచెం ధైర్యం తెచ్చుకుని "చిత్తం, అది సిల్కుటేపుట. మద్రాసు నుంచి తెప్పించారుట. పైగా కత్తిరించేందుకు వెండికత్తెర తెప్పించారుట. శ్రీవారు తప్ప మరొకరు వెండికత్తెర ఎలా చేతపట్టుకుంటారు?" అన్నాడుట.

***టేపు అయితే రేపు కత్తిరిస్తామని చెప్పు***

"వెండికత్తెరా! టేపా! మనం కత్తిరించాలా! అదంతేలే టేపు అయితే రేపు కత్తిరిస్తాం. ఇవ్వాళ వీలులేదు. ఇవ్వాళ బుధవారం. తిధికూడా మంచిదికాదు. రేపు పదిగంటలకు రమ్మను. ఒప్పుకున్నాం కనుక రేపు వస్తామని చెప్పు. అదైనా ఒక షరతు మీద. మేము టేపు కత్తిరించే సమయంలో ఒక్క పిట్టకూడా అక్కడ ఉండకూడదని చెప్పు" - అని లోపలికి వెళ్ళి పోయారుట - ప్రారంభోత్సవాల ప్రారంభదశలో అలాటి తమాషాలు కూడా జరుగుతూ ఉండేవి.

దేశంలో ప్రారంభోత్సవాలు అనేకశాఖల్లో జరుగుతూ ఉంటాయి. రోడ్లకు, గిడ్డంగులకు, ఫ్యాక్టరీలకు, పాలడిపోలకు, సెలూన్లకు, సెకండు హాండ్ పుస్తకాల షాపులకు, ఉత్సవాలకు, ఉద్యమాలకూ - ఎవరినో ఒకరిని పిలవడం, ఎంతో గొప్పగా ప్రారంభోత్సవాలు జరపడం ఆచారమైపోయింది.

పరువు పోతుందని పని నెత్తిన వేసుకోగలరా?

అయితే, ఇవన్నీ ఎంతో అభివృద్ధిలోనికి వస్తాయనుకోవడానికి వీల్లేదు.

వారి వారి అదృష్టాలను బట్టి నడుస్తూ ఉంటాయి. కొందరి చేత పునాదిరాళ్ళు వేయిస్తే అవి శివలింగాలలాగా అలాగే ఉండిపోతాయి. ఎంతకాలమైనా. పరువుపోతుందని ప్రారంభోత్సవాలు చేసిన వారే - ఆ పని అంతా ఎక్కడ పూర్తిచేయగలరు? కాకపోతే లోలోపల దైవాన్ని ప్రార్ధించవచ్చు - లేదా ఏదైనా మొక్కుకోవచ్చు. అంతకన్నా ఏం చెయ్యకలుగుతారు?

కొందరు పెద్దమనుష్యులు చెపుతారు - "నాయనా! నన్ను పిలవకండి. నా చేతిలో చేయించడంవల్ల పైకి రావడమనేది కుంటుపడక తప్పదు - చాలా అనుభవంతో చెపుతున్నాను. మరొకర్ని చూచుకోండి. మంచి పని తలపెట్టి - నన్ను ఆహ్వానించడం మంచిది కాదు" అని. కానీ అంతమాత్రంతో వదులుతారా?

"మీకెందుకు మీరు దయచెయ్యండి. సంశయాలు పెట్టుకోకండి. సక్రమంగానే నడుస్తుంది అంతా. కార్యక్రమానికి అవసరమైన డబ్బంతా బ్యాంకులో వేసే ఉంచాం" అని బ్రతిమాలి, హామీ ఇచ్చి లాక్కుపోతూ ఉంటారు. చెప్పిన మాట విననందుకు గట్టి దెబ్బ తింటూవుంటారు.

ఒకసారి మాకు మిత్రుడైన ఒకరాజకీయవేత్తను - ఒక సినిమా థియేటర్‌కు ప్రారంభోత్సవం చెయ్యమని ఆహ్వానించారు. మేము కూడా వెళ్ళాం. పెద్ద పార్టీ జరిగింది.

ఆ ఊళ్ళో మరొక సినిమా హాలు ఆవశ్యకతను గురించి ఎంతగానో ఉద్ఘోషించారు. ఇద్దరు ముగ్గురు ఉపన్యాసకులు ఆ నిర్మాణం ఎంత గొప్పగా జరగబోయేది వర్ణించారు. ఇద్దరు వాటాదారులు మా మిత్రుణ్ణి పునాదిలో సున్నం వెయ్యమన్నారు. తాపీ చేతికిచ్చారు. ఆయన వేశాడు..

ఊరుకుంటే పోయేది - ప్రక్కననున్న మిత్రులు కూడా వెయ్యాలని మమ్మల్నికూడా పిలిచారు. శుభమస్తు అంటూ మరో ముగ్గురం సున్నం తీసివేశాం. హర్షధ్వానాల మధ్య అది పూర్తి అవగానే పెద్ద టీపార్టీ జరిగింది. హాలు ప్రారంభోత్సవానికి రావలసిందిగా అందర్నీ అప్పుడే కోరారు.

సరేనని వచ్చేశాం. పదకొండు సంవత్సరాలైంది. ఆ రోజు అక్కడ పెట్టిన పది పన్నెండు ఇటికలు తప్ప - కట్టడం మాట ఎత్తలేదింతవరకు.

ఆ ఊరి నుంచి ఎవరైనా వచ్చినప్పుడు అడుగుతూ ఉంటాను ''ఆ హాలు సంగతి ఏమైంది?'' అని ''పునాది పూడిపోయింది'' అని ఎంతో వినయంగా చెపుతూ ఉంటారు.

**(ఆగస్ట్ 10,'76, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**''రాణీ, ఓ రాణీ ఏడుకావస్తోంది ఇంకా లేవవేం?.. నిర్మల.. ...** ఏమిటే పాడు నిద్ర!. బుజ్జీ అలా మసిలి మళ్ళీ పడుకుంటావేరా?'' ప్రొద్దుటిపూట ఇల్లాలి కేకలు.

''వాళ్ళు లేవటం మాట సరే పాలొచ్చాయా లేదా? అరకప్పు కాఫీ కోసం ఇంటి కప్పు ఎగిరిపోయేలా కేకలు పెట్టాలి'' ఆవిడ భర్త కేకలు.

''పాలసీసా రాలేదండీ! వస్తే కాచి తీసుకురానూ. పోనీ హార్లిక్సు కాచితేనా?''

''ఇంకా నయం. కాళ్ళమీద వేసుకుని ఉగ్గు గిన్నెతో గ్లూకోజు నీళ్ళు పోస్తానన్నావు కాదు. ఆ పెద్దాణ్ణి లేపి, ఆ చెట్టు క్రింద పాలన్నా తెప్పించు.''

''వాడు లేవడండీ. ఒరే బుజ్జీ. లేవరా పాలు తేవాలి. ఏమండీ చిల్లర ఉందా?''

''నిన్న ఇచ్చిన చిల్లరంతా ఏం చేశావు రూపాయి మార్చడం. చిల్లర ఎక్కడో పొయ్యడం. ఓ రూపాయన్నా ఇచ్చి పంపు.

''బుజ్జీ లేవరా? పాలుతేవాలి''

బుజ్జి లేచి కూర్చుని ప్రక్కమీదవున్న జంపఖానా గట్టిగా కప్పుకుని ''నన్ను లేపకు కళ్ళు మండిపోతున్నాయి.''

''వెధవా కళ్ళు మండుతున్నాయ్!. ఒళ్ళుమండిపోతుంది నీ చేష్టలు చూస్తుంటే లేస్తావా లేవవా?'' బుజ్జి జంపఖానాలోనుంచి అరుస్తాడు. ''నేను చలిలో ఏం తేలేను. కావాలంటే నువ్వే వెళ్ళు.''

''వాణ్ణి లేపడం మన చేతవుతుందిటే!. అలా పెంచావు పిల్లల్ని'' అని గృహస్థు నేరారోపణ.

''నే పెంచడమేమిటి? మీరు భయపెట్టాలి వాళ్ళని. బొత్తిగా చెప్పినమాట వినడం మానేశారు. ఏరా బుజ్జీ.''

''అరవకమ్మా. ఒక్క అరగంటదాకా నన్ను లేపకు'' అని బుజ్జి హుకుం.

"పోనీ ఆ పనిమనిషినన్నా పిలవ్వే. ప్రాణం పోతోంది." భర్తగారి గగ్గోలు.

"పనిమనిషి ఇప్పుడే పక్కింటికి వెళ్ళిందండి. ఇంకో గంటకు గానీ రాదు - బట్టలు ఉతకడానికి" అని ఆమెగారు.

"గంట తర్వాత వస్తుందా ఎందుకు?"

***"మీరిద్దరు నన్ను పట్టి దించాలి"***

"రోజూ అంతేగా! ఎనిమిదింటికి వచ్చి అందరూ స్నానాలు అయిన తర్వాత బట్టలు ఉతికి ఆరేసిపోతుందండీ. చూస్తూనే ఉంటారుగా మీకు తెలియదూ అది వచ్చి వెళ్ళే వేళలు? అని అర్ధాంగి ప్రశ్న.

"నాకు అదేపనా! అది వచ్చి వెళ్ళే వేళలు డైరీలో వ్రాసుకుంటున్నానంటానా! ఒకసారి కేకెయ్యరాదూ. పాలు తెచ్చి వెళ్ళిపోతుంది."

"అలా రాదండి. వాళ్ళింట్లో పనులు చెయ్యందే రానిస్తారేమిటి? ఆ ఇంటాయనా ఉద్యోగం చేస్తున్నాడు. వాళ్ళ పిల్లలూ బడుల్లో చదువుకుంటున్నారు. గంట తర్వాతగానీ రాదు."

"గంట తర్వాత వస్తే ఒక్క పనిచెయ్యమను చెయ్యమనేమిటి. చెయ్యండి"

"ఏం చెయ్యమంటారు?"

"ఇద్దరూ పట్టి నన్ను మంచం మీద నుంచి దింపి చిరిచాపమీద పడుకోబెట్టండి"

"ఏం మాటలండీ అవి?. ప్రొద్దున్నే ఇలాటి సంభాషణ ఏమిటి? పాలురావడం కొంచెం ఆలస్యమైంది. పోనీ నేనే వెళ్ళి ఆ చెట్టు దగ్గరపాలు తెస్తాను. మీరీలోగా పిల్లల్ని లేపండి. ప్రొద్దెక్కి పోతోంది. లేస్తే ముఖాలు కడుక్కోని. ఒక్కొక్కళ్ళనే స్నానం చెయ్యమనండి.

ఇంతలో ప్రక్కింటావిడ వస్తుంది ఎంతో గాబరాగా. "మీ ఇంట్లో కొట్టిన పిండి ఉందా? ఉంటే ఈ గ్లాసుడు ఇవ్వండి. మావారు రాత్రి భోజనం చెయ్యకుండా పడుకున్నారు. రాత్రిపాలుంటే కాస్త కాఫీ కాచి ఇచ్చాను. అయినా ఇంకా ఆకలిగా ఉందిట. శోష.శోష అంటున్నారు" అంటుంది.

***మా ఇంట్లో పిండిలేదు మీ ఇంట్లో పాలున్నాయా?***

"మా ఇంట్లోలేదు శాంతమ్మగారూ. మీ ఇంట్లో రాత్రిపాలు ఇంకా కాసిని ఉన్నాయా? కప్పుడుంటే చాలు" అని ఈమె ప్రశ్న.

"అయ్యో. లేవండీ! ఎప్పుడన్నా ఇలా పాలసీసాలు రావడం ఆలస్యమవుతూందని అరకప్పుడు దాస్తాను. అవే గోరువెచ్చగా కాచి ఇస్తాను. అవే చప్పళించుతాడాయన. బాగా కాస్తే పటేలున విరిగిపోతాయి. రాత్రిపాలు రవ్వనిప్పుల మీద కాచాను. అరపొంగు రాగానే స్టవ్ ఆర్పేయాలి. పోనీ బొంబాయి రవ్వ ఉందా? మధ్యాహ్నం తెచ్చి ఇస్తాను. నేనిక్కడే ఉన్నాను. వారికి శోష వస్తుందేమో! " అని ఆవిడగారి ఆవేదన.

"ఒరేయ్ బుజ్జీ. మీ అమ్మ వెళ్ళలేదల్లే ఉంది చూడరా.. ఆవిడ భర్తకు శోషట. అందులో పడి నా ఘోష వినిపించుకోవడం లేదు. వెళ్ళరా"

బుజ్జి లేచి కూర్చుని "శాంతమ్మగారు నాన్నా. పాపం మంచావిడ. ఆవిణ్ణి ఏమీ అనకండి" అని మళ్ళీ ముసుగుపెడతాడు.

పాపమా ఇల్లాలు బొంబాయి రవ్వ ఇచ్చి ప్రక్కింటావిణ్ణి పంపి భర్త దగ్గరకు వచ్చి "పాపం శాంతమ్మగారు వచ్చింది వాళ్ళాయనకు శోష వచ్చిందిట. కొంచెం బొంబాయి రవ్వవుంటే డబ్బా దులిపి ఇచ్చి వచ్చా. నే వెళ్ళి చెట్టు దగ్గర పాలు తెస్తా. పిల్లల్ని లేపండి ఏడున్నర అవుతోంది.

"నువ్వేం చెప్పుతున్నావో నాకు వినిపించడంలా"

"పాలకోసం వెడుతున్నానండీ. త్వరగా వచ్చేస్తా. అక్కడ లేకపోతే ఆంజనేయులు గుడిదాకా వెళ్ళొస్తా. ఈలోగా సీసా పాలు ఒస్తే?"

"వస్తే పొట్టమీద వేసుకుని పాడుకుంటా"

"పాడుకోవటమేమిటి?"

పాలసీసాలు పొట్టమిద వేసుకుంటారా?"

"లేకపోతే పట్టుకెళ్ళి ఎక్కడన్నా అమ్ముకు రమ్మంటారా?"

"కాస్త వెచ్చపెట్టుకోండి."

"ఈ శరీరం వెచ్చపడందే మంచం దిగలేను"

"నే వెడుతున్నా ముగ్గురు పిల్లల్నీ లేపండి బడికి వేళవుతోంది ఎనిమిదికూడా కావస్తోంది."

"నాడి చూద్దువుగాని నాదగ్గరే ఉండు"

"ఎనిమిది అయ్యేదాకా నువ్వు గుమ్మం దిగవు. వాకిట్లో ఎవరన్నా కనిపిస్తే చీరల బేరాలు చేస్తావు. ఇంటికి వచ్చేటప్పటికి నే పాలు త్రాగే స్థితిలో ఉంటానో ఉండనో?"

"నేనేం బేరాలు చెయ్యను. ప్రొద్దున్నే చీరల బేరాలేమిటి? అసలీమధ్య నే చీరలు కొన్నానా!.

క్రిందటి డిశంబరులో - ఒక్క రేషన్ చీర తెచ్చుకున్నా. అంతేగా. అసలు వాటి ధరలే నాకు తెలియవు. ఈ నెల్లోనన్నా రెండు కట్టుడు చీరలు కొనాలి. నేవెళ్ళి వస్తా. మీరు పిల్లల్ని లేపండి. నే పాలు తెస్తా."

ఇంతలో "అనసూయమ్మగారూ" అని పిలుపు, ఆమె అటుచూచి "మీరా! రండి." ఆప్యాయంగా ఆహ్వానిస్తుంది. "ఆ! ఏం లేదు. మీ ఇంట్లో హనుమాన్ చాలిసా ఉందా! రాత్రిళ్ళు పిచ్చికలలు వస్తున్నాయి. పోనీ చదువుకుందామనిపించింది. నలభై రోజులు చదివితే - దయ్యాలు కూడా విడిచి పారిపోతాయట" అని వచ్చినామె కోరికా, వాఖ్యానం.

"ఉందికానీ. మడిలో ఉంది. మధ్యాహ్నం ఇవ్వొచ్చా."

"ఇవ్వొచ్చు. కానీ ఈపూట ప్రారంభిద్దామని. నాకు మనస్సులోకి ఏదైనా ఆలోచన వస్తే ఆపబుద్ధి పుట్టదు.

అప్పటికప్పుడు చేసెయ్యవలసిందే కొంచెం పట్టుబట్టకట్టుకుని చాలీసా ఇవ్వకూడదూ. మావారు ఆఫీసుకి వెళ్ళేలోగా వారిచేతకూడా చదివిద్దామని. "

"ఎలా నేను పాలసీసాకు వెళ్ళాలి. మా పిల్లలు లేస్తారు. వాళ్ళు స్నానం చేయగానే తీయించి పంపిస్తాలెండి"

"ఇంకా వాళ్ళు లేవలేదా? బడికి వేళ అవుతోందిగా. అయినా మీరు పాలకు వెళ్ళడమేమిటి? మీ అబ్బాయిని లేపి పంపకపోయారు?"

"వాడు లేవడం లేదు. కళ్ళు మంటలుగా ఉన్నాయట. కాస్త ప్రొద్దుపోయేదాకా చదివాడు. అందుకని నేనే వెళ్ళుతున్నా. సీసాలు రాలేదివ్వాళ. అందువల్ల చాలా ఇబ్బంది అయ్యింది."

"అలాగా! మీరు తెలుగు చాలీసా కూడా కొన్నారా?"

"లేదు. అందలేదు. కొందామనే ఉంది"

"కొంటే మాక్కూడా ఒకటి కొనండి.

"అలాగే నే పాలకు వెళ్ళివస్తా"

"నేనూ అరగంట తర్వాత వస్తా"

ఆమె వెళ్ళిపోతుంది. ఆ ఇల్లాలు భర్తదగ్గరకి వెళ్ళి నేను పాలకు వెడుతున్నానండీ! మీరు పిల్లల్ని లేపండి. లేకపోతే అందరికీ బడి గల్లంతే!" అని చెపుతుంది.

"నువ్వు ఇంట్లోనే ఉండు కొంచెం పని ఉంది"

"వచ్చి చెయ్యకూడదూ?"

"ఇప్పుడే చెయ్యాలి"

పాలువద్దు. ఏమీ వద్దు. నానాడి కొంచెం చూస్తూ కూర్చో. అవసరమొస్తే పిల్లల్ని లేపు."

"ఏం మాటలండీ ప్రొద్దున్నే"

"నాడికి ప్రొద్దునేమిటి? సాయంత్రమేమిటి? ఇలా బల్లమీద కూర్చో" అని చెయ్యిజాస్తాడు.

వాకిట్లో 'పాలు' అనికేక. ఆవిడ బయటకు పరిగెత్తుతుంది. ఆయన వెంకటేశ్వరుడి పటానికి దణ్ణం పెడతాడు. తర్వాత ఘట్టం...

**(జూలై 03,'76, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**"అమ్మా! అమ్మా నే సినిమాకు వెడుతున్నా".**

"ఏం సినిమారా? రోజూ అదే పనా? నీ దగ్గర డబ్బులుంటే ఒక్క రూపాయి ఇయ్యి. అర్జంటు పని వచ్చింది."

"మన బడ్జెట్ చాలా లోటమ్మ. ఇవ్వాళ టిక్కెట్టు డబ్బులు బొటాబొటి - డ్రింకుకు స్వస్తి. "

"ఏం సినిమారా ఒక్క రూపాయి కావాలిరా. మీనాన్న రాగానే తీసుకుని ఇస్తారా."

"నాన్న ఉన్నాడుగా నీకు కాషియర్. మధ్య నన్ను బాధపెడతావెందుకమ్మా. టైం అయింది. నా వంతు భోజనం టేబుల్ మీద పెట్టు. టా...టా"

"అంత గొప్ప సినిమా వచ్చిందేమ్రిటా ఒక్కరోజు ఆగలేవు. "

"లేదమ్మా సినిమా చూడకపోతే శివుడికి కోపం వస్తుంది. మూడో కన్ను తెరుస్తాడు. "

"బాగానే ఉంది నీ ధోరణి. అసలేమిటా సినిమా. పోనీ రెండో ఆటకు నే కూడా వస్తాలే. అది పురాణమా! సాంఘికమా! జానపదమా!

***నాంచారయ్య సమర్పించు నా అంతవాణ్ణి నేను***

"నా అంతవాణ్ణి నేను.. "

"నీ అంతవాడని నువ్వేలేరా. అయినా నా కడుపున పుట్టావు కదట్రా."

"అదే పొరపాటు. అయినా ఏం చేస్తాం? మరిచిపోతల్లీ ఆ వృత్తాంతం."

"మరిచిపోకేం చేస్తాను. నీ అంతవాడివి నువ్వంటున్నావుగా.!? "

"అవును మాతా ఈ రోజుల్లో ఎవడంత వాడు వాడే ఒకళ్ళతో పోలిక లేదు. ఇది నవయుగం. అందుకే నాంచారయ్యా సమర్పించు 'నా అంతవాణ్ణి నేను' సినిమాకు వెడుతున్నా."

"మీ అంతవాళ్ళు మీరు కావాలి నాయనా. మా అంతవాళ్ళుగా ఎందుక్కావాలి.? నీ అంతవాడివి నువ్వయి నీ సంతానం నీకంటే గొప్పదై. "

"సంతానం మాట ఎత్తకమ్మా. చాలా డేంజర్ మరో పదేళ్ళలో జనాభా రెండింతలవుతోందని పత్రికల్లో అంత అంత అక్షరాలతో అచ్చువేస్తున్నారు. చూడటంలా. నా సతానం మాట ఎత్తుతావేమిటమ్మ. ఈ బాల బీష్మ ఇలా బ్రతకనియ్యమ్మ."

***మానవులంతా ఒకటే కుటుంబం తల్లీ.***

"పెళ్ళి చేసుకోకపోతే ఎలాగురా? వంశం ఏమైపోతుందిరా. ఎప్పటినుంచో వస్తున్న పరంపరా ఇది."

"ఏం పరంపరమ్మా. వీటితోనే మానవజాతి చర చర పెరిగిపోతోంది. కొన్నిటికి ఫుల్‌స్టాప్ పెట్టాలమ్మా. "

"ఏమిటా అర్థంలేని ప్రలాపాలు. మీ నాన్న దగ్గిర ఉంది మన వంశవృక్షం. చూడు ఎలాంటి వాళ్ళు జన్మించారో. మహా పురుషులు పుట్టిన వంశంరా"

"మహర్షులు పుట్టిన దేశంలో మహాపురుషులు పుట్టక ఏం చేస్తారమ్మా. అయినా ప్రతిపురుషుడూ మహా పురుషుడు కావాలంటే ఎలా?"

"ఈ సోదంతా ఏమిట్రా. నేను కోడల్ని చూచుకో అక్కర్లా. మనుమన్ని ఎత్తుకో అక్కర్లా. వంశం ప్రతిష్టతో ముందుకు పో అక్కర్లా"

"అమ్మానీ మాటలకు ఎంతో చింతిస్తున్నానమ్మా. కాలం మారిందనే విషయం కూడా గుర్తించకపోతే ఎలా చెప్పు. నాన్న సగం చదువుకున్నాడు. నువ్వు కేవలం నిశానీదారువి. ప్రపంచం సంగతి ఎలా తెలుస్తుందమ్మా. నిండిర్ విల్లీ అనే మహానుభావుడు ఎప్పుడో వ్రాశారు. "ప్రపంచమంతా ఒకే కుటుంబం" అనే గ్రంథం."

"ఎవరో ఏదో వ్రాస్తూనే ఉంటారు. చేతులో కలం ఉంటే వ్రాతలకేం? డబ్బుంటే అచ్చుకూడా పడతాయి. నోబోటిగాళ్ళు కాలక్షేపంకోసం ఆ పిచ్చాపాటి చదువుతుంటారు. ఆ విల్కికి మన వంశ మర్యాద లేం తెలుస్తాయిటా. అసలే దేశం ఆయనది? "

"ఏం తిడుతూ ఉత్తరం వ్రాయిద్దామనా. చాలా దూరంలే. ఇంతకీ నేను సినిమాకు వెళ్ళాలి. మాటలో పెట్టావు. "

***రూపాయిలోనుంచి పాపాయిల్లోకి వెళ్ళావు***

"అయినా ఇదేమిటి? రూపాయి కావాలని ప్రారంభించి, పాపాయిలదాకా వెళ్ళావు. రూపాయలు సంపాదించాలి తప్పదు. పాపాయిల మాత హుళక్కి. ఈ సాంబశివరావుకి సంతాన ప్రాప్తిలేదు. విచారపడకు. నీకు అంతగా పిల్లల్ని పెంచాలనే వాంఛ తీవ్రంగా ఉంటే పిల్లల్ని పెంచలేని బీదవాళ్ళు చాలామంది ఉన్నారు. ఇద్దరు ముగ్గుర్ని తెచ్చి ఇంట్లో దించుతాను. చక్కగా పోషించు. నీ పేరూ, బొమ్మా పత్రికల్లో పడతాయి. ఆ బీద పిల్లలు ఇంత అన్నం తింటారు? "

"బాగానే ఉంది. పరాయి వాళ్ళను పెంచితే నా వాళ్ళు అవుతారుట్రా. శాస్త్రం చెప్పినట్లుంది నీ సలహా. వాళ్ళు నన్ను అమ్మ అంటారా! బామ్మ అంటారా?"

"ఎందుకు అనరమ్మా. ప్రతి రోజూ వాకిట్లోకి ఎంతమంది బీదవాళ్ళు వచ్చి "అమ్మా బిచ్చం అమ్మా కాస్త అన్నం" అని అరవడంలా. నువ్వు వినిపించుకోవడంలేదు. కావాలంటే వాళ్ళచేత 'బామ్మ' అనికూడా పిలిపిస్తాను. ఇంకా నువ్వు పట్టుబడితే మన ఇంటి పేరు వాళ్ళక్కూడా పెడతాను. ఏం? సంతోషమేనా? "

"నాకేం అక్కర్లేదులే. కడుపున కాయకాసింది. ఆ కాయలో నుంచి మరి కొన్ని కాయలు కాయాలి. వీటి తీపి బయటి వాటికి ఉంటుంద్రిరా. `మన` అనే మాట మరొకళ్ళను చూస్తే వస్తుందా.? "

"రానంతవరకూ మనం నిజమైన దేశభక్తులం కాదమ్మా. మనకిలాటి స్వార్థాలుండబట్టే - ప్రభుత్వం ఎక్కువగా సిరిని తీసుకుని తక్కువ ఉన్న వాళ్ళకు పంచుతున్నారు. అంతే అవుతుంది మన పనికూడా."

"ఇదంతా మీ నాన్న స్వార్జితం. ఎలా తీసుకుంటారు. నేనీ ఇంట్లో అడుగుపెట్టిన తర్వాతనే ఇంత సిరి కలిసి వచ్చింది. నే వచ్చిన మూడేళ్ళలో ఈ మేడ కట్టారు మీ నాన్న. అంతకు ముందేం ఉంది - అద్దె కొంపేగా. "

"అదే నయం ఈ మేడకంటే. అది సరేగాని మేడ ఎలా కట్టారమ్మా నాన్న? ఆ రహస్యం కొంచెం చెప్పగలనా? ఎవరితో చెప్పనులే సంసారం విషయాలు ఈ సాంబశివరావు కూడా తెలుసుకోవచ్చుగా. మీ అబ్బాయినేగా. "

"అందరూ ఎలాకట్టారో ఆయనా అలాగే కట్టారు. ఇటికతో సున్నంతో. "

***<u>ఇటుకా, సున్నం ఎలా వచ్చెనో చెప్పగలవా.</u>***

"నీ జవాబు బాగానే ఉంది మాతా. కానీ ఆ ఇటుకా, సున్నం ఎలా వచ్చెనో చెప్పగలవా? " అని సాంబశివరావు గంతులు వేస్తూ పాట పాడటం ప్రారంభించాడు. తల్లి ముఖం చిట్లించుకుని వింటోంది

"సినిమాలలో పాటలు తప్ప కృష్ణా రామా చేతకావు. ఏం లాభం? ఎక్కడన్నా ఉద్యోగం సంపాదించుకోరా అంటే వద్దంటావు. దేశసేవ అంటావు. ఇంత పెద్ద దేశానికి చిన్న కుంకవు నువ్వేం సేవ చేస్తావు? నువ్వు చెయ్యకపోతే ఆగుతుందా?"

"సేవ చెయ్యలేకపోయినా, ద్రోహం మాత్రం చెయ్యను తల్లీ! నన్ను కృష్ణా రామా అనుకోమంటున్నావా? మన ఇంట్లో ప్రతి ఇటుక రాతిమీద పాండురంగడు వచ్చి నిలబడతాడనుకుంటున్నావా? నన్ను కన్న సాధ్వీమణీ. మన్నించు. నా చేత ఇంకా మాట్లాడించు. ఈ కుటుంబాన్ని ఇంతటితో ఆగిపోనీ. నేను మాత్రం పెళ్ళిచేసుకోను. నడిచిపోతాను ఏ హిమాలయాలకో. ఎవరన్నా "మీరెవర"ని అడిగితే భారతీయుణ్ణి అని చెప్పుకుంటాను. దొరికితే ఎక్కడన్నా రెండు మెతుకులు తింటాను. లేకపోతే వస్తుంటాను. నా అంతవాణ్ణి నేనుగా స్వంతంగా నవయుగ పౌరుడుగా జీవించాలనుకుంటున్నాను మాతా. నాన్నలాగా బ్రతకలేను. ఈ మేడకు మరో అంతస్తు వెయ్యలేను. నేను సినిమాకు వెడుతున్నా. అదృష్టవశాత్తు "నా అంతవాణ్ణి నేను" అనే ఫిలిం వచ్చింది చూచివస్తా"

"రూపాయి మాటేమిటిరా"

"నాన్ననడగవమ్మ. ఆయన ఎందరినో అడిగి తెచ్చిన డబ్బు ఎంతో ఉంది. "

"గుళ్ళో కొబ్బరికాయకొట్టాలిరా. మీనాన్న వచ్చేసరికి ప్రొద్దుపోతుంది. "

"కోటి కొబ్బరి కాయలు కొట్టినా చేసిన పాపం తీరుతుందని నమ్మకం లేదమ్మా. వస్తా. ఆరుదాటింది. "

"నా అంతవాణ్ణి నేను - టా..టా. "

(సెప్టెంబర్ 29,'76, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

## షరా మామూలే, మిగిలింది జేబురుమాలే!

**పూర్వం నాటకాల కాగితాలు పంచిపెడుతూ ఉండేవారు విరివిగా.** ఒక బండిలో నౌబత్ ఖాన్ వాయిస్తూ కాగితాలు పంచిపెట్టడం ఆ మోత వినగానే పిల్లలందరూ పరుగెత్తడం. కాగితం కోసం ఒక ఫర్లాంగుదూరం వెళ్ళడం మాములు.

ఒకడు ఎంతో ఠీవిగా కూర్చుని ఆ కాగితాలనే కరెన్సీ నోట్లు పంచిపెట్టినంత ధీమాగా పంచుతూ ఉండేవాడు. పిల్లల్ని కసురుతూ ఉండేవాడు. పెద్దవాళ్ళకు మాత్రం మర్యాదగా ఇస్తుండేవాడు. పిల్లలం - ఎవరం ఎన్ని నాటకం కాగితలు దాస్తామా? అని పందెం వేసుకునే వాళ్ళం. అందుకని అందర్నీ బ్రతిమలి కాగితాలు తెచ్చి మడతపెట్టి దాచేవాళ్ళం.

చదవడం మాత్రం చదివేవాళ్ళం. నాటకానికి వెళ్ళడం ఎక్కడ సాధ్యమవుతుంది. ఎన్నింటికని పెద్దవాళ్ళు తీసుకు వెడతారు? భీముడు ఫలానా ఆయన వేస్తాడు - రాముడు ఫలానా, ప్రహ్లాదుడు ఫలానా - అంటూ చదువుతూ ఉండేవాళ్ళం.

ప్రతికాగితంలో చివర 'షరా మాములే' అని ఉండేది. అదిమాత్రం ఏమిటో తెలిసేది కాదు. దాని ప్రక్కనే వర్షము వచ్చినను నాటకము ఆడబడును - అని ఉండేది. అది కొంచెం తెలిసేది. పాతహాలు - పెంకుల్లోనుంచి నీళ్ళు కారేవి. అయిన నాటకం ఆడబడును అని వ్రాసేవారు. చూచేవారికి తడిసే ఓపిక ఉండాలి - అనుకునేవారు పెద్దవాళ్లు.

హాలులో ఇబ్బందులు చాలా ఉండేవి. ఆడవాళ్ళకు కొయ్య మేడమీద ప్రత్యేకస్థలం ఏర్పాటు చేసేవారు. క్రింద పెద్ద అరుగు దానిమీద చాపలు. పైనుంచి పిల్లలు లఘుశంక చేసేవారు. దానికి కూడా వోర్చుకోక తప్పేదికాదు. దాని ముందు బల్లలు. అవి హోదాగల సీట్లు. అక్కడ కూర్చుంటే ఎంతో గౌరవం. ఆ ఛాన్సు అందేదికాదు సామాన్యంగా. అయినా వాటినిండా నల్లులు. ముందుగా కుర్చీలు మేకులు లేచి ఉండేవి. బట్టలు చిరిగేవి. తొడలు గీసుకుపోయేవి. అరిచేతులు చీరుకుపోయేవి. అయినా ఎవర్నీ ఏమీ అనడానికి వీల్లేదు. ఇవన్నీ కూడా షరా మామూలు క్రిందకే వచ్చేవి.

ఒకొక్కప్పుడు ఒకరిద్దరు నటులు రాకపోయినా నాటకం ఆడేవారు. ఒకప్పుడు ప్రేక్షకులు గల్లంతు చేసేవారు. రాని నటుల్ని ఏమీ చెయ్యలేరు గనక కాంట్రాక్టరు హఠాత్తుగా అండర్ గ్రౌండ్‌లోకి వెళ్ళి పోయేవాడు గనక - వచ్చిన నటులమీదనే చెయ్యి చేసుకునేవారు. అలా అనవసరంగా కొందరు దెబ్బలు తినడం కూడా షరా మామూలు కిందకే వచ్చేది.

నటులు నాటకంలో పద్యాలు, పాటలూ కాకుండా ప్రేక్షకుల కోరికపైన అసందర్భపు పాటలు పాడటం పాడకపోతే నాటకం ముందుకు సాగనీయకుండా చెయ్యడం జరుగుతూ ఉండేది. ఈ గందరగోళమంతా కూడా షరా మామూలు క్రిందకే వచ్చేది.

"ఏవమ్మా మీ వారికి ప్రమోషన్ వచ్చిందిగా. సంసారం హాయిగా సాగిపోతోందిగా - ఇంకా ఎప్పుడు చూసిన అలా సణుగుతూ ఉంటారేం? చక్కగా నవ్వుతూ కాపురం చెయ్యొచ్చుగా - ఆ నాలుగొందలూ చేత్తో పుచ్చుకుని" అని ప్రశ్నిస్తే -

అది విన్న ఇల్లాలు "మీరు చెప్పిందంతా నిజమే. కావాలంటే కాపురం నవ్వుతూనూ చెయ్యవచ్చు - నాట్యమాడుతూనూ చెయ్యవచ్చు. కానీ గుణాలెక్కడికి పోతాయండి. అని గుండెల్లో గూడుకట్టుకున్నాయి. ఎంత మంచి స్థితి వచ్చినా షరామామూలేనన్నట్లు ఆ సణుగుడు అలాగే నిలిచిపోయింది ఏం చెప్పమంటారు" - అంటుంది.

ఈ రోజుల్లో కూడా ఇంకా పెళ్ళిళ్ళ విషయంలోకి వస్తే పిల్లవాడి తల్లి తండ్రులు 'షరా మామూలే' నంటున్నారు. రేట్లు మామూలే. ఆడబడుచులకూ, అత్తగారికి ప్రత్యేక స్థానాలే. ఆడపిల్ల చదువుకున్నా, సంపాదిస్తున్నా - షరాలు మారవు - వరాలు మారవు. రేటు అంగీకరింపబడితే - పిల్ల తండ్రికి గుండెలో పోటు వచ్చినా, పరువులో లోటు వచ్చినా, నరకంలో సీటు వచ్చిన వివాహము జరుపబడును - అని కూడా కనిపించని అక్షరలలో మనం చదువుకోవచ్చు.

కొన్ని సంసారాలు, సంస్థలూ, దాంపత్యాలు, స్నేహాలు, ప్రణయాలు, వ్యవహారాలు ఎల్లకాలం షరా మామూలుగానే నడుస్తూ ఉంటాయి. ఎన్ని గాలిదుమారాలు వచ్చినా ఎన్ని తుఫానులు వచ్చినా - నాటకాలు మాత్రం ఆపబడవు. అసలు నాటకాలలో ఒకొక్కప్పుడు

నటులు తక్కువ కావడం - పాత్రపోషణలు కుంటుపడటం జరుగుతూ ఉంటుంది. కానీ పైన చెప్పిన వాటి అన్నిటిలో క్రొత్త నటులు అనుకోకుండా ప్రవేశిస్తూ ఉంటారు. నాటకాలు, తమాషాగా మారుతూ ఉంటాయి. విషాదాంతాలు సుఖాంతాలవుతాయి. సుఖాంతాలు విషాదాంతాలుగా మారి విచిత్రగతులు కల్పిస్తూ ఉంటాయి.

దాంపత్యాలలో కూడా తమాషాగా క్రొత్త నటీనటులు ప్రవేశిస్తూ ఉంటారు. ఒకరి కన్నీటి వర్షం కురుస్తున్నా కూడా ఆ నాటకాలలా సాగిపోతూనే ఉంటాయి - వర్షం వచ్చినా నాటకం ఆడబడును అన్నట్లు ఆ దాంపత్యాలలో మార్పేం ఉంటుంది - విషాద ఘట్టాలు పెరగడం తప్ప ఆ మగరాయుడి బ్రతుకు తప్పతప్ప అయినా తప్పులోనుంచి బయటపడదు ఎప్పుడోగాని ఆ నాటకం పరిసమాప్తం కాదు.

కొందర్ని 'ఎలా ఉంది సంసారం' అని ప్రశ్నిస్తే - "షరామామూలేకాని ఒక క్రొత్త నటుని ప్రవేశం జరిగిందిటీవల. కోడలు పేరిట క్రొత్త నటి ప్రవేశం జరుగబోతోంది. ఆవిడపాత్ర ఆవిడే వ్రాసుకొనివస్తుంది. అదే అప్పగిస్తుంది. మన ప్రాంటింగ్ ఏమీ అక్కరలేదు. కనుక రంగాలలో కొంత మార్పు రావచ్చు. మా డైలాగ్సు కొన్ని తగ్గిపోవచ్చు - కొన్నాళ్ళకు మా పాత్రలు మూగపోవచ్చు' అనడంకూడా వింటుంటాం.

మా మల్లినాధ సూరిగారు పొడుమి ముక్కు తుడుచుకునేందుకు ఎప్పుడూ జేబులో ఒక పాత రుమాలు అట్టిపెట్టుకునేవారు. అది తప్ప తక్కిన జేబు అంతా ఖాళీ. నాకు తెలిసినంత అయిదుసార్లు మాత్రం అణా జేబులో వేసుకురావడం చూశాను. తక్కిన సమయలలో జేబులో చెయ్యిపెట్టకుండా డాబుసరిగా జీవితం గడపగలిగేవారాయన. చివరకు అత్తరువు సాహేబు దగ్గరకూడా శాంపులుగా సువాసన తైలాలు పూయించుకుని పూలరంగడిలాగా వస్తూ ఉండేవారు. ఎప్పుడైనా 'ఏమండీ జేబులో ఏమైనా చిల్లర ఉందా?" అంటే "షరా మామూలే.. మిగిలింది జేబురుమాలే" అని అది తీసి ముక్కు తుడుచుకుని అని అది తీసి ముక్కు తుడుచుకుని, ఖాళీజేబు దులిపి చూపించేవారు.

(సెప్టెంబర్ 24,'71, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**చాలామందికి ఈ రోజుల్లో హాయిగా కాలక్షేపం చెయ్యడం,** బాధ్యతలు పట్టించుకోకుండా తప్పించుకోవడం - అనవసరపు కబుర్లు చెప్పి ఇతరులచేత మెప్పించుకోవడం - ఇత్యాది కళలలో ఆరితేరుతున్నారు.

అసలు ఇలాంటివారు తమ జీవితాన్ని గురించి రవంత కూడా ఆలోచించరు. కాలం అంతా హాయిగా గడిపివేసి, ఎప్పుడో ఒకసారి తమ కష్టాలు వల్లించి, "ఏం చేస్తాం? కాలం అలావుంది. ఆలోచించి చేసేదేం కనిపించడంలేదు - కులాసాగా కాలక్షేపం చెయ్యడమొక్కటే మార్గం" అంటూ ఉంటారు.

దీనికి తగ్గట్టుగా ఈ కాలంలో ప్రతివారికీ అంతులేని ఊహలు ఏర్పడుతున్నాయి. వాటిని ఎంతసేపని మనసు అనే ఉయ్యాలలో ఊపి చిచ్చుకొడతారు. అందుకని వాటిని మోసుకుని, వాడవాడలకూ బయలుదేరుతూ ఉంటారు. కనిపించిన వారిని గట్టిగా పట్టుకుని నెత్తిన రుద్దుతూ ఉంటారు. అవతలివాళ్ళ గతి - ఆ సీతాపతికే తెలియాలి.

***మా వారు ఊసులతో మాసాలు గడపగలరు.***

''మావారికి ఊసుపోక కబుర్లలో వాసరాలు గడిచిపోతాయి. లెక్కవేస్తే మాసాలు దొర్లిపోతాయి సంసారం సంగతి చెపితే విసుగు. స్వంత సమస్యల మీద చీకటి ముసుగు'' అని ఒక ఇల్లాలు వేదన వెలిబుచ్చింది.

మొన్న ఒకాయన వచ్చారు. కొంచెం సేపు కుశల ప్రశ్నలు వేసిన తరువాత సినిమా ప్రపంచం మీద వాఖ్య మొదలుపెట్టాడు.

''అసలు వేయిపడగలెందుకు ఫిలిం తీయకూడదు?'' అన్నాడు.

''చాలా కష్టమండీ అంత పెద్ద కథ ఎలా సాధ్యమవుతుంది?'' అన్నాను.

''అదేమిటండీ అలా అంటారు. అంతగా అయితే సీరియల్‌గా తీయవచ్చు. ప్రజలు చక్కగా చూస్తారు'' అన్నాడు.

''అంతశ్రమ ఎవరు తీసుకుంటారండి. ఏవో కొన్ని తమాషా చిత్రాలు తీసి సొమ్ము సంపాదించుకోవడానికి ప్రయత్నిస్తారుగాని'' అన్నాను.

''పోనీ నారాయణరావు నవల ఎందుకు తియ్యకూడదూ! ఫస్ట్‌క్లాస్ నవల'' అంటూ - అందులో వేషాలన్నీ ఫలానా వారు వెయ్యాలని నిర్ణయించారు. ''హీరోయిన్ విషయంలో జమునే ఉండాలి - అలా అయితేనే ఫిలిం తీయాలి. లేకపోతే ఆ నవల అలా ఉంచితే మంచిది. ఇంకో వేషమైతే నేను ఒప్పుకోను. మీరు నా మాట నమ్మండి. టేక్ ఇట్ ఫ్రంమీ'' అని గట్టిగా వాదించాడు.

***<u>నా 'అలాగే'లు ఆయనకు సరిగమలైనాయి</u>***

నేను అలాగే అలాగే - అంటూ కూర్చున్నాను - అంతకన్నా మాట్లాడి ప్రయోజనం లేదని గ్రహించి నా 'అలాగే'లు ఆయనగారికి సరిగమలలాగా పనిచేసినాయి కాబోలు. మరింత హాయిగా ఉపన్యాసం దంచారు. ఆయనకు ఇల్లు జ్ఞాపకం వచ్చేసరికి సరిగా రెండుగంటలు పట్టింది. నేను ఇంట్లో ఉండి కూడా తాత్కాలికంగా బహిష్కరించబడినవాడిలాగా అలాగే వరండాలో కూర్చునిపోయాను.

మా ఊళ్ళో ఒక కుర్రవాడుండేవాడు. ప్రొద్దున చక్కగా భోజనం చేసి బయలుదేరేవాడు ఊరివెంట. కనిపించిన ప్రతివాణ్ణి ''ఏమిటోయ్ కబుర్లు. ఊళ్ళోనే ఉన్నావా? ఎప్పుడో ఒకసారి ఊరు వెళ్ళావుగా. ఎప్పుడొచ్చావు? వచ్చేదాకా అక్కడేవున్నావా? మళ్ళీ వెడతావా? వెడితే ఎన్నాళ్ళుంటావు. రాగనే కనిపిస్తావా? ఇంకా ఏమిటి కబుర్లు?'' అనేవాడు.

ఆ ప్రశ్నలకు అంతు ఉండేదికాదు. అన్నీ అడిగి చివరకు మళ్ళీ ఏమిటి కబుర్లు అనేవాడు. ఆ సమయంలో అక్కడికింకొకరెవరైనా వస్తే - మళ్ళీ అతని వైపు తిరిగి ''ఏమిటి కబుర్లు? ఎక్కడినుంచి వస్తున్నావు? పొలంనుంచా? పొద్దున వెళ్ళావా? మళ్ళీ ఎప్పుడు వెడతావు? రాత్రి ఇంటికి వస్తావా'' అంటూ ఓ పది ప్రశ్నలు వేసేవాడు.

***<u>ఏమిటి కబుర్లు? ఎప్పుడు కట్టారా అరుగులు?</u>***

ఆ ప్రశ్నలకు అందరికీ ఒళ్ళుమండిపోయేది. ''సరేలే! తర్వాత మాట్లాడుదాం. ఇప్పుడు కొంచెం పనివుంది'' అని వెళ్ళిపోయేవారు. పోతే అతగాడి కేమన్నా భయమా! ఇంకోణ్ణి పట్టుకునేవాడు. అలా సూర్యుడు నడిడినెత్తి వచ్చేదాకా కనపడ్డ వాడి నెత్తల్లా చితక్కొట్టి, అప్పుడు రెండోమాటు తిండికోసం ఇంటిదారి పట్టేవాడు.

అతడు పొలం వెడతాడనీ, వ్యవసాయంలో పాల్గొంటాడని, ఏదో కొంత సహాయపడతాడనీ ఎంతో ఆపేక్షపడుతూ వచ్చిన వాళ్ళనాన్న - కన్నీళ్ళు పెట్టుకుంటూ కుర్చునేవాడు అరుగుమీద.

ఒకొక్కసారి వాళ్ళ నాన్ననే ''ఏమిటి కబుర్లు? అరుగుమీద కుర్చున్నావేం? ఇంకా కుర్చుకుంటావా? అసలు చిన్నప్పటి నుంచీ ఇలా కూర్చునేవాడివా? అప్పుడు అరుగులు ఇలాగే ఉండేవా? తర్వాత మార్పించారా?'' అనేవాడు.

''లేదునాన్నా ఇవి కట్టి పాతిక సంవత్సరాలైంది. నువ్వు పుట్టిన ఏడే కట్టాం'' అని తండ్రి చెప్పేవారు.

***<u>సరే కడితే కట్టారు. ఏమిటి కబుర్లు!</u>***

"ఆ ఏడే కట్టారా? ముందుగానే కడితే బాగుండేదిగా. ఏం రాళ్ళు దొరకలేదా? సున్నం దొరకలేదా! పనివాళ్ళు గిరాకీ అయ్యారా? సరే కడితే కట్టారు. ఏమిటి కబుర్లు?" అనేవాడు.

తండ్రి ఎంతో ఓపిక తెచ్చుకుని "ఇంట్లోకి పద. అమ్మ చెప్పుతుంది" అని బ్రతిమాలి పంపేవాడు. ఆ యువకుడెప్పుడూ అలాగే అందర్నీ ప్రశ్నిస్తున్నాడని - ఇంకా పెళ్ళికాలేదనీ -ఒకసారి పెళ్ళి కూతుర్ని చూడటానికి వెళ్ళి పెళ్ళి కూతుర్ని చూడగానే దగ్గిరకు వెళ్ళి "ఏమిటి కబుర్లు?" అని ప్రశ్నలు వేశాడనీ వారు బయటికి పిలిచి బండిలో ఎక్కించారనీ విన్నాను. ఎవరేమనుకున్నా, ఎన్నాళ్ళకూ వివాహం అయినా కాకపోయినా అతని జీవితం చాలా విచిత్రంగా గడిచిపోతోంది.

మొన్న ఒకచోట ముగ్గురు వనితలు చేరారు. ఇద్దరు సంతానవంతులు. ఒకమె ఇంకా స్వేచ్ఛాజీవి. వారు సుమారు రెండున్నర గంటల సమయాన్ని "సినిమా కబుర్లతో గడిపేశారు. అవివాహిత అయిన వనిత ఆ సభకు అధ్యక్షత వహించింది. వారి సంభాషణ ఇలా జరిగింది.

*ఏనుగంటే నాకిష్టం. ఏనుగు కలలు ఎన్నోవచ్చాయి.*

'హాథీ మేరీ సాథీ ఆరుమాట్లు చూశాను. అయినా ఇంకా క్రొత్తగానే ఉంది. అందులో ఉన్న ఉత్సాహం చెప్పలేకుండా ఉన్నాను. నాక్కూడా ఆ ఏనుగువెంట తిరుగుతున్నట్లే ఉంది. అసలు చిన్నప్పటినుంచీ నాకు ఏనుగంటే ఇష్టం. ఎనుగు అంబారీమీద ఊరేగుతున్నట్లు చాలాసార్లు కలలు వస్తూ ఉంటాయి" అని అధ్యక్షురాలు దీర్ఘోపన్యాసం ఇచ్చింది.

ఆరేళ్ళ పిల్లవాణ్ణి వెంటపెట్టుకు వచ్చి ఆడుకొమ్మని అయిదు పైసలిచ్చి బయటికిపంపిన ఒక ఇల్లాలు -అలాంటి చిత్రాలు చూడటం తనకు అలవాటు లేదనీ, హాస్యం, శృంగారం ఉన్నవే తనకు ఇష్టమనీ - పాటలు మంచివి ఉంటే పదిమాట్లయినా వెడతానని - తన అభిలాషలన్నీ బయటపెట్టింది.

మూడో ఆవిడకు అసలు మాట్లాడటమే పడటంలేదు.

"అసలు అంతే. మీరు చెప్పింది నిజమే" అనడం, పాటలు పాటలూ అంటూ కళ్ళు మూసుకుని తన్మయత్వంలో పడటం. హాథీ హాథీ అని గుడ్లు పెద్దవి చేయడం వగైరా చేష్టలతో ఆ కాలమంతా గడిపివేసింది.

రాత్రి ఎనిమిది అయిన తర్వాత "ఇంటికి వెళ్ళాలి" అని ఇద్దరు లేచారు. అవివాహిత మాత్రం " అప్పుడేనా ఎనిమిదేగా అయింది. ఇప్పటినుంచీ ఏం చేస్తాం?" అని సణిగింది.

**(అక్టోబర్ 8, '65, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**బంగారం నగలమీద నిషేధం తొలగించిననాడే** మా బావమరిదికి ఆడపిల్ల పుట్టింది. ఆయనకూడా ఆంధ్రప్రభలోనే పని చేస్తుంటంవల్ల, పేపరు చేతపట్టుకుని ఇంటికి వెళ్ళాడట.

అంతకు ముందే ఇంట్లో వారంతా "తొలుచూరు ఆడపిల్ల పుట్టింది అంటే లక్ష్మి అన్నమాట. సిరికోసం వెతుక్కో అక్కర్లేదన్నమాట. సౌభాగ్యలక్ష్మి, ధనలక్ష్మి, గజలక్ష్మి, వరలక్ష్మి, " అంటూ పొగుడుతున్నారట.



కౌముది

మా బావమరిది తీసుకువెళ్ళిన పత్రిక చదివి "ఇంకేం? అనంత లక్ష్మి పుట్టినరోజునే ఆభరణాల మీద నిషేదం తొలిగించారు. ఆలస్యం చేయకుండా వెళ్ళి - మెళ్ళోకో చిన్నగొలుసు, చేతులకు వత్తులూ ఆర్డరివ్వండి. పురిటి నీళ్ళనాటికి వస్తాయి' అని అందరూ అనడం ప్రారంభించారట.

***ఇప్పుడెక్కడ, ఎప్పుడో చూద్దాం..***

మా బావమరిది - "అప్పుడే ఎక్కడ! - ఎప్పుడో చూద్దాం. అప్పు దొరకొద్దూ! అదను కుదరొద్దూ. " అంటూ గిరిగిరా తిరగడం ప్రారంభించాడట. పత్రిక పట్టుకు వెళ్ళినందుకు చింతా క్రాంతుడవడం కూడా జరిగిందిట.

చివరికేమీ తోచక బోనస్ వచ్చిన తర్వాత చేయిస్తానన్నాడట. ఎవరూ ఒప్పుకోలేదు. ఇహ లాభం లేదని వెళ్ళి వాటికి ఆర్డరిచ్చాడు. తీరా ఇచ్చిన తర్వాత - ప్రతిరోజూ సైకిల్ మీద వెళ్ళి ఎప్పుడిస్తారని అడిగివస్తున్నాడు. బారసాల నాటికి పిల్లవంటి మీద బంగారం మెరిసిపోవాలని తన కళ్ళవెంట ఆనంద బాష్పాలు కురిసిపోవాలని.

పధ్నాలుగు కారెట్ల బంగారం కొద్ది కాలమే ప్రచారంలో ఉన్నా - దాన్ని గురించి తమాషాలు, తగాదాలు, ఉపమనాలు, ఉడుకుబోతుతనాలు అనేకం బయలుదేరాయి.

హైదరాబాదులో ఉండగా - మా ఇంటికి కొంచెం దూరంలో - ఒక అరవ ఇల్లలుండేది. ఆవిడ ఒక రోజున, ప్రక్క ఇంటి ఆవిడతో నగల్ని గురించి మాట్లాడుతోంది.

"పధ్నాలుగు కారెట్లు పసందు ఇల్లే అమ్మ.. ఒరుమాదిరిగా ఇరికిదు.. మెడలో ఉన్నా సిరికిరి ఇల్లే (చిరునవ్వులేదు పెదవులపైన) - ఎన్న ప్రయోజనం?"

ప్రక్కింటావిడ అంటోంది - 'పైగా అవి వంటికి పడలేదు మామీ! మా బంధువుల్లో ఒకావిడ గొలుసు కొనివేసుకుంది. పదిహేను రోజుల్లో మెడచుట్టూ పచ్చబొట్టు పొడిపించుకున్నట్లు మచ్చపడింది.'

***ద్రాహకం - ద్రేహానికి పడదు.***

"ఆమా..ఆమా.. అదినిండా సత్తెం.. అందులో ద్రాహకం ఉండేది. అది ద్రేహానికి పడదు. చర్మానికి తగిలితే, అది మాదిరిగా మారిపోను' అన్నది అరవ ఇల్లాలు.

"మచ్చపడటమే, కాదుట. అంతవరకూ ఒకటే దురదట - పైగా సన్న సన్నని పొక్కులు కూడా లేచుకు వచ్చాయట. పాపం. అని వేసుకున్న వాళ్ళు వాటితో నానా అవస్థాపడి తీసి పెట్టెలో పారేశారట."

"రొంబ కష్టం. రొంబకష్టం. వేరొన్ను విషయం - పధ్నాలుగు కారెట్టు పురుష హృదయం మాదిరిగా ఫెళుసుగా ఇరికింది. మెత్తదనమే ఇల్లియే" అన్నదామె.

ఆభరణాలకు పనికిరాదని చెప్పడంతో వదిలి పెట్టకుండా పురుష హృదయంతో కూడా పోల్చిందామె.

మొన్న ఒక పెళ్ళిలో ఇద్దరు వ్యక్తులు వీధిలోకి వచ్చి సిగరెట్లు కాలుస్తూ - నూతన దంపతుల్ని గురించి మాట్లాడుతూ - 'ఆ పిల్ల ముందు వాడెక్కడ. ఒకటి 24 కారెట్లు, ఒకటి పధ్నాలుగూ' అన్నాడొకాయన.

'పధ్నాలుగు కూడా ఎక్కడ! ఇంకో నాలుగు తగ్గించు. పుత్తడి దగ్గిర ఇత్తడిలాగా ఉంది. అయినా కర్మలెవరు తప్పిస్తారు? పాపం, ఆ అమ్మాయికి యావజ్జీవ కఠినశిక్ష' - అన్నాడు.

"ఎప్పుడైనా పురుళ్ళకు పుట్టింటికి పంపితే పెరోల్ మీద వదిలినట్లు వదులుతారు - అదిలేనిచోట్లూ ఉన్నాయి" అన్నాడింకో ఆయన.

**పప్పుగిన్నె చెడగొట్టి గొలుసు**

పద్నాలుగు కారెట్ల మీద నిజానికి చాలా మందికి మనసులేదు. భర్త ఒకవేళ 'ఏమే! పోనీ, కొంచెం చవకగా వస్తాయి - ఆ పద్నాలుగు కారెట్లని - కొన్ని నగలు చేయించుకుంటావేమిటి' అంటే భార్య వెంటనే 'అవెందుకు. పోనీ ఆ పప్పుగిన్నె తీసుకుపోయి, నాలుగు పేట్ల గొలుసు చేయించండి - ఆ అర్ధశేరు వుడికేది తీసుకుపోయి - వడ్డాణం చేయించండి - రోజు పొద్దున్నే అంట్లతో పాటు తోమడానికైనా వీలవుతుంది' - అనడం జరిగేది. 'అలా అంటావేమిటే! దాంట్లో మాత్రం బంగారంలేదు. పాళ్ళు తక్కువగాని' అని ఆయన అంటే -

'మా అమ్మమ్మ అంటూ ఉండేది. స్వంత కొంపలోనన్నావుండాలి గాని, మధ్య త్రిశంకు స్వర్గాలల్లే ఈ అద్దెకొంపలేమిటి. అలాగే మళ్ళీ మధ్య ఈ పద్నాలుగు కారెట్ల బాజాలెందుకండీ' అనడం కద్దు.

కంట్రోలు అమలులోకి వచ్చిన తరవాత బంగారం వాడకం తగ్గించుకోవాలని చాలా ప్రచారం జరిగింది. బంగారానికి బదులు ఇతర లోహాల నగలు ధరించమని కూడా ప్రభుత్వం సలహా ఇచ్చింది.

ఇవ్వడమేమిటి - వివిధ రాష్ట్రాలలో గ్రామాలలో స్త్రీలు ధరించే నగలు తెచ్చి ఊరూరా ప్రదర్శనలిచ్చారు. హైదరాబాదులో కూడా ప్రదర్శనం జరిగినప్పుడు - చాలామంది ఆ నగలు తెచ్చి భార్యలకు కానుకలుగా ఇచ్చారు.

ఏ దుద్దులో, ఉంగరాలో తప్ప, అరవీశెకు తక్కువ బరువుగల ఆభరణం ఒక్కటీ లేదు. మేమున్నచోట - ఒకావిడ రాజస్థాన్ నగలు తెస్తే - ఒకామె గుజరాత్ నగలు తెచ్చింది. స్వయంగా వెళ్ళి.

**పనిమనిషి మారిందా!**

మర్నాడు అవన్నీ ధరించి ఇంట్లో తిరుగుతుంటే - 'క్రొత్త పనిమనిషిని పెట్టారల్లే ఉందే? ' - అని అడిగారట ప్రక్క ఇంటి ఆయన.

'క్రొత్త పనిమనిషి కాదండీ - గుజరాత్ నగలు. అదేదో లోహానివి - అమ్ముతున్నారట ఊళ్ళో' - అందిట భార్య.

'ఓహో గుజరాత్ నగలా! ఆ ఇంటియజమాని ఒక మురళి కూడా కొనుక్కుంటే బాగుండును. ఇల్లు గోకులం అవుతుంది' అన్నాడాయన.

ఇరవై నాలుగుకారెట్ల మీద నిషేధం ఉన్న రోజుల్లో ఎవరన్నా మేలిమి బంగారం ఎలాగో అలా సంపాదించి నగలు చేయించుకొన్నా - మేలిమి అని చెప్పేవారు కాదు. 'అబ్బే! పద్నాలుగే? అంత భాగ్యం కూడానా!' అని -

'మాపాసా' వ్రాసిన 'నెకొలెస్' కథలో నాయికలాగా అబద్దలాడుతూనే ఉండేవారు. 'నిధి చేతిలో ఉండి, ఉన్నదని చెప్పుకొనే యోగ్యత లేని జీవులు' కొందరుంటారు. శాపాల్లో ఇదో రకం.

**ఏ రంప పోలవరమో పోదాం.**

మేలిమి బంగారం దొరక్క - పద్నాలుగు కారెట్లకు భార్య అంగీకరించక బాధపడే ఒక గృహస్థు - ' ఈ బాధంతా దేనికే! రోజూ ఒక పావలా మల్లెపువ్వులు తెస్తాను. తల్లో, మెళ్ళో, ముంజేతులకు, దండలకు కట్టి ధరించు. అపర శకుంతలలాగా ఉంటావు' అన్నాడట.

''అలా అయితే, పదండి ఈ ఉద్యోగం వదిలి పెట్టి, ఏ రంప పోలవరమో వెళ్ళి - ఒక చిన్న పర్ణశాల వేసుకుందాం. కందమూలాలు తిందాం. బస్తీలో అలా కట్టుకు తిరిగితే ఏ సినిమా వాళ్ళో వచ్చి పట్టుకు పోతారు'' అందిట.

(జూలై ౨.'76, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**"ఏమండీ! ఆ ఎదురింటి అబ్బాయి** - ఎన్నిమాట్లు చెప్పినా మన మాలతిని చూచి నవ్వడం మానడంలేదు. ఏం చెయ్యాలో తోచడంలేదు" అని భార్య ఫిర్యాదు చేసింది భర్తతో.

"మందలిద్దాం.. మందలిద్దాం" అన్నాడాయన అరిగిపోయిన ప్లేటు లాగా గీతలు పడ్డ గొంతుకతో.

"ఎన్నిమాట్లయింది మందలించడం? చెప్పిన కొద్దీ మొండికేస్తున్నాడు. ఏ పోలీసు రిపోర్టో ఇవ్వండి. కాలేజి మానిపించి కటకటాల వెనుకకు తోయిస్తారు" అన్నదామె ఎంతో కసితో.

"తొందరపడకు.. రిపోర్టు దాకా పోవడం దేనికి, రేపో, మాపో ఒకసారి చెప్తుతా"

"ఆ అబ్బాయి ఈ ఇంట్లోకి వచ్చి ఆరునెలలు దాటింది. క్రొత్తలో పదిరోజులు ఊరుకున్నాడు. అప్పటినుంచి చూపులిలా పారబోసుకుంటున్నాడు. ఏదో ఉపాయం చూడండి. అపాయంలో పడకముందే! "

"చూస్తా.. చూస్తా.. మాలతిని కొంచెం అతనివంక చూచీ చూడకుండా ఉండమను. ఏదైనా మంచితనంగా, మాటల ద్వారా మంచితనంగా పరిష్కారం చేసుకోవడం ఉత్తమం. కక్షలు మంచివికావు".

"కక్షలంటారేమిటండీ! కన్నెపిల్లల్ని చూచి అలా నవ్వి నానాబాధలూ పెడుతుంటే"

"చెపుతా.. కన్నెపిల్లల్ని చూచి నవ్వడం అంత మంచిది కాదయ్యా. నీకు అంత సరదాగా ఉంటే - కాపురాలు చేస్తున్న వాళ్ళను చూచి నవ్వవయ్యా అని చెపుతాలే. నువ్వు ఇంట్లోపని ఏమన్నా ఉంటే చూసుకో"

***<u>అంత భయమయితే ఆడపిల్లల్ని ఎందుకు కన్నావు?</u>***

ఆవిడగారికి అరికాలి మంట పాపిటబొట్టుదాకా ప్రాకి భగ్గున మండింది.

"ఇంట్లో పనులే చూస్తాలే! మీతో బయట పనులు చెప్పిపోదామని వచ్చా. మీకు ఆ కుర్రాణ్ణి కేకలు పెట్టడమే భయంగా ఉందా? అంత పిరికితనం వాళ్ళు ఆడపిల్లల్ని ఎందుకు కనాలి?" అని ఆవిడ ప్రశ్న.

"అప్పటి సంగతులిప్పుడు సరిగ్గా జ్ఞాపకం లేవు. పెద్దతనం వచ్చింది. నిన్నటి విషయాలే బుర్రలో నిలవడంలేదు. నన్ను అనుగ్రహించి ప్రతి చిన్న విషయానికీ క్రాస్ పరీక్ష చెయ్యకు. అందులో జరిగిపోయిన విషయాలలో నుంచి నేరాలు వెతికి నన్ను శిక్షించటానికి ప్రయత్నించకు. వెళ్ళు నీ వంటింటి సామ్రాజ్యంలోకి." అని పత్రిక అడ్డం పెట్టుకొన్నారాయన. ఆయన మనసులో విషయం ఆవిడతో చెప్పడు. ఆవిడ అర్థం చేసుకోదు. ఆయన ఒక సత్యం తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. "ఆ కుర్రవాడు మాలతి ఒక్కదానివంకే చూచి నవ్వుతున్నాడా? అలాగే మరి కొందరి వంక కూడా చూచి నవ్వుతున్నాడా" మాలతి ఒక్కదానివంకే చూచి నవ్వితే ఆ నవ్వులన్నీ పువ్వుల తోరణాలుగా మారిపోతాయనే ఆశ ఆయనగారికి ఉంది.

మరి ఇంకా కొందరి వంక కూడా చూచి నవ్వుతున్నాడని తెలిస్తే మాత్రం మందలించ వలసిన అవసరం ఏర్పడుతుంది. అతణ్ణి కలుసుకుని "ఇదుగో రమేష్. ఇంతమందిని చూచి నవ్వడం మంచిది కాదు. ఒకవేళ నువ్వినా ఇంతకాలం నవ్వడం మంచిదికాదు. ఆ నవ్వులన్నీ ఒక్కచోటే గుమ్మరిస్తే మంచిది." అని చెప్పాలని ఆయనకోరిక.

ఒకవేళ దైవం అనుకూలించి మాలతిని చూసి నవ్వుతుంటే - మందలించే అవసరం ఏం ఉంది? వెతికిన తీగ కాళ్ళకు తగిలినట్లే. మరమరాల డబ్బాలో మట్టిపోసి 'మనీప్లాంట్' పెట్టి నీళ్ళు పోసినట్లే. కొన్నాళ్ళకు ఆ కుర్రవాడే చెప్పివేస్తాడు.. తన అభిమతం. లేదా మాలతిచేత చెప్పిస్తాడు. అప్పుడు అనవలసిన మాట ఒక్కటే - 'తథాస్తు' అని. ఈ సత్యం గ్రహించిన ఆవిడ మందలించి ఉంటుంది.

***మందలింపులతో కథలు ముదురుతున్నాయి.***

మందలించడం, మనస్సులు మార్చుకోవడం ఇవన్నీ పూర్వకాలపు పద్ధతులు. ఆ రోజుల్లో అని ఆయుర్వేద వైద్యంలాగ పనిచేసేవి. ఈ రోజుల్లో ధైర్యం చేసి ఎవరినన్నా మందలించడానికి ప్రయత్నిస్తే కథ ముదురుతోంది.

వెంటనే వినిపించే జవాబు "నీకేం మతిపోయిందేమిటి? అలా మాట్లాడుతావేం? నీకున్న 'బ్రయిన్' నాకు లేదనుకున్నావా? అనవసరంగా 'స్ట్రయిన్' కాకు. రక్తపోటు రావచ్చు. సోడాబుడ్డిలో గోలీలాగా గుండెకాయ జారిపడిపోగలదు" అని పది రకాలుగా తిరిగి మందలిస్తున్నారు.

అక్కడితో అవతలవాళ్ళ తిక్క ఒక్క మాటుగా తిరిగిపోతోంది. డెక్కి పట్టుకుంటోంది.. డొక్కలో నొప్పి వస్తోంది. ముక్కుమీద బలంగా గుద్దినట్లవుతోంది. బ్రతుకే ఉక్కిరిబిక్కిరి అయిపోతోంది. 'ఎరక్కపోయి మందలించాను.. మందభాగ్యుణ్ణి' అని పశ్చాత్తాప పడవలసి వస్తోంది.

కొద్ది రోజుల క్రింద ఒక పెద్దమనిషి కనిపించారు సినిమాహాలు దగ్గిర. మొదటి ఆట చూచి చాలామంది ఆడపిల్లలు రిక్షాలెక్కి వెళ్ళిపోతున్నారు. ఒక అమ్మాయి రిక్షాదారుడితో తగాదా పడుతోంది. నేనన్నాను- 'కొంచెం వాణ్ణి మందలిస్తే మంచిది. ఆ అమ్మాయితో పోట్లాడుతున్నాడు' అన్నాను.

ఆ పెద్దమనిషి నవ్వి "మందలించడం దాకా వస్తే అతడే మనల్ని మందలిస్తాడు అసలా అమ్మాయి గట్టిగానే జవాబు చెప్తుతోంది. మందలించ దలచుకుంటే మహిళలు మందలించినట్లు మనం మందలించలేం.. వాళ్ళు ఒక్క మాటతో కత్తిపోటు పొడుస్తారు" అన్నారాయన.

ఒకామె తన కుమార్తె స్నేహితురాండ్ర ఇళ్ళకు పోయి బాగా పొద్దుపోయి రావడం సహించలేక భర్తతో చెప్పిందిట "అమ్మాయి మరీ అర్ధరాత్రి వస్తోంది ఇంటికి. కొంచెం మందలించండి - అలా రావడం మంచిదికాదని"అన్నదట.

ఆయనగారు వెంటనే అన్నారుట "ఇపుడు అర్ధరాత్రి వేళకు వస్తోంది. మందలిస్తే మర్నాడు ఉదయానికి రావచ్చు. నీకిష్టమైతే అలాగే మందలిస్తాను" అని.

ఆమె ఏం చెప్తుతుంది జవాబు

***అధికారం చూపిస్తే పదవికే ప్రమాదం***

పన్నెండు వందల పై చిలుకు జీతం ఉంటుందని ఒక అమ్మాయిని తల్లితండ్రులు రెండో పెళ్ళివాడికిచ్చి కట్టారుట. అమ్మాయి మూడో కంటివాడికి తెలియకుండా ముచ్చటగా కాపురం చేస్తోందిట. ఆయనగారికి కొద్దికాలం గడిచిన తర్వాత అధికారం చెలాయించాలనే బుద్ధి పుట్టిందిట.

అందువల్ల ప్రతి విషయంలోనూ కల్పించుకుని మందలించడం ప్రారంభించాడట. అక్కడికీ ఆ అమ్మాయి కొంతకాలం ఓపిక పట్టిందిట. అది - లోకువగా భావించి, ఆయన తోకలేని కోతిగా గంతులు వేయడం సాగించాడుట.

ఇంకా సహిస్తుందా ఆ అమ్మాయి. సహనం పూర్తి అయింది. సాహసం కల్పించుకోక తప్పలేదు. ఒకరోజున ఆయన ఏదో విషయంలో మందలింపు ప్రారంభించగానే "కొంచెం ఆపుతారా ధోరణి. ఇంతకాలం సహించాను. మీరు నిజంగా నా మీద అధికారం

చెలాయించదలచుకుంటే మాత్రం ఆ కోరిక నెరవేరదు. పదవికే ప్రమాదం వచ్చే పరిస్థితులు ఏర్పడవచ్చు. కనుక ముందుగా తెలియచేస్తున్నాను. మందలింపులు కట్టిపెట్టి మనసిచ్చి మాట్లాడటం నేర్చుకుంటే కొంత శాంతి లభిస్తుంది" అని. పదవీ, ప్రమాదం - అనే మాటలు విని ఆయన కొంచెం కొంచెం నిదానంలోకి రావడం ప్రారంభించాడుట.

ఇప్పుడేదైనా చెప్పవలసివస్తే "ఏమిటి నీ మనస్సు బాగుందా! ఒకమాట చెప్పాలి" అని ఉపక్రమిస్తున్నాడట. మహిళాలోకానికి జై అనిపించిందా వార్త వింటే!

భార్యలను మందలించడం యుగం మారిపోయింది. అదంతా గత చరిత్ర. పూర్వం అనవసరం ఉన్నాలేకపోయినా భార్యల్ని మందలించడం ఒక హోదాగా ఉంటూ ఉండేది.

"ఏమిటండీ అలా ప్రతిదానికీ కల్పించుకుని తగువులాటకు దిగుతారు" అంటే, ఆయన గారు ముసిముసి నవ్వులు నవ్వుతూ "చేసుకొన్న దాన్ని మందలించకపోతే ఎవర్ని మందలించను? మందలింపులో మర్యాదా ఉంది. అధికారం ఉంది. ఇంకా దేవుడు చాలా మేలు చేస్తే ప్రేమకూడా ఉంది" అని చెపుతూ ఉండేవారు ఆనాటి ప్రాణపతులు.

ఇప్పుడు అలాంటి అధికారాలకు తావులేదు. మమతా, సమతా పాటించవలసిన కాలమిది. భర్తలు తగ్గినకొద్దీ వారి గౌరవానికి మొగ్గు కనిపిస్తోంది. కానీ ఇంకా చాలా మంది పూర్వకాలపు ఇల్లాళ్ళు - తిండికీ, వస్త్రానికీ మొగుడిమీద ఆధార పడి ఉండటంవల్లనో మందలింపులు పడుతూనే ఉన్నారు. వారికి విముక్తి రావాలి.

**'మందలించే భర్త గోవిందా రామ..'**

ఈ ఉద్యమానికి మహిళలు పూనుకోవాలి. మాటల్లో బలం కల్పించుకోవాలి. పాటలు తోడుచేసుకుని ప్రచారం సాగించాలి. "కూటికోసం మాటపడే రోజులు పోయినాయి" అనే నినాదాలు లేవతీయాలి. ఈ సందర్భంలో నా వంతు కానుకగా ఒకపాట వ్రాసి అందిస్తున్నాను.

మందలించే భర్త గోవిందారామ
మాకొద్దు మాకొద్దు గోవిందారామ
పెద్దరికముంటేను గోవిందారామ
పెద్ద రికమండేషను గోవిందారామ
ముద్దుగా చెప్పాలి గోవిందారామ
కాలాలు మారాయి గోవిందారామ
బట్టలో పేలాలు వేగవిక గోవిందారామ
లోకళ్ళకు చిగుళ్ళు గోవిందారామ
మొలవవిక గోవిందారామ
సమత పాటించాలి గోవిందారామ
మమతతో మెలగాలి గోవిందారామ
మగవుకి జాతికీ గోవిందారామ
మంగళారతి పట్టు గోవిందారామ
మందలించే భర్త గోవిందారామ

మాకొద్దు మాకొద్దు గోవిందారామ

మాకొద్దు  మాకొద్దు గోవిందారామ

ఇలాటి పాటలు ప్రతి ఇంటా వినిపించాలి.

"మాకొద్దు" అనే శీర్షికతో రేడియోలలో ప్రసారాలు చెయ్యాలి. సభల్లో ఎలుగెత్తి పాడాలి. పెళ్ళిళ్ళలో మంగళారతి బదులు ఇవే ముక్త కంఠంతో వినిపించాలి పూర్వపు అధికారులు గోవింద కొట్టాలి.

(ఆగస్టు 12, 1976, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**నిద్రలో అనేక రకాలున్నాయి.** పిన్న నిద్రలూ ఉన్నాయి. మొద్దు నిద్రలూ ఉన్నాయి. మత్తు నిద్రలూ ఉన్నాయి. చిత్తు నిద్రలూ ఉన్నాయి..

ఒకానొక ప్రియుడు భార్యను అర్థించాడు "వో సరసిజాక్షి! బారెడు ప్రొద్దెక్కింది - నీ చారెడు కళ్ళు తెరిచి, ఆ సూర్యభగవానుణ్ణి ఒకసారి చూసి తర్వాత ఈ దీనుడి ముఖం వంక ఒకసారి చూడు. ఎంతో పుణ్యం ఉంటుంది. కాఫీ కాచి ఉంచాను. మొఖం కడుక్కుని కొంచెం సేవించి ఒకసారి ఒళ్ళు విరుచుకుంటే చాలు ఈ పూట గడిచిపోతుంది" అని.

"మగవాళ్ళు, ప్రొద్దెక్కేదాకా నిద్ర పోవటం - వారిని లేపడం కోసం ఆడవాళ్ళు మేలుకొలుపు పాడటం - జరుగుతూ ఉంటుంది. ఒకామె అంది వట్టి రోజుల్లో అయితే పోరగా పోరగా ఎనిమిదింటికన్నా కళ్ళు తెరుస్తారు. నోట్లో వేడినీళ్ళు, వంటిమీద వేడినీళ్ళు.. కంచంలో చారుమళ్ళు - ఇవన్నీ అరగంటలో జరిగిపోతాయి.

***"ఆదివారం అర్ధరోజు నిద్రలోనే గడుస్తుంది"***

ఇక ఆదివారం వస్తే చెప్పాలా.. ఎంత పిలిచినా పన్నెండు గంటలదాకా పక్కమీద అటు నుంచి ఇటూ, ఇటు నుంచి అటూ దొర్లడమే సరిపోతుంది. "పన్నెండు దాటిందండీ మీరు లేస్తారా లేవరా, నా కడుపులో మండిపోతుంది" అని గట్టిగా కుదిపితే - ఎల్లకిలా ఉన్న మనిషి బోర్ల బొక్కిలిగా పడుకోవడం.

వీపు మీద ఎన్ని వాయిస్తే మాత్రం ఏం లాభం. చేసుకున్నవాళ్ళం గనక విసురుగా బాదలేంగా - అందుకని సన్న సన్నగా వాడుతుంటే - చిచ్చికొట్టినట్లు హాయిగా నిద్రపోవడమే గానీ లేవడం ఉండదు.

కర్మం చాలక నిద్రలేచినా ఇంత తిండితిని - పత్రిక వంక ఒకసారి చూసి - అలా సోలిపోయినట్లు మళ్ళీ మంచం మీద వ్రాలడం.. సాయంత్రం సినిమా వేళకన్నా లేస్తాడేమోనని భార్య ఎదురు చూచినా లాభం ఉండదు.

ఒక్కొక్కప్పుడు వీధి దీపాలు వెలిగే వేళకు లేచి, అది వేకువ అనుకుని, ఏదో కడుపులో కొంచెం ఆకలి అనిపించి లేచి వెళ్ళి పేస్టు, బ్రష్ చేత్తో పుచ్చుకోవడం కూడా కొన్ని కొన్ని సందర్భాలలో జరుగుతూ ఉంటుంది.

వారం పొడువునా ఏదైనా విషయం ఆలోచించతలిస్తే - కొంచెం నిదానించు - ఆదివారం నాడు తీరిగ్గా మాట్లాడుకుందాం. ఆ రోజు బుర్ర ఖాళీగా ఉంది. ఆఫీసు రోజుల్లో బుర్ర నువ్వు చెపితే నమ్ముతావో లేదో - కేవలం "యాష్‌ట్రే"లాగా ఉంటుంది. శనివారం రాత్రి దాన్ని దులిపితే ఆదివారం ఫ్రెష్‌గా ఉంటుంది అని ఆయనగారి సమాధానం.

పదిగంటలకు ఆఫీసుకి వెళ్ళక్కరలేని ఉద్యోగి ఒకాయన ఉన్నాడు. ఆయనగారికి మధ్యాహ్నం నిద్రమీద ఎంతో అభిమానం. తిన్న వెంటనే నిద్రపోవాలి.

*"మంచం ప్రక్కనే అన్నం కంచం"*

అసలాయనకు అన్నం మాట జ్ఞాపకం రాకపోతే నిద్రమాటా జ్ఞాపకం రాదు. ఏదైన పనిమీద ఉంటే చాలా జాగ్రత్తగా చూస్తాడు కాగితాలు వగైరాలు. ఎవరైనా వస్తే చక్కగా మాట్లాడతాడు. తగాదాలాటి విషయమైతే పోట్లాడుతాడు కూడా.

కాని అన్నం తినాలనే మాట జ్ఞాపకం రాగానె మాత్రం ఆవలింతలు ప్రారంభమవుతాయి. అందువల్ల ఆయన గారి పక్క దులిపించుకుని మంచం పక్కనే కంచం పెట్టించుకుని తినడానికి ఉపక్రమిస్తాడు. ఆవలింతల మధ్య మధ్య ఒక్కొక్క అన్నం ముద్ద లోపలకు వెడుతూ ఉంటుంది. అయితేనేం.. ప్రతి ముద్దా అతణ్ణి చిచ్చికొడుతుంది ఆవలింతలు నిద్రను రెచ్చగొడుతుంటే - ముద్దలు చిచ్చికొడుతుంటే భార్యామణి "మీరింకా కూరతినాలి. పులుసు పోసుకోవలి. మజ్జిగ పోసుకోవాలి" అని హెచ్చరిస్తుంటే -

ఆయనగారు నోరు తెరిచినప్పుడు కన్ను తెరిచి, నోరు మూసినప్పుడు కన్ను మూసి ఎలాగో అలా భోజనం ముగించి మంచం మీద వ్రాలడం జరుగుతూ ఉంటుంది. చెయ్యి కడుక్కోవడం మరచిపోయిన సందర్భాలు కూడా కొన్ని ఉన్నాయనీ, ఆమె మెల్లిగా కడిగి మూతి తుడిచిరావడం జరుగుతూ ఉంటుందని చెపుతూ ఉంటారు.

భోజనం కాగానే వక్క పలుకు చేతిలో పెడదామని ప్రయత్నించినా లాభం ఉండదు. అసలు ఒక్క పలుకే పలుకని మనిషి వక్క పలుకేం వేసుకుంటాడు. కాఫీ త్రాగినప్పుడు ఫలహారం చేసినప్పుడు మాత్రమే ఆయనగారు వక్క పలుకు రుచిచూసేది.

*"కళ్ళు తెరవండి సార్ క్రాఫ్ పని అయింది"*

ఆ మధ్య నేను ఒక సెలూన్‌కి వెళ్ళాను. నలుగురు ముగ్గురు వెయిటింగ్‌లో ఉన్నారు. అందరూ పత్రికలు తిరగవేస్తున్నారు. అదేమిటో విచిత్రం అక్కడ ఏదైనా పత్రిక ఉంటే ప్రతి అక్షరం చదవ బుద్ధి పుడుతుంది. అయితే పేరా పేరాకూ కుర్చీలో ఉన్న వాళ్ళ ఖండన కార్యక్రమం ఎంతదాక చూస్తూ ఉండటం, మళ్ళీ అక్షరాలమీదకు కళ్ళు పోనియ్యడం జరుగుతుంది.

కత్తెర చప్పుళ్ళు ఎంతో ఉత్సాహాన్నిస్తాయి. చురుకుగానే జరుగుతోంది పని - త్వరలో ముగియవచ్చునని. ఒక వ్యక్తి పనిముగించుకుని కుర్చీలో నుంచి లేస్తే ఒక ప్రాణం లేచివచ్చినట్లుంటుంది.

అవును మరి అక్కడున్న వారందరూ గడ్డాలు మాసి, తలలు మాసి - అప్పుడే జైల్లో నుంచి బయటపడ్డ వాళ్ళలాగా ఉంటారాయె. అందువల్ల ఎప్పుడు బయటపడటమో అనిపించడంలో ఆశ్చర్యమేం ఉంటుంది.

వెయిటింగ్ లిస్టులో ఉన్న ఒకాయన కుర్చీలో కూర్చుని, క్రాఫింగ్ కాదు - షేవింగ్ అనడం విన్నప్పుడు - ఆయనగారి వదాన్యతకు మనస్సు ఎంతో ఉప్పొంగిపోతుంది. ఉన్న నలుగురూ అలా గడ్డాలు చేయించుకుని వెళ్ళిపోతే - మనవంతు త్వరగా వస్తుంది కదా - అనిపిస్తుంది. "మీకు క్రాఫా, గడ్డమా? " అని సెలూన్ దారుడు ముందుగా అడిగితే బాగుండును మనస్సుకు కొంచెం విశ్రాంతిగా ఉంటుందనే ఆశ కూడా పుడుతుంది. అతడు అడగడు. పోనీ మనమే అడుగుదామంటే - సెలూన్‌లో భాగస్వామి అనుకుంటాడేమోనని భయం. పోనీ క్రాపుల వరికి ఒక బల్లా, గెడ్డాలకు మరో బల్లా ఏర్పాటు చేస్తే బాగుండును. అంత విశాలమైన భావాలు మనకు వస్తే ఏం లాభం?

ఒకాయన మాత్రం తను వచ్చిన ప్రదేశాన్నీ, పనిని మరచిపోయి హాయిగా గోడకు జార్లగిలబడి నిద్రపోతున్నాడు. తప్పకుండా రేడియో సంగీతం ఉంటుంది కదా - ఆ మత్తులో ఆయనగారు సుఖసుషుప్తిలో మునిగిపోయాడు.

కొంతసేపటికి ఆయన వంతు వచ్చింది. సెలూన్ యజమాని వచ్చి 'సార్ సార్' అన్నాడు. ఆయన లేవలేదు.

"లేవండి సార్ ఇంకా చాలామంది వెయిటింగ్‌లో ఉన్నారు" అన్నాడు.

ఆయన లేవలేదు. ప్రక్కనున్న పెద్ద మనిషి గట్టిగా భుజం పట్టుకుని కుదిపాడు. కొంచెం కళ్ళు తెరిచాడు.

"పదండి కుర్చీలోకి" అన్నాడాయన.

"కుర్చీలోకా, వస్తా" అని ఆయన మళ్ళీ కునుకుపాట్లలో పడ్డాడు.

అప్పుడా పెద్ద మనిషి ఒక రెక్కా, సెలూన్‌దారుడొక రెక్కా పుచ్చుకు తీసుకుపోయి కుర్చీలో కూర్చోపెట్టారు. కట్టింగ్ ప్రారంభమయింది.

ఇవతల పెద్దమనిషి అడిగాడు "మేలుకుని ఉన్నాడా?" అని.

"లేదండీ నిద్రపోతున్నాడు. క్రాఫింగేగా ఫర్వాలేదు. గడ్డమైతే దుంపతెగేది" అన్నాడా యజమాని.

అలాగే క్రాఫింగ్ వేయడం పూర్తి అయింది. మళ్ళీ చెయ్యిపుచ్చుకుని లేవదీశాడు. డబ్బు ఇవ్వకుండా వెళ్ళి పోతున్నాడు. అప్పుడు ఆయన్ని నిలబెట్టగా - మరో అతడు సిరంజితో ముఖాన నీళ్ళు కొట్టగా, కొంచెం ఉక్కిరి బిక్కిరి అయి - తను ఎక్కడున్నదీ తెలుసుకుని పర్సు తెరిచి డబ్బు ఇచ్చిన వాడయ్యాడు.

వెడుతూ వెడుతూ "సగం నిద్రలో లేచి వచ్చాను. అందులో సంగీతం వింటుంటే నాకు హాయిగా నిద్ర వస్తుంది" అంటూ వెళ్ళిపోయాడాయన.

## *'లడ్డూలు' నేనెక్కడ తిన్నాను*

మా మల్లినాథులు చెప్పారు ఒకసారి. ఆయనగారు ఏదో పెళ్ళిలో జరిగిన విందుకు వెళ్ళారట. వాళ్ళు పంచదార లడ్డూలు దండిగా వడ్డించారుట. ఆయనగారికి వాటిని ఆరగిస్తుండగా - అర్ధాంగి జ్ఞాపకం వచ్చిందిట. ఆవిడగారికి ఆ లడ్డూలంటే ఎంతో ఇష్టంట.

అందువల్ల వడ్డనలో మళ్ళీ లడ్డూలు వచ్చినప్పుడు విస్తట్లో వేయనీయకుండా 'భోజనం అయిన తర్వాత తినడం నాకు అలవాటు' అని ఎడం చేతిలో వేయించుకుని అంతా లేచేటప్పుడు వాటిని జేబులోకి మెల్లగా జేర్చి - ఇంటికి బయలుదేరారుట..

రాత్రి పదకొండు అవడం వల్ల అంతా నిద్రపోతున్నారుట. ఆయన తల్లిగారు తలుపు తీసింది. ఆ భార్యా ప్రియుడు మెల్లగా లడ్డూలు బయటికి తీసి ఆవిణ్ణి లేపి కూర్చోపెట్టి - ఆ రెండూ తినిపించారట. స్వయంగా మంచినీళ్ళు తెచ్చి త్రాగించి "ఇప్పుడు నా మనస్సు శాంతించింది. అంటూ లడ్డూలు ఇంటికి తేవడం కథంతా చెప్పారుట.

తెల్లారిన తర్వాత భార్యను పిలిచి "రాత్రి నీకు లడ్డూలు పెట్టానని పిల్లలకు చెప్పకు. గోలపెడతారు. ఈసారి ఎప్పుడైనా తెచ్చి వాళ్ళకు పెడతాలే" అన్నారుట. ఆవిడ నివ్వెరపోతూ అదంతా హాస్యం క్రింద భావించి "ఛా రాత్రి లడ్డూలు నేనెక్కడ తిన్నాను. మీదంతా హాస్యం" అన్నదట.

ఇక కొందరు నిద్రలో మెళుకువ వచ్చినా, ఏదన్నా తిని పరున్నా కూడా తెల్లారి చెప్పలేరు. చెప్పినా ఒప్పుకోరు - ఇదొరకం - దెయ్యపు నిద్ర.

**(సెప్టెంబర్ 22,'76, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

# చేసిన పాపాలకు పెట్టిన దీపాలు సరి.

**ఈ నెలలో - సామెతలలో హాస్యం కొంత వివరిస్తాను.** వారెంతగా ఆలోచించి లోక సత్యాలను చక్కటి మాటల్లో పొదిగారో గమనించాలి. ఒక్కొక్క సామెత మీద ఒక గ్రంథం వ్రాయవచ్చు.

స్త్రీలకు స్వతంత్ర్య జీవనం అవసరమనీ, భర్తలకు తొత్తులుగా పడి ఉండడం వల్ల చాలా హీనత ఉందనీ - స్త్రీ పురుషుల ప్రతిపత్తి నశించిపోతుందనీ - భర్తకు దాస్యం చేసి చేసి బడుగులు కావడం తథ్యమని పూర్వులు గ్రహించారు. అది ఈనాడు మరింతగా రుజువై నగ్న సత్యంగా మారింది.

కూలీ నాలీ చేసుకుని కుదురుగా ఉండకుండా మొగుణ్ణి కట్టుకుని సగమై పోయాను - అని ఒకామె ఎంతో విలపించింది. ఇది ఏనాటి అనుభవమో! అర్ధాంగి కోరేది భర్త జీవితంలో కష్టసుఖాలు పంచుకోవడంలో, భోగభాగ్యాలు, దానధర్మాలు అందుకోవడంలో అర్ధాంగి కావాలనేది అసలు సూత్రం కాని - బానిస చాకిరి చేసి శుష్కించి పోవడం కాదు. శూన్యంలోకి చూపులు పోనివ్వడం కాదు.

అందుకనే సామెతలో స్త్రీ హృదయం పలికింది - ఎక్కడో అక్కడ ఏ కూలీ నాలో చేసుకుని, కుదురుగా - అంటే ఒకరికి బెదరకుండా, మనస్సు చెదరకుండా, గౌరవం తరక్కుండా ఉండవలసిన దాన్ని - ఇలా పెళ్ళాడి, అతని పాదాలు పట్టుకు వ్రేళ్ళాడి - ఎంత చేసినా అతనికి తృప్తి కల్పించలేక, మనశ్శాంతి పొందలేక, తను సగం కావలసి వస్తుందని ఎంతో విలపించింది. అలా భర్తల పరంగా, శాంతిని, పోగొట్టుకుని, బలహీనులైనవారికి ఆనవాలుగా ఈ సామెత వెలిసింది.

ఆడవాళ్ళు అందరూ వంటలో మునిగి ఉండటం ఇంటెడు చాకిరీ చెయ్యడం మామూలే. నిజంగా వారెంతో అవస్థ పడితేగాని అందరి కడుపులూ నిండవు. అవస్థ పడి అమృతం లాగా భోజనం తయారు చేసి అందరికీ వడ్డించి, తర్వాత తింటారు చాలామంది ఇల్లాండ్రు.

అందువల్లనే "అన్నం అడిగేవారే గాని, అడ్డిగ అందించే వారెవరూ ఉండరు. " అనే శాస్త్రం కూడా ఉంది మనకు. అన్ని వస్తువులు తామే సంతరించుకుని, సకాలంలో అన్నదానం చెయ్యాలనే అపేక్షతో అవస్థ పడుతూ ఉంటారు స్త్రీలు.

అయితే కొందరు వంటింట్లో చేరడమే గానీ - వంటమాత్రం ఎంతసేపటికీ అవదు. ఇంట్లో వాళ్ళు ఆకలి ఆకలి అని కేకలు పెడుతుంటే - "అవుతోంది, అవుతోంది. అన్నం మెత్తపడుతోంది. కూర మగ్గుతోంది" అంటూ జవాబు మాత్రం ఎప్పటి కప్పుడు అందిస్తూ ఉంటారు వంటింట్లో నుంచి.

పరాయివాడెవడో భోజనం కోసం వచ్చి "గృహిణి చిత్తం" అని వాకిట్లో కూర్చున్నట్లుగా కూర్చోవాలి యజమాని కూడా! "ఏం ఎంతవరకొచ్చింది. శోష వస్తోంది" అని చెప్పుకున్నా - ఆమెగారికి తొందర పుట్టదు. "ఫలహారం చేశారుగా - అలా పసిపిల్లవాడిలాగా గొడవ చేస్తారేం. కూర మగ్గుతోంది. పచ్చడి నూరి కేకేస్తా. నాకు మాత్రం వంటింట్లో పడి ఉండాలని సరదా ఏమిటి? ఎప్పుడు నడుం వాల్చుకుందామా? అని ఉంది" అని జవాబు.

చివరకు ప్రొద్దు పడమర వ్రాలి - భర్త మంచం మీద తూర్పుకు తిరిగి లోలోపల దైవాన్ని ప్రార్థిస్తుండగా "పది నిమిషాల్లో లేవవచ్చు. అన్నం నైవేద్యం పెట్టడం, వడ్డించడం" అని సువార్త వినిపిస్తుంది.

ఇంటివారిని బట్టే "కాకి కూయగా లేచి, కాటుక మాదిరిగా అన్నం, కాకరకాయ మిరియం (అంటే తెగమాడ్చి) చేసి, పశువులొచ్చే వేళకు (అసలు సందెవేళకు) పరుగెత్తి పరుగెత్తి వడ్డించిందట" - అనే సామెత.

పాపం, ఈ ఇల్లాలిలో కూడా ఒక సుగుణం ఉంది. ఎంత ఆలస్యం చేసిన వడ్డన మాత్రం అతి చురుకుగా లేడిలాగా చిందులు వేస్తూ వడ్డిస్తుంది. ఆ చిందులూ, వయ్యారం చూసి చేసుకున్న వాడు - ఆకలితో మధ్యాహ్నం నుంచి పడ్డ బాధ మరచిపోతాడు.

దుర్వ్యసనాలలో చిక్కుకున్నవారు సంసారాలను చిన్న చూపు చూడటం సహజం. ఇంటి విషయం పట్టించుకుంటే - వ్యసనాలకు సొమ్ము ఉండదు. అందువల్ల వాటికోసమే ఉన్న సొమ్మంతా తగలబెడతాడు. మళ్ళీ అక్కడ మోజు తగ్గకూడదు. ఖర్చుకు లోపించకూడదు. జీవితాన్ని నాశనం చేసే కల్లు చిప్పలో తాగితేనేం, దొప్పలో త్రాగితేనేం? కానీ దానికి మాత్రం కళాయి ఉండాలని ఆపేక్ష. వారిని జీవితాలను చక్కగా వర్ణించే సామెత ఇది - "కాలు కడుగ ముంతలేదు - కల్లు త్రాగడానికి కళాయిగిన్నె" అనేది.

వ్యసనాలకు లోనైన వాళ్ళందరూ ఇలాటి షోకులకు పోయి - సంసారాన్ని సన్యాసి మఠంగా మార్చి వేస్తారు. ఉన్న కాస్త సుఖాన్ని దూసివేస్తారు. ఇల్లాలికీ, పిల్లలకూ రవ్వంత వెలుతురు అందకుండా అన్ని కిటికీలు మూసివేస్తారు. సంఘ ద్రోహుల్ని లెక్క వేసుకుంటూ ఉంటాం గానీ - సంసార ద్రోహులెంతమందో ఉంటారు. వారిని ఎలా శిక్షించాలో తెలియదు - ఎవరు శిక్షిస్తారో తెలియదు.

పాపం చెయ్యడానికి వెనుకపడటమంటూ ఉండదు. అని అలా నిర్వహిస్తూనే పోవాలి. కానీ వాటిని క్షాళన చేయడానికి దేవుడి దగ్గర దీపాలు వెలిగిస్తూ ఉండాలి. ఒకటి ఎక్కువ వెలిగించానని సంతోషించడానికి తావు ఉండదు. ఎందువల్లనంటే - ఎన్ని దీపాలు వెలిగించినా పాపాల చీకటిని పారద్రోలలేవు. అవి ఆపితేగా - ఇవి లెక్కలోకి వచ్చేది.

ఎంత పాపం చేసిన ఆపి దీపాలు వెలిగిస్తే - ఆ దేవుడు కరుణిస్తే కొంత పుణ్యం అందుకునే అవకాశం ఉంటుంది. అవి ఆపడం శక్యం కాదు. అందువల్ల ఎన్ని దీపాలు వెలిగించినా చాలవు. ఒకవేళ ఎక్కువ వెలిగిస్తే - పాపానికి సరిపడ్డన్ని అవుతాయి అక్కడికి చాలా మేలే.

అంటే ఏమన్నమాట "పాపలు చేస్తూ ఉండటం.. దీపాలు వెలిగిస్తూ ఉండటం." ఇది కొన్ని జీవితాలలో జరిగే తమాషా. ఎక్కడ తగ్గుతుందా హృదయంలో ఘోష?

**(జూన్ 13,'76, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**మొన్న మా ప్రక్కింటి ఆచార్యులవారు పిలిచి** "సార్! మా అబ్బాయి మెట్రిక్యులేషన్ పాసయ్యాడు." అని ఎంతో సంతోషంతో చెప్పారు. పై చదువు విషయం చెపుతూ - "నేను టెక్నికల్ సైడుకి వెళ్ళమంటున్నాను. వాడు కాలేజీలో చేరి గ్రాడ్యుయేటు కావాలంటున్నాడు" అన్నారు.

ఇలాటి సంవాదాలు జూన్ నెలలో ప్రతి ఇంటా జరుగుతూనే ఉంటాయి. అందువల్లనే హైస్కూలు విద్యపూర్తి అయిన తర్వాత విద్యార్థి నాలుగురోడ్ల మధ్య నిలబడినట్లుంటాడంటారు. అటా, ఇటా అని ఆలోచించడం చివరకు ఎటో అటు ఉరకడం జరుగుతూ ఉంటుంది.

***నాన్న 'డాక్టర్' - అమ్మ ఇంజినీర్'***

ఆరునెలల క్రిందట నేను బంధువుల ఇంటికి వెడితే, అక్కడున్న ఒక విద్యార్థి నాతో చెప్పాడు □

"మా నాన్న డాక్టరు పరీక్షకు వెళ్ళమంటున్నాడు. మా అమ్మ- వద్దు ఆ కళేబరాలు నువ్వు కొయ్యలేవు.. జడుసుకొంటావు కూడా..- అంటుంది.

మా అమ్మ కోరిక ఇంజినీర్ చెయ్యాలని. మా నాన్న -ఇంజనీర్లకు ఉద్యోగాలు ఉండటం లేదురా, డాక్టరు చదివితే, ఏ ఎర్రనీళ్ళ అమ్ముకుని బ్రతకవచ్చు. ఈ వృత్తిలో స్వతంత్రం ఉంది- అంటాడు. ఏం చెయ్యాలో తోచడం లేదు'' అన్నాడు.

తల్లికి అగ్రతాంబూలమా? తండ్రికా? - అనే మీమాంస వచ్చింది. నేను మాత్రం ఈ విషయం ఎలా తేల్చి చెప్పేది?.. ఒకరి పక్షం చెపితే, రెండోవారికి కోపం వస్తుంది.

అందుకని ఆలోచించి - ''రెండూ మానేసి తెలుగు బి.ఏ చదువు. అమ్మా నాన్నకు భారత భాగవతాలు చదివి చెప్పవచ్చు - పై భాగంలో వచ్చే అద్దె మూడువందలతో హాయిగా బ్రతకవచ్చు. చదువుకోసం పెట్టదలచిన సొమ్ము బ్యాంకులో వేసుకోవచ్చు. పెళ్ళి అయిన తర్వాత వచ్చిన కట్నం, ఈ సొమ్మూ కలిసి ఎక్కడైనా ఇంకో ఇల్లో, నాలుగెకరాల పొలమో కొనుక్కోవచ్చు'' అని చెప్పాను.

మొన్న ఉత్తరం వ్రాశాడు - చివరికి నాన్న మాటే దక్కింది. అమ్మ పతి ఆజ్ఞ పాలించింది. మీరు తర్వాత చదవమన్న భాగవతం ముందే మొదలుపెట్టాను. 'పతి ప్రత్యక్షదైవం' అనే పద్యాలు విని అమ్మ మనసు కరిగింది.

చివరికి అంది ''ఆ పతివ్రతలు అంతంత త్యాగం చెయ్యగాలేందే, నేను మీ నాన్న మాటను ఎదిరించడం మానలేమిటి. అలాగే చదువు డాక్టరు పరీక్ష. అయితే క్లాసులో చేరేముందు ''శరీరం అస్థిరం.. శుష్కం.. శూన్యం'' అనే ఘట్టాలు కూడా క్షుణ్ణంగా చూడు. ''

***<u>అమ్మ కోసం భాగవతం</u>***

'ఇదంతా భాగవత మహాత్యం' మీరు చెప్పినట్లు తెలుగు బి.ఏ చదవలేకపోయినందుకు క్షమించండి. పోతే మీ మాట ప్రకారం జీవితమంతా భారత భాగవతాలు చదువుతాను - మా అమ్మకూ, నాన్నకూ వినిపిస్తాను' అని వ్రాశాడు.

చాలామంది కుర్రవాళ్ళు ఫస్టు ఫారం చదువుతూండగానే ప్రారంభిస్తారు - 'మా వాణ్ణి ఫలానా చదువుకు పంపుతాం' అని. అంతేకాదు - వాణ్ణి అప్పటినుంచీ ఆ డిగ్రీతో పిలుస్తారు. కొందరు తమ ఫస్టుఫారం కుర్రవాణ్ణి 'ఇంజనీర్' అని పిలిస్తే మరి కొందరు తమ పిల్లవాణ్ణి 'డాక్టర్' అని పిలుస్తారు.

ఒకసారి ఒకరింటికి పోతే ఆ ఇల్లాలు భర్తతో అంటోంది - డాక్టరును వెతుక్కు రమ్మని ఇంజనీర్ని పంపా. ఇద్దరూ ఇంతవరకూ కొంపకు రాలేదు' అంది. ఆయన వెంటనే 'ఆ డి.యస్.పీ.ని పంపకపోయావు. జుట్టు పట్టుకు లాక్కు వచ్చేవాడు?' అన్నాడు.

మూడోవాడు చాలా ధైర్యసాహసాలు కలవాడుట. అందువల్ల పోలీసు శాఖలో చేర్పించాలని తండ్రి అభిలాష. మళ్ళీ కొద్ది ఉద్యోగమేమిటని ఆయన వాణ్ణి చిన్నప్పటి నుంచీ డి.యస్.సి. అని పిలవడం ప్రారంభించాడట.

ప్లీడరు గుమాస్తాలు చేసిన వారిలో కొందరు, అవస్థపడి, వాళ్ళ అబ్బాయిని ఏమైనా సరే ప్లీడరు పరీక్షకు పంపాలని పట్టుబడతారు. ప్లీడరు గుమాస్తా బిరుదుపోయి ''ప్లీడరుగారి తండ్రి'' అనే కితాబు రావాలని ఎంతో ఉబలాట పడతారు.

***<u>కలెక్టరు - కారు డ్రైవరు.</u>***

వెనుకటికి మా మిత్రులు కరణంగారు వాళ్ళబ్బాయిని గురించి మాట్లాడుతూ ''మా వాడు అంతా సరిగ్గా కలిసివస్తే కలెక్టరవుతాడు. లేదా కారు డ్రైవరవుతాడు - అనేవారు. అదేం మాటండీ అలా అంటారంటే - ''అవునండీ, వాడి జాతకంలో కారులో హాయిగా తిరుగుతాడని ఉంది. దీన్ని బట్టి వీడు కలెక్టరు కావాలి. లేదా కారు డ్రైవరు కావాలి నాకు రెండో దానిమీదే ఎక్కువ నమ్మకం ఉంది. కారు సుఖం డ్రైవరు అనుభవించినట్లు కలెక్టరు అనుభవించలేడు నిజానికి' అనే వాడాయన.

క్రిందటి సంవత్సరం ఒకరి అబ్బాయికి అన్ని కాలేజీలో సీట్లకోసం ప్రయత్నించి విఫలులయ్యారు. చివరికి ఎలాగో వెటర్నరీ కాలేజీలో సీటు దొరికింది. తల్లికి అది ఎంత మాత్రం నచ్చలేదు.

"వెళ్ళి వెళ్ళి ఆ పశువుల శాఖలో పనేమిటండి! వాడికి వాటి వాసనే పడదు గదా - ఇంకా వాటికి వైద్యమెలా చేస్తాడండీ!. ఎవరన్నా పిల్లనివ్వడానికి వస్తే - పశువుల విద్యంటే పారిపోరుటండీ' అని ఆమె వాదన.

భర్త ఆమెకు నచ్చచెప్పాలని ఇలా అన్నాడు: "భారత దేశం పశువులకు ప్రసిద్ధి చెందిందే! ఇక్కడ పాలు నదులుగా ప్రవహించినాయి. పైగా పశువుల వైద్యంలో ఎంతో మేలు ఉందే. మూగజీవాల సేవలో మోక్షం ఉందే" అని.

***ఆ మందులు మనక్కూడా***

ఆవిడ కొంచెంసేపు ఆలోచించి "పోనీ అలాగే చేరమనండీ. ఆ మందులు మనక్కూడా పనికి వస్తాయేమో కనుక్కోమనండి" అన్నదట ఆమె.

పాపం చాలా మంచిది ఇలా తమ బిడ్డలు భవితవ్యాన్ని గురించి ఎంతో ఆలోచిస్తూ ఉంటారు. మా చిన్నతనంలో ఇన్ని ఉద్యోగాలు లేవు.

ముఖ్యంగా పల్లెటూళ్ళలో "మా బాబు తహసిల్దార్ కావాలనీ, మా తండ్రి ఓవర్ సియర్ ఉద్యోగంలో చేరి మా ఊరికి గుర్రమెక్కి రావాలనీ" అనుకుంటూ ఉండేవారు.

ఆ రోజుల్లో ఆ తరగతి ఉద్యోగులంతా గుర్రాల మీద వచ్చేవారెంత హోదాగానో! తర్వాత అవి పోయి, సైకిళ్ళ మీద కాలవగట్ల వెంట పరుగులెత్తడం వచ్చింది. కారుకొనుక్కునే హోదా వచ్చేదాకా - టైర్లు పోతే మళ్ళీ వేయించుకుంటూ, సైకిళ్ళు త్రొక్కడం తప్పడంలేదు.

కాలేజీ చదువుల్లో చేరేముందు ఈ తల్లి తండ్రుల స్వప్నాలు ఎన్ని విధాలుగానో ఉంటాయి.

(జనవరి 6,'72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**"నేనుండగా నీకేం భయం,,"** అనేమాట అనేక సందర్భాలలో వింటూవుంటాం. సమర్థుడైన భర్త కల వనిత ఆయనగారు అనకుండానే, తనంతట తానే వెయ్యిమాటల్లో అనుకుంటా ఉంటుంది. "వారుండగా నాకేం భయంలేదు. కొండ విరిగి మీద పడ్డ బెండులాగానే ఉంటుంది"

సమర్థుడు కాని భర్త అయితే పాపం ఆయనంతటి ఆయనే అనేకమాట్లు ఆ తలోదరికి ధైర్యం చెప్పవలసి వస్తూ ఉంటుంది - "నేనుండగా నీకేం బయం?" అని చెప్పవలసి వస్తుంది. ఇంట్లో బియ్యం లేవని చెప్పినా, వంట్లో ఓపిక లేదని, కంట్లో నలక పడిందని గోలపెట్టినా ఆయనగారు వెంటనే అందుకుని -

***"నేనుండగా నీకేం భయమే!"***

"నేనుండగా నీకేం భయం పిచ్చిదానా?" అంటూ ఉంటాడు. ఆయన సర్వ శక్తిమంతుడైనట్లు - శారీరక, మానసిక, బాధలన్నిటికీ ఆయన సమక్షమే సర్వనిర్మూలనోపాయమైనట్లు భావిస్తాడు కాబోలు....

"అట్లాంటి వారు ఇంట్లో ఉండే లాభం?" అని ఆవిడ లోలోపల గోలపెడుతుంటే - ఆయనగారు తను ఉండటం చాలా గొప్పవరమన్నట్లుగా పేర్కొని తన ప్రలోభాన్ని బయట పెడుతూ ఉంటాడు.

అర్ధరాత్రి పూట ఎక్కడైనా చప్పుడైతే అది విని భార్య దిగ్గున లేచి "ఏమిటో చప్పుడండీ. భయం వేస్తోందండి" అని భర్తను లేపితే ఆయన కళ్ళు కూడా తెరవకుండానే "నేనున్నాగా నీకేం భయం పడుకో నిద్రపో!" అంటాడు.

***నేనుంటే లైట్ దేనికే..***

"పోనీ లేచి ఒకసారి లైట్లన్నీ వెయ్యండి" అని ఆవిడ ప్రాధేయపడితే - "నేనున్నాగా అంటే లైట్ అంటావేమిటి?" అని విసుక్కుంటాడు. మనస్సులో చీకటిని కూడా పారద్రోలగల మహాతేజస్సంపన్నుడులాగా భావించుకుంటూ..

నిజానికి అలాంటి వాడొకడు ఉన్నాడనే భావంతోనో, బాధతోనో స్త్రీలు సంసారంలో పడి ఉంటారనుకోండి. అయినా సమయంకాని సమయంలో, అసమర్ధతను దాచి పుచ్చుకోవడం కోసం - నేనుండగా నీకేం భయం అంటుంటే మాత్రం వారికి అరికాలిమంట నెత్తికెక్కే పరిస్థితి ఏర్పడవచ్చు.

మొన్న ఒక ఇల్లాలు పాకిస్తాన్‌తో యుద్ధం వచ్చిన సందర్భంలో "చూశారా యుద్ధం వచ్చిందిట. ధరలు పెరిగిపోతున్నాయి. కిరసనాయిలు అసలు దొరకడమేలేదు" అందిట భర్తతో.

మంచంలో పడివున్న భర్త ఆ మాటలు విని చివాలున లేచి కూర్చుని "ఏమిటా మాటలు? ఎందుకా భయం? యుద్ధం రానీ ఏమన్నా రానీ, నీకెందుకా ఆలోచనలు? నేనుండగా నీకేం భయం లేదు నువ్వు హాయిగా ఉండు" అన్నాడుట.

"అది నిజమేలెండి, మీరు పడుకోండి, కళ్ళు తిరుగుతాయేమో, మీరు పడుకోండి" అని బ్రతిమాలిందిట.

ఈ సంవత్సరం కళాప్రపూర్ణ బిరుదు సంపాదించాలని ఒక ఆవిడ ఒక పెద్ద హోదాగల వ్యక్తిని కలుసుకుని - "ఎలాగైనా ఈ కీర్తి నాకు దక్కించాలి. మహిళా లోకానికి ఇది ప్రథమం గనుక ఎక్కువ అభ్యంతరం ఉండదు" అని బ్రతిమాలిందిట.

***నే ఉండగా - బిరుదుకేం తక్కువ***

ఆయనగారు "నేనుండగా మీరలా భయపడతారేమిటి. ఈ చిన్న సహాయమే చెయ్యలేకపోతే నేనెందుకు? మీకు బిరుదు వచ్చినట్లే భావించి, పెట్టె సర్దుకుని ప్రయాణానికి సిద్ధంగా ఉండండి" అన్నాడుట.

ఆ వనితాలలామకు ఆ మాటలు వంశీ మనోహర రాగాలుగా వినిపించి, పరవశంతో బ్రతుకుతూ వచ్చిందట ఇటీవల. కానీ ఈ వత్సరం జాబితాలో మహిళామణి పేరు లేదు. బహుశ ఆమె మూర్చిల్లి ఉంటుంది. ఆ పెద్దమనిషి "నేనుండగా నీకేం భయం లే... ఈ వత్సరం వీలులేకపోయింది. పై సంవత్సరం దాకా ఓపికపట్టు" అని ఓదారిస్తూ ఉండి ఉంటాడు.

చాలా మంది 'నేనుండగా' అనే మాటను అండగా పెట్టుకొమ్మనీ, అణుమాత్రమైనా భీతి చెందవద్దనీ చెపుతూ ఉంటారు. మా బంధువుల్లో ఒక డబ్బుగల వితంతువు ఉంది. ఆమెకు దగ్గిర బంధువు ఒకాయన ఉన్నాడు. ఆయనగారు మాత్రం ఏ చిన్న విషయం వచ్చినా, తన మనస్సు నొచ్చినా, బ్రతుకు పుచ్చినా రవంత కూడా అధైర్యం చెందకుండా ఆ ధనవంతురాలిదగ్గరకు వెళ్ళి -

***కొండ దొర్లిస్తా.. ఇనుప ఉండలు మ్రింగుతా***

"నువ్వుండగా నాకేమీ తక్కువమ్మా! కొండలు దొర్లించగలను. ఇక ఇనప ఉండలు మ్రింగి హరించగలను. మీ ఇంటి మీద ఒక్క కాకి కూడా వ్రాలకుండా శపించగలను" అని ఎంతో ధైర్యంగా చెపుతూ ఉంటాడు. ఆమెగారు ఉప్పొంగి పోతుంది. అతగాడు నిప్పుల్లో ఉరకమన్నా ఉరుకుతుంది. ఆ ఒక్క "నువ్వుండగా మంత్రంతో" అతగాడు ఆమె సిరిపేరిటి నువ్వు ఉండలు పిండి, ఆ నూనెతో తన ఆశ పేరిట గంగాళం నింపుకుంటున్నాడు.

"తక్కువేమి మనకూ రాముండొక్కడుండు వరకూ" అన్న ఫణితిలో 'తక్కువేమి మనకూ సీతమ్మక్క ఉండువరకూ" అని తెల్లవారు ఝామున లేచి పాడుకుంటూ ఉంటాడు. ఆ గానం విని ఆమె మనస్సు మైనమై పోతూవుంటుంది.

ఒకసారి ఏదో పనిమీద ఒకపెద్ద మనిషి దగ్గరకు వెళ్ళాను. ఆయనక్కడ లేని ప్రేమ చూపించి ఆ పని కాస్తా వాయిదా వేసాడు. ''అదేమిటి అలా వాయిదా వేస్తున్నారు - కొంచెం చేసిపెట్టండి'' అని అడిగాను ఆయనగారు చిరునవ్వొకటి విసిరి'' నేనుండగా మీకేం భయం. మీరు అయినట్లు గానే భావించి హాయిగా ఉండిపోండి'' అన్నాడు.

***<u>నేను అండమానుల్లో ఉన్నా ఫర్వాలేదు</u>***

అక్కడికీ కొంచెం వేదాంత ధోరణిలోకి మనిషిని మార్చి ''మీరుండగా నాకేం భయం లేదనుకోండి. మీరుంటారని నమ్మకమేమిటి?'' అన్నాను.

''అలాంటి భయం కూడా మీరేం పెట్టుకోవద్దు. నేను అండమానుల్లో ఉన్నాసరే మీరెంత మాత్రం భయపడవలసిన అవసరంలేదు - మీ పని పూర్తి అయినట్లే భావించండి'' అన్నాడు.

ఆయన మాత్రం అలాగే ఉన్నాడుగానీ ఆయన ఇచ్చిన హామీపత్రం పుచ్చి బుగిలిపోయిన స్థంభమై పోయింది. ఎప్పుడైనా కనిపించినప్పుడు - ''ఏమండీ అంతా ఇలా బుగిలిపోయింది. పొడిరాలుతోంది ఏమిటి ఈ ''గ్రహచారం'' అని అడిగితే

''అది బుగులు అంటారేమిటి? పుప్పొడి సువాసన తెలియడంలా?'' అని ధైర్యవాచకాలు పలుకుతాడు.

ఇలా పలికి పలికి చివరికి మాత్రం ''మీరు మాత్రం ఒక్క పని చెయ్యండి ఎంతైనా మనం మానవులం గనుక దైవశక్తిని కూడా కొంచెం సంపాదించడం మంచిది. కనుక గుడిలో కొన్ని ప్రదిక్షణలు చెయ్యండి ప్రతిరోజూ.

- అలా పదిరోజులు చేసిన తర్వాత నాకు వచ్చి కనిపించండి. బహుశ అప్పటికి నాకు కొంత బలం రావచ్చు. మీ పని సంగతి చూడవచ్చు'' అన్నాడు.

''నేనుండగా'' అన్నవాడు - గుడి చుట్టూ ప్రదక్షణం దాకా వచ్చాడు. 'నేనుండగా' అనేది ఆ జగద్రక్షకుడవాలి గాని - నరుడని పిలవబడే జనుడొకడుంటే ఏమి ఫలితం వస్తుంది.

''**సంక్రాంతి, సంబరాలూ, సరసాలూ చాలావరకు** తగ్గిపోయినాయి. ఏదో చల్లగా గడిచిపోయింది'' అన్నాడొకాయన మాట్లాడుతూ.

ఆయన మాటలు నిజమేనేమో అనిపించింది. ఆర్థిక పరిస్థితులు బాగా లేనివారి సంగతి అంతేగా మరి. అని కాకుండా కొన్ని దండగల జీవితాలుంటాయి. ఉన్నదంతా పోగొట్టుకుని ఉప్పు చేపల్లాగా తయారైన వాళ్ళ జీవితాలు వాళ్ళకు నిజానికి బ్రతుకే దండగ అయిపోతుంది. ఇక పండగల సంగతేం ఉంటుంది.

'ఒకప్పుడు నేనూ వెలిగాను అలనాటి పెట్రోమాక్సుకన్న, ఈ నాటి ట్యూబ్‌లైట్ కన్న నేనేం చింత పడక్కర్లా.. పండగలు చూచి పశ్చాత్తాపపడక్కర్లా!' అని ఇలాటివారు మసక మనస్సుల్లో రవంత రజను జల్లుకోవడానికి ప్రయత్నిస్తారు. ఇదో రకం తాత్విక చింతన! వీటిలో ఎన్ని రకాలు!

***<u>వద్దనే పండుగ వదిలేశాం.</u>***

''ఈ పండుగ సమయం ఇలా గడిచింది. గడిచిందేమిటి, గడపాలనే గడిపాం. క్రొత్తబట్టలు కట్టలేక కాదు. క్రొత్త బొమ్మలు పెట్టలేక కాదు. పిండి వంటలు బుట్టకు ఎత్తలేకా కాదు. మనస్సు బాగుండలేదు. పోనీలే ఈ పండగ వదిలేద్దామనుకున్నాం. వదిలేశాం. అంతే'' అని ఒకామె ఎంతో నిర్లిప్తత ప్రకటించింది.

ఇదోరకమైన గంభీర ప్రకటన! మొన్న ఒక కవిపుంగవుడు మీటర్‌తో సంబంధం లేని గేయం ఒకటి హుందాగా చదివి వినిపించాడు సభలో. అక్కడికీ ఊరుకోకుండా "నాకు ఛందస్సు రాక కాదు. పద్యాలు వ్రాయలేక కాదు ఆ గేయం వ్రాసింది. " అని ఒక చక్కటి పద్యం చదివి వినిపించాడు. పద్యాలు వ్రాయకపోవడానికి కారణం ఏం చెబుతాడు. అదో సరదా. "రెండిట అందరిన్ తనియింప గోరి" కాబోలు - అనుకున్నాం.

చేతినిండా సొమ్ము లేకపోవడం వల్ల పండగ హడావిడి, సరదా తగ్గిపోవడమే కాదు సిరిగలవాళ్ళు కూడా ఈ కాలంలో నీళ్ళు నమిలి ఊరుకొంటున్నారు. "పది రూపాయలు ఎప్పుడు అవతల పారేస్తే అప్పుడే పండగ" అనే ధీమా వీరికి కొరత ఉంటుంది.

***<u>వంచించలేను... లంచాలు తినలేను</u>***

మొన్న ఒక గృహస్తునడిగాను "ఎలా నడిచింది పండగ?" అని. "సగం నిద్రతో గడిచింది - సగం నిరుత్సాహంతో గడిచింది. సంక్రాంతి దాటిపోయేది. నాకు సంక్రాంతి అంటే వట్టి భ్రాంతిగా మారిపోయింది. మనకేం పంటలున్నాయా? పాడిగోవులున్నాయా! ఒకళ్ళను వంచించే పదవులున్నాయా! లంచాలు తినే అవకాశాలున్నాయా! అతిసామాన్య పౌరుణ్ణి ఇంకా అంతకంటే తక్కువ పౌరుణ్ణి, నాకు సంక్రాంతేమిటి?" అన్నాడాయన.

"అదేమిటి దేశానికి అంతటికీ ఉన్న పండుగ మీకు లేకపోవడమేమిటి. వాటికి ఉన్న ప్రత్యేకత వాటికి ఉందిగదా! మనం పొమ్మంటే పోతుందా ఏమీ చేయలేక పోతే - తల కడుక్కుని రెండుపులగం మెతుకులు నోట్లో వేసుకుంటే సరిపోతుంది గదా?" అన్నాను.

"తల కడుక్కోవడమన్నారా ఏ తెల్ల వారుఝామునో లేచి, ఏ పంపుదగ్గిరో కడుక్కోడానికి ప్రయత్నించవచ్చు. పులగం ఎక్కడినుంచి వస్తుంది. బియ్యం ఖరీదు తెలుసుగదా! మంచివి కిలో రూపాయి అరవై. మూడు రూపాయలు మూడు అరవైలూ పెడితేగాని - పిల్లలకు ముప్పొద్దులా పెద్దవాళ్ళకు ఒక ప్రొద్దు మూతులు తుడుచుకోవడం జరగడంలేదు.

"ఇంకా పులగంలోకి పప్పెక్కడనుంచి వస్తుంది. కిలో రెండు రూపాయలు..! ఇంకా కొంతకాలంపోతే గిద్దల లెక్కపోయి బద్దల లెక్కలోకి వస్తాయి.. ఇంకా పులగమంటారు మీరు. బ్రతుకులే కలగాపులగంగా ఉన్నాయి. అయిదు రూపయలు ఇంట్లో ఉంటే భోగిమంట దగ్గిర చలి కాచుకున్నంత వెచ్చగా ఉంటోంది. ఏం చెప్పమంటారు ఈ బ్రతుకుల సంబరాలు?" అని ఆయనగారు నుదుర్వ్రేళ్ళతో తాకారు.

మొన్నటి ఆంధ్రప్రభ సంక్రాంతి సంచికలో సరసాలు అనే పేరుతో ఒక పడుచుకత్తె, పడుచువాని బొమ్మలు వేశారు. అది మా 'ఉషశ్రీ'గారు కాబోలు అన్నారు. "ఈ బొమ్మ చూశారు. ఇది గతించిన చరిత్రలో పుట! ఎవరి సంగతో ఎందుకు, నా విషయంలో అంతే. ఒప్పుకోరు కానీ చాలామంది విషయం కూడా అంతే. ఇంట్లోవాళ్ళు ఎప్పుడేం అడుగుతారోనని నీరసాలు వేసుకు తిరుగుతుంటే ఇంకా సరసాలెక్కడ. సరదాలెక్కడ.!"

***<u>చంటివాణ్ణి మినహాయిస్తే - సైలెంట్ పిక్చర్</u>***

"సిల్కు చీర కొనలేదనే చీదరింపులతో భోగి ప్రారంభమైంది - సంక్రాంతి ఆ గందరగోళంలోనే దాటిపోయింది. కనుమునాడు మినుము కొరికే ప్రాప్తం లేకుండా పోయింది. ఆ మర్నాడు సంజ్ఞలే తప్ప మాటలు లేవు. పాలు చాలక, డొక్కలు లేవక ఏడ్చే చంటివాణ్ణి మినహాయిస్తే సంసారమంతా సైలెంట్ పిక్చరుగా సాగిపోతోంది. ఇందులో సరసమేమిటి.. సంబరమేమిటి?" అన్నారు.

"ఆ ఎదురింటావిడ ఎలా నవ్వుతోందో చూడవే! పండగనాడు కూడా అలా మూతి ముడుచుకుంటావేం. సంవత్సరంలో పది పండగరోజులుంటాయి. అవి పకపకలకోసం పెట్టారుగాని ఇలా మౌనంగా ఉండటానికి కాదే!" అని గృహస్తు భార్యామణితో అన్నాడు.

ఆవిడ విసుగ్గా తలతిప్పి "పకపకలూ, చెకచెకలూ నాలాటిదానికి ఏం వస్తాయి. ఎంత పండగైతే మాత్రం ముఖాన గీతలెక్కడికిపోతాయి. ఒకరు చెరిపే గీతాలా! బ్రతుకంతా కనిపించకుండా నిలిచిపోయే వాతలు." అంది.

"అదేమిటే అంత వేదాంతంలోకి పోతావు. ఉన్న కష్టాలు ఉంటాయి. ఈ ఒక్కరోజూ మరిచిపోమన్నాగాని, బ్రతుకంతా మరిచి పొమ్మన్నానా! ఆ సంగతి నాకు మాత్రం తెలియదు! అది తర్వాత ఆలోచిద్దాం. ఒక్కసారి నవ్వుతూ మాట్లాడవే నవ్వవే!" అని ఆయన బ్రతిమాలుకున్నాడు.

***<u>నలభై నెంబరు చీరకు నవ్వులేం వస్తాయి.</u>***

"ఆ! నవ్వులు నవ్వులు! ఎక్కడినుంచి వస్తాయి. మీరు కొన్న నలభయ్యో నెంబరు చీరకు జరీపువ్వుల చీరలు కట్టినవాళ్ళకు వస్తాయి - వల్లమాలిన నవ్వులు. ఈ దుంగకు చుట్టిన తెరచాపలోనుంచి రంగులూ, పొంగులూ ఏం బయటపడతాయి. అయినా నువ్వు ఒకరు చెపితే వస్తుందేమిటి?" అని ఎంతో దీర్ఘాలు తీసి లోపలకు పోయింది.

ఇలా చాలామంది పండగన్నట్లు నైరాశ్యం ప్రకటిస్తున్నట్లు దేశంలో ఒక క్రొత్త కాంతి ప్రసరిస్తున్నది అన్ని తావుల్లో, అన్ని హృదయాలలోను. దాన్ని గొప్ప సంక్రాంతిగా భావించి భారత జాతి అంతా ఆనందిస్తోంది.

కాకపోతే సంక్రాంతి కొంచెం ముందుగా వచ్చింది. వచ్చినా అసలు సంక్రాంతి దాకా నిలిచింది. ఏమిటా సంక్రాంతి. బాంగ్లా దేశంలో ఉదయించే సూర్యుడు క్రొత్తకాంతులతో ఉదయించే సంక్రాంతి.!

***<u>బాంగ్లా ప్రభుత్వపు బల్లమీద క్రొత్త బొమ్మలు</u>***

యాహ్యా అహంకారం భోగి మంటల్లో పడిపోయింది. బాంగ్లా ప్రజల కష్టాలు తొలిగిపోగా, వారి హృదయాలలో ముత్యాలు ముగ్గులు పెట్టింది ఇందిర. బాంగ్లా ప్రభుత్వపు బొమ్మల బల్లమీద క్రొత్త బొమ్మల్ని నిలబెట్టింది ప్రియదర్శిని. అందరిచేతా ముక్త కంఠంతో మంగళ గీతాలు పాడించింది.

కాందిశీకులందరిచేతా - శాంతి, సంతృప్తి పేరిట పులగం తినిపించింది. ఉభయదేశాల మధ్యా పువ్వుల వంతెన నిర్మించింది. ఎందరో ఇందిరా దాసులు వెలిసి భక్తి గీతాలాలపించేలాగ చేసింది.

ఇది ఎలాటి సంక్రాంతి..! ఈ పండగ ముజీబ్ విడుదల అయి, ప్రధాని అయేదాకా జరిగింది. ఇది చరిత్రలో ఎన్నడూ ఎరగని సంక్రాంతి.

**ఇటు అనంతపురమో, అటు అదిలాబాదో వెళ్ళినంత** తేలిగ్గా వెళ్ళి వస్తున్నారందరూ అమెరికా ఖండానికి. ఎవరినడిగినా మా వాడు ఒకడు అమెరికాలో ఉన్నాడని చెపుతున్నారు.

మొన్న ఒకాయన అన్నాడు మా ఊరి వాళ్ళు ముప్పయి మంది ఉన్నారు న్యూయార్కులో. ఎప్పుడైనా షికారుగా పార్కుకి వెడితే మా ఊరు ముఖాలు కనిపించడం. వాళ్ళ వెనకటి సోదంతా చెప్పడం తప్పడంలేదు. అలాటి సందర్భాలలో 'నేను నిజంగా అమెరికాలో, ఉన్నానా? ఆంధ్రదేశంలోనే ఉన్నానా? అనే సందేహం కూడా కలుగుతోంది' అని.

అమెరికాలో ఉన్న వాళ్ళను గురించి మాట్లాడుతుంటే మా ఊరు నుంచి వచ్చిన ఒక కరణంగారన్నారు "నాకు వీసా దొరకలేదుకానీ, తస్సాగొయ్యా.. అమెరికాలో అన్ని రాష్ట్రాలు తిరిగి మన దేశాన్ని గురించి గంభీరోపన్యాసాలిచ్చి వచ్చేవాణ్ణి. మనముందు వెర్రి ముఖాలు వెయ్యావలసి వస్తుందని 'వీసా' అంటూ ఒకటి పెట్టారు" అని.

***<u>పురిటినీళ్ళకు ముప్పయి వేలు</u>***

మాకు తెలిసిన ఒకరు కూతురికి పెళ్ళి చేశారు. ఆరు నెలలన్నా కాకముందే అల్లుడు అమెరికా వెళ్ళాడు. మరో మూడు నెలల్లో భార్యను పిలిపించుకున్నాడు. కూతుర్ని అంత దూరం పంపలేక తల్లితండ్రులెంతో బాధపడ్డారు. నెలకు రెండు మూడు మాట్లయినా ఫోనులో మాట్లాడేవారు. భగవంతుని దయ ఆ అమ్మాయికి పురుడు దగ్గర పడింది.

తొలి పురుడు తాము పొయ్యాలని తల్లితండ్రుల అభిలాష అదీ ఆచారం ఉన్నదిగా. అందుకని కూతుర్ని పంపమన్నారు. అల్లుడు వీల్లేదన్నాడు. తల్లితండ్రులిద్దరూ బయలుదేరారు. న్యూయార్క్. పురుడు పోసి చక్కా వచ్చారు రిటెన్ టిక్కెట్టు మీద. పురిటి నీళ్ళు పోసి రావడానికి ముప్పయివేలయింది.

తిరిగి వచ్చి ఎంతో గొప్పగా చెప్పుకున్నారు. "ముప్పయివేలు పోతేపోయింది - అమెరికా చూశాం.. అందాల మనుమణ్ణి చూశాం." అది విన్న ఒక వృద్ధురాలు "అంత దూరం వెళ్ళారు కదా - ఇంకా కొన్నాళ్ళు ఉండకపోయారా? అంత సొమ్ము పెట్టి మళ్ళీ వెళ్ళగలరా? అందట.

***అమెరికా పురుళ్ళు అతి ఖరీదైన పురుళ్ళు***

అది విని ఆ ఇల్లాలు వెంటనే అందిట. "ఇంకా ఉంటే నా పురుడు కూడా అక్కడే వచ్చేది." పిల్లాడి పేరు అక్కడ రిజిస్టర్ చేయించుకోవాలిట. వాణ్ణి తీసుకు రావడానికి మళ్ళీ ఏవో ప్యాస్‌లు వగైరాలు కావాలిట. అదికాకుండా అమెరికా పురుళ్ళు అతి ఖరీదైన పురుళ్ళు అవి.

మొన్న ఒకమ్మాయికి కంట్లో కొంచెం జీర ఏర్పడిందిట. ఉద్యోగం చేస్తోంది. వాళ్ళు, వీళ్ళు వేడి చేసి వచ్చింది నందివర్ధనం పూలు వేసి కట్టమనీ - కంటి చుట్టూ మంచి గంధం పట్టు వెయ్యమనీ సలహా చెప్పారు. కానీ ఆ అమ్మాయి బంధువులెవరో ఉన్నారట. అమెరికా వాళ్ళు ఉత్తరం వ్రాశారుట. ఇక్కడ ఎలాటి జీర అయినా ఇట్టే తీసివేస్తారుట రావలసిందని.

ఆ అమ్మాయి సెలవు పెట్టి ఎకాఎకిని బయలుదేరి వెళ్ళింది వాషింగ్టన్. ఒక్కతే ప్రయాణం - చేసింది. అందులో ఒక తమాషా జరిగిందిట. లండన్ విమానాశ్రయంలో దిగి - టాయిలెట్ చేసుకుంటూ చూస్తే కంట్లో జీరకనిపించలేదుట. అద్దంలో ఏమన్నా పొరపాటున్నదేమోనని మరో అద్దంలో చూసిందట. కన్ను శుభ్రంగా ఉందిట. అనవసరంగా ఇంత దూరం వచ్చాను. ఇప్పుడేం చెయ్యడమా అని ఆలోచించి - ఎలాగూ బయలుదేరాను కదా అని అమెరికా చేరిందట. అక్కడ కొన్నాళ్ళు ఉంది. మళ్ళీ జీర కనిపిస్తుందని చూసింది. అలాటిదేమీ లేదు. అక్కడ వాళ్ళు చెప్పారు. "మీది వేడి ప్రదేశం అందువల్ల అలా వచ్చి ఉంటుంది. ఇది చల్లని దేశం కనుక మాయమైంది" అని.

ఆవిడ తిరిగి వచ్చింది.కానీ వచ్చినప్పటినుంచీ రెండు కళ్ళూ నీరు కారడం ప్రారంభించాయుట. ఆరు నెలల నుంచీ అలాగే ఉన్నాయుట. అనవసరంగా అమెరికా ప్రయాణానికి అంత డబ్బు ఖర్చుపెట్టడం వల్ల ప్రవహిస్తున్న కన్నీళ్ళని వేరే చెప్పనక్కరలేదుకదా!.

***అవమానం భరించలేక అరేబియా సముద్రంలో..***

సుమారు పది సంవత్సరాల క్రింద ఒక కుర్రవాడు ఒక కుర్రదాన్ని ప్రేమించాడు జంటనగరాల్లో. ఆమె కూడా మనస్సు ఇచ్చినట్టే నటించింది. అతడు ఎంతో సరదాగా కాలం గడుపుతూ వచ్చాడు. హఠాత్తుగా ఆమె మరొకరిని ప్రేమించింది. కొత్త ప్రియుడి ఆమెను తీసుకుని అమెరికాకు బయలుదేరాడు.

ఆ వార్త ఆ తాత్కాలికపు ప్రియుడికి తెలిసింది. వారితో కూడా బొంబాయిదాకా వెళ్ళాడు. ఆమె విమానం ఎక్కేలోగా మనస్సు మార్చుకుని తనతో తిరిగి ఇంటికి వస్తుందని ఎంతో ఆశపడ్డాడు. దూరంగా నిలబడి తనది అన్య స్థితిని ఆమెకు అర్థమయేలాగా చేశాడు.

జుట్టు పీక్కున్నాడు. పాంటు మోకాళ్ళ దగ్గర చింపుకున్నాడు. చొక్కా బ్లేడుతో చీలికలు వాలికలు చేసుకున్నాడు. అపర మజ్నూగా తయారయ్యాడు.

ఆవిడ మనస్సు అంత తేలిగ్గా మారుతుందా? విమానం విరహుల మీద జాలిపడి ఆగుతుందా? దాని వేళకు అది బయలుదేరింది. 'లైలా, లైలా' అంటూ చేతులెత్తి తాత్కాలికపు ప్రియుడు అరవడం ప్రారంభించాడు. ఆ అమ్మాయి దగ్గరకు పరుగెత్తాడు. పోలీసులు ఆపివేశారు.

చాలాకాలం వరకూ అతని జాడతెలియలేదు. 'అరేబియన్' సముద్రానికి అంకితమై పోయాడని కొందరు అనుమానించారు. మరో విమానంలో అమెరికా చేరి ఆవిడకోసం అన్వేషణ సాగిస్తూ ఉంటాడని కొందరనుకున్నారు. కానీ అతడు గోవాలో హిప్పీలలో కలిసిపోయాడని విశ్వసనీయమైన వార్తల ద్వారా తెలిసింది.

కొంతకాలం క్రిందట ఒక దేశనాయకుడు ప్రసంగిస్తూ - అమెరికా వాసులకూ ఆంధ్రులకూ చాలా దగ్గర సంబంధం ఉన్నదన్నాడు. ఆంధ్రులే మొట్టమొదటిగా అమెరికా ఖండం చేరారని ఆయన అభిప్రాయం వెళ్ళబుచ్చారు. ఇప్పుడు ఎవరైనా ఆ విషయంలో పరిశోధన చేయవలసి ఉంటుందన్నారు. అందువల్లనే ఆంధ్రులు చాలామంది అక్కడ నివాసాలేర్పరచుకుంటున్నారన్నారు కూడా.

***ఆ అమ్మాయి అమెరికా వస్తుందేమో కనుక్కోండి.***

ఆయన అభిప్రాయం మాట ఎలావున్నా ఈ రోజుల్లో చాలామంది అమెరికా ఖండానికి చేరుతున్నారు. ఏవో పనులు కల్పించుకుని మొన్న ఒక్క పేటలో విచారిస్తే చెప్పారు. ఆడపడుచులు ఆరుగురూ, ఎనమండుగురు అమెరికాలో ఉన్నారని అంచనా తేలింది.

మొత్తం మీద ఎంతమంది ఆంధ్రులున్నారో అమెరికాలో తెలియదు. ఇంకా చాలామంది ప్రయాణాలు కడుతూనే ఉన్నారు. మా మనమడు ఒకడున్నాడు. పెళ్ళిమాట ఎత్తితే - "ఆల్ రైట్ చేసుకుంటాను. కానీ అమెరికా వెళ్ళివచ్చిన తర్వాత" అంటూ ఉంటాడు. అమెరికా వెళ్ళిన తర్వాత తిరిగి వస్తాడేమో - ననే దిగులు పడుతున్నారు తల్లితండ్రులు. మరో యువకుడున్నాడు. ఏదైనా సంబంధం రాగానే 'పిల్ల అమెరికా వస్తుందేమో కనుక్కున్నారా?' అని మొదట ప్రశ్న వేస్తాడు.

కట్టుకున్న తర్వాత రాక ఏం చేస్తుందిరా? ఆ మాట ముందడగడమేమిటి? భార్యగా అవరించిన తర్వాత 'బహామాదీవులకు రమ్మన్నా రావాలి కదా' అంటే - "అలారావడం వేరు. అలా తీసుకుపోతే కేవలం లగేజ్ తీసుకు వెళ్ళినట్లుంది. అమెరికా అనగానే ఎగిరి విమానంలో వెడలి అక్కడ చకచకా ఇంగ్లీషులో మాట్లాడే చాతుర్యం ఉండాలి. ఇక్కడ సాంప్రదాయాలన్నిటినీ 'వీసా' పుచ్చుకున్న రోజునుంచీ విడిచిపెటడానికి సిద్ధంగా ఉండాలి. ఒక్క మాటలో చెప్పాలంటే విదేశీ మెంటాలిటీ ఉండాలి" అని అతగాడు వ్యాఖ్యానిస్తాడు. ఆంధ్రకూ, అమెరికాకూ, చాలా సన్నిహితత్వం ఏర్పడుతున్నది. ఆంధ్రుల అభిమాన దైవం తిరుపతి వేకటేశ్వర ప్రభువు కూడా అమెరికాలో ఆలయం నిర్మించుకుంటున్నాడు.

(ఏప్రిల్ ।।,'65, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

## *'అమ్మ' పోయి 'మమ్మీ' వచ్చింది*

మొన్న ఒకాయన మాట్లాడుతూ "ఇంగ్లీషు ఇంకా కొన్నాళ్ళుంచితే, అదే మాతృభాష అయిపోతుందేమో" అన్నాడు. ఆయన చెప్పిందాంట్లో కొంత సత్యం లేకపోలేదు. దేశంలో ఇంగ్లీషు చదివినవాళ్ళు నూటికి ఇన్నివంతులని లెక్కవెయ్యడమే గాని, ఇంగ్లీషు ముక్కలు వాడకుండా, తెలుగు మాట్లాడే వాళ్ళెక్కడున్నారు?

మూడు నాలుగేళ్ళ పిల్లల వద్దనుంచి ముసలి వాళ్ళదాకా, ఇంగ్లీషు వాడుతూనే ఉంటారు.

చాలామంది ఇళ్ళల్లో పిల్లలు తల్లిని 'అమ్మ' అనిపిలవడం పోయింది. "మమ్మీ" అనడమే. పిల్లలు 'అమ్మ' అని నోటారా పిలవకపోతే ఎంతో వెలితిగా ఉంటుంది. తన సంతానం 'అమ్మ' అనిపిలిస్తే తల్లి నెత్తిన పూలకొమ్మ దులిపినట్లుంటుందంటారు.

అదంతా పోయింది "మమ్మీ" వచ్చిపడింది. "అవును మరి పూర్వపు ప్రేమా వాత్సల్యం పోయి, డమ్మీ తల్లులుగా తయారైనవాళ్ళని 'మమ్మీ'లంటే మాత్రమేం" అన్నదొక ముసలమ్మ.

ఆమె ఈ విషయంలో తన విచారాన్నీ, ఆశ్చర్యానీ వెలిబుచ్చుతూ "తలపుల్లోనూ పిలుపుల్లోనూ మార్పువచ్చిందండీ!. తల్లి తల్లిగా ఉంటే పిల్లలు పిల్లలుగా ఉందురు. వాళ్ళు పిల్లలని ఆడించడం పోయి చక్కగా ముస్తాబై "టాటా" అంటూ బయటికి పారిపోతారాయె." అంది.

***టాటా అంటే నీగతి నీది***

'టాటా' అంటే ఏమిటి "మీ గతి మీది! నేనుపోతున్నా" అని చెప్పడమేగా - పిల్లలు గుమ్మందాకా వెళ్ళి మళ్ళీ 'టాటా' అనాలి. నిజానికి 'టాటాలు' వింటుంటే, ఏదో పెనుగాలికి మాతృ హృదయపు కవాటాలు 'టఫీ'మని కొట్టుకుని మూసుకుపోయినట్లనిపిస్తుంది.

వెనుకటి రోజుల్లో పిల్లలు ఒళ్ళు విరుచుకుంటూ కళ్ళు తెరిస్తే, తల్లి వెళ్ళి ఎంతో ముద్దుగా వాళ్ళని దగ్గిరికి తీసుకుని "లేచిరా బాబూ! నా తండ్రి లేచావా! బాబులేస్తే గాని తెల్లారినట్లుండదు. అబ్బో! చిన్ని కళ్ళింకా మూతలు పడుతున్నాయే! మత్తు వదిలేదాకా ఎత్తూకొంటారా?" అనేవాళ్ళు.

ఇప్పుడంతా ఇంగ్లీషు సాంప్రదాయం వచ్చిపడిందిగా. తాము లేవగానే నిద్రపోయే పిల్లల వద్దకు వెళ్ళి బిగ్గరగా "కిట్టూ గెట్ అప్! రామూ గెట్ అప్.. సరలా గెటప్.. క్విక్.. క్విక్ ఆల్ రెడీ సిక్స్." అంటూ కొంచెం బద్దకించేవాణ్ణి ఒక దెబ్బవేసి లేరా సిల్లీ ఫాక్సు" అనడం జరుగుతూ ఉంటుంది.

***ప్రమిదలేని సెమ్మాలాగా***

నిద్రలేపడమే అంతచక్కగా ఉంటే, ఇక తక్కిన పోషణల సంగతి చెప్పాలా! వాళ్ళ స్నానాలు వాళ్ళు చెయ్యాలి. వాళ్ళఒళ్ళు వాళ్ళే ఆరేసుకోవాలి. వాళ్ళ తిళ్ళు వాళ్ళే తినాలి. "మమ్మీ" ఎక్కడో ప్రమిద లేని సెమ్మలాగా ఎక్కడో కూర్చుని "క్విక్" "క్విక్" - సైలెన్స్, సైలెన్స్ అంటూ అరుస్తూ ఉంటుంది.

పాపమా పిల్లలు "ఎస్ మమ్మీ" అంటూ అన్ని పనులూ చేసుకుపోతూ ఉంటారు. ఇలా అమ్మలున్న ఇళ్ళు కూడా అనేకం అనాథాశ్రమాలుగా మారిపోతున్నాయి.

పిల్లల పోషణ మన సంస్కృతిలో గొప్ప అధ్యాయంగా పరిగణింపబడింది. జోలపాటవద్ద నుంచీ ఎన్నో పాటలున్నాయి పిల్లల సందర్భాన పాడేవి.

"ఉంగపెట్టెద రారా
వప్పులకుప్పల తండ్రీ" అనీ

"నలుగు పెట్టెదరారా

నవ్వుల అంగారు తండ్రి - అనీ"

ఇలాంటి వన్నీ పాడుకుంటూ పిల్లలకు సేవచేస్తూ ఉండేవారు. తలంటి పోసే ఓపిక ఎక్కడుంది తల్లులకు? క్లబ్‌లో టెన్నిసు మాచ్ గెలవాలనేగాని, పిల్లలకు నలుగుపెట్టి నీళ్ళు పొయ్యాలని ఎక్కడుంది. అంతా ఇంగ్లీషు పద్దతే! ఆదివారం వస్తే "యూ! బాయిస్ ఎండ్ గరల్సు.. షాంపూ బాత్ టుడే! అండర్ స్టాండ్?" అని ఆజ్ఞాపించడం.

***షాంపూ పులుముకుని షవర్***

పాపం వాళ్ళు "ఎస్ మమ్మీ" అని తలనిండా వాళ్ళే ఇంత షాంపూ పోసుకుని "షవర్" క్రింద నిలబడటం - జరుగుతూ వుంటుంది. మాతృమూర్తి మూడున చమురు పెడితే దీవనగా మారుతుంది' అంటారు.

ఇంటి పద్దుల్లోనుంచి 'కుంకుడుకాయలు' పోయాయి. షాంపూలూ సబ్బులే.

పిల్లల్ని పదినిమిషాలు విడిచి ఉండవలసివస్తే వెంటనే వచ్చి వాళ్ళను దగ్గరకు తీసుకుని "నే చచ్చిపోయా బాబూ - నిన్ను విడిచిపెట్టి వెళ్ళానా! నీకు కోపం వచ్చిందా! 'అమ్మ' అని పిలిచానా! ఎప్పుడూ వెళ్ళను నాన్నా" - అని ఎంతసేపో నచ్చచెప్పుకునేవాళ్ళు.

ఈ రోజుల్లో ఏం ఉంది? పిల్లలసలు దగ్గిరికి రాకూడదు. ఏదో పుస్తకమో, పేపరో పుచ్చుకుని కూర్చున్నప్పుడు ఏ పిల్లవాడైనా, ఎక్కడన్నా ఏదో దెబ్బతగిలో - ఆకలయ్యో - తల్లి దగ్గిరికి వచ్చి చెప్పుకుందామని "మమ్మీ" అంటే -" గెట్ ఔట్, స్టుపిడ్, నాన్-ఎడ్యుకేటెడ్, బ్రూట్.. ఒకటే డిస్ట్రబెన్సు" అని విసుక్కోవడం జరుగుతూ ఉంటుంది.

***ఈ పిల్లలతో పీస్ లేకుండా పోయింది***

ఎవరితోనైనా మాట్లాడేటప్పుడు - పిల్లలున్నారండీ వాళ్ళు 'వట్టికర్సు' అమ్మమ్మ!! 'మైండ్‌కి పీస్ లేదండీ. ఇంత ట్రబుల్ లైఫ్‌లో పడలేదండీ - అంటూ ఉపన్యాసమిస్తుంది.

నిజానికి అలాటి తల్లి దొరకడం వాళ్ళకెలాటి 'కర్సో' ఎలా చెప్పగలరు?

ఇక నాన్న అనే జీవి ఒకడుంటాడు. ఆయన్ని "డాడీ" అనాలి. అలా అంటేగానీ ఆయన గౌరవం నిలవదు. ఆయన చదువు చెపుతూ "వాల్" అంటే ఏమిటి? అంటాడనుకోండి. "గోడ డాడీ" అనాలి. 'డాగ్' అంటే ఏమిటి? అంటే "కుక్క డాడీ" అనాలి.

***డాడీ మమ్మీ - మమ్మీ డాడీ***

ఇంట్లో నుంచి తల్లి 'ఎవరువచ్చిందంటే "డాడీ మమ్మీ" అనాలి. ఎవరు కోపడ్డారురా అని తండ్రి అడిగితే 'మమ్మీ డాడీ' అనాలి ఏడుస్తూ.

తల్లిని ఏదైనా కొనిపెట్టమని అడిగితే "గోటు డాడీ! మడ్డీ ఫెలో" అంటుంది. ఆ ' మడ్డీ' ఎవరికి చెందుతుందో!

మేమెరుగున్నవాళ్ళల్లో ఇకరికి ఇంగ్లీషు పద్దతులెక్కువ. వాళ్ళు పిల్లల్ని ఇంట్లో దూరంగా ఉన్న ఒక రూములో పడుకోపెట్టివస్తూ "గుడ్ నైట్" అంటూవుంటారు. అది "గుడ్ నైట్" ఎట్లా అవుతుంది? వాళ్ళు అర్ధరాత్రి లేచి కూర్చుని 'మమ్మి' అని ఒకడు, 'డాడీ' అని ఒకడు, మెల్లగా మొదలుపెట్టి స్వరాలు హెచ్చిస్తూ అరుస్తూ ఉంటారు.

కొంతసేపటికి 'డాడీ' ప్రత్యక్షమై "షట్ అప్. స్లీప్! డోంటు మేక్ నాయిస్ ప్లీజ్" అని అరిచి పోతూ ఉంటాడు. అది పాపం వాళ్ళకి "గుడ్ నైయిట్" - ఈనాటి పిల్లల ఫేట్ ఇలా ఉంటుంది.

(ఏప్రిల్ ౨౫,'౭౦, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**"నేను చెప్పే ఆచారాలు, నీతిసూత్రాలు, మొదలైనవన్నీ** జనబాహుళ్యం కోసమే. వారు బాగుపడాలనే తాపత్రయం తప్ప నాకు వేరే ఉద్దేశ్యమేమీలేదు. అసలు నా విషయం నేనాలోచించడమే మహా తక్కువ." అని ఒక పండితోత్తముడు ఎంతో పరోపకార పరాయణత్వం ప్రకటిస్తూ పలికాడట.

ఈయనగారు మంచివాడుగానే కనిపించాడు. ఎందుకంటే, జీవితంలో గల యధార్థాన్ని బయటకు చెప్పేశాడు. కొంచెం వంకర తిప్పాననుకోండి. అది మాత్రం సుగుణం కాదూ.

అయినా పరులకోసం ఈయన కొంత తాపత్రయపడటమంటూ ఉంది. అది మాత్రం సామాన్యమా?

"నువు బ్రతికేది ఇతరులకోసం, నీకోసంకాదు" అనే సూత్రం ఉందిగా మనకు.

ఒక మత ప్రచారకుడు  పెద్ద పెద్ద సభలో మహోపన్యాసాలిస్తూ ఉండేవాడుట. నీతి నియమాలను గురించి గట్టిగా హెచ్చరిక చేస్తూ ఉండేవాడుట. ఆయన మాత్రం మామూలు సమయాలలో మద్యం సేవించి హాయిగా విశ్రమిస్తూ ఉండేవాడుట.

***పండితోత్తములు - భావసమాధి***

ఎవరైనా వెళ్ళి అయ్యగారున్నారా అంటే "భావసమాధిలో ఉన్నారు. దానిలో నుంచి శక్తి సంపాదించందే ఇతరులకేం బోధించ కలుగుతారు?" అని ఇంట్లో వాళ్ళు జవాబు చెప్పేవారుట.

కొంతకాలనికి ఆయనగారి రహస్యం బయటపడిందట "ఇదేమిటి స్వామీ! మీరే ఇలా చేస్తే అనుచరులేం అవుతారు? తమరు ఆదర్శ మూర్తులుగా నిలవాలికదా" అన్నాడుట

ఆయనగారు నవ్వి, "నాయనా! ఇంతమందికి నీతి జోడిస్తున్నాను. దానివల్ల అందులో కొందరైనా బాగుపడితే చాలదూ? నా ఒక్కడిదీ ఏం లెక్క? ఎవరూ బాగుపడరంటారా? అప్పుడు నేనేం అనుకుంటాను? 'వీళ్ళేదో బాగుపడతారు కదా అని నేను నా సుఖాలు కూడా విడనాడుకోవలసి వచ్చింది. ఈ ప్రమేయం పెట్టుకోకపోతే నేనెంత స్వేచ్ఛగా బ్రతికేవాణ్ణికదా' అనే బెంగతో కృశించాల్సి వచ్చేది.

అందుకని పరోపకారం మీద ఎక్కువ మక్కువ పెట్టుకుని ప్రచారంలోకి దిగాను. నిజం చెపుతున్నాను. నేనొక్కణ్ణి చెడిపోతే వచ్చే నష్టమేమిటి? అలసి పులిసి పోయిన జీవితం అట్లపిండి జీవితం, తీయతీయని జీవితాలు, తేనె రసగుల్లాల్లాంటి జీవితాలు బాగుపడితే మంచిది కాని" అన్నాడుట.

ఈ మహనీయుడు తప్పు చెయ్యడంలో కూడా కొంత పరమార్థం స్వేచ్ఛా ప్రకటించ కలిగాడు. పైగా సత్యాన్ని కూడా చెప్పగలిగాడు. నిజమే కొందరు తప్పుడు మార్గాలలో పడ్డప్పుడు సర్వశక్తుల్ని ఉపయోగించడం, రసజ్ఞ ప్రదర్శించడం జరుగుతూ ఉండాలి. ఇలా ఒక విధమైన కళ ఇలాటివారు గ్రంధాలలో పాత్రలుగా బాగా రాణిస్తారు. గ్రంధకర్తలుగా రాణించగలరేమో!

***షా చేసేవన్నీ తప్పులే... అతడు మాత్రం గొప్పవాడు***

ఈ సందర్భంలో బెర్నార్డ్ షాను గురించి చెస్టర్‌టన్ వెలిబుచ్చిన భావం వినండి: "షా తప్పు పనులు చేస్తున్నప్పుడు ఎంతో రాణిస్తాడు. అతనిలో గల ధీశక్తి అంతా వెల్లడి అవుతుంది. పైగా అతడు సామాన్యంగా తప్పులే చేస్తూ ఉంటాడు. అతని ప్రవృత్తులూ, కార్యకలాపాలూ అన్నీ తప్పులే ఒప్పయినదల్లా షా ఒక్కడే" అని చమత్కరించాడు.

చెస్టర్‌టన్‌లో ఒక ప్రత్యేకత ఉంది. అతడు ఇతరుల నెలా విమర్శిస్తాడో, తనను కూడా అలాగే విమర్శించుకోగలగడమే ఆ ప్రత్యేకత. "తనను గురించి తను నవ్వుకోగల వ్యక్తి" అనే బిరుదు ఉందాయనకు.

ఈ వ్యాసం మొదటలో పేర్కొన్న మతప్రచారకునిలాగా, అందరికీ నీతులు చెపుతాను. నా సంగతి నేను చూచుకుంటాను - అనే పద్ధతిలో వాడు కాదు ఈ రచయిత.

తన తప్పులు, తన దురలవాట్లు తను బయట పెట్టుకుంటూ -బయటవాళ్ళను విమర్శించేవాడు. అందులో మళ్ళీ ఒక ప్రత్యేకత - వాడి చేష్టల్ని ఎక్కిరించేవాడు. వ్యక్తుల్ని గౌరవించేవాడు. తన విషయంలో వ్యక్తిత్వాన్ని గురించి చెప్పుకోవడానికి అవకాశం లేదు గనుక, తప్పుల్నే తమాషాగా చెపుతూ ఉండేవాడు.

ఈయనగారు బీర్ ఎక్కువగా త్రాగుతూ ఉండేవాడు. ఆ మత్తులో అనేక మతిమరుపు పనులు చేస్తూ ఉండేవాడు. రైల్వే బుక్కింగ్ ఆఫీసుకి వెళ్ళి డబ్బులు గిరాటువేసి కప్పు టీ ఇమ్మనేవాడు. త్రాగి తన ఇంటికి వచ్చి గది తాళం పెట్టివుంటే - తాళం చెవి జేబులో ఉన్నమాట మరిచిపోయి స్క్రూలు తెచ్చి ఒకేసారి తలుపు బందులు ఊడదీశాడు.

***<u>హాట్ కోడిగుడ్ల వంట</u>***

ఒకసారి మిత్రుడి హాట్ లోపలికి తీసుకుపోయి దాన్ని తిరగేసి దాంట్లో నాలుగు కోడిగ్రుడ్లు పడేసి స్టౌమీద పెట్టి వచ్చి హాలులో కూర్చున్నాడు. ఒక మిత్రుడు వెళ్ళబోతుంటే ఆపి "కొంచెం ఉండు సూప్ తీసుకు వెడుదువుగాని" అని బ్రతిమాలి కూర్చోబెట్టి లోపలకు వెళ్ళాడు. హాట్ ఎగ్స్ మాడిపోయినాయి.

నవ్వుకుంటూ బయటికి వచ్చి "హాట్ కోడిగ్రుడ్లు మ్రింగింది. దాన్ని స్టవ్ ఆరగించింది. మీరు వెళ్ళిరవచ్చు. నేను కోడిగ్రుడ్లు మళ్ళీ కొనుక్కోవాలి. మిత్రుడు సాలుమన్ మళ్ళీ హాట్ కొనుక్కోవాలి" అన్నాడుట. జరిగిన తమాషా అంతా తెలిసి మిత్రులందరూ నవ్వుకుని, ఇది దానికంటే మించిన పార్టీ అని సంతోషించారట.

ఒకసారి ఈ మహారచయిత తప్ప త్రాగివున్న సమయంలో ఎక్కడ దొరికిందో ఒక అసలైన పదునైన ఖడ్గం చేతికి అందిందట. అది గిరిగిరా త్రిప్పుతూ బయలుదేరాడుట. కోరడి అవతల ఒక వ్యక్తి కనపడ్డాడు. వెంటనే కోరడి లంఘించి అతనిమీద కలబడ్డాడట. మొత్తానికి అవతలవాడి కేం అపాయం జరగలేదు.

***<u>వాడు నాకన్న తప్పతాగాడు గనుక బ్రతికాను</u>***

ఈ విషయాన్ని గురించి చెస్టర్‌టన్ తర్వాత ప్రసంగిస్తూ -

"నేను కోరడి దూకడం వగైరాలు విచిత్రంగానే కనపడచ్చు. కానీ అతడెందుకని ప్రమాద స్థితిలో పడలేదో తెలుసా! అతగాడు నాకన్నా తప్ప తాగి ఉన్నాడు. నేనెంత ఈ సవాల్ అందుకోలేదు. చచ్చు వెధవ వీడితో యుద్ధమేమిటని చక్కా వచ్చాను. లేచి ఏమాత్రం సవాల్ చేసినా వాడి తల ఎగిరిపోయింది. నా తల సంగతి తర్వాత తేలేది" అన్నాడు.

ఒకసారి చెస్టర్‌టన్ ఇంటికి ఫోను చేశాడుట. భార్య "ఎక్కడనుంచి?" అని ప్రశ్నించిందిట. అది విని "ఎక్కడ నుంచి అని ప్రశ్నిస్తున్నావా? నేనే వెర్రిఅనుకుంటే నాకంటే వెర్రిదానివి ఎక్కడనుంచి ఫోను చేస్తానింత హుషారుగా - బీర్ మార్కెట్" - అన్నాడుట సగర్వంగా.

చెస్టర్‌టన్ తన రచనలద్వారా చాలా నీతులు చెప్పాదు - చాలమందిని విమర్శించాడు కూడా!కానీ తన విషయం వచ్చేసరికి ఏదీ దాచకుండా నిజం చెప్పేవాడు. దాని వల్ల అతనికెంతో పేరు వచ్చింది.

"నే చెప్పే నీతులన్నీ ఇతురులకోసమే. నే చేసేదంతా పరోపకారమే! నా సంగతంటారా అది మీకెందుకు?" అనే పద్ధతి పెద్ద మనుష్యుల చరిత్రలు విడ్డూరంగా ఉంటాయి.

(ఫిబ్రవరి 17,'70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

***నిజం చెప్పకపోతే నిద్రపట్టదు నాకు***

ఊత పదాల్లో జాతిరత్నాలవంటి మాటలు కూడా కొన్ని ఉంటాయి. ఒక తాత ఏం మాట్లాడినా ముందు "నిజం చెప్పకపోతే నాకు నిద్రపట్టదు" అనడం మామూలు. ఊరికే అనడమే కాదు - నిజం కూడా చెప్పేసేవాడు.

ప్రక్కనున్న వాడెవడైనా తన ఆస్తిని గురించో, అధికారాన్ని గురించో కొంచెం అబద్ధం చెబితే వెంటనే ఈ తాతగారు అందుకుని "నిజం చెప్పకపోతే నాకు నిద్రపట్టదు - ఆయన జీతం ఆరువందలు కాదు. మూడు వందల యాభై" అనేసేవాడు.

ఎవరింటికైనా వెళ్ళినప్పుడు - (క్రొత్తవాళ్ళ ఇంటికి) వాళ్ళతో మాట్లాడుతూ మాట్లాడుతూ ఆ యజమానివంక చూచి "నిజం చెప్పకపోతే నాకు నిద్రపట్టదు - మీ ఇల్లు చాలా బాగుంది కానీ మీ ముఖం అంత బాగాలేదు. అసలు నాకు మీ వంక చూడాలనిపించడంలేదు గానీ, మొహమాటానికి చూస్తున్నా" అనేవాడు.

ఎవరింటికైనా పెళ్ళికి వెళ్ళినప్పుడు లగ్నం పూర్తికాకముందే పిల్లనూ, పిల్లవాణ్ణి చూచి "నిజం చెప్పకపోతే నాకు నిద్రపట్టదు. పెళ్ళి కూతురు బాగుంది కానీ పెళ్ళికొడుకు నాకేం నచ్చలా! ఈడు కుదిరినా జోడు కుదరలా? ముందుముందా అమ్మాయి చాలా విచారపడుతుంది" అనేసేవాడు.

అందుకని ఆయన్ని పెళ్ళిళ్ళు వగైరాలకు పిలవనికి సందేహించేవారు. కానీ బంధుత్వ రీత్యా తప్పేదికాదు. ఆయన ఏదో అనక మానేవాడుకాదు. ఆ ఊతపదం పుణ్యమా అంటూ బోలెడు సత్యాలు గుమ్మరిస్తూ ఉండేవాడు ప్రతినిత్యం.

***ధాతు విక్రాంతీ, ధగభగలు వాడటం తెలుసు.***

మరోకాయన ఏదేనా చెప్పాలంటే ముందుగా ఇవతలవాళ్ళ చెయ్యి గట్టిగా పట్టుకునేవాడు. కొంచెం చెప్పి "ఏం నే చెప్పేది వింటున్నావా?" అనేవాడు. "ఆ! ఆ! వింటున్నా" అనేవారు అవతలవారు.

"నేను వంకాయకూర వండవే కొరివీ అని దాంతో చెప్పి బజారు వచ్చా. వెళ్ళేసరికి ఆ మండోదరి చామదుంపలు వండి ఊరుకుంది. ఏం నేచెప్పేది వింటున్నావా?"

"నేవినకేమండి. మీ ఆవిడ వినకుండా చామదుంపలు వండిందిగాని!"

"నిజమేవండేసింది. నా జీర్ణకోశం చెడిపోవడం, అజీర్తి ప్రవేశించడం, భావన జీలకర్ర, ధాతుని క్రాంతీ దగభగలు వాడటం దానికి తెలుసుకదా! ఏం నే చెప్పేది వింటున్నారా?"

"వింటున్నానండీ.. అప్పచెప్పమంటే అంతా అప్పచెపుతా"

"అప్పుచెప్పక్కర్లా. ఆ మాత్రం శ్రద్ధవుంటే అంతే చాలు. ఆ చామదుంపలు వేసుకుని తినడమా చావగొట్టి ఇవతలకి రావడమా! ఈ ఆలోచన పడిపోయా చాలాసేపు. నువ్వాలోచిస్తున్నావేమిటి. అయితే నే చెప్పేది వినడం లేదన్నమాట'-

"విన్నానండి. వినబట్టే ఆలోచిస్తున్నా. ఒక ఆలోచనకాదు రెండు"

"ఏమిటవి?"

"మీరు చామదుంపలు తినడమా మానడమా? అనేది ఒకటి. నేను మీ దగ్గరనుండి తప్పించుకోవడమెలాగా? అనేది ఒకటి"

***దుంపకూరా.. చెంప దెబ్బలూ..***

"తప్పించుకుంటే ఎలా సొంతం విని తప్పించుకో. చివరికేం చేశానో తెలుసా!? చామ దుంపలు నా వంటికి పడవు. చెంపదెబ్బలు దాని వంటికి పడవు. అందుకని చారూ, మజ్జిగా పోసుకుని తిని మాట్లాడకుండా ఇవతలకు వచ్చేశా! దాంతో జంకిపోయి మర్నాడు ప్రొద్దున వంకాయ కూర వండేసింది"

"మరో కూర లేదుగా.. ఇంట్లో?"

"లేకపోతే తెచ్చేవాణ్ణి. తేకపోతే ఊరుకుంటుందా అలా చెప్పిన పని చెయ్యకపోతే ఊరన్నా పోతానంటుంది. ఉరన్నా పోసుకొంటానంటుంది. నే చెప్పింది వింటున్నా"-

"వింటున్నానండి. మీ తగాదాలతో నా తల మాడిపోతోంది. వెళ్ళిరానా!?"

"వెళ్ళిరా. మళ్ళీ కనిపిస్తావుగా!"

"మరి చెయ్యి వదలండి"

"వదులుతా అదెంత సేపు? ఒకసారి రేపు కనిపించు వింటున్నావా నా మాట?"

"వినకేం చేస్తానండి. చెయ్యీ, చెవ్వూ రెండూ మీ స్వాధీనమై పోయాయి. గుంజుకు పోదామంటే మొహమాటం గుండెల్లో పీటవేసుకుని కూర్చుండే చెయ్యి వదలండిక - వెళ్ళివస్తా."

ఆయనగారి చెయ్యివదిలి "ఆ వెళ్ళే ఆయన్నిట్లా కొంచెం పంపించి వెళ్ళు నే చెప్పింది వింటున్నావా?"

"చెయ్యి వదిలిన తర్వాత కూడా వినమన్నావా? చెయ్యి వదలగానే చెంపమీద పెట్టలేదు. అది ఆలోచించు" అని అతగాడు వడివడిగా నడిచిపోతాడు,

***నా కుడిమీసం తీస్తా ! నీ ఎడం మీసం తియ్యి***

ఒకాయన మాట్లాడుతూ ప్రతిదానికీ పందెం కడుతూ ఉంటాడు. ఏమిటా పందెం? అది అలా జరిగితే నా కుడిమీసం తీస్తా జరక్క పోతే నీ ఎడమ మీసం తీసేస్తావా! అని.

ఫలానా మంగమ్మ కూతురికీసారి మొగపిల్లాడు పుట్టి తీర్తాడు. పందెం వేస్తావా! నా కుడిమీసం - నీ ఎడం మీసం. ఫలానా ఆయన్ని మంత్రిగా తీసుకుంటారీ సంవత్సరం - నా కుడి మీసం - నీ ఎడం మీసం. ఫలానా ఆయన్ని మంత్రిగా తీసుకుంటారీ సంవత్సరం - నా కుడిమీసం - నీ ఎడం మీసం. ఈ పంచాయితీలు బాగుపడటం కష్టం - పార్టీలు ఎక్కువై పోతున్నాయి. నా కుడి మీసం - నీ ఎడం మీసం. ఇలా రోజుకో యాభై పందాలు వేస్తునే ఉంటాడాయన.

మొగవాళ్ళతోనే కాదు. ఆ ఉద్రేకంలో ఆడవాళ్ళతో కూడా ఇదే పందెం. "ఏం శాంతమ్మా. నీ కొడుకీసారి బి.ఏ ప్యాసయితే నా కుడి మీసం.. నీ ఎడం మీసం అనేసేవాడు."

ఆవిడ నవ్వుకుని "వెనుక జన్మలో ఎన్నో పందాలు వోడి రెండు మీసలూ వదిలేశా నాయనా. నాతో పందెం దేనికి?" అన్నదట.

ఇలాగే మీసాలు తీసేసిన ఒక చైనులుగారితో పందెం వేశాడట. ఆయనగారు "మీసాలు తీసి చాలాకాలమైంది నాయనా" అన్నాడట. దానికా పెద్దమనిషి "పందెం పందెమే అంతగా అయితే పెంచి మళ్ళా తీసెయ్యి" అని సలహా ఇచ్చాడట.

*__మీకు కొంపవస్తే చెప్పలేను__*

మా ఊళ్ళో ఒకావిడ గంటల తరబడి సోది చెపుతూ మధ్య మధ్య "మీకు కోపం వస్తే నే చెప్పలేను" అనేది. ఎదుటివాళ్ళు కొంచెం మొహమాటం లేనివాళ్ళయితే "కోపం రావడమేమిటమ్మ. వచ్చి గంట అయింది. వచ్చి కూడా ఏం చెయ్యలేకపోతున్నా" అనేవారు.

ఎవరో ఆవిణ్ణి పట్టుకుని తెగతిట్టారట - పట్టుకుంటే వదలదని. ఆమెకావార్త తెలిసింది. సరాసరి ఆయన దగ్గరికి వెళ్ళింది "మీరన్న మాటలు విన్నాను. నాకు నిజంగా కోపం వచ్చింది. మీకు కోపం వస్తే నే చెప్పలేను" అంది.

"నాక్కోపం రాకపోతే ఎందుకంటానమ్మా! నీక్కోపం మళ్ళీ పలకరించవేమో అనుకున్నా దానికి బదులు - రెండు కోపాలు (నాక్కోపం వచ్చింది మీక్కోపం వస్తే చెప్పలేను,) వెంటపెట్టుకు వచ్చావాయె! ఇంకేం చేసేది" అన్నాడు.

ఒకావిడ ఏది చెప్పినా "ఎక్కడో పాడు" అనడం అలవాటు భర్త వచ్చి ఏదో కోటో, ఉత్తరీయమో కొనుక్కొచ్చానని సంతోషంగా చెపితే "కొన్నారేమిటి? " అనేది ముఖంలోకి వెలుతురు తెచ్చుకుని.

"అవునే గజం ఆరున్నర" అనేవాడాయన, ఆ వెలుతురు దోచుకోవాలనీ, మనస్సు జాచుకోవాలనీ.

"ఆరున్నరే ఎక్కడో పాడు" అనేది.

"పాడంటా వేమిటే ఫస్ట్‌క్లాస్ పాప్‌లెన్ తెచ్చుకుంటే" అని ఆయన సంజాయిషీ

"పాప్‌లెన్ తెచ్చారు సరే. ఈ చారలేమిటి ఎక్కడో పాడు?" అని సమాధానం.

పురుషుల అందాలేమిటి ఎక్కడో పాడు

"మళ్ళీ పాడేమిటే? నీకు ఏది చేసినా పాడే, ఏది చూసినా పాడే ఇదెక్కడ దొరికిందో.. ప్రారబ్ధం కొద్దీ" అని ఆయన సణుగుడు.

"ఇప్పుడు నేనేమన్నానండీ. చారలు లేకుండా కొనుక్కోపోయారా అన్నాను. చారలని మీకు బాగుండవు. నల్లని నలుపాయె!" ఎర్రటి వాళ్ళకైతే.

"పులి వేషంలాగా ఉంటుంది. స్త్రీకి పురుషుల అందాలు తెలియాలని లేదు - భర్త అందాలు తప్ప."

"పురుషుల అందాలేమిటి? ఎక్కడో పాడు. "

"ఎక్కడో పాడట మెందుకు ఇక్కడే పాడతాలేవే. నువ్వు పాడమన్న తర్వాత తప్పుతుందా? పాడతా మన ప్రణయ గేయాలు" అని ఆయన నివేదిక.

ఇలా పాపం చాలామంది వాటి అర్థం తెలియకుండా, అవతలవాళ్ళు బాధపడుతున్నారని గ్రహించకుండా, ఊతపదాల్ని విసిరి కొడుతూ ఉంటారు. పచ్చిమిరపకాయో, అరటికాయా, వంకాయ, ఉల్లిపాయ, బంగాళాదుంప ముక్కలు లేకుండా బజ్జీలెలా ఉండవో - అలాగే వీరికి ఊతపదాలు లేకుండా వాక్యాలుండవు పాపం.

**(ఫిబ్రవరి 15,'65, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

*__పిల్లకు పదహారేళ్ళయితే 'చచ్చాం'__*

కొందరికి ప్రత్యేకించి కొన్ని ఊతపదాలుంటాయి. అవి వాడందే వాళ్ళకు మాట్లాడటం తెలియదు. ఆ ఊతపదం తీసి రెండు నిమిషాలు మాట్లాడమంటే వాళ్ళ వశంకాదు.

మా బంధువుల్లో ఒకాయన ఉన్నాడు ఆయనతో ఏది చెప్పినా 'చచ్చాం' అనేవాడు. ఆ చావడం ఎందుకో తెలియదు. పైగా 'చచ్చాను' అనే వాడు కాదు - 'చచ్చాం' అనేవాడు బహువచనంలో....

'ఇందుగో బ్రహ్మానందం మావాడికి సంబంధం కుదిరింది తెలుసా?' అని ఎవరైనా అంటే - వెంటనే 'చచ్చాం' అనేవాడు.

'మావాడికి సంబంధం కుదిరితే ఈయన చావడమేమిటా?' అని ఆ చెప్పిన పెద్దమనిషి మనస్సు చివుక్కుమనేది.

ఆ బ్రహ్మానందం అక్కడితో ఊరుకునేవాడు కాదు. పెళ్ళి కుదిరినందుకు సంతోషపడుతూనే ఉండేవాడు. వెంటనే 'ఎవరి అమ్మాయి?' అని ప్రశ్నించేవాడు.

'అమ్మాయి తండ్రి పేరు చెపితే మళ్ళీ "చచ్చాం" అంటాడేమో'నని ఆ పెద్దమనిషి తటపటాయిస్తూ 'గోవిందరావుగారు' అనడం జరుగుతుంది.

'గోవిందరావు గారైతే ఫర్వాలా గొప్పవాడే పిల్ల కెన్నేళ్ళు' అని మళ్ళీ ప్రశ్న. ఫర్వాలేదు మామూలుగానే మట్లాడుతున్నాడనే భావంతో 'పిల్లకు పదహారు దాటాయి' అనడం వెంటనే ఆ బ్రహ్మానందం 'చచ్చాం' అనడం జరిగేది. ఆ పెద్ద మనిషికి కోపం వచ్చి 'పదహారేళ్ళు దాటితే చస్తామా? ఎన్నేళ్ళుంటే బ్రతుకుతాం' అనేవాడు.

ఆ బ్రహ్మానందం 'సరేలే నీకు కోపం వచ్చిందేమిటి.. చచ్చాం' అనేవాడు.

ఇవతల పెద్దమనిషి ఇక మాట్లాడి లాభంలేదని వెళ్ళిపోయేవాడు.

***<u>వాళ్ళు వచ్చారు? అయితే చచ్చాం!</u>***

ఆయన ఇంటికి బంధువులు వెళ్ళినప్పుడు కొన్ని తమాషాలు జరిగేవి. ఒకసారి బంధువుల్లో ఒక జంటకు ఆయన రమ్మని ఎన్నో ఉత్తరాలు వ్రాశాడు. పోనీ ఇంతగా వ్రాశాడు కదా అని వారిద్దరూ వచ్చారట.

రాగానే బ్రహ్మానందం పిల్లలు చూచి వెళ్ళి ఆయనతో చెప్పారట.

వెంటనే ఆయన 'వాళ్ళు వచ్చారూ - అయితే చచ్చాం' అన్నాడట.

వచ్చిన వారది విని 'మీరు చావడం దేనికి? మేం వెళ్ళిపోతాం లెండి' అని గిరున తిరిగి బయలుదేరారట.

అది చూసి బ్రహ్మానందం పరుగెత్తి అడ్డం తగిలాడట. 'మీరు వెళ్ళవద్దు' అని బ్రతిమాలాడట.

ఆ వచ్చిన దంపతులు 'మేము రావడం వల్ల మీరు చచ్చాం అన్నారు కదా.. ఎందుకు ఉండటం వెళ్ళనీయండి' అన్నారట.

'అలా వెళ్ళడానికి వీల్లేదు. మీరు రావడం నాకెంతో సంతోషం?' అన్నాడు బ్రహ్మానందం.

'సంతోషమైతే, చచ్చాం, ఇదో తగాదా వచ్చింది?" అన్నాడట. ఇక ఆ మాటలు వినలేక ఆ జంట వెళ్ళే రిక్షా ఆపి క్షణమన్నా ఆగకుండా అందులో కూర్చున్నారట.

ఆయన కుమారుడికి ఎవరో పిల్లనివ్వడానికి వచ్చారుట. బ్రహ్మానందంతో భార్య ముందుగానే చెప్పిందట - వాళ్ళు పెళ్ళి విషయంలో వస్తున్నారు. మీరు మీ ఊతపదం వాడకండి - అది అమంగళంగా ఉంటుంది. పైగా వాళ్ళు అర్థం చేసుకోలేక మరో విధంగా అర్థం చేసుకుంటారు - అని.

బ్రహ్మానందం 'పిచ్చిదానా అలాటి సందర్భాల్లో ఎందుకంటానే' అని నవ్వుతూ బుగ్గలు రాచుకున్నాడుట. కొంతసేపట్లో పెళ్ళివారు రానేవచ్చారు. బ్రహ్మానందం ఊతపదం రాకుండా కొంచెం సేపు ప్రయత్నించాడు. భార్య సంతోషించింది - ఆయన అలా జాగ్రత్తగా ఉన్నందుకు. అందరూ కాఫీలు వగైరాలు తీసుకున్నారు.

***పెళ్ళి తర్వాత వచ్చిందీ 'చచ్చాం'***

ఒక పెళ్ళి పెద్ద 'సరే, ఇక మనం అసలు విషయంలోకి వద్దాం' అన్నాడుట.

పెళ్ళి కుమార్తె తండ్రి బ్రహ్మానందం వంక చూచి 'చూడండి! మా అమ్మాయిని మీ అబ్బాయికివ్వాలని వచ్చాం'అన్నాడుట.

బ్రహ్మానందం వెంటనే ' మీ అమ్మాయినే, చచ్చాం' అనేశాడు.

పెళ్ళివారు నిర్ఘాంతపోయారు. ఇదేమిటిలా అన్నాడా? అని.

బ్రహ్మానందం పెళ్ళాం 'బాబూ! మీరేమీ అనుకోకండి. ఆయనకదో పాడు అలవాటు. ప్రతి దానికి ఆ మాట అంటూ ఉంటారు. ఎంత చెప్పినా ఆ మట విడిచి పెట్టరు. మా పెళ్ళి అయిన క్రొత్తలో బాగానే ఉన్నారు. తర్వాతే ఈ 'చచ్చాం వచ్చి పడింది' అని తల బాదుకొంది.

పిల్లనిద్దామని వచ్చి నాయన 'అదేమిటండీ! మ పిల్లనిస్తానంటే "చచ్చాం" అంటారు. ఎవరి పిల్లనిస్తే బ్రతుకుతాడో ఆ పిల్లనే వెతుక్కుని చేసుకొమ్మనండి' అంటూ అందర్నీ తీసుకుని అక్కడినుంచి చక్కా పోయాడట.

అలా ఆయన ఆ ఊతపదం వాడుతూ అందర్నీ బాధపెడుతూ ఉంటాడు. రోజుకి ఎన్నిమాట్లు, ఆ మాట వాడుతూ ఉంటాడో చెప్పలేం -

మే మెరుగున్న ఆయన ఒకాయన ఉన్నాడు. ఆయన ప్రతిదానికి 'నీకు పిచ్చేమిటి?' అంటూ ఉంటాడు.

ఆయన 'నేను పొద్దున రైల్లో దిగా. సరాసరి రిక్షాలో వచ్చా! నీకేమన్నా పిచ్చేమిటి?' అంటాడు.

'నువ్వు రిక్షాలో రావడమేమిటి? నీకు పిచ్చేమిటి?' అని ఎదుటివాడు నిర్ఘాంతపోవడం జరుగుతుంది.

***పిచ్చి నాకు లేదు - మా అన్నయ్యకుండేది.***

ఒకాయన భోజనం చేస్తుంటే పనివేళ వెళ్ళి 'ఇప్పుడు భోజనం చేస్తున్నావా! నీకేమన్నా పిచ్చా?' అన్నాడట.

'అబ్బే అదేం లేదు. కొంచెం ఆలస్యమైందివ్వాళ' అన్నాడుట.

అని 'మరి మీ భోజనమైందా?' అన్నాడుట.

'అబ్బో గంట క్రిందే అయింది' అన్నాడు.

ఆ గృహస్థు భార్య 'పోనీ కొంచెం ఫలహారం చెయ్యండి' అందిట..

'నాకు ఆకలిలేదు. నీకేమన్నా పిచ్చా?' అని మళ్ళీ ప్రశ్న.

'ఒక ఆఫీసరుతో మాట్లాడాలని వెళ్ళి మధ్యలో ఆయనతో "నీకేమైనా పిచ్చా?" అన్నాడుట.'

ఆ ఉద్యోగస్తుడు తెల్లపోయి 'నాక్కాదండి. మా అన్నగారికి కొంచెం ఉండేది. అదైనా ఇప్పుడు లేదు. బాగానే ఉన్నాడు. కొంచెం వస్తే అమావాస్యకు వస్తుంది. మళ్ళీ విదియ తదియల్లో తగ్గిపోతుంది' అన్నాడుట.

ఉద్యోగంలో ఉన్న ఆయన కుమారుడోసారి వచ్చి 'నాన్న నా భార్యను తీసుకుపోతాను' అన్నాడుట.

'వెంటనే ఆయన నీకేమన్నా పిచ్చా?'అన్నాడుట.

'పిచ్చేమిటి? హోటల్ తిండి తినలేక చచ్చిపోతుంటే - అయినా నా భార్యను నేను తీసుకుపోవడం పిచ్చేమిటి? ' అన్నాడుట.

'నాతో వాదిస్తావు నీకేమన్నా పిచ్చా? ఇదివరకే తీసుకెళ్ళవలసింది. ఇంతకాలం ఆగావు' అన్నాడు.

'అయితే రాత్రి రైల్లో బయలుదేరతాం?' అన్నాడు కుమారుడు.

'నీకేం పిచ్చేమిటి? రాత్రి బస్సులు బోలెడు పడితే... వంటరిగా వెళ్ళేవాళ్ళకు రైలుగాని, భార్యతో వెళ్ళేవాళ్ళకు బస్సులే నయం' అన్నాడట.

ఇలా అందర్నీ 'పిచ్చేమిటి?' అనడం ఆయనకో పిచ్చి పాపం.

(జూన్ 3,'65, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**లండన్‌లో స్థూలకాయం గల స్త్రీల సమాజం ఒకటి ఉంది.** దానిపేరు లావుపాటి లావణ్యవతుల సంఘం. దీనిలో సభ్యత్వానికి గల నిబంధనలలో ముఖ్యమైంది -నడుం చుట్టుకొలత నలభై రెండు అంగుళాలుండాలనేది.

అంతకు తక్కువ నడుంగల వారికి సభ్యత్వ అభ్యర్థనలు త్రిప్పి పంపివేశారు. చుట్టుకొలత పెరిగిన తర్వాత మళ్ళీ పెట్టుకోండి అర్జీలు అని వ్రాసి పంపుతారట.

అయినా వారికి సభ్యత్వం తక్కువా? ఇప్పటికే లక్షమంది నలభై రెండు అంగుళాల చుట్టుకొలతలగల నారీమణులు సభ్యులుగా చేరారు.

వారంతా ఒక్కచోట చేరితే ఎంత ఆనందంగా ఉంటుంది? మధ్య ఒక్క డొక్కు పీచు కనిపించదు. అలాటివారు చూస్తే నిజంగా ఈ నిండు విగ్రహాలకు దిష్టికొడుతుంది కూడా!

***<u>అమిత దేహధారిణులు</u>***

నిజానికి ఇంగ్లాండులో ఇలాటి అమిత దేహ ధారిణుల సంఖ్య అధిక మనిపిస్తోంది. ఇటీవల వేసిన అంచనాలను బట్టి ఏడులక్షల మంది ఈ తెగకు చెందిన వారుంటారని తెలిసింది.

ఈవ్ కోల్సు అనే ఆవిడ ఈ లావుపాటి లావణ్యవతుల సంఘాన్ని స్థాపించింది. "స్త్రీ అందంగా, ఆకర్షణీయంగా ఉండాలంటే ఒక్క పేరులాగా ఉండవలసిన అవసరం లేదు. లావుపాటి స్త్రీలలో అంతులేని లావణ్యం ఉంది. పెరిగిన వారి కండల్లో ఎంతో నిండుతనం ఉంది" అని ఈవిడ వాదం.

స్థూలకాయాల్ని చూచి చాలామంది వారు స్థబ్దులుగా ఉంటారనుకుంటారు. కానీ ఇది నిజంకాదు. వారిలో ఎంతో ఉత్సాహం ఉంది. మురిసి మురిపించే ముగ్ధమోహన మూర్తులు కావాలని పురుషులు కోరుతూ ఉంటారు. ఆ సుగుణాలన్నీ స్థూలకాయులైన వనితలో కొల్లలు.

***<u>ముడిచేసిన గొడుగులు.</u>***

"సన్నగా, ముడిచేసిన గొడుగులాగా, మూల పెటిన చేతికర్రలాగా ఉండే భార్యలతో కాపురం చేసే భర్తల్ని చూస్తే నాకెంతో జాలివేస్తుంది. అలాటి భార్యల్లో అందం ఏం ఉంటుంది వట్టి బొమికల చుట్టలు. రెండు రొట్టెలు పెడితే అరక్క కొట్టుకుంటారు. లావుపాటివాళ్ళు కడుపునిండా తింటారు - కమ్మగా నవ్వుతారు. జీవితం హాయిగా గడపడం వాళ్ళకు బాగా తెలుసు -" అని ఆ వ్యవస్థాపకురాలి వాదన.

ఈ సంఘంలో ఇర్నీ లైబర్ అనే ఆమె ఉంది. ఈమె నడుం చుట్టు కొలత ఆరు అంగుళాలట. సంఘ నిబంధనలను మించిన నడుము. ఈవిడ చేత సుష్టుగా తినిపించడం భర్తకి ఎంతో ఇష్టంట.

***ఎంత బలిసినా సిద్ధం***

భరించేవాడు భర్త అని నిర్వచనం కానీ ఇర్నీ భర్త ఆమె ఎంత బలిసినా భరించడానికి సిద్ధపడ్డ త్యాగమూర్తి! ఆమె ఐస్‌క్రీమ్ కేకులు, బన్‌లు చప్పరించి కుక్షిలోకి రవాణా చేస్తుంటే భర్త డాన్ ముఖం మైదానంలో వెన్నెల పడ్డట్లవుతుంది.

నిత్య నైవేద్యాలతో పాటు అనవసర నైవేద్యాలెన్నో సమర్పించి ఈ పురుష పుంగవుడు - ఎంత ఆనందించడం తన హృద్య నౌకకు లంగరు వేసి ఆ బంగారు బుట్టవద్ద నిలిపివేయడం జరుగుతూ ఉంటుందట. డాన్ భూతదయ కొనియాడతగింది. అలికి అన్నం పెట్టడమే అబ్బరంగా భావించేవారికి డాన్ గొప్ప గుణపాఠం.

మా బంధువుల్లో ఒకావిడ చాలా లావుగా ఉండేది. కానీ పైన చెప్పిన లావుపాటి లావణ్యవతుల వ్యవస్థాపకురాలు చెప్పినట్లే - ఎంతో కులాసాగా ఉండేది. లావు తనకేమీ అడ్డం రావడంలేదనీ, అందరిలో ఉండే చలాకీ తనలోనూ ఉన్నదనీ, రుజువు చేసుకోవడం కోసం ఎంతో తాపత్రయపడ్డది. భర్త 'ఇదుగో లతా! కొంచెం కాఫీ తీసుకురా. క్షణంలో రావాలి' అంటే - 'అలాగే రెండు నిముషాలు' అంటూ చలాకీగా గిరుక్కున తిరగడానికి ప్రయత్నించేది.

***జడలోనే విసురు***

ప్రయత్నంలో విసురేగాని నిజంగా ఆవిడ తిరిగి వెళ్ళడానికి, రైలు ఇంజను వెనక్కి త్రిప్పినంత పనీ అయ్యేది. ఎలాగో తంటాలుపడి వెళ్ళిన తర్వాత భర్త ఆమె వెళ్ళిన దర్వాజా వైపు చూసి "పిచ్చిపిల్ల" అనుకునేవాడు. ఆ 'పిచ్చి పిల్లకు ఆయన ఏర్పరచుకున్న అర్థం ఇంకొకరికి తెలియదు."

పాపమావిడ కాఫీ తీసుకుని వచ్చేది. మరి ఆ రావడం విసురుగా ఉండాలని ఆవిడ అభిప్రాయం కానీ శరీరం అంత తేలిగ్గా చెప్పిన మాట వినకపోవడంవల్ల - మెడ విసురుతూ కొంగు ముందుకు వేస్తూ, జడముందుకు వేస్తూ కొంత చైతన్యం ప్రదర్శించేది.

అలావచ్చి కాఫీ కప్పు చేతికి అందీయగానే ఆ ప్రాణవల్లభుడు ఒక్కసారి ఆవిడ కళ్ళలోకి తొంగి చూసి "పిచ్చిపిల్లా" అనేవాడు. ఆవిడ చిరునవ్వు నవ్వేది. ఆవిధంగా ఇద్దరి మధ్యా పుచ్చపువ్వుల వెన్నెల కురిసేది.

వాళ్ళకు మురిపెంగానే ఉండేది. కానీ ఆ కులుకులు వగైరాలు చూచిన ఇతరులు మాత్రం - ఆ బుట్టబొమ్మకీ, ఈ తొట్టిస్నానం మొగవాడికి సరిపోయింది. ఈ పిచ్చిబాగులవాడు ఆవిణ్ణి పిచ్చిపిల్ల అంటాడేం విడ్డూరమో - అనుకునేవారు.

లావుపాటి లావణ్యవతుల సంఘం అమెరికాలో కూడా స్థాపించాలనే అపేక్ష కొందరికి కలిగిందిట. అక్కడ ఈ సంఘం విజయవంతం కాదని లండనులోని వనితలు అభిప్రాయ పడుతున్నారు.

***లావుపాటి లావణ్యవతులు***

అమెరికన్ వనితలకు తిండి సరిగ్గా తినడం చేతకాదుట. ఆచి, ఆచి, తూచి, తూచి తింటారట. వారికి శరీరాలా పెరుగుతాయి. గజం స్థలంలో పదిహేనుమంది నిలిచేలాగా ఉంటారుట. అందువల్ల లావుపాటి లావణ్యవతుల శాఖ అక్కడ స్థాపించే అవకాశాలు ఉండవని వీరి అభిప్రాయం. ఏమైనా కానియ్యండి లావుపాటి స్త్రీల సంఘం అందిస్తున్న సత్యాలు ఎంతో చక్కగా ఉన్నాయి. "తినండి - పెరగండి" అనేదే ఈ సంస్థ ముఖ్య సందేశమట.

లావుపాటి లావణ్యవతుల సంస్థ వర్ధిల్లుగాక.

(జూలై ౨౨,'71, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

***భాషలో బఠానీలు మరమరాలు***

సంస్కృత వాక్యాలు బఠానీలలాగా ఉన్నాయంటే - ఇదంత పుష్టి సరిగా లేకపోతే సరి. అలాంటప్పుడు ఆ రచనల జోలికే వెళ్ళకూడదు. మెత్తటి మరమరాలే నమిలితే మంచిది అంటారు పండితులు. సంస్కృతం వాడటాన్ని గురించి కాదు - నేను పేర్కొనేది.. పాళ్ళు కలవడాన్ని గురించి మాత్రమే.

కొందరి రచనలో వ్యంగ్యం పాళ్ళు ఎక్కువగా కనిపిస్తూ ఉంటాయి. వారికి అందులో ఆనందం ఎక్కువ. వ్యంగ్య రచన చాలా గొప్పది గనుక దాన్ని సంతోషంతో స్వీకరిస్తారు పాఠకులు.

కొందరి రచనల్లో హాస్యం పాళ్ళు ఎక్కువ. అలాటి రచనలు ఐస్ క్రీమ్‌లాగా ఫ్రూట్‌సాలిడ్‌లాగా ఆరగించడం జరుగుతూ ఉంటుంది. మొన్న ఒకాయన తన ఇంట్లో బీరువాలో ఉన్న ఓ పుస్తకాల వరుస చూపించి అవన్నీ ఉడ్‌హౌస్ డిషెస్ అన్నాడు. ఆ ఉపమానం నన్నెంతో అలరించింది.

మరి కొందరి రచనలలో హేళన ఎక్కువగా కనిపిస్తుంది. ప్రపంచంలో ప్రతి వస్తువూ, ప్రతివ్యక్తీ వారికి చులకనగా కనిపిస్తారు కాబోలు. అలా అవహేళనకు దిగుతూ ఉంటారు. అలాటివారిని గురించి ప్రస్తావిస్తూ మొన్న ఒకాయన అన్నారు. అది ఒకరకమైన మానియా - దానికి మందు ఒక్కటే - అలాటి హేళనలు చేసి, అవతలివారిచేత అక్షితలు వేయించుకోవడమే అని.

అవహేళనలో కూడా స్థాయిలున్నాయి. కొందరు అతి సున్నితంగా పట్టుదారాలలాగా వదులుతూ ఉంటారా వాక్యాల్ని. కొందరు దాన్ని కంబరతాడులాగా పేని వదులుతారు. ఎదుట హృదయానికి రాచుకుని పుండు పడాలని వారి సంకల్పం.

***సుగంధపు పాళ్ళు. సెంటెడ్ లైన్లు.***

కొందరు వ్రాస్తే - ఏదో పరిమళం గుబాళిస్తూ ఉంటుంది. ఆత్మను ఉత్తేజపరుస్తుంది. భాషలో ఉండే సుగంధపు పాళ్ళు వారికి బాగా తెలుసు. వారు వ్రాసే వ్యాసాలు కానివ్వండి - మరేమన్నా కానివ్వండి. నాకుమల్లే వ్రాయగల వాళ్ళు మరొకళ్ళను చూపించండి అని ఛాలెంజ్ చేసినట్లుంటుంది. ఒకసారి చదివి చూడండి ఆ ఘాటు. అని ఒకాయన తన వ్యాసాన్ని గురించి చెప్పాడు -

వెనుకటికి శ్రీ పింగళి నాగేంద్రరావు గారు ఒక సినిమా పాతలో ఎంత ఘాటు ప్రేమయో అని వ్రాశారు. ఆ ఘాటు చాలాదూరం కొట్టింది. ప్రేమలో ఉన్న చల్లదనాన్ని, వెల్లదనాన్ని వెనక్కు నెట్టింది.

***బాటం నుంచి త్రవ్వి పోశాను***

విమర్శ దృష్ట్యా - ఒకవిధమైన దూషణతో కూడిన రచనలు కొందరు సాగిస్తూ ఉంటారు. మృదువుగా చెప్పడం అసలు అలాటివారి మతం కాదు "బాటం నుంచి ఎత్తి అవతల పారేశాను. తర్వాత వాళ్ళేమన్నా ఏడ్చుకోనీ" అని ధీమాగా చెపుతు ఉంటారు కూడా.

వెనుకటికి ఒక రచయిత తను వ్రాసిన వ్యాసం ఒక సంపాదక మహాశయుని వద్దకు తీసుకుపోయి.. "నా వ్యాసం మీరు తప్పకుండా ప్రచురించాలి" అన్నాడుట. సంపాదకులు "అలాగే ప్రయత్నిస్తాను" అన్నాడుట.

వ్యాసకర్తకు ఆ మాట తృప్తికరంగా తోచలేదు. చూడటం కాదు - మీరు సందేహించక్కరలేదు. మీ పత్రిక్కి మంచి పేరు వస్తుంది అన్నాడుట.

''అలా వాయిదా వెయ్యకండి. దీన్నిండా అగ్గి కూరి తెచ్చాను. మీరు పరధ్యానంగా చిత్తు కాగితాల బుట్టలో పారేస్తారేమో? '' అన్నాడుట.

సంపాదకునికి ఓపిక తగ్గింది. అలాగా. ''మీరు దీని నిండా అగ్గి కూరారా! అలా అయితే చిత్తు కాగితాల బుట్టలో వెయ్యను. దీనినిండా అగ్గివుంది గనుక దీన్ని అగ్గిలోనే పడేస్తాను'' అని చెప్పాడుట.

రచయితలు తమ అభిలాషను బట్టి అలాటి పాళ్ళు కలుపుతూ ఉంటారు. కొందరు ప్రజలకు నచ్చడం కోసం కొన్ని ప్రత్యేకమైన దినుసుల పాళ్ళు కలుపుతూ ఉంటారు - ఆ రచనలకు ఏదో ఒకవిధమైన 'లేబుల్' అతికిస్తూ ఉంటారు - వాటిద్వారా పేరు సంపాదిస్తూ ఉంటారు.

రాజకీయ వాసన గలవారు కలం తీసుకుంటే - దేశప్రగతి, అభ్యుదయం, సమిష్టి జీవనం, స్వయం సమృద్ధి, విద్య, వ్యవసాయం, పారిశ్రామికాభివృద్ధి, సమత, మమత - ఇత్యాది మాటలను సమయోచితంగా కాకపోయినా, సమాజం కోసం వెదజల్లుతూ ఉంటారు మధ్య మధ్య. కొంతకాలం అవి వేపుడు జీడిపప్పుల లాగా రుచి కల్పించినా - రానురాను మెత్తపడిపోతాయి. అప్పుడప్పుడు వేపుడూ మాడిపోతూ ఉంటుంది

ఆధునిక కవనాలలో కూడా చాలారకాల భావాల్ని వాళ్ళు కలుపుతున్నారు. క్రొత్త ఉపమానాలు, క్రొత్త భావనలు - కొత్త చందస్సు.. పాత ఓజస్సు కలబోసి ఒక కమ్మని శైలి సృష్టిస్తున్నారు - అన్నీ క్రొత్తరకపు పూలగుత్తులే. వారి వారి ప్రతిభను బట్టి పరిమళాలు లభ్యమవుతూ ఉంటాయి.

***<u>ప్రేమకథల్లో - థీమా వాక్యాలు</u>***

చెప్పుకోతగ్గ విషయమేమంటే - ఈనాటి ప్రేమలేఖల్లో అనుకోకుండా మాత్రం కాదు - కావాలనే ఆకాంక్షతోనే - రాజకీయాలు దొర్లుతున్నాయట విరివిగా. నీ ప్రేమ - నా ప్రేమ - ప్రణయ జీవనం - హృదయ సమ్మేళనం - ఇత్యాది పదాలు తగ్గి దేశ సేవలో ముందడుగు. ఆర్థిక దుర్భిక్షంలో పోరాటం. నవయుగ వైతాళిక గీతాలు వల్లించడంలో గొంతులు కలపడం (మనస్సులు కలపడం మాట అలా ఉందనివ్వండి) ధారణలో పాల్గొనడానికి దాంపత్య శిక్షణ అవసరమైనప్పుడు సమ్మెలకు సహకారం ఇత్యాది విషయాలమీద లేఖలో ముందుగా చర్చించుకోవడం జరుగుతుందట - ఈ పాళ్ళు ప్రేమ లేఖలకు పన్నీటి జల్లులుగా మారుతున్నాయట.

ఏది ఎలా వున్నా రచనలలో చక్కటి వాతావరణం కోసం - చందమామను, చల్లగాలిని, మల్లెపూవును, మాలతీలతల్ని, కోయిల జతల్ని, హంస నడకల్ని - అందాల తెలిమబ్బుల్ని జలతారు అంచుల్ని వెన్నెల మడతల్ని - ఉపయోగించి ఉత్సాహంతో ముందుకు సాగిపోయేవారు ఉన్నారు. -

ఎవరి పాళ్ళు వారివి - ఎవరి గళ్ళు వారివి - ఎవరి అభిరుచులు వారివి.

**రేడియోలలో ప్రకటనలు వచ్చిన** తర్వాత, కొంత వినోదం, విలక్షణం కూడా ఏర్పడిందనేమాట సత్యం. అసలు ఫిలిం సంగీతమే చాలా తమాషా ఘట్టాలు కల్పిస్తోంది సంసారాలలో.

సాయంత్రం పూట భర్త ఇంటికి రాగానే ఆవిడ వంటింట్లో ఉన్నా, దొడ్లో ఉన్నా తెల్ల చీర కట్టిందెవరికోసమూ? మల్లెపూలు ముట్టిందెవరికోసమూ'' అంటూ పాట వినిపించగానే ఆయనగారు పాదరక్షలు విప్పకుండానే పదిక్షణాలు దిగ్భ్రాంతి చెందడం తటస్తిస్తూ ఉంటుంది.

*"మీ బట్టలు నల్లగా ఉన్నాయా.. అయితే"*

ఆయన దుస్తులు ధరించి ఆఫీసుకు ప్రయాణమయ్యే సమయంలో బట్టలు నల్లగా ఉన్నాయా? ఫలానా సబ్బు, లేదా సబ్బుపొడి వాడండి" అని రేడియో హెచ్చరించడం జరుగుతుంది.

అంతవరకూ ఆ విషయాన్ని మరిచిపోయిన ఇల్లాలు "అన్నట్లు మీకు చెప్పడం మరిచిపోయాను. అది తీసుకురండి సాయంత్రం. లేదా మధ్యాహ్నం ఫలహారానికి బంట్రోతును పంపుతారుగా అతని చేతికిచ్చిపంపించండి. ఎంతో పుణ్యం ఉంటుంది" అని చెప్పడం.

ఈ హెచ్చరిక నా మచ్చ మాసింది. జ్ఞాపకం ఉన్న వస్తువులు తేవడానికే జీతం చాలడంలేదు. జీవితంలో శక్తి మిగలడం లేదు. రేడియోలో ముప్పొద్దులా జ్ఞాపకం చేస్తూంటే ఇంక కాపురం చేసినట్లే అంటూ ఆయనగారు బస్సు దాకా సణుక్కుంటూ వెళ్ళడం జరుగుతూ ఉంటుంది.

ప్రొద్దుటిపూటా, సందెవేళా సామాన్యంగా ఇల్లాళ్ళు ఇంటిపనుల్లో పడి సతమవుతూ ఉంటారు. పిల్లల్ని సర్దుకునేందుకు, అవకాశందక్కదు. అందువల్ల "గిజనీ వేళలు" అనేవారు.

*పని అయిన తర్వాత ఏడవండిరా బాబు.*

ఇప్పుడు కూడా ఆ సమయాలలో పిల్లలు తల్లిదండ్రుల్ని వేధిస్తూనే ఉంటారు. ఏదో కారణం పెట్టుకుని ఏడ్పు సాగిస్తూనే ఉంటారు. "కొంచెం నా పనులు అయిన తరువాత ఏడవండిరా. మాతృహృదయం బయటపెడతాను" అని తల్లి కోరినా మాత్రం వాళ్ళు ఊరుకుంటారా!

అవతల అర్ధాంగి పదవి నిర్వహించాలి - ఇవతల తొమ్మిదింటిలోగా ఆహార సమస్యలు తొమ్మిదింటిలోగా ఆహార సమస్యలు పరిష్కరించాలి. అప్పుడే ఆహార సమస్య కూడా వస్తూంది. భర్త గదిలోంచి "ఏ షర్టు వేసుకోమన్నావు!" అని కేక. సావిట్లో ఆడపిల్ల కుర్చీలో కూర్చుని "నాకు పరికిణీ జాకెట్ తీసి బయట పెట్ట"మని కేక. మగపిల్లవాడు "అమ్మా ఇట్లా వచ్చి దబ్బున లాగూకు బొందు పెట్టవే నాకు చేతకావడంలేదని ఏడుపు.

దొడ్లోనుంచి పనిమనిషి "చింతపండు కాస్తా! సీకాయపొడుం కాస్తా వెయ్యండి. బట్టల సబ్బు బయట పెట్టండి. ఉతికే వేవైనా ఉంటే ఇలా పడెయ్యండి. నేను పక్కింటికి వెళ్ళాలి. పదిదాటితే ఎవరూ ఉండరు" అని అరుపులు.

తెలియకుండా వచ్చి వెనకనుంచి "మీ ఇంట్లో ఏ పప్పు ఉన్నాసరే. ఒక సోలెడు బదులివ్వండి. ఎల్లుండి తెచ్చి ఇస్తాం. కాఫీ కప్పుపంచదార కూడా ఇవ్వండి. ఇది సాయంత్రం ఇచ్చేస్తాం" అని పక్క భాగంలో ఆవిడ అభ్యర్థనలు.

*ఎందుకు పిల్లల్ని ఏడిపిస్తారు? ఆ ద్రావకం పోయండి.*

ఇలాంటి పరిస్థితుల్లో కొంప గందరగోళంగా ఉండకేం చేస్తుంది. ఇంతలో ఏదో తగవులో పడి పిల్లలు కొట్టుకోవడం, తండ్రి తిట్టిపోయడం. కొంచెం ఘటికుడైతే వాళ్ళ వీపుమీద తాషా వాయించడం, వాళ్ళు పాటకచేరీ ప్రారంభించడం జరుగుతుంది.

ఆ సమయంలో రేడియోలో నుంచి "ఎందుకూ పిల్లల్ని అలా ఏడిపిస్తారు" వారికి వెంటనే ఫలానా ద్రావకం ఇవ్వండి. అది ఏడ్పును వెంటనే ఆపుతుంది. అంతే కాదు. ఎంతో బలాన్నీ ఉత్సాహాన్నీ ఇస్తుంది" అని సలహా ఇస్తుంది.

"స్టవ్ మీద పులుసు ఇంకా పొంగురాలేదు. తొమ్మిందింపావు దాటిపోతుంది. ఆయన నెక్ టై బిగించి, అద్దం ముందు నుంచుని అందాలు దిద్దుకుంటున్నారు. మధ్యలో వాళ్ళకేం ద్రావకం తయారుచేసి పొయ్యగలను. తాగితే మాత్రం ఉరుకొంటారా? మరింత బలం వచ్చి తన్నుకుంటారు. పిల్లలకు అవీ ఇవీ పొయ్యిమంటారుగాని - ఇలా అష్టావధానం చేసే తల్లులకేం సలహాలు చెప్పరేం?" అని ఇల్లాలు వంటింట్లో స్వగతం చెపుతూ ఉంటుంది.

*ఫలానా చిత్రం చూడండి... నేడే చూడండి.*

ఒకసారి బంధువుల ఇంటికి వెళ్ళాను. ఆయన తన పిల్లలకు కాలేజీలో సీట్ల ప్రయత్నాన్ని గురించి చెపుతున్నారు. ఎంతో దిగులు పడిపోయాడు పాపమా గృహస్తు. సీటురాలేదనే ఆదుర్దాయేగానీ, వస్తే ముగ్గురు పిల్లలకూ వెరశి మొత్తం తొమ్మిది వందలు చేత్తో పుచ్చుకుంటే వాళ్ళను సీట్లలో కుర్చోపెట్టి రావడం వరకూ జరుగుతుంది. తర్వాత గతి తర్వాత అంటున్నాడు.

ఇంతలో రేడియోలో నుంచి 'ఫలనా చిత్రం చూడండి. అద్భుతమైన కత్తిసాములు, ఆకర్షణీయమైన సంగీతం తప్పక చూడండి' అని ఆహ్వానం వినిపించింది. ఆయనగారికి పాపం ఎక్కడలేని కోపం వచ్చింది. "చూశాంలేవయ్యా పదహారు రూపాయలు వదిలినాయి. చిన్నవాడికి ఒక జత స్కూల్‌డ్రస్ వచ్చేది."

ఏదో ఫ్రీ టిక్కెట్టు ఇచ్చి, రానూపోనూ కారు ఏర్పాటు చేసినట్లు పిలుస్తావు? రోడ్లమీద ఆహ్వానాలతోనే సతమతమవుతుంటే - సావిట్లో ఆహ్వానాలు కూడాను. వెళ్ళాలనుకున్నవాళ్ళు వెళ్ళలేదా - తెలుసుకోలేరా!. ఎవళ్ళ బ్రతుకులు వాళ్ళను బ్రతకనియ్యక హెచ్చరికలు కూడాను" అని రేడియో కట్టేసి చక్కావచ్చాడు.

*మహావిష్ణువు అడ్డుపడవలసిందే - మందులుకాదు*

రోజురోజుకీ తలకెక్కి పిండికొట్టే సమస్యలు తీరక ఆలోచనాశక్తి నశించి తలదిమ్మెక్కి తరుణోపాయంతోచక ఇళ్ళల్లోవాళ్ళు అవస్థపడుతుంటే "మీరు శిరోభారంతో బాధపడుతున్నారా! వద్దు వద్దు ఫలానా మందు వాడండి. క్షణంలో తగ్గిపోతుంది" మీ మొఖం లక్షణంగా ఉంటుంది" ఆ సలహా రేడియోద్వారా!

"మహానుభావా! ఆ మందులతో తగ్గేదిమ్మ కాదయ్యా ఇది. ఇది అనుభవించి తీరవలసిన దిమ్మే. ఏ మహావిష్ణువో అడ్డంపడాలిగాని మందులు అడ్డంపడలేవయ్యా" అని ఇంట్లోవారి సమాధానం.

రేడియో ప్రసారం విశేషాలు కల్పించే తమాషాలు మరోసారి వివరిస్తా వీలైతే.

(సెప్టెంబర్ 12,'71, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**కొద్ది మాటలతో - తప్పించుకునే** స్వభావాన్ని గురించి క్రిందటి వ్యాసంలో కొంతవరకు వ్రాశాను. పెద్దగా జవాబు చెప్పడంలో కొంత బాధ ఉందనే కారణం చేతనే చాలామంది ఇలా తప్పించుకుంటూ ఉంటారు.

కొందరు ఎక్కడికైనా వెడుతూ వెడుతూ, వెళ్ళేచోటు చెప్పడం లేక, పనిని గురించి తెలియచేయడం అంతకన్నా ఇష్టంలేక "ఇప్పుడే వస్తా" అని చెప్పి చక్కా పోతూ ఉంటారు. ఆ ఇప్పుడే ఎన్ని గంటలైనా అనవొచ్చు - ఆ వెళ్ళేది ఎంత దూరమైనా కావచ్చు.

దీనికి బదులు ఫలానా చోటికి వెడుతున్నాను. ఎంతసేపటికి వస్తానో చెప్పలేను - అని స్పష్టంగా చెపితే బాగుండును. అలా చెప్పరు. ఇవతల వాళ్ళు ఎదురు చూస్తే మాత్రం వాళ్ళకు లెక్కేమిటి? సందెవేళ ఇప్పుడే వస్తానన్నవాడు - అర్ధరాత్రివేళ వచ్చినా ఆశ్చర్యపడవలసినదేమీలేదు.

*'ఇప్పుడే వస్తా' ... ఆ ఇప్పుడు ఎప్పుడో!*

ఒక్కొక్కప్పుడు ఇద్దరు ముగ్గురు మిత్రులు కూర్చుని ఏదో మాటాడుతున్నప్పుడు - అందులో ఒక ప్రబుద్ధుడు చివాలున లేచి" ఇప్పుడే వస్తా" నని బయలుదేరి వెడతాడు. ఏ సిగరెట్లో తెచ్చుకుంటాడు కాబోలు ననిపిస్తుంది. గంటసేపు చూసినా రాడు -

"అయ్యో! అతడు రాకుండా వెళ్ళడమెలా" అని తక్కినవాళ్ళు మర్యాద ఆలోచించి, మరికొంతసేపు అనవసరంగా కూడా కూర్చుంటారు. చివరకు విసుగు పుట్టి చక్కా పోతారు. 'ఇప్పుడే వస్తా' నన్న వ్యక్తి ఆ మరునాడో, మూడోనాడో కనిపించడం తటస్థించినప్పుడు చిరునవ్వుతో ఇలా చెపుతాడు -

"మీ దగ్గిరినుంచి బయలుదేరానా! పదినిముషాల్లో వచ్చేద్దామనుకున్నా. కానీ ఇంతలో ఒక మిత్రుడు కనిపించాడు. గంటదాకా వదల్లేదు. మిత్రులు కని పెట్టుకుని ఉంటారని చెప్పినా 'ఫర్వాలేదులే నీతో మాట్లాడాలి - అని లాక్కుపోయాడు. అక్కడే చాల ప్రొద్దుపోయింది.. సారీ" అంటాడు.

అప్పుడు ఏమంటే మాత్రం చేసేది ఏం ఉంటుంది.

ఇకముందెప్పుడైనా 'ఇప్పుడే వస్తా'నని చెప్పినప్పుడూ అతని కోసం ఎదురు చూడకుండా పెందరాళే ఇళ్ళకు చేరవచ్చుననే భావం ఏర్పడుతుంది అంతే. చాలామంది కుర్రవాళ్ళు స్కూలునుంచి ఇంటికి రాగానే పుస్తకాలోబల్లమీద పడేసి - కాళ్ళూ చేతులూ కూడా కడుక్కోకుండా "ఇప్పుడే వస్తా"నని చెప్పి బయటకు వెళ్ళడం జరుగుతూ ఉంటుంది.

***'ఇప్పుడే వస్తా' తమాషాలో ఎన్నో అర్థాలు***

దీనికి అర్థం - వీధిమూలలో ఏ క్లాసుమేటో ఉండి ఉంటం కావచ్చు. ఏ క్రికెట్ ఆటకో వస్తానని చెప్పి టైంకాక ముందు హడావుడిగా పరుగెత్తడం కావచ్చు. సినిమాకు వస్తానని వాగ్దానం చేసినవాడు ప్రయాణానికి ఎంతవరకు సిద్ధంగా ఉన్నాడో చూచి రావడానికి పడే ఆదుర్దాకావచ్చు... "ఇప్పుడేవస్తా"లో అన్ని అర్థాలు నిండి ఉంటాయి.

చాలామందికి ఈ "ఇప్పుడే వస్తా" చిట్కా తెలుసు. ఇది పనిచేసినట్లు మరొకటి పని చెయ్యదని వారు చాలా తమాషాగా సమయానికి వాడి తప్పించుకుంటూ ఉంటారు. కొంచెం ఏదైనా పని చెపుతామని వాసన పట్టినప్పుడు ఎంతో విధేయత ప్రకటిస్తూ, "ఇప్పుడే వస్తా ఎంతోసేపు పట్టదు - అయిదు నిమిషాలు మీరు ఇంట్లోనే ఉంటారుగా వచ్చేస్తా"నని దూసుకుపోతూ ఉంటారు - "నాకు పని చెప్పడానికి నువ్వెవరవోయి" అని ముఖం మీద అనలేక

కొందరు ఏదైనా మాట చెపితే - "సరే చూస్తా" అంటూ ఉంటారు. చూస్తానంటే ఎంతో నమ్మకం కుదురుతుంది. ఆ విశ్వాసంతో మరో ప్రయత్నం చెయ్యకుండా మందమతిగా ఊరుకోవడం సంభవిస్తుంది. కొన్నాళ్ళు గడిచిన తర్వాత - మళ్ళీ ఆ వ్యక్తి దగ్గరికి వెళ్ళి జ్ఞాపకం చేస్తే

"అవునవును జ్ఞాపకం ఉంది, ఆ విషయాన్నే ఆలోచిస్తున్నా త్వరలోనే చూస్తా మరిచిపోలేదు" అంటాడు. అలా "చూస్తాం" దొంతరల పేర్చుకుంటూ పోవడమే గానీ - చూడటం మనకేమాత్రం కనిపించదు. ఆ విషయం తేలేదాకా ఇవతల వ్యక్తి ఆకాశం వంక చుస్తూ నిలబడవలసిందే - చివరకు శూన్యాన్ని వరించవలసిందే?

***'చూస్తా' - ఈ చూస్తాలతో కుస్తీలు***

ముఖ్యంగా ఈ "చూస్తాలు" ఒకరిని డబ్బు అప్పు అడిగినప్పుడో - ఏదైనా ఉద్యోగం ఇప్పించమని అడిగినప్పుడో - ఎక్కువగా ఉపయోగించబడుతూ ఉంటాయి. ఈ 'చూస్తాల' పైన ఆశపెట్టుకుని ఇవతల వ్యక్తులు కాలంతో కుస్తీ పడుతూ ఉండవలసిందే పాపం.

తను ఇబ్బందిని గురించి కొంచెం చెప్పుకుందామని వెడుతూ ఉంటారు అభ్యర్థులు. ఎంతో భయపడుతూనే అంటారు "మీరా చూచేది.. కొంచెం త్వరగా చూస్తే ఎంతో ఉపకారం చేసినవారవుతారు. మీ మేలు ఎంతమాత్రం - మరువం" అని.

దానితో అవతల పెద్ద మనిషికి ఎక్కడ లేని కోపం వస్తుంది. "ఒకసారి చూస్తానన్న తర్వాత మళ్ళీ అందులో లోపం ఉంటుందనుకోవడం మీ పొరపాటు. చూస్తానంటే చూడటమే. ఈ చూడటంలో మెల్లకన్నేంలేదు. "

"ఇంకో సంగతి మరచిపోతున్నారు మీరు. నేను చూడటం ఒక్క దానితోనే సరిపోదు. మీ అదృష్టం కూడా కొంతవరకు కలిసిరావాలి. అప్పుడు నే చూస్తానన్నది శుభప్రదం జయప్రదం కావడం" అంటాడాయన కొంచెం ధీమా ప్రకటిస్తూ. అవతల వ్యక్తి "అవునులెండి. మీరేం చేస్తారు, మా ఖర్మం అలా ఉంటే" అనే దాకా తీసుకువస్తాడా చూస్తానన్న మనిషి.

***<u>చూస్తా.. కొంచెం తీరుబడిగా చూస్తా..</u>***

నా చిన్నతనంలో ఏదైనా పద్యం వ్రాసి ఏ పండితుడి వద్దకో, పత్రికాధిపతివద్దకో తీసుకువెడితే వారాకాగితం మడతపెట్టి, దానిమీద ఏదైనా బరువుపెట్టి "చూస్తా.. కొంచెం తీరుబడిగా చూస్తా.. మళ్ళీ కలుసుకుందాం" అని ఎంతో ఆప్యాయతగా చెప్పారు.

క్రొత్తగా పద్యాలు వ్రాసే రోజుల్లో వ్రాయగానే ఎవరన్నా చూచి మెచ్చుకుంటే బాగుండాలనిపించేది. చూడటమే ఉండేది కాదు. మెచ్చుకునేదాకా ఎలా? తిరిగి ఇంటికి వచ్చి అద్దంలో ముఖం చూసుకోవడం తప్ప - ఏం ఉంటుంది ఆనందం?

ఈ చిన్న వాగ్దానాల ధోరణి చాలావుంది నిజానికి.

(సెప్టెంబర్ ౨,'71, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**సామాన్యంగా సంసారాలలో** చిలిపి తగువులూ, చిల్లర సంభాషణలూ రావడం మనం వింటూ ఉంటాం. ఇంతకాలంగా హాయిగా కాపురం చేస్తున్న దంపతులిద్దరూ ఒక్కసారిగా తగవుల్లోకి దిగారేమిటా అనిపిస్తుంది.

పూర్వగ్రంథాలు వగైరాలలో పొలియకలనీ, చిడిముడులనీ, చిరుకోపాలనీ ఎన్నో వర్ణిస్తూ వచ్చారు. ఇప్పుడు పొలయలుకలతో ఎక్కడా సంబంధం ఉండటం లేదు. బయటపడి పోట్లాడుకోవడం దాకా వచ్చేస్తోంది. గృహిణి ఏదో కొంచెం తప్పు చేస్తుందనుకోండి - యనగారు వెంటనే ప్రారంభిస్తాడు.

"నీకు బుద్ధి లేదు."

"ఇప్పుడు తెలుసుకున్నారా! అయ్యో? ఎంత లస్యమైంది?"

***<u>మీది అసలు చాలా బండ వంశం</u>***

"తెలుసుకుని చాలాకాలమైంది. కానీ ఎందుకు బయట పెట్టడమని ఊరుకున్నాను. మీది అసలు బండవంశం"

"అవును. అదీ కనిపెట్టారన్నమాట. మీ దగ్గిర ఏదీ దాగటం లేదమ్మ. సుకుమార వంశంలో వచ్చి నేను పడ్డాను. పూలవనంలో రాతిబండ వచ్చిపడ్డట్లు."

"మా వంశ గౌరవం మీకేం తెలుస్తుంది? బండకేం తెలుస్తుంది పచ్చడి రుచి. ఎలాగో కాలక్షేపం చేస్తున్నాం గాని. "

"అంతే మరి, మీరు కాబట్టి ఎలాగో సర్దుకుపోతున్నారు - బుర్ర ఉడికిపోతూ ఉండాలి పాపం. పోనీ కొంచెం రుద్దమన్నారా"

"అదికూడా ఎందుకు భస్మాసుర వరం. ఏమీ అక్కర్లేదులే. ఇట్లా బ్రతకనియ్యి"

"చిరంజీవులుగా వర్ధిల్లండి. అలాటి పొరపాట్లు నేనేం చెయ్యను. మీరు నామూలకంగా శ్రమే కాకుండా ఎంతో బయపడుతున్నారన్నమాట. గట్టిగా చేప్పేస్తే మూట కట్టుకుని పుట్టింటికి చక్కాపోతాను" -

***ఇంతకీ ఎర్ర పెన్సిలు ముక్క ఎక్కడుంది?***

"ఎందుకూ.. నేనే పోయి ఏ యతీంద్రుల్లోనే కలుస్తాను. ఒక్కసారి జై పరమేశ్వరా అంటే యోజనాల దూరంలో వెళ్ళి వ్రాలతాను. నీ గోరోజనం అంతా తీరిపోతుంది ఇంతకీ ఎర్ర పెన్సిలు ముక్క వెతుకుతావా లేదా! దానికింత మంట మండించావు."

ఇలా మధ్య మధ్య ఏ చిన్న విషయంలోనో భార్యా భర్తల మధ్య చిరుమంటలు లేస్తూ ఉంటాయి. దీన్నే "సంసారంలో షార్టు సర్క్యూటు" అంటారు - కాసేపు నిదానిస్తే కార్యసాధన జరుగుతుంది. కానీ అంత సహనం ఎక్కడనుంచి వస్తుంది.

కొంచెం ధునిక సాంప్రదాయాలు గల సంసారాల్లో తగాదాలు మరి ఒకరకంగా ఉంటాయి.

"నేను ఫీసు నుంచి కొంచెం లస్యంగా వస్తాను."

"ఇవ్వాళ క్లబ్‌లో సదస్సు ఒకటి ఉంది. మీరే ముందు వస్తారేమో. వస్తే పిల్లల చెంత అన్నం తినిపించి వెయ్యండి."

"కొంచెం త్వరగా రావడానికి ప్రయత్నించరాదూ"

"ఎలా ప్రయత్నించడం నేను కార్యదర్శిని. మాట మీకు ఎన్నిమాట్లు గుర్తు చెయ్యాలి. నలుగురూ ఏమంటారు"

"నలుగురూ ఏమంటారో నాకు తెలియదు గానీ - నేను మటుకు మామూలు సభ్యురాలుగా ఉండమంటాను సంసారాలు చేసేవారికి.

"మీరు పొరపడుతున్నారంటాను."

"నాది పొరపాటంటారా!"

"ముమ్మాటికీ ట్రూత్ గ్రహించలేకపోతున్నారు."

"ఏమిటి ట్రూత్. పిల్లల్ని వదిలి అర్ధరాత్రి దాకా తిరగడం, భర్తను ఇంటిపనులు చేయమనడం. సంసారాలకంటే సదస్సులు ఎక్కువ అనడం - ఇవన్నీ అసలు ధర్మాలా"

***చదివారు ఎమ్మే ఎన్నో ఉపన్యాసాలిచ్చారు.***

"ఔను. నాకు అలా చేయడంలో కొంత తృప్తి ఉంది. సంతృప్తి లేని జీవితాలు ఎలా ఉంటాయో తెలియదా! ఎమ్మే చదివారుగా - ఎన్నో ఉపన్యాసాలిస్తూంటారుగా"

"ఉపన్యాసాలు వేరు. సంసారాలు వేరు. ఇవి అంత తేలికగా సాగవు. శ్రమపడాలి. శ్రద్ధ తీసుకోవాలి. నువ్వు పిల్లల విషయంలో ఇలా ప్రవర్తిస్తే వారిని తీసుకువెళ్ళి ఏ కాన్వెంటులోనో అప్పగించి వస్తాను."

"నాకేం అభ్యంతరం లేదు. కాన్వెంటులో దింపినా మంచిదే, ఈ చీకటింటిలో పడేసి పెంచడంకంటే. వాళ్ళ కేమన్నా ప్రత్యేక సౌకర్యాలా! వినోద కార్యక్రమాలా! అమ్మకు అప్పగించడం - అంతా సతమతమై పోయిన తర్వాత అర్ధరాత్రి వచ్చి తలుపు కొట్టడం. తల్లికంటే తండ్రికే ఎక్కువ బాధ్యత ఉంది. సరిగా గ్రహించగలిగితే"

"గ్రహించడం ఏం లోటు లేదు. తమరు అనుగ్రహించడం లేదనే బాధే తప్ప ఇంతకీ రాత్రి పెందరాళే రానంటావు. అయితే వాళ్ళను కూడా తీసుకువెళ్ళు"

"ఇంకా నయం కాస్త గాలి పీల్చుకోకుండానా! రెండు గంటలు స్వేచ్ఛా వాయువులు పీల్చందే ఎలా బ్రతకడం. ఎందరు రావడంలేదు పిల్లల్ని వదిలిపెట్టి . నేనేనా! అందులో నేను కార్యదర్శిని."

***కార్యదర్శిగా - కొంచెం మార్గదర్శిగా ఉండు***

"అందువల్లనే చెపుతున్నాను. వాళ్ళకు కొంచెం మార్గదర్శకంగా కూడా ఉండు. ఇళ్ళదగ్గిర పిల్లలు వంటరిగా ఉండి ఎలా భయపడుతూ ఉంటారో బోధించి ఏడుగంటలకు సభ చాలించి, ఎవరింటికి వారిని దయచెయ్యమని చెప్పిచక్కారా"

"ఇవ్వాళ ఏమవుతుందో. నేను కార్యదర్శిని. తలుపులు మూసేదాకా ఉండవలసిందే తాళాలు చేత పట్టుకుని రావలసిందే అది నా గౌరవ పదవి."

"ఇది అగౌరవ పదవా! దయచేసి పదవికి రాజీనామా ఇయ్యి. నీ ఇష్టం వొచ్చిన కారణాలు ఏమన్నా వ్రాయి."

"మరీ అలాటి బూజుపట్టిన మాటలు మాట్లాడతారేం. ఇంత పేరు సంపాదిస్తున్నానని సంతోష పడటం చేతకాదు సరిగదా - చెడు సలహాలు కూడా ఏమిటి?"

"చేస్తున్న సంసారం ఒకటి ఉన్నది గనుక"

***నవ్వుతుంటే కాళ్ళు బయటికి నడిపించవు***

"మీరు చూస్తూ ఊరుకోండి. సంసారానికేం హాయిగా సాగిపోతుంది. అందరి సంసారాల వంటిదే మనదీ."

"సరే! సరే! ఫీసు వేళ అయింది. ఇక బిగి ముడులు తొలగించుకొని చిలకలాగా నవ్వు ఒకసారి. చూచి చక్కా పోతాను. సాయంత్రం పెందరాళే నే వస్తాలే -"

"మరి ఇంత రగడ దేనికి. రామాయణం దేనికి? ముందే ఈ మాట చెప్పకపోయారా! చక్కగా గడిపేవాళ్ళంగా నవ్వులతో"

"ఫీసుకు వెళ్ళేముందు అంతగా నవ్వులు సాగితే బయటకి అడుగు పెట్టడం - చాలా కష్టం. అందుకని చిరుకోపం" అంటూ - యన వెళ్ళి పోయాడు.

చివరమాటలు, ఓడిపోయి మాట్లాడినవే. అసలు ఉద్దేశ్యం వీణ్ణి దబాయిద్దామనే. కాని సాగక పాపం.

**(24' జనవరి 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**"సంక్రాంతి, సంబరాలూ, సరసాలూ చాలావరకు తగ్గిపోయినాయి.** ఏదో మెల్లగా గడిచిపోయింది" అన్నాడొకాయన.

ఆయన మాటలు నిజమేనేమో అనిపించింది. ఆర్థిక పరిస్థితులు బాగాలేని వారి సంగతి అంతేగా మరి. అవి కాకుండా కొన్ని దండగల జీవితాలుంటాయి. ఉన్నదంతా పోగొట్టుకుని ఉప్పుచేపల్లాగా తయారైన వాళ్ళ జీవితాలు.. వాళ్ళకు నిజానికి బ్రతుకే దండగ అయిపోతుంది. ఇక పండగల సంగతేం ఉంటుంది.

'ఒకప్పుడు నేనూ వెలిగాను. అలనాటి పెట్రోమాక్సుకన్నా, ఈ నాటి ట్యూబ్‌లైటు కన్నా. నేనేం చింతపడక్కర్లా!' అని ఇలాటివారు మసక మనస్సుల్లో రవంత రజను జల్లుకోవడానికి ప్రయత్నిస్తారు. ఇదోరకం తాత్విక చింతన. వీటిలో ఎన్నిరకాలు!

***వద్దనే పండగ వదిలేశాం!***

"ఈ పండగ సమయం ఇలాగడిచింది. గడిచిందేమిటి? గడపాలనే గడిపాం. క్రొత్తబట్టలు కట్టలేకకాదు, పిండివంటలు ఎత్తలేకా కాదు. మనస్సు బాగుండలేదు. పోనీలే ఈ పండగ వదిలేద్దామనుకున్నాం.. వదిలేశాం అంతే" అని ఒకామె ఎంతో నిర్లిప్తత ప్రకటించింది.

ఇదోరకమైన గంభీర ప్రకటనే! మొన్న ఒక కవి పుంగవుడు మీటర్‌తో సంబంధంలేని గేయం ఒకటి హుందాగా చదివి వినిపించాడు సభలో. అక్కడికీ ఊరుకోకుండా నాకు ఛందస్సు రాకకాదు, పద్యాలు రాయలేకకాదు ఆ గేయం వ్రాసింది. అని ఒక చక్కటి పద్యం చదివి వినిపించాడు. పద్యాలు వ్రాయకపోవడానికి కారణం ఏం చెపుతాడు. అదో సరదా.. "రెండిట అందరిన్ తనియింప గోరి" కాబోలు - అనుకున్నాం.

చేతినిండా సొమ్ము లేకపోవడంవల్ల పండగ హడావుడి, సరదా తగ్గిపోవడమే కాదు. సిరిగలవాళ్ళుకూడా ఈ కాలంలో నీళ్ళు నమిలి ఊరుకొంటున్నారు. "పది రూపాయలు ఎప్పుడు అవతల పారేస్తే అప్పుడే పండగ" అనే ధీమా వీరికి కొంత ఉంటుంది.

***వంచించలేను... లంచాలు తినలేను***

మొన్న ఒక గృహస్థునడిగాను "ఎలా నడిచింది పండగ?" అని. "సగం నిద్రతో గడిచింది - సగం నిరుత్సాహంతో గడిచింది. మరో రెండుమూడుగంటలు నిద్రపడితే - సంక్రాంతి దాటిపోయేది. నాకు సంక్రాంతి అంటే వట్టి భ్రాంతిగా మారిపోయింది. మనకేం పంటలున్నాయా! పాడిగోవులున్నాయా! ఒకళ్ళను వంచించే పదవులున్నాయా! లంచాలు తినే అవకాశాలున్నాయా! అతి సామాన్య పౌరుణ్ణి. ఇంకా అంతకంటే తక్కువపౌరుణ్ణి, నాకు సంక్రాంతేమిటి?" అన్నాడాయన.

"అదేమిటి! దేశానికి అంతటికీ ఉన్న పండుగ మీకు లేకపోవడమేమిటి? వాటికి ఉన్న ప్రత్యేకత వాటికి ఉందిగదా! మనం పొమ్మంటే పోతుందా! ఏమీచేయలేక పోతే - తల కడుక్కుని రెండు పులగం మెతుకులు నోట్లో వేసుకొంటే సరిపోతుందిగదా?" అన్నాను.

"తల కడుక్కోవడమన్నారా!? ఏ తెల్లవారు ఝామునో లేచి, ఏ పంపుదగ్గరో కడుక్కోవడానికి ప్రయత్నించవచ్చు, పులగం ఎక్కడినుంచి వస్తుంది. బియ్యం ఖరీదు తెలుసుగదా!.. మంచివి కిలో రూపాయి అరవై.. మూడురూపాయలు, మూడు అరవైలూ పెడితేగానీ - పిల్లలకు ముప్పొద్దులా పెద్దవాళ్ళకు ఒక ప్రొద్దు మూతులు తుడుచుకోవటం జరగడంలేదు..

ఇంకా పులగంలోకి పప్పెక్కడనుంచి వస్తుంది. కిలో రెండు రూపాయలు. ఇంకా కొంతకాలం పోతే గిద్దల లెక్కపోయి బద్దల లెక్కలోకి వస్తాయి. ఇంకా పులగమంటారు మీరు. బ్రతుకులే కలగాపులగంగా ఉన్నాయి. అయిదు రూపాయలు ఇంట్లోవుంటే భోగిమంట దగ్గిర చలికాచుకున్నంత వెచ్చగా ఉంటోంది. ఏం చెప్పమంటారు ఈ బ్రతుకుల సంబరాలు?" అని ఆయనగారు నుదురు వ్రేళ్ళతో తాకారు.

మొన్నటి ఆంధ్రప్రభ సంక్రాంతి సంచికలో సరసాలు అనేపేరుతో ఒక పడుచుకత్తె, పడుచువాని బొమ్మలు వేశారు. అది మా 'ఉషశ్రీ'గారు కాబోలు అన్నారు... "ఈ బొమ్మ చూశారు. ఇది గతించిన చరిత్రలో పుట... ఎవరి సంగతో ఎందుకు? నా విషయంలో అంతే. ఒప్పుకోరుగానీ చాలామంది విషయం కూడా అంతే! ఇంట్లోవాళ్ళు ఎప్పుడేం అడుగుతారోనని నీరసాలు వేసుకుతిరుగుతుంటే ఇంకా సరసాలెక్కడ? సరదాలెక్కడ?"

***చంటివాణ్ణి మినహాయిస్తే - సైలెంట్ పిక్చర్***

"సిల్కు చీర కొనలేదనే చీదరింపులతో భోగి ప్రారంభమైంది - సంక్రాంతి ఆ గందరగోళంలోనే దాటిపోయింది. కనుమునాడు మినుము కొరికే ప్రాప్తం లేకుండాపోయింది. ఆ మర్నాడు సంజ్ఞలే తప్ప మాటలు లేవు. పాలుచాలక డొక్కలు లేవక ఏడ్చే చంటివాణ్ణి మినహాయిస్తే సంసారమంతా సైలెంట్ పిక్చరుగా సాగిపోతోంది. ఇందులో సరసమేమిటి? సంబరమేమిటి?" అన్నారు.

"ఆ ఎదురింటావిడ ఎలా నవ్వుతోందో చూడవే! పండగనాడు కూడా అలా మూతి ముడుచుకుంటావేం? సంవత్సరంలో పది పండగ రోజులుంటాయి. అవి పకపకలకోసం పెట్టారుగాని. ఇలా మౌనంగా ఉండటానికి కాదే!" అని ఒక గృహస్థు భార్యామణితో అన్నాడు.

ఆవిడ విసుగ్గా తలతిప్పి "పకపకలూ, చెకచెకలూ నాలాటిదానికి ఏం వస్తాయి? ఎంత పండగైతే మాత్రం ముఖాన గీతలెక్కడికిపోతాయి. ఒకరు చెరిపే గీతలా! బ్రతుకంతా కనిపించకుండా నిలిచిపోయే వాతలు" అంది.

"అదేమిటే అంత వేదాంతంలోకి పోతావు. ఉన్న కష్టాలు ఉంటాయి. ఈ ఒక్కరోజూ మరిచిపోమన్నాగాని, బ్రతుకంతా మరిచి పొమ్మన్నానా! ఆ సంగతి నాకు మాత్రం తెలియదూ! అది తర్వాత ఆలోచిద్దాం ఒక్కసారి నవ్వుతూ మాట్లాడవే.. నవ్వవే" అని ఆయన బ్రతిమాలుకున్నాడు.

***నలభైనెంబరు చీరకు నవ్వులేం వస్తాయి***

"ఆ! నవ్వులు పువ్వులు ఎక్కడనుంచి వస్తాయి. మీరుకొన్న నలభయ్యో నెంబరు చీరకు... జరీపువ్వుల చీరలు కట్టినవాళ్ళకు వస్తాయి - వల్లమాలిన నవ్వులు. ఈ దుంగకు చుట్టిన తెరచాపలోంచి రంగులూ, పొంగులూ ఏం బయటపడతాయి. అయినా నువ్వు ఒకరు చెపితే వస్తుందేమిటి" అని ఎంతో దీర్ఘాలు తీసి లోపలకు పోయింది.

ఇలా చాలామంది పండగపట్ల నైరాశ్యం ప్రకటిస్తున్నట్లు దేశంలో ఒక కొత్త కాంతి ప్రసరిస్తున్నది అన్నితావుల్లో, అన్ని హృదయాలలోను. దాన్ని గొప్ప సంక్రాంతిగా భావించి భారత జాతి అంతా ఆనందిస్తోంది.

కాకపోతే సంక్రాంతి కొంచెం ముందుగా వచ్చింది. వచ్చినా అసలు సంక్రాంతిదాకా నిలిచింది. ఏమిటా సంక్రాంతి? భారత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి కల్పించిన సంక్రాంతి. భారతదేశానికి అఖండ కీర్తి తెచ్చిపెట్టిన సంక్రాంతి. బాంగ్లాదేశంలో ఉదయించే సూర్యుడు క్రొత్తకాంతులతో ఉదయించే సంక్రాంతి.

***బాంగ్లా ప్రభుత్వపు బల్లమీద క్రొత్త బొమ్మలు***

యాహ్యా అహంకారం భోగిమంటల్లో పడిపోయింది. బాంగ్లా ప్రజలకష్టాలు తొలిగిపోగా, వారి హృదయాలలో ముత్యాలు ముగ్గులు పెట్టింది ఇందిర. బాంగ్లా ప్రభుత్వపు బొమ్మల బల్లమీద క్రొత్త బొమ్మల్ని నిలబెట్టింది ప్రియదర్శిని. అందరిచేతా ముక్తకంఠంతో మంగళగీతాలు పాడించింది.

కాందిశీకులందరిచేతా - శాంతి, సంతృప్తి పేరట పులగం తినిపించింది. ఉభయదేశాల మధ్యా పువ్వుల వంతెన నిర్మించింది. ఎందరో ఇందిరాదాసులు వెలిసి భక్తిగీతాలాలపించేలాగా చేసింది.

ఇది ఎలాటి సంక్రాంతి.. ఈ పండుగ ముజీబ్ విడుదల అయి, ప్రధాని అయేదాకా జరిగింది. ఇది చరిత్రలో ఎన్నడూ ఎరగని సంక్రాంతి.

12 ‘ ఫిబ్రవరి 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**అపహాస్యం పాలు** అయ్యేవారిలో సామాన్య సంసారులేకాదు - సాధారణ పౌరులేకాదు - సాంఘిక ఉత్తరకుమారులే కాదు. గొప్ప గొప్ప రాజ్యాధినేతలు, నియంతలు కూడా అపహాస్యం పాలు కావడం జరుగుతుంది.

దర్పం ఎక్కువైనకొద్దీ - సంఘం వారికి పట్టే దర్పణం కూడా పెద్దదవుతుందనే సత్యం వారికి అర్థంకాదు పాపం... వెనుకటికి ఒకాయన ప్రతిపనీ అర్థం లేకుండా గుడ్డెద్దు చేలోపడ్డట్టు చేస్తూ ఉండేవాడుట. ఇంత వయస్సు వచ్చిన మనిషి ఇంత అవివేకంగా ప్రవర్తించడమేమిటా! అని అందరూ విస్తుపోతూ ఉండేవారుట.

ఆయన ప్రతిచోటా అపహాస్యంపాలయి వస్తున్నా - ఎక్కువ న్యూనత పడేవాడు కాదు. ఆ బాధంతా ఆయన అర్థాంగిపడేది. పదిమందిలో తల ఎత్తలేకపోయేది.

''ఏమిటమ్మా! నీ భర్త ఇలా అయిపోతున్నాడు. కొంచెం నువ్వన్నా చెప్పరాదటమ్మా!.. వయస్సు గ్రహించడంలేదు. వంశప్రతిష్ఠ గమనించడంలేదు - ఈ దుర్వ్యసాయంలో పడి కొట్టుకుపోతున్నాడు' అని ఎవరైనా అంటే -

***ఒకటి మెల్లకన్నూ... ఒకటి డొల్లకన్నూ***

ఆవిడ కంటినీరు చీరకణువుతో అద్దుకుని ''ఏం చెయ్యమంటారు! జీవితాలు మారడం కష్టం. చెప్పి చెప్పి నా నాలిక చిల్లులు పడింది. ఆయనకు సరి అయిన చూపు రావడంలేదు. ఒకటి డొల్లకన్నూ ఒకటి మెల్లకన్నూ అయిపోయింది. మనో నేత్రం మసితో కప్పుకొనిపోయింది. నా తిప్పలింతే'' అందిట.

అలాటి జీవులు ఒకరు చెపితే వింటారా! 'మూర్ఖుల మనస్సు రంజింప చెయ్యడం ఇసుకతో త్రాడుపేనడంకంటే కష్టమ'ని పెద్దలు ఊరికే అన్నారా!. ఏదో గట్టి దెబ్బ తగిలితే - మాడుపగిలితే - దారికి రావాలిగానీ - తమంతట తాము రావడానికి ఎంతమాత్రం ఇష్టపడరు. వారి ఇష్టాలు వేరూ - సంతుష్టులు వేరు - 'డొల్లకన్నూ - మెల్లకన్నూ' అనామకులు చాలామంది ఉంటారు. ప్రపంచంలో చరిత్రలో మనకు తాజాగా కనిపించే మహానాయకుడు భుట్టో! ఎందువల్లనో మొదటినుంచీ - భారతదేశం పేరు చెపితే - బడాయి గంతులు వేస్తూ, లడాయి మాటలు మాట్లాడుతూనే ఉన్నారు.

అంతకుముందెక్కడున్నాడో - జిన్నా సంపాదించిన పాకిస్తాన్ అవతరించగానే కన్నంలో ఎలుకలాగా బయటికి వచ్చాడు. అన్ని ఎలుకల్లాగా కాదు.. తను తెల్ల ఎలుకననిపించుకోవాలి తాపత్రయపడ్డాడు. ఎవళ్ళ ఆధిపత్యంలో ఉంటే వాళ్ళకు గుడ్డిబూరా ఊదుతూనే వచ్చాడు.

***సన్నాయి క్కరా.. గుడ్డి బూరా..***

సన్నాయి వాయించేవాడికి గుడ్డిబూరా వాయించేవాడు.. లొచ్చుగా కనిపించినా, వాడులేందే పనిగడవదు గనుక - మధ్య మధ్య వాడివంక చూచి తలకాయ తిప్పడం మోకాలి మీద తాళం వేసుకోవడం తప్పదు. ఇది చూచి గుడ్డి బూరదారుడు - అదంతా మెచ్చుకోలే ననుకొని ముచ్చటపడటం జరుగుతూ ఉంటుంది. ఈ గుడ్డిబూరా ప్రబుద్ధుల్ని గురించి మరోసారి వివరంగా వ్రాస్తాను.

భుట్టో మహాశయుడు పాక్ అధిపతులందరి దగ్గిరా గుడ్డిబూరా ఊదాడు.. బుగ్గలు ఉబ్బేలాగా, - సిగ్గుచెడే పరిస్థితులు వచ్చేదాకా. ఈ ప్రక్క వాయిద్యగాణ్ణి పనిపట్టి భద్రతా సంఘానికి పంపి పాకిస్తాన్ శుభజీవనానికి అవసరమైన మంగళ గీతాలాలపించమని పంపడం జరిగింది.

మంగళ వాయిద్యాల సంగతి ఆ మానవుడి కేం తెలుసు.. తెలిసిందల్లా గుడ్డిబూరా సంగీతమే! అదే వాయించాడక్కడ కూడా. ... ''భారతదేశనింద 'పల్లవి - పాకిస్తాన్ ధర్మప్రవృత్తి' అనుపల్లవి... చరణాలో రణరంగ ప్రవృత్తి... రాగాలాపనలో కాశ్మీరు సమస్య.. ప్రతిసారీ ఈ పిచ్చి పాటకచేరీలు చేసివచ్చాడు.

మొన్న జరిగిన యుద్ధసమయంలో కూడా అలాటి పాటకచేరీ చేశాడు. ఇంతలో ఇంటి దగ్గరనుంచి పిలుపురావడం.. బాంగ్లాదేశం గెలుపుమాట చెవినిపడడం, యాహ్యా మూర్ఛపడుతూ తనచేతి సన్నాయి భుట్టోకి అప్పగించడం జరిగింది.

***సన్నాయి క్కరలో సంగం రంధ్రాలు ఊడినాయి***

ఆశకొద్దీ దాన్నీ చేతపట్టుకున్నాడు. గానీ - సన్నాయి వాయిద్యమెక్కడ నుంచి వస్తూంది. సగం వరకు సన్నాయి చిట్లించి, నాలుగైదు రంధ్రాలు ఊడిపోయినాయి. అసలే క్రొత్త బిచ్చం - అందులో ఆ పిచ్చ సన్నాయి చేతికిస్తే ఏం చేస్తాడు పాపం.. స్వరం పెగలదు.. గళం విప్పారదు.

అలవాటైన పాటవున్నా అదే పాడేశక్తి లేకుండా పోయింది. కాస్త రాగం పెగిలినా దానినిండా అపశ్రుతులే. తను ఇంతకాలం గుడ్డిబూరతో పైవాళ్ళను ప్రోత్సహించాడు. ఇప్పుడు తన ప్రక్కవాద్యగాడు కుదరలేదు. కాసేపు గుడ్డిబూరా ఊదుతూ - కాసేపు సన్నాయిని పలికించాలని ప్రయత్నిస్తూ - నానా అవస్థపడుతున్నాడు. ఒంటరిగా బయలుదేరిన గంగిరెద్దు ఆటగానివలె..

పోనీ మద్దెళ్ళు సరిగా మ్రోగుతున్నాయా .. మరమ్మత్ కోసం.. మరమ్మత్ చేసిన తర్వాత క్రొత్త స్వరాలు ప్రాక్టీస్ చెయ్యడం కోసం.

వాళ్ళు మాత్రం తెలివితక్కువవాళ్ళా! ముద్దుగా ఆడుతుంటే 'అహహ' అనేవారేగాని "మూర్ఛపోతే" - నీళ్ళుకొట్టి, లేవదీసే ఓపికా, అవసరం ఎవరికున్నాయి.. 'ఇండియా మీద కోపం' అనే విసినకర్ర ఒకటి రెండుసార్లు విసిరారు. అప్పు అడిగితే ఏం కసిరారో తెలియదు. ఆయుధాలు అవసరమైతే దానం చేస్తామన్నారు.

***పగిలిన మృదంగం.. కన్నీళ్ళ అతికింపు***

ఆ దానంలో ఏం రహస్యముందో - అందరు నాయకుల దగ్గర తలవంచి, దాసోహమన్నారు.. పగిలిన మద్దెల బాగుచేస్తాం. వెళ్ళగలిగితే నిక్సన్ దగ్గరకి వెళ్ళు - లేకపోతే కన్నీళ్ళతోనే అతికించుకో.. అసలు నీ స్వరమే సరిగా లేనప్పుడు సన్నాయి బాగుచేసి మాత్రం ఏం లాభం. తర్వాత చూద్దాంలే. దాన్ని దాచి అట్టిపెట్టు - అని చల్లగా వెనక్కి పంపారు.

తిరిగివచ్చి తానేదో జైత్రయాత్ర చేసివచ్చినట్లు చెప్పుకున్నాడనుకోండి. అది రాజకీయ లాంఛనం. కానీ తిరిగి వచ్చిన తర్వాత తనే క్రొత్తరాగాలు కొన్ని ప్రాక్టీస్ చేస్తున్నాడు పాపం. "ఢిల్లీ వచ్చి ఇందిరా గాంధీని కలుసుకుంటాన" నేది అలాటి క్రొత్తరాగాలలో ఒకటి.

ఈ రాగాలు ఆమెకు అర్థం కావా!. 'బాంగ్లాదేశ్' తుమ్రీలు పాడటానికైతే నాదగ్గరకి రానక్కరలేదు. వేరే విషయాలుంటే అలాగే రావచ్చునన్నదామె.

మరి ఏం చేస్తాడో తెలియదు. పాపం ఎంత ప్రయత్నించినా పాట కుదరడంలా. ప్రపంచదేశాలు ఒక్కొక్కటే బాంగ్లాదేశ్‌ను గుర్తిస్తూంటే - అతని బలం దేశానికి పది పౌనుల చొప్పున తగ్గిపోతోంది. మనస్సు మరింతగా నిక్సన్ వైపు మొగ్గిపోతోంది.

భుట్టో - ఎంతో అపహాస్యం పాలయిపోయాడు. అంతకుముందు యాహ్యా... అంతకుముందు ఆయూబ్. ఇప్పుడు బుట్టోతోపాటు నిక్సన్... సప్తమ నౌకాదళాన్ని తిప్పి తీసుకుపోవడంతో అతని పని అపహాస్యం పాలయింది.

వెనక్కి తిరిగిన నౌకలు అతణ్ణి ఎంత ఎక్కిరించినాయో యోచించి వ్రాస్తే చక్కటి "అపహాస్య ప్రకరణ" అవుతుంది.

**(17' జూన్ 65, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**భారత దేశం ఋషివాటిక అనీ, ధర్మభూమి అనీ,** కర్మభూమి అనీ - అనేక రకాల వర్ణిస్తూ ఉంటారు. వర్ణించడమేగానీ తిరిగి ఆ స్వరూపాన్ని నెలకొల్పలేకపోతున్నాం.

కానీ ఈనాడు మన ప్రభుత్వం వెనుకటి స్థితికి దేశాన్ని తెచ్చే పనులు కొన్ని చేస్తున్నదని సంతోషించవచ్చు. ఎందువల్లనంటే పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు ఆధ్యాత్మిక మార్గం అన్నారుగా పెద్దలు?

ఆహారం విషయం తీసుకోండి. మృష్టాన్న భోజనాలు మానివేయమన్నారు. సుష్టుగా తినడం జాతిధర్మం కాదనే సూచన చేశారు. దైవభక్తి ఉన్నా లేకపోయినా, దేశభక్తి నాధారం చేసుకుని వారానికి ఒక పూట నిరాహారదీక్ష వహించమన్నారు.

నువ్వు మానిన ఆహారం, వారానికి ఒక పూట తినే సోదర మానవునికి ఒక పూట కడుపు నింపుతుందిగనుక - తద్వారా మోక్షం సంభవించవచ్చునన్నారు.

***పాలుంటే అన్నం మాను***

అసలు ఆహారం విషయంలో అంత శ్రద్ధ ఉండక్కరలేదన్నారు. "నా అలవాటు ప్రకారం తింటాను" అనడం వట్టి పిచ్చి అభిలాష క్రిందకు వస్తుందన్నారు. ఏది దొరికితే అది తిను. ప్రతి పదార్థం తినడం నేర్చుకో. పాలు త్రాగితే అన్నం మానుకో. కందమూలాలు దొరికితే అన్నీ మానుకో. అనే సూత్రాన్ని ఒకరకంగా బోధించారు.

సీతా మహాదేవిని తన ఆశ్రమానికి తీసుకుని వచ్చినప్పుడు వాల్మీకి మహర్షి -

**"కల మాన్నములు పెట్టకలమో, లేమో**

**గాని కందమూలముల కేమికరువులేదు`** - అన్నాడు. శ్రీరామచంద్రమూర్తి వంటి మహారాజు భార్య అయిన సీతామాతనే అలా కందమూలాలతో గౌరవించినప్పుడు సామాన్య మానవుల్ని తినమనడంలో తప్పేం ఉంటుంది? ఏమైనా ఉంటే ఆ వేదాంతాన్ని అర్థం చేసుకోవడంలో ఉండాలి పొరపాటు.

నిజానికి ఇలా ఆహార సమస్యను పరిష్కరించడం చాల మంచిది. దీనివల చెడ్డచిక్కులు వస్తున్నాయి. జనాభా తగ్గింపు కోసం ఎన్నో ఘనకార్యాలు చేయవలసివస్తోంది. కందమూలాలు తినో, గాలిపీల్చో బ్రతకనేర్చిన సంతానమేర్పడితే, జనాభారేటు ఎంత పెరిగితే మాత్రమేం? కొంతకాలమైన ఎరువుల బియ్యం, అరువుల బియ్యం తినడం తప్పిపోతుంది.

ఈ విషయాలు ఆలోచించినప్పుడు మనం కొంచెం వెనక్కి వెడుతున్నట్లే కనిపిస్తోంది. ఈ మధ్య పాశ్చాత్య సంపర్కం వల్ల మనకు అలవాటైన కాఫీ అలవాటు తగ్గించడానికి కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ప్రతిరోజూ తెల్లవారగానే, గృహిణులు చిన్న చిన్న గ్లాసులు ఖాళీ వాస్‌లైన్ సీసాలు, ఉగ్గుగిన్నెలు పిల్లలు ఆడుకునే లక్కపిడతలూ పుచ్చుకుని, ప్రక్క ఇళ్ళకు పోయి, "దీనితో దీనెడు పంచదార ఇస్తారు? పిల్లవాడు గుక్కలు పెడుతున్నాడు. సాయంత్రం ఎలాగో అలాగో తెప్పించి ఇస్తా. కార్డు ఉంది మాకు. ఇస్తారు ఇవ్వాళో, రేపో" అంటూ తిరగడం.

అవతల వాళ్ళు "డబ్బా దులిపి రెండు రోజులైంది. మా వారితో చెప్పి నాలుగురోజులైంది. మా వారితో చెప్పి నాలుగురోజులైంది. కాఫీ మానేసి ఒక రోజయింది. ఏం చెప్పను ఖర్మం?" అంటూ ఉపన్యసించడం అప్పు కోసం వెళ్ళిన ఇల్లాలు ఇంటి ముఖం పట్టి, లక్క పిడత ఎగరేసి పట్టుకుంటూ, మధ్య మధ్య చప్పట్లు కొట్టుకుంటూ రావడం జరుగుతోంది.

***కాఫీలో తాటిబెల్లం***

మొన్న ఒక గృహిణి పనిమనిషితో అంటోంది. "ఒక్క అర్థరూపాయి పంచదార ఎక్కడన్నా తెచ్చిపెట్టు, నీకు రెండు కప్పుల కాఫీ ఇస్తాను. చిక్కటి పాలున్నాయి, చక్కటి పొడి ఉంది" అని.

ఆ పనిమనిషి అంది వెంటనే "పంచదార నేనెక్కడ తేగలనమ్మగారూ. ఏ ఇంటికెళ్ళినా వీసెడు పంచదార తెస్తే రూపాయి లాభం ఇస్తానంటున్నారు. నావల్ల కాదని చెప్పి ఇప్పుడే ఇరవై పైసలిచ్చి కాఫీ హోటల్లో త్రాగివస్తున్నా. తప్పదమ్మగారూ ఇక కాఫీలో తాటిబెల్లం అలవాటు చేసుకోవలసింది. చవకా, చలవాకూడా నమ్మగారూ" అని.

భగవంతుడి దయవల్ల పంచదార కరువుతో కాఫీ అలవాటును దూరం చేసే అవకాశాలున్నాయి. అప్పుడే ఆరుమాట్లు త్రాగేవాళ్ళు మూడు మాట్లలోకి మూడుమాట్లు త్రాగేవాళ్ళు రెండుమాట్లలోకి వచ్చారు. అతిధులు ఇళ్ళకు వస్తే కాఫీలు ఇవ్వలేక అవేవో బిళ్ళలు కొని నీళ్ళలో కలిపి అందిస్తున్నారు.

### *తామ్రపాత్రలో గంగ*

ఉదయం పూట కాఫీలుమాని తామ్రపాత్రలో రాత్రి పోసి మూతపెట్టిన గంగాజలం సేవించవలసిందనీ, దానిద్వారా ఆరోగ్య మహాభాగ్యాన్ని అందుకోవచ్చుననీ ప్రజలకు సినిమా స్లైడ్ల ద్వారా, పత్రికా ప్రకటన ద్వారా ప్రచారం చేయడం ఎంతో అవసరమనిపిస్తోంది.

పూర్వం మనవాళ్ళు కాషాయ వస్త్రాలు ధరించేవారనీ, యోగుల కౌపీనధారులై ఉండేవారనీ, కొందరు దీక్షావస్త్రాలు ధరించేవారనీ చెప్పుతూ ఉంటారు. వనవాసంలో వల్కలాజనాలు ధరించడం కూడా కద్దు.

వస్త్రాల ధరలను బట్టి మన ప్రజలు కూడా వస్త్రధారణ విషయంలో చాలా నియమాలు పాటించడం ప్రారంభించారు. పాపం చాలామందికి అనుకోకుండా పాషన్ పేరుతో దీక్షా వస్త్రాలు అలవాటైనాయి.

### *ఆధునిక వస్త్రాలు*

'వాష్ అండ్ వేర్' వస్త్రాలు వచ్చిన తర్వాత వాటికి మాయడం, లాండ్రీకి వేయడం వంటి పద్ధతులు నశించిపోయాయి. ఒకపూట వంటి మీద, ఒకపూట దణ్ణెం మీద ఉండడానికి ఆ వస్త్రాలు అంగీకరించాయి. అందువల్ల ఇంచుమించుగా ఎప్పుడు చూచినా వాటి యజమానులు దీక్షా వస్త్ర ధారులుగానే కనిపిస్తూ ఉంటారు. పురుషులలో టెర్లిన్ ధారులు కూడా అంతే. ఆదివారం చొక్కా ఉతకడం, తక్కిన వారమంతా ధరించడం. కనుక ఎప్పుడూ నీలపు చొక్కాధారిగానే కనిపిస్తాడలాంటి వ్యక్తి. ఇలాటివారు ఎంతమందో కనిపిస్తూ ఉంటారు.

వల్కలాలు, కాషాయాంబరాలు ధరించడానికి ఇలాంటివారు ఒక్క మెట్టుమాత్రం తక్కువగా ఉన్నట్లు భావించవచ్చు. ఇలా ఆహారం విషయంలోనూ, ఆహార్యం విషయంలోనూ, కొంత మార్పు వచ్చింది ప్రజాజీవనంలో.

అన్నట్లు సిగరెట్లు కాల్చేవారి విషయంలో కూడా మార్పువచ్చే అవకాశాలేర్పడ్డాయి. దేశంలో ఆర్థికలోపం తొలగించడం కోసం "సిగరెట్టు పీల్పుదారుల" పెదవులకు క్లిప్పులు తగిలించారు ఆర్థిక మంత్రిగారు.

### *తిరోగతిలో పురోగతి*

ఆయన గారికి పాపం సిగరెట్లు కాల్చేవారి పైన జాలికూడా ఉంది. అందువల్ల సలహాకూడా చెప్పారు. "సిగరెట్టు కాల్చేవారంతా బీడీలు కాల్చడం అలవాటు చేసుకోవడం ఎంతో మంచిది" ని. బీడీ ఘాటు అలవాటైతే హుక్కా చక్కగా అలవాటవుతుంది. ప్రతి ఆఫీసరూ ఒక హుక్కా గొట్టం బల్లమీద పెట్టుకునే అవకాశం ఏర్పడుతుంది.

తనకీలు, వగైరాలకు వెళ్ళవలసి వచ్చినప్పుడు ఆ గొట్టాలు చంకనపెట్టుకుని చక్కగా తిరగవచ్చు. ఏదో విధంగా దేశం ఆచారాల విషయంలో వెనకడుగు వేస్తోంది. ఆ తిరోగమనంలో కొంత పురోగమనం కాదా మరి.

(13' మార్చ్ 65, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

### *మొన్ననేగా ప్రీయూసీకి కూర్చున్నాడు*

పూర్వం ఎవరికడుపునైనా మగపిల్లలు పుడితే ఒక ఇల్లు పది ఇళ్ళు అవుతాయని, ఎంతో సంతోషంగా ఉండేవారు. ఈరోజుల్లో అలాంటిదేం లేదు. ఒక్కొక్కడికి పదివేలు చొప్పున అని లెక్కవేసుకోవడమే సరిపోతుంది.

అందువల్లనే నీకు మగపిల్లలెందరు? ఆడపిల్లలెందరు? అనడానికి డెబిట్లెన్ని, క్రెడిట్లెన్ని అని అడగడం జరుగుతున్నది. ఇలాంటి సంపాదనల్లో పడ్డారు తల్లితండ్రులు.

"మీవాడెంతలో ఉన్నా"డని మొన్నఒకావిణ్ణి అడిగితే "ఉన్నాడు ఎనిమిదిలో" అంది. "ఎనిమిదేవిటమ్మా!" అని ఆశ్చర్యంగా నిలబడవలసి వచ్చింది.

ఆవిడగారు దీర్ఘంతీస్తూ, "ఏం, వాడికేం? మొన్ననేగా 'ప్రీయూసీ'కి కూర్చున్నాడు. వచ్చే ఏడు 'యంబ్బీబీస్'కి వెడతానంటున్నాడు" అంది.

"మీవాడు కూర్చున్నాడంటే ఒక పట్టాన లేస్తాడా? ప్రతి క్లాసులో మూడుసార్లు కూర్చోంది లేవడు. పైగా ఎం.బి.బియస్.కి సీటు రావద్దా? చదవద్దా? అప్పుడే ధర అంత పెంచేశావేం?" అంటే..

**_యంబ్బీబీస్ అవగానే ఇల్లుపడగొట్టి_**

"ఇంకా నయం పదిదాకా చెప్పమన్నారు మావారు. మీరు ఎరుగున్నవారని ఎక్కడన్నా మంచి సంబంధం ఉందేమోనని ఎనిమిదన్నా! 'యంబ్బీబీస్ అవగానే ఈ ఇల్లు పడకొట్టి మేడ వేస్తాడు. కారుకొనక తప్పదుగా. ఆదివారాలు వెళ్ళడానికి ఊరుబయట తోట కొంటాడంట. బోలెడు ఊహలున్నాయి" అని చెప్పుకుపోతోందావిడ.

ఇంతకీ వాడు ప్రీయూసీ గాదు, వీడికో పదివేలిచ్చే ప్రేయసిరావాలి.. ఇలా నడుస్తున్నాయి ఆశలు.

వెనక ఒకసారి కుమారుడి కట్నం విషయం మాట్లాడుతూ "ఇక్కడికే పదివేలు నష్టంలో ఉన్నాం" అనేమాట ఎన్నోసార్లు అంది. చివరికి "ఏమిటమ్మా పదివేలు నష్టమంటావు?" అని అడిగితే చెప్పలేదు.

తర్వాత ఆరాలు తీయగా తెలిసింది - ఆవిడకో సంవత్సరం క్రింద కడుపుపోయిందట. అది సరిగ్గా ఉండి ప్రసవిస్తే మగపిల్లవాడు పుట్టేవాడని, వాడికి ఎవరైనా కళ్ళుమూసుకుని పదివేలిచ్చేవారనీ, ఆ కాన్పుపోయింది గనుక, పదివేలు నష్టంలో పడ్డామని ఆవిడ అలా చెపుతోందనీ.

ఇలాంటి అంచనాలు వేసుకుని ఆశలుదూసుకుని కోర్కెల చితాలో కొట్టివేతలూ, జమలూ వేసుకుంటూ కూర్చోవడం తల్లిదండ్రులకు అలవాటైపోయింది. గుణవతి అయిన కోడలు రావాలని, ఇంటికి పేరు తేవాలని చూచేవారెక్కడా కనిపించడం లేదు.

**_ఎర్రగా ఉండాలి, ఎనిమిదివేలివ్వాలి_**

మొన్న ఒకాయన తమ ఇంట్లో ఉన్న కుర్రవాడికి బోలెడు సంబంధాలు వస్తున్నాయనీ, ఏది నిశ్చయించుకోవాలో తెలియక తను సతమతమవుతున్నానని చెప్పడం ప్రారంభించాడు. "మరి ఎలా మీ సమస్య పరిష్కారమయ్యేది?" అన్నాను.

"అయ్యేదేం ఉంది? ఒక్కటే మార్గం పిల్ల ఎర్రటి ఎరుపుగా ఉండాలి. ఎనిమిదివేలు బహుమానాలుండాలి. అలా అయితే అంగీకరించడమే. మీరుకూడా ఇదే గుర్తుపెట్టుకోండి 'ఎర్రపిల్లా, ఎనిమిదివేలూ' ఇంతకు తక్కువైతే అసలు మాట్లాడకండి" అన్నాడు.

"నాకెందుకయ్యా ఆ గొడవంతా? అయినా మీవాడి ముఖానికి ఎర్రవాళ్ళెవరు వస్తారు? జతకో కోతి దొరికితే జన్మసార్థకమైనట్లే, పైగా ఎనిమిదివేలా? ఎవడిస్తాడు? చంబిలోయలేదు? అక్కడ దోపిడి ముఠాలుంటాయి. వాటిలో చేర్పించు. ఎనిమిదేం లెక్క, యాభైవేలు సంపాదించవచ్చు" అన్నాను.

శాసనసభ్యుడుగా ఎన్నికైన ప్రతివ్యక్తీ మంత్రికావాలని గల్లంతు పడ్డట్టు పెళ్ళీడు వచ్చిన వాడల్లా ఎర్రటి పిల్లా, ఎనిమిదివేలూ అంటూ తనంతట తాను అవస్థ తెచ్చిపెట్టుకుంటాడు. డబ్బు విలువ పెరిగి, మనోనిబ్బరాలు చెదిరిపోయిన కాలమిది. మొన్న ఒకరింటికి వెళ్ళాను. ఆ ఇంట్లో ఒక బ్రహ్మచారి ఉన్నాడు. మొహం మీదో కంతి, శరీరం కాటుక కాంతి, ఏదో సంపాదిస్తాడని తల్లిదండ్రుల భ్రాంతి. వాడి ముఖం చూస్తేనే వాంతి.

ఇక ఆ తల్లి చెప్పే మాటలు "రావటానికి ఓ వంద సంబంధాలు వచ్చాయి. కానీ, వాడికి ఒక్కపిల్లా నచ్చలా. మంచి అందగత్తె కావాలంటున్నాడు. అరచేతులంత కళ్ళూ, దానిమ్మగింజల్లాంటి పళ్ళూ పద్దెనిమిదేళ్ళూ" - ఇవన్నీ ఉంటే మూడు ముళ్ళూ వేస్తాడుట.

***వరాల తండ్రో - వరాహమూర్తో***

అదివినగానే జవాబు చెప్పాలనిపించింది. "అలాటి అమ్మాయి దొరికితే మంచిదే దొరికితే మూడు ముళ్ళేమిటి? ముప్పయి ముళ్ళు వెయ్యవచ్చు. వేస్తే మాత్రం వాళ్ళు ఉంచుకోరయ్యా, మావాడంటే మాటలనుకున్నా వేమిటి? వరాలతండ్రి."

"వరాల తండ్రికాదు, వరాహమూర్తి. మీ అబ్బాయికి అంత అందమైన పిల్లనెవరిస్తారమ్మా. గంతకు తగిన బొంత అని ఎవర్నో చూచి కట్టెయ్యక"

"అల్లా మాట్లాడతావేమయ్యా. ఈ ఇంట రంభ నృత్యం చెయ్యాలి. ఈసారి రా, నీకే తెలుస్తుంది."

"మీ ఇంట రంభ నృత్యం చేయాలి, దేవేంద్రుడు మీ ఇంటిముందు నిరాహారదీక్ష మొదలు పెట్టాలి. అన్నట్లు వాడికి ఆహారం గొడవ లేదు కావాల్సు. పోనీ బైఠాయింపు సమ్మె చెయ్యాలి. ఆయన్ని వెళ్ళగొట్టడానికి నువ్వు 'టియర్ గాస్' వదలాలి" అన్నా.

"ఏమో? నువ్వనేదంతా నాకు తెలియదు. చిదిమి దీపం పెట్టదగిన పిల్లలుంటే వచ్చి చెప్పు" అంది.

"ఆ! ఎవరన్నా అలాంటి పిల్ల కనిపిస్తే ఫలానాచోట "చిదపకుండానే దీపం పెట్టతగిన కుర్రవాడున్నాడు" అని చెబుతా అంటూ వచ్చెయ్యడం జరిగింది.

ప్రతి మగపిల్లవాణ్ణి కన్న తల్లికీ, తండ్రికీ ఒక రంభరావాలి, ఇంట్లో ఒక చిన్న బ్యాంకు పెట్టాలనే ఆశలు ఎక్కువైనాయి. ఈ రెండింటికీ తూగలేనివాళ్ళు వట్టిజోగుల క్రింద జమపడుతున్నారు. అలాటి వారి ఇళ్ళల్లో ఆడపిల్లలు ఎదిగి కూర్చుంటున్నారు. తల్లిదండ్రులకు ఎక్కిళ్ళు ప్రారంభమవుతున్నాయి. మహాపాపం చేసిన వాళ్ళలాగా తిరగవలసివస్తున్నది సంఘంలో.

మొన్న ఒకరింటికి పెళ్ళికి వెళ్ళాం. ఆ పెళ్ళికి పెళ్ళికాని ఆడపిల్లలు, ఇరవైదాటినవారు వచ్చారు. వారికా పెళ్ళిచూస్తుంటే ఎన్నెన్ని ఊహలూ, ఉద్రేకాలూ పుట్టుకొచ్చాయో ఎలా చెప్పడం?

ఒక ప్రక్క తమకంటే చిన్నపిల్లకు పెళ్ళికావడం, ఒక ప్రక్క తమ ఈడువారు ఇద్దరు ముగ్గురు పిల్లలతో పెళ్ళిపందిట్లో తిరుగుతూ ఉండటం, మధ్యమధ్య వాళ్ళు 'మావారు' మావారు' అంటూవుండటం, సరిగ్గా తెలియక ఆ అవివాహితార్ధ ముసలిపిల్లల్ని "మీవారెక్కడ? అని ప్రశ్నించడటం.. వాళ్ళు పెళ్ళిపందిరివంక చూడలేక డోళ్ళు వాయించేవేపు చూపులు త్రిప్పడం జరుగుతూ వచ్చింది.

***పెళ్ళికూతురు తలంబ్రాలు చిందరవందర***

ఒక అమ్మాయి పాపం అలాగే పెళ్ళిచూస్తోంది పిచ్చిగా. అంతలో తలంబ్రాలు పోసే ఘట్టం వచ్చింది. పాపమా అమ్మాయి ప్రక్కనున్న అమ్మాయితో చెపుతున్నది: "పెళ్ళికొడుకు చూడు ఎంత చక్కగా తలంబ్రాలు పోస్తున్నాడో! పొందిగ్గా పోస్తున్నాడు. మందహాసంతో పోస్తున్నాడు" అని పాపం తన పాపటబొట్టు దువ్వుకుంది అరిచేత్తో.

మళ్ళీ ప్రారంభించింది. "పెళ్ళికూతురిలా తొందర తొందరగా పోస్తుందేం? అవన్నీ చిందరవందరగా పడిపోతున్నాయి. నేనైతే.." అని నాలుక కరచుకుంది.

ఇదంతా పాపం ఆ అమ్మాయితల్లి ప్రక్కన నుంచుని వింటున్నది. ఆవిడ మనస్సు చెడిపోయింది. కొంచెం ప్రక్కకు వెళ్ళి గభాలున విరుచుకుపడిపోయింది. అంతా మూగారు. "ఫిట్సు, ఫిట్సు" అంటూ గోల చేశారు.

తర్వాత తెలిసింది - కుమార్తెకు పదమూడేళ్ళు దాటినప్పటినుంచీ ఆవిడకలా ఫిట్సు రావడం ప్రారంభమైనాయట. ఎక్కడున్నా పెళ్ళిళ్ళయినా శుభలేఖలు వచ్చినా, ఆవిడలా పడిపోవడం జరుగుతూ ఉంటుందంట.

పాపములాంటిపిల్లలకు పెళ్ళిళ్ళు కావాలంటే ఎవరైనా దేవతలు కొందరు దిగిరావాలి. పోతే ఆ వయసువాళ్ళు ఎవరో వచ్చి పెద్ద మనస్సుతో చేసుకుంటానని ఎదుట నిలబడతాడు.

ఈ గరల్సు పేరుతో నిలిచినవాళ్ళు ఎంతమందో ఉన్నారు - ఇల్లువిడిచి. ఇంట్లో ఇలాంటి అవివాహిత మధ్యవయస్సు వాళ్ళున్నారు.. వీరందరి పెళ్ళిళ్ళూ ఏ ముహూర్తాన జరుగుతాయో, ఏ పురోహితుడు పుణ్యం కట్టుకుంటాడో.

(6 ' మార్చ్ 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**ఎవరికివారే అనేది ముఖ్యంగా** రాజకీయాలలో ఎక్కువగా గోచరిస్తుంది. ఎన్నికలకు నిలబడిన కొందరు అభ్యర్థుల రాజకీయ చరిత్రలు గమనిస్తూంటే వారు వివిధ పార్టీలలో ఎలా కప్పగంతులు వేసిందీ తెలుస్తుంది.

1942లో సి.పి.ఐ, 1947లో సి.పి.ఎం, 1952లో కాంగ్రెసు, 1967లో పాతకాంగ్రెసు, 1971లో క్రొత్త కాంగ్రెసు, 1972లో స్వతంత్ర పార్టీ ఇలాటి శాఖాచంక్రమణ చరిత్రలు కొల్లలుగా కనిపిస్తున్నాయి.

శాసనసభకు అభ్యర్థిగా నిలుస్తానని అర్జీపెట్టుకున్న వాళ్ళనల్లా "అలాగే, అభ్యంతరం లేదు. ఎక్కండి బండి" అనడానికి ఎక్కడ అవకాశముంటుంది? గెలిచినవారిని ఉన్న సీట్లలోనే కూర్చోబెట్టాలిగాని, ప్రయివేటు బస్సులలో ప్రయాణికుల్ని కుక్కి "వోవర్‌లోడ్" చేసేందుకు అవకాశాలు లేవుగదా!

***బట్ట పిడుపు డికాషను బడుగు కాఫీ***

అందువల్ల వడపోత తప్పదు. వడపోత సరిగ్గా లేదని కొందరి వాదం. కమ్మటి ఫిల్టర్ డికాక్షన్ దిగడానికి బదులు బట్టపిడుపు డికాషన్ దిగింది. అంతా వట్టి గసి, దీంట్లో కాంగ్రెసు ఆశయం అనే తీయటి క్షీరం పోసే, రుచి ఎలా వస్తుంది. పాలు, పొడీ రెండూ దండగేనని చాలామంది వ్యాఖ్యానించారు.

వద్దన్న అభ్యర్థి అల్లా కాంగ్రెసు సంస్థకు మద్దత్తు మానివేస్తే, ఇక సంస్థ నిలిచేదెలా? పటిష్టమైన ప్రభుత్వం ఏర్పడేదెలా? అందరి విషయం కాకపోయినా, కొందరైనా అభ్యర్థిత్వం అంగీకరించలేదని ప్రత్యర్థులుగా తయారయ్యారు. కొందరు తెల్లవారేసరికి ఇండిపెండెంటు అభ్యర్థులుగా మారి పోటీకి నిలబడ్డారు.

దీన్నిబట్టి ఏం అర్థమవుతుంది? "ఎవరికి వారే, ఎన్నికల తీరే" అనేది నిరూపించడం కాదూ! "నా అంతటివాణ్ణి నేనే" అనుకునే పరిస్థితి ఏర్పడితే, నియమాలు, నిబంధనలూ అడ్డం వస్తాయా! నిజాయితీ మాటకు వస్తే ప్రతివారూ బజారున పడటం తప్ప మరొకటి ఏం ఉంది?

***ఉబ్బిపోతున్న ఉదరంపై చదును***

ఎన్నికల ప్రచారంలో ముఖ్యమైన సాధనాలు రెండు. ఒకటి తన గొప్ప తను చెప్పుకోవడం, రెండు - ఎదుటి వ్యక్తిని కించపరచడం అన్నివిధాలా అనర్హుడని అల్లరి చెయ్యడం. వెంటనే కరపత్రాలు వేయించడం, పురవీధులలో విరజిమ్ముకుంటూ పోవడం అది తమ విజయానికి తొలిమెట్టుగా భావించి లోలోపల ఉబ్బిపోతున్న ఉదరాన్ని అరచేత్తో రాచుకుని ఆనందించడం.

'సీటు ఇస్తేనే పార్టీ. లేకపోతే బయిటకు పోయి తూటాలు పేల్చేస్తా. లేకపోతే బయటకు పోయి తూటాలు పేల్చేస్తా. అభ్యర్థిని పడగొట్టేస్తా. శత్రుదళాన్ని చెండేస్తా. వారి గుండెలు పిండేస్తా. అంటూ బయలుదేరుతుంటే ఇంకా సంస్థ ఏమిటి? సంప్రదాయమేమిటి? ఆశయాలకు కట్టుబడి ఉండటమేమిటి? ఎవరికివారే, స్వార్థపు తీరే - అన్నట్లు పరిణమించడం జరుగుతోంది.

కాంగ్రెసు అభ్యర్థులకు వ్యతిరేకంగా పనిచేస్తూన్నారనే భావంతో కొందరు సభ్యుల పైన చర్యలు తీసుకున్నారు. వీరి సంఖ్య రెండు వందల వరకూ వచ్చింది. 'అపరాధలు చేసినట్లు ఆధారాలు ఉన్నాయి'' అంటున్నారు కాంగ్రెసు పెద్దలు, 'అంతా నిరాధారం, నీటిమూట' అంతున్నారు కొందరు. ఏది ఏమైనా ఎన్నికలకు పూర్వం వరకూ ఎంతో సమైక్యంగా ఉన్న పోనీ ఉన్నట్లు కనిపించిన - కాంగ్రెసు సంస్థలకి ఎన్నో కక్షలు, పక్షాలు ఏర్పడ్డాయి. ఎవరికి వారైతే చివరకు మిగిలేదేమిటి? అన్న శాస్త్రం జ్ఞాపకం వస్తోంది.

***పాత కాంగ్రెస్‌కు పల్లవే దొరకలేదు***

పాత కాంగ్రెసు గొంతు ఎక్కడా వినిపించడంలేదు. ఎన్నికల సమయంలో ఏదో ఒక పాట పాడాలి ప్రతి పార్టీ. పదిరోజులు ముందు కూర్చుని కొన్ని పాటలు వ్రాసుకోవడం, ఫణుతులు వేసుకోవడం, ఊరూరా సంగీత కచేరీలు సాగించడం ఆచారం. పాత కాంగ్రెసుకీ సంవత్సరం పాట సరిగదా - పల్లవి పల్లవి కూడా సరిగా కుదర్లేదల్లే ఉంది.

ఆ పార్టీకి చెందిన మహారథులు ఎన్నికల ప్రచారం పేరుతో బయటికి బయలుదేరలేదింతవరకు, ఎక్కడున్నారో వారి అడ్రసులు కూడా తెలియడంలేదు. ఒకనాడు ఝంఝూమారుతంలాగా సంచారం సాగించిన నాయకోత్తములు ఏ తీరంలో ఉన్నారో, ఏ రకమైన మూగ తపస్సు చేస్తున్నారో తెలియడంలేదు.

అభ్యర్థిగా అర్జీ దాఖలు చేసిన వారంతా తాము సమర్థులమనే అనుకుంటారు గాని - మరోరకంగా భావించరు కదా! తన ఓట్ల పెట్టెలో ఓట్లు పడడానికేం అభ్యంతరం ఉండదనీ - తక్కిన వారివంక చూసే వారే ఉండరనీ వీరికి గట్టి అభిప్రాయం కలుగుతుంది. అలా కలగకపోతే - మొట్టికాయలెలా తింటారు పాపం!

ఈ ఎన్నికలలో చెప్పుకోవలసిన తమషా ఒకటి ఉంది. ఎవరెంత గొప్పవారైనా తమంతట తాము నిలబడటం కష్టం. ఎవరో ఒకరు జబ్బపట్టుకుని నిలబెట్టాలి. పడిపోకుండా వెనుక ఒక మనిషిని పోటీ నిలబెట్టాలి. ముందుకు తూలిపోకుండా రొమ్ముమీద ఒకడు చెయ్యివేసి నిలబడాలి. ఇన్ని బలాల మధ్య ఆ వ్యక్తి నుంచున్నాననిపించుకుంటాడు.

పదిమంది ఆసరావుంటే ఏం లాభం? పదివేలమంది చేరి ఒక్కసారి పడకొడతారు. తుఫానులో వృక్షం ఫెళఫెళలాడుతూ విరిగినట్లు విరిగి క్రింద పడతాడు. పట్టుకున్న వాళ్ళు పరారు. లేవదీసే వాళ్ళెవరు? తనే లేవలి గుండెలు సరిచేసుకుంటు.. ఆ తర్వాత ఏ తీరానికి చేరతాడో? ఎలా మారతాడో? ఆ దైవానికి ఎరుక. అయినా మళ్ళా అయిదేళ్ళదాకా ఎన్నికలకు నిలుద్దామనే ఊహలుండవుగా.

***అభ్యర్థిగా నిలవగానే భార్య పరారు***

వెనుకటికి ఐర్లాండులో ఒక పెద్ద మనిషి, ఎవరు చెప్పినా వినకుండా ఎన్నికలకు నిలబడ్డాడుట. 'గెలవడం తథ్యం' అని తనకు తానే ప్రతినిత్యం ధైర్యం చెప్పుకునేవాడుట. తను ఎంత చెప్పినా వినకుండా ఎన్నికలకు నిలబడ్డాడనే కోపంతో భార్యామణి పుట్టింటికి దయచేసిందట. ఉన్న ముగ్గురు ఆడపిల్లల్ని, దగ్గుతో మంచంలో పడివున్న అత్తగారిని అక్కడే వదిలివేసిందిట.

కథానాయకుడు వాటి విషయంలో ఎంతమాత్రం చింతించలేదుట. ఎన్నికల్లో నెగ్గితే ఎందుకు రాదూ! దాసోహం అంటూ పడి ఉటుంది. వద్దన్నా సేవచేస్తూంది. మా అమ్మకు వైద్యం చెయ్యడానికి డాక్టర్లు వాకిట్లో క్యూలో నిలబడతారు వచ్చి. ఫీజు పుచ్చుకోరు సరికదా - రోజూ నాకు నజరానాలు తెస్తారు.

ఇక ఆడపిల్లల పెళ్ళి అంటారా ఎన్ని సంబంధాలు వస్తాయో? ఎందరు అల్లుళ్ళు కావడానికి ఆడియాసలు పడతారో, ఎన్నెన్ని సిఫార్సులు తీసుకువస్తారో - గెలవడ మొక్కటే తరువాయి. తర్వాత బ్రతుకు అంతా నల్లేరు బండి - అని ఎంతో సంబరాలు పడ్డాడుట.

ఆ ఆశతోనే ఉన్న ఆస్తి అంతా అమ్మివేశాడుట. తలదాచుకోవడానికి ఉన్న ఇల్లు కూడా తాకట్టు పెట్టేశాడుట. ఓట్ల కోసం ఎదురుచూశాడు. గుండెలు తూట్లు పడ్డాయి. భార్య తిరిగిరాలేదు. పిల్లలకు పెళ్ళికాలేదు. పిలిచినా ఒక్క డాక్టరూ వాకిట్లోకి రాలేదు. ఇంట్లో కూడాలేదు. అక్కడితో సంవత్సరం మంచం పట్టాడుట.

తర్వాత దైవకృపవల్ల కొంచెం లేచి తిరగడం అలవాటు చేసుకున్నాడుట. కానీ దేశంలో ఎక్కడన్నా ఎన్నికలనే విషయం తెలిసినా - పత్రికలో చదివినా హఠాత్తుగా విరుచుకుపడిపోతాడు. పడితే ఆరునెలలకు గానీ లేవడు.

***<u>తెలియని తీరాలలో కన్నీటి నయగారాలు</u>***

ఏ డాక్టరు నయం చేయలేని ఎన్నికల జ్వరం ఆయన్ని అలా జీవితాంతం వరకూ పట్టుకుని పీడిస్తూనే ఉంది. ఎన్నికల తర్వాత ఇలా తెలియని తీరాలకు కొట్టుకుపోయి - కన్నీటి నయగారాలు కల్పించుకొన్న వారెందరో.

పాపం చాలామంది ఎన్నికల ఉత్సాహంలో పడి, రంగంలో ఉరకడం - తర్వాత ఊరడించేవాళ్ళు లేక ఉసూరుమంటూ జీవితం గడపడం మామూలైపోయింది.

ఓటర్లు ఏం చేస్తారు. అందర్నీ గెలిపించడం సాధ్యం కాదుగదా - వారిని వారే ఆశీర్వదించుకోవాలి. రాజకీయ మహాసాగరపు ఒడ్డుకు మళ్ళీ ఎప్పుడూ పోరాదని తమర్ని తామే శాసించుకోవాలి.

**ఎవరేమనుకున్నా, ముందు** ముందేమి జరగబోతున్నా.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పిల్లలకు ఒక్కసారిగా ఎక్కడలేని ఉత్సాహం కల్పించింది. నిజంగా విద్యార్థులకు ఇంత సంబరం, సంతోషం ఏనాడూ ఏర్పడి ఉండలేదంటే ఆశ్చర్యం లేదు.

పాపం వీళ్ళంతా వోట్లు లేని చిన్నవారుగాని లేకపోతే కాంగ్రెసు పక్షానికి అంతులేని నోట్లు వచ్చిపడేవి వచ్చే ఎన్నికల్లో.. నోట్లు లేకపోయినా వారంతా ఇంట్లో ఉన్న పెద్దలందరి చేతా కాంగ్రెసు పార్టీకి వోట్లు వేయించి తీర్తారు.

విద్యార్థి లోకానికి ఎంత స్వతంత్రం? ఎంత గౌరవం కల్పించింది ప్రభుత్వం? ఇదిగో చూడండి విద్యార్థులూ? ఏడో క్లాసు వరకూ మీకేం భయం లేదు.. హాయిగా తిరగండి. ప్రతి సంవత్సరం పరీక్షలక్కూర్చోవడం, ఫలితాల కోసం వేసవి సెలవలు సరిగా గడపలేకపోవడం.. వీటివల్ల గుండెలు అరిగిపోతూ వచ్చాయి మీకు.

***'మీరు అరివీర భయంకరులు కావాలి!'***

"అలా అరిగిపోతే ఎలా? మీరు భావి పౌరులు. విద్యకోసం శారీరక మానసిక శక్తుల్ని పోగొట్టుకొని, బలహీనులై కూర్చుంటారా? అంతటి దుస్థితి మనకు ఏర్పడడమా! చదువు సంగతి తర్వాత. మీరు అద్భుత బలపరాక్రమశాలురు కావాలి, అరి వీర భయంకరులు కావాలి.. మీ శౌర్యప్రతాపాలు విని శత్రురాజులకు చిత్త సంక్షోభమేర్పడాలి -" అని వెన్ను నిమిరి గుప్పెడు పసుపు కొట్టి ముందుకు పంపే అవకాశం కలిగింది మనకు.

ఇలా అంటున్నాం కదా అని అసలు పాఠశాలలకు వెళ్ళకుండా ఇళ్ళల్లోనే బైఠాయించకండి. దానివల్ల కొంత ప్రమాదం ఉంది. మీరు చదివినా మానినా పుస్తకాల పేర్లన్నా తెలిసివుండాలి. ఎవరన్నా అడిగితే ఫలాన క్లాసు అని చెప్పే అవకాశం ఉండాలి. తరగతులకు హాజరు కావడమంటే ఏమిటి? హాయిగా ఏ క్లబ్బుకో వెళ్ళినట్లు వెళ్ళిరావచ్చు.

"ఎప్పుడైనా వినాలనిపిస్తే పాఠం వినండి లేదంటే హాయిగా రెస్టు తీసుకోండి. ప్రొద్దున పూట ఇంటిదగ్గర హాయిగా కసరత్ చేసిరండి - మధ్యాహ్నం పూట క్లాసుల్లో కూర్చోండి - కాళ్ళ నొప్పులు తీరిపోతూ ఉంటాయి. ప్రొద్దున్నా, సాయంత్రం రెండుపూటలా ఎలాగూ తిరుగుతూ ఉంటారు గనుక - మధ్యాహ్నం పూట మీకు రెస్ట్ కావాలి. పరీక్షలంటూ ఉండవు గనుక - ఉన్నా తప్పడమంటూ ఉండదు గనుక గురుశిష్య సంబంధాలు స్నేహ బంధాలుగా మారిపోవచ్చు. అందులో ఎంత ఆనందం ఉంది?"

***కులాసాగానే క్లాసులకెళ్ళిరండి***

"విద్యార్థులారా? - మీరు తరగతులకు హాజరు కావటంలో మరో విశేషం ఉంది. విశేషమేమిటి అవసరం కూడా ఉంది. ఏమిటంటారా! మీరు తరగతులకి వెళ్ళకపోతే ఏడు, పది తరగతులు తప్ప తక్కిన తరగతులేం నడుస్తాయి. మరి ఆ ఉపాధ్యాయ బృందమంతా ఏమవుతుంది.

"వారికి ఉపాధి కల్పించవలసిన అవసరం మనకు ఉంది. అది దేశీయమైన బాధ్యత అనేది మీరు గుర్తించాలి. ఎకాఎకిని ప్రభుత్వ పరీక్షలకే హాజరవుదామనుకుంటున్నారా! అలా వీలుండదు. ప్రతి క్లాసులో చదివినట్లు సర్టిఫికెట్ ఉండాల్సిందే అందుకనే ఈ పద్ధతి పెట్టింది. లేకపోతే మళ్ళీ నిరుద్యోగ సమస్య ఏర్పడదూ.

"కనుక మీరు దేశభక్తి పరాయణులై, ప్రతినెలా జీతం సరిగా కడుతూ, క్లాసులకు మాత్రం వెళ్ళి హాజరు పట్టీ వేయించుకుంటూ - తక్కిన విషయాలలో స్వేచ్ఛ ననుభవించండి. ఏడో క్లాసు పరీక్షో, పదో క్లాసు పరీక్షో వచ్చినప్పుడు, కొంచెం కష్టపడితే పడవచ్చు.

అంతేగాని ఇప్పటినుంచీ అంత భయమెందుకు? పూర్వం శ్రీశైలం వెళ్ళాలంటే చిట్టడవి దాటిపోవలసి వచ్చేది. అందువల్ల భయంతో భగవంతుణ్ణి తలచేవారు. చిట్టడవిలో ఎత్తిన చేతులు శిఖర దర్శనమయ్యేదాకా అలాగే ఉండేవి. ఇప్పుడు బస్సులు, కార్లూ పోతున్నాయి. భయం పోయింది. శిఖరం చూచినప్పుడే నమస్కరిస్తున్నారు.

మరి విద్యార్థుల పరీక్షల సంగతీ అలాగే వచ్చింది. చిట్టడవి ప్రయాణం పోయింది. చిన్నకారు ప్రయాణం వచ్చింది. పరీక్షాశిఖరాలు ఎక్కడోగాని కనిపించడంలేదు. కనుక తమాషాగా కాలం గడపవచ్చు. హుషారుగా ముందుకు పోవచ్చు. ఈ సమయంలో బోలెడు లోకజ్ఞానం సంపాదించవచ్చు. బోలెడు సినిమాలు చూడవచ్చు. స్పోర్ట్సులో ఖ్యాతి సంపాదించే స్థితికి రావచ్చు.

***కల్లోల సాగరం నుంచి బయటపడ్డారు.***

"అబ్బబ్బా! ఇంతకాలం పిల్లాడుగాని, పిల్లగానీ తప్పటడుగులు వేయడం నేర్చుకొన్నప్పటి నుంచీ - బళ్ళోకి పంపడమే. కిండర్ గార్డెన్‌లో మునిగితే ఏ పోస్టు గ్రాడ్యుయేట్ క్లాసు తర్వాతనోగానీ తేలడమంటూ ఉండదయ్యో. ఇందులో బోల్తాలు కొట్టే పడవలుంటే - ఇక చెప్పాలా!

ఉల్లాసంగా గడపవలసిన జీవితమంతా కల్లోల సాగరంలో ప్రవేశించి, పరీక్షల తుఫానులకు తట్టుకుని, తూట్లు పడి, ఎలాగో మాట్లు వేసుకుని, బయటపడవలసి వస్తోంది. బయటికి రాగానే ఉద్యోగ సమస్య - చాలా కేసుల్లో నిరుద్యోగ సమస్య. దీంతో చదువుకున్న వెలుతురు ముఖం నుంచి అదృశ్యమై - దానికి బదులు మానుగాయ రంగు పులుముకుని "మాయా మేయ జగంబె నిత్యమని సంభావించి" అన్నట్లుగా విషాద జీవితం గడపవలసి వస్తోంది.

ప్రభుత్వంవారు ఈ అవస్థ చూసి జాలిపడి ఆలోచించి, ఆలోచించి, ఈ మాత్రం స్వేచ్ఛ కల్పించారు. వారికి ధన్యవాలు. నామటుకు నాకు చిన్నతనంలో - అంటే విద్యార్థి దశలో అంత స్వేచ్ఛ ఉంటే ఇంకెన్ని కావ్యాలూ, గ్రంధాలూ చదువుకునే వాణ్ణోననిపిస్తుంది.

***నా చదువుకోసం అత్తయ్యపడ్డ అవస్థ***

ముసలమ్మను తీసుకుని బస్తీలో కాపురం పెట్టి, మూడుపూటలా వండించుకు తిని ఎంతో అట్టహాసం చేసేవాళ్ళం. పరీక్ష పేరు చెపితే నాకంటే ఆ ముసలమ్మ కెక్కువ బాధగా ఉండేది. క్లాసులో చేరినరోజున ఎగపీల్చిన ఊపిరి - పరీక్ష ప్యాసు అయ్యానన్న రోజున విడిచేది. ఆవిణ్ణి ఎంత క్షోణ పెట్టామో!

పరీక్షలు లేని పద్ధతి అప్పుడు ఉంటే - ఆవిడ హాయిగా ఏ ఆధ్యాత్మ రామాయణ కీర్తనలో పాడుకుంటూ - ఇంత అన్నం వండి పడేసేది. నా చదువుకోసం అత్తయ్య పడ్డ అవస్థ అంతా ఇప్పుడు జ్ఞాపకం వచ్చి మరీ బాధగా ఉంది.

ఒక్కసారి కేకపెట్టాను. 'క్షమించు అత్తయ్యా!' అని. మరి ఆలోచనలో ఉన్న అత్తయ్యకు వినిపిస్తుందో, లేదో చదివే వాళ్ళతో పాటు, చదివించే వాళ్ళ బాధలు కూడా చాలా తగ్గుతాయి ఈ క్రొత్తపద్ధతివల్ల.

***విద్యార్థులు - మెలికల పొట్లకాయలు***

ప్రభుత్వం జీతాలు ఇదివరకే తీసివేసింది కదా! ఇప్పుడు చాలావరకు పరీక్షలు తీసివేసింది. ఇంత మంచి జరుగుతుంటే సంతోషించని వారెవరుంటారు. పోనీయండి యువకులు ఆరోగ్యవంతులవుతారు. నిండు విగ్రహాలు తయారవుతాయి. జాతీయాభివృద్ధి కార్యక్రమాలలో అదీ ఒకటి.

చదువులలో పడి నలిగి, నిక్కాక శరీరాలతో పిల్లలు పాడైపోతున్నారు. చదువుకున్న ఆడపిల్లల్ని, మగపిల్లల్నీ చూడండి. మెలికల తిరిగిన పొట్లకాయలలే ఎలా అయిపోతున్నారో. సహించలేం.

**(10' మార్చ్ 65, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**పదవుల సంక్రాంతి: పరీక్షల సంక్రాంతి**

ప్రజలకు సంవత్సరానికొకసారి సంక్రాంతి వస్తుంది. రాజకీయ వేత్తలకు అయిదు సంవత్సరాలకొకసారి వస్తుంది.

అసలు సంక్రాంతి ఇళ్ళూ, వాకిళ్ళూ అలికి సున్నం కొట్టి, ముగ్గులు పెట్టుకున్నట్లుగా - రాజకీయవేత్తలు తమ మనస్సుల పేరిటి పాతగోడలని గీకి తాత్కాలికంగా సున్నం కొట్టు కొంటారు "ముందుసంగతి" ఆలోచిస్తూ ముగ్గులు పెట్టుకుంటారు.

***పదవుల సంక్రాంతి***

ముఖ్యంగా తాము గడించిన అనుభవంలో ఉన్న చేదు తీపిని కలిపి వేపపువ్వు పచ్చడిలాగా నంజుకుంటారు ఓటర్ల దగ్గరకి వెళ్ళినప్పుడు "డూ డూ బసవన్న"లలాగా ప్రతి విషయానికి తలలూపుతారు. నమ్రత పేరిట మెడ గంటలు మోగిస్తారు.

చేటలో బియ్యంలాగా, నోటుకోసం ఆరాటపడతారు. "అయ్యగారికి దణ్ణం పెట్టు" అనే యజమాని మాటవిని గంగిరెద్దు కుడికాలు ఎత్తుతుంది. అలాగే "అధికార పిపాస" హెచ్చరిక విని వోటరకు నమస్కరిస్తారు. దీన్ని "పదవుల సంక్రాంతి" అనవచ్చు నిజానికి.

ఓట్ల సంపాదనలో కృతకృత్యులైనవాళ్ళు పదవుల పేరిట "పులగం కోసం ఎగబడడం కూడా కద్దు. కానీ ఈ "పులగం" అందరికి అందదు పాపం. కొత్త మంత్రులు సంక్రాంతి బొమ్మలలాగా బల్లల మీద ఎక్కుతారు. ప్రతి రాష్ట్రానికి అటు కేంద్రానికి ఈ బొమ్మల కొలువు ఉంటుంది.

ఎన్నో బొమ్మలు ఈ బల్లలెక్కాలని ప్రయత్నిస్తాయి. కొన్ని వికలం కూడా అవుతాయి. తక్కిన బొమ్మలన్నీ బల్లెక్కాలని ఎంతో ప్రయత్నిస్తాయి.

***నచ్చిన బొమ్మలు: నవ్వే బొమ్మలు***

కానీ బొమ్మల అలంకరణ బాధ్యతంతా పార్టీ నాయకునిది. ఆయన పాతవాటిలో కొన్నిటిని తీసి బుట్టలో పారెయ్యవచ్చు. తన వంక చూచి నవ్వేవాటిని, నమస్కరించే వాటిని. తన చుట్టూ నిత్యప్రదక్షిణలు చేసేవాటిని, తనకు నచ్చినవాటిని. తన నాయకత్వాన్ని మెచ్చేవాటిని కొన్నిటిని కొలువులో చేర్చవచ్చు.

ఈ సంవత్సరం పదవుల సంక్రాంతి చాలా వినోదంగా ఉంది. ఇంతవరకూ ఒక్క కేరళలో తప్ప - తక్కిన అన్ని రాష్ట్రాలలో కాంగ్రెసు బొమ్మలే కొలువులో ఉండేవి. ఈసారి అట్టి అవకాశం లేకుండా పోయింది.

మద్రాసు రాష్ట్రంలో బొమ్మల బల్లమీద అన్నీ కొత్తరకం బొమ్మలే వచ్చాయి. కాంగ్రెసు బొమ్మలన్నీ బుట్టలలోకి ఎక్కాయి. అనుకోని సంక్రాంతి వచ్చిందిక్కడికి. ద్రవిడ మున్నేట్రకజగం పేరిట బొమ్మలే అన్నీ.. ఈ పండగ చూచి చక్రవర్తి రాజగోపాలాచారిగారి కళ్ళు నీలి అద్దాల చాటుగా మిలమిలలాడినాయి.

ఈ కొత్త బొమ్మల కొలువు ఒక్క భారత దేశంలోనే గాక - ప్రపంచమంతటా విడ్డూరంగా వినిపించింది.

ఈ బొమ్మలు మాకు పులగం వాసిలేదంటున్నాయి ప్రజలకు. ప్రసాదం పంచిపెట్టడం మాట మాకు ముఖ్యమంటున్నాయి. తమిళదేశమంతా ఈ బొమ్మలకు నివాళులందిస్తున్నారు. దైవం సరిగా చూస్తే ఈ బొమ్మలు అయిదేళ్ళుంటాయి బల్లమీద. కేరళ రాష్ట్రంలో చాలాకాలం బొమ్మల బల్ల బోసిగా ఉండిపోయింది. అక్కడ కూడా కాంగ్రెసు బొమ్మలన్నింటినీ బుట్టలో వేసి కొత్త బొమ్మ లెక్కాయి బల్లమీద. అయితే ఇవన్నీ ఒకే తరగతి బొమ్మలుకావు. రకరకాలవి ఉన్నాయి. ముస్లిం బొమ్మలకు కూడా బల్లమీద స్థానం ఏర్పడింది. ఈ బల్లమీద ఒక దంపతుల జంట ఉండడం ప్రత్యేకత.

***పాత బొమ్మలకు రంగులు***

ఎన్నికల సమయంలో ఓటర్లు మహాశిల్పులుగా రూపొందుతూ ఉంటారు. ఒకప్పుడు పాతబొమ్మల సంగతి పట్టించుకోరు ఒకప్పుడు పాతవాటికి రంగులు వేసి. "బల్ల ఎక్కండి" అని దీవించి పంపుతూ ఉంటారు. వారి దీవనలు బొమ్మలకు జీవం.

ఇలాగే బెంగాల్, ఒరిస్సా, బీహారులలో కూడా క్రొత్త బొమ్మలతో కొలువులు ఏర్పరిచారు. ఈ అయిదు బల్లలమీదా అసలు కాంగ్రెసు బిమ్మలు ఒక్కటి కనిపించ కుండా పోయాయి.

బీహారు బల్లమీద - జనక్రాంతిదళ్. జనసంఘం, సంయుక్త సోషలిస్టు. ప్రజా సోషలిస్టు, స్వతంత్ర, మార్కిస్టు, ఇండిపెండెంటు బొమ్మలు వెలిశాయి. బొమ్మల సైజులు కుదరకపోయినా. పోలికలు సరిగ్గా లేకపోయినా, కాళ్ళక్రింద ఎత్తు పెట్టి నెత్తిన టోపీలు పెట్టి బల్లను ఒకేమాదిరిగా అలంకరించడం జరిగింది.

బెంగాల్ బల్ల మరీ విచిత్రంగా ఉంది. ఇక్కడ మాత్రం కొత్త రంగువేసుకున్న పాత కాంగ్రెసు బొమ్మలు కొన్ని ఉన్నాయి. ఇవిగాక ఆరు, ఏడు రకాల బొమ్మలు బల్ల ఎక్కాయి. వీటిలో ఘూర్ఖాలీగ్ బొమ్మల కూడా చేరాయి. వీటి ప్రక్కనే వర్కర్ లీగ్ బొమ్మలున్నాయి. మొత్తం మీద ఈ బల్ల అమ్మకం బల్లలాగా గాని - అలంకరించిన బల్లలాగా లేదు ఈ బొమ్మలలో - అన్నదమ్ముల జంట ఒకటి ఉంది.

ఒరిస్సా బల్లమీద స్వతంత్ర పార్టీ బొమ్మలు కొన్ని ఉన్నాయి. తక్కినవన్నీ తరగతుల వారీగా చేరాయి. రాజస్థాన్‌లో బల్ల దులిపి తెల్లబట్టవేశారుగాని, ఏ బొమ్మలెక్కాలో ఇంకా తేలలేదు. గవర్నరు కాంగ్రెసు బొమ్మలు పెట్టమనడం వల్ల - కొంత అలజడి బయలుదేరింది. తక్కిన రాష్ట్రాలలో కాంగ్రెసు బల్లమీద చేరుతోంది మెల్లగా.

**రాజుల పేరిట మోజు బొమ్మలు**

మన రాష్ట్రంలో చాలా వింత బొమ్మలు దిగిపోయాయి. రాజుల పేరిట మోజు బొమ్మలీసారి లేవు. వాటి స్థానంలో కొన్ని తాజా బొమ్మల్ని చేర్చారు.

ఇప్పటికి పధ్నాలుగు బొమ్మలు బల్లనలంకరించాయి. వీటిలో ఎనిమిది పెద్దవి - ఆరు చిన్నవి. ఏడు పాతవి, ఏడు క్రొత్తవి. ఇంకా బల్లల ఖాళీ ఉంది. ఒక ఆడ బొమ్మ. ఒక ముస్లిం బొమ్మ, బల్లమీద ఉండడం ఆచారం. ఈ రెండింటినీ ఇంకా ముఖ్యమంత్రి ఎన్నుకోలేదు. ఇవిగాక మరికొన్ని బొమ్మల్ని చేర్చవచ్చు.

కేంద్రంలో బొమ్మల కొలువు ఇంకా తీర్చులేదు. ఎలాటి బొమ్మలు వస్తాయో.. ఎంత మోజు కల్పిస్తాయో గమనించాలి. మొత్తం మీద ఈ ఏటి "పదవుల సంక్రాంతి" "పరీక్షల సంక్రాంతి" అయింది.

సంక్రాంతి పురుషుడు ఏవాహనం ఎక్కి వచ్చాడో తెలియడంలేదు.

(18 ' మార్చ్ 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**ప్రేమల్లో రాక్షస ప్రేమలు** కొన్ని ఉంటాయి. వాటి భీభత్సం వేరు.. రభస వేరు. అక్కడ రాణింపు శూన్యం, అనురాగ మృగ్యం వలపు హుళక్కి. గెలుపొక్కటే ప్రధానం.

అసలు రాక్షసుల చరిత్రలు తిరగవేస్తే ఇలాటి కథలు చాలా కనిపిస్తాయి. రామలక్షణులు అడవిలో ఉండగా - రాక్షస భామినులు వారివెంట పడటం జరిగింది. యోగ్యతా యోగ్యతలు కాదు - అక్కడ యోచించేది. కామపూరితులై, కళ్ళు మూసుకుని పోయి, ప్రేమపేరిట పిశాచ నృత్యాలు ప్రారంభించడమే.

మెప్పించి ఒప్పించుకోవడమనేది ఈ జాతి లక్షణం కాదు. బలత్కారమే మార్గం. అది ఒక పాశవిశక శక్తి దానికి యుక్తి ఏమిటి. రక్తి ఏమిటి?

**లక్షణునితో రాక్షసి సరసం**

రామలక్ష్మణులు దండకారణ్యంలో సంచరిస్తుండగా, ఒకచోట పెద్ద గుహకనిపిస్తుంది. వారిరువురూ అందులో ప్రవేశించారు. అక్కడ వికృతాకారం గల ఒక రక్కసి కనిపించింది. దాని పేరు అయోముఖి. అది చూసి చూడడంతోనే లక్ష్మణ స్వామిని ప్రేమించింది - అంత శరీరాన్ని గిరగిరా త్రిప్పుతూ లక్ష్మణుని చెయ్యి పట్టుకుని -

"వీరాధివీరా నా హృదయాన్ని దోచుకున్నావు నువ్వు. నిన్ను ప్రేమిస్తున్నాను. మన్మధుడు పుష్పబాణాలతో నన్ను దహిస్తున్నారు. ఇక సహించలేను ప్రియా నీ గాఢాలింగనంలో కరిగిపోవాలి నేను" అని అరవడం మొదలు పెట్టిందట.

లక్ష్మణమూర్తికి ఎలాంటి కోపం వచ్చిందో చెప్పలేం. పైగా ఆ రాక్షస నారీమణి, వయ్యారమంతా ఒలకబోస్తూ, బండిచక్రాలంత కళ్ళతో ప్రక్క చూస్తూ "ప్రియతమా! మనం ఏ పర్వత శిఖరం మీదనో, ఏ పచ్చటి వనంలోనో, లేక నదీతీరంలోని ఏ సైకత సీమకో ఎగిరిపోయి హాయిగా సుఖిద్దాం - రా నా రాజా" అంటూ వచ్చి లక్ష్మణుణ్ణి, అన్నగారి సమక్షంలోనే ఆలింగనం చేసుకొందిట.

దాని ప్రణయం పాడుగానూ - అంత కళేబరాన్ని ఈడ్చుకు వచ్చి ఆ సుందరమూర్తిని సందిట్లోకి తీసుకుని - సరసమాడటం ప్రారంభించింది. దాని చేతుల్లో పడి లక్ష్మణుడు కనుక బ్రతికాడుగాని - మరోడయితే చచ్చి క్రింద పడేవాడు.

**నీ ప్రణయం పాడుకాను నే దొరికానా!**

'ఎలాంటి పిచ్చిపనులు చేసినా ఆడవాళ్ళను చంపకూడదనే ఆంక్ష ఒకటి ఉంది రఘువంశ వీరులకు... అందుచేత అది బ్రతికింది. కానీ లక్ష్మణస్వామి కొంచెం దానికి బుద్ధిచెప్పాలని - చెవులూ ముక్కూ కోసి వదిలివేశాడుట.' నీ ప్రణయం మండిపోనూ... నేను దొరికానా నీకు. పో.. పో.. నీ గుహలోకి నువ్వు మళ్ళీ బయటకు రాకు ' అని.

రామచంద్రుణ్ణి వలచి వచ్చిన శూర్పణఖ సంగతి ఇంతేగా! దీన్ని చెవులూ, ముక్కూ కత్తిరించి పంపడం జరిగింది. ఆ శస్త్ర చికిత్సలన్నీ సుమిత్రానందునుడే చేశాడు. లేకపోతే రాక్షస ప్రేమకు రఘువంశ ప్రభువులా లొంగేది. శిక్షకోసమే ఆ మత్తకాశీనులు వారివెంట పడింది.

రావణాసురుడు కూడా ఈ రాక్షసత్వాన్ని ప్రకటించి సీతాదేవిని ఎత్తుకుపోయాడు. కానీ అతనికి కావలసిన ప్రాయశ్చిత్తం జరిగింది. అతడు అశోక వనంలో ఉన్న సీతాదేవితో అంటాడు "పరస్త్రీలను బలాత్కారంగా పొందడమే మా రాక్షసధర్మం" అని. వాడి ధర్మం - లంకా దహనానికీ, చివరకు విధ్వంసానికి దారి తీసింది.

రాక్షసులందరూ ఇలా స్త్రీలను చెరబట్టడం ఒక వినోద క్రీడగా భావించి, కొంతవరకు జీవితాన్ని దొర్లించి చివరకు ఏ శ్రీ విష్ణువు చేతిలోనో పడి నశించి పోవడం జరుగుతూ వచ్చింది. ఒకడు రంభమీదకు ఎగబడితే, ఒకడు మేనక మీదకు ఒకడు తిలోత్తమమీదకి దాడితీస్తే - ఒకడు శచీదేవి మీదకు..

***అప్సరసల పైట కొంగులపై అడుగులు***

ఒకడు ఇంద్రపదవి కావాలని పరుగులు తీస్తే - ఒకడు నందనోద్యాన నీడలో పచార్లు సాగించాలని, అప్సరసల పైట కొంగులు పరిచి వాటిమీద అడుగులు వేస్తూ ఆనందించాలనీ - కోరడం జరిగింది.

ఇవన్నీ రాక్షసచర్యలు.. ప్రేమ అనడానికి ఎక్కడ అవకాశం ఉంది. ఎలా అనగలుగుతారు.

రాక్షసిమూకకు రాక్షసి అలవాట్లుండటం సహజం. కొంతమంది నరులలో కూడా రాక్షసప్రవృత్తులుండటం మరీ విచిత్రంగా ఉంటుంది. అసలు వారి పుట్టుకను గురించే ఎంతగానో వ్యాఖ్యానించవలసి ఉంటుంది. ఆడవాళ్ళు ఉద్యోగాలు చేసే శాఖల్లో కొందరు పై అధికారులు ఈ ధర్మ దారిద్ర్యానికి లోబడి వెర్రి చేష్టలకు దిగుతూ ఉంటారు. "ఉపకారానికి అపచారం తోడు కావలిసిందే" వీరిపట్ల. ఇలాటి దుస్సంఘటనలు ఎన్నో జరుగుతూ ఉంటాయి. ఉద్యోగాలన్వేషించే వనితామణుల విషయంలో ఈ రాక్షసకృత్యాల్ని అరికట్టి శ్రీరామచంద్రులు ఎందరో అవతరించవలసి ఉంది. ఎక్కడో ఎప్పుడో.

***చరిత్రపుటల్లో సిరాపూతలు***

ఉద్యోగాల విషయంలోనే కాదు. ఏదో కొంచెం దీనదశలో ఉండి ఆశ్రయం కోసం వెళ్ళినా, ఆర్థిక సహాయంకోసం వెళ్ళినా - అలాటి వారిని చులకనగా చూచి వలపులు గుమ్మరించడానికి ప్రయత్నించే నరరూప రాక్షసులు చాలామంది ఉంటారు. ఈ 'బలవంత ప్రణయాల' చిద్రఘట్టాలు చరిత్రలో అనేకం గోచరిస్తాయి. వారంతా చరిత్రపుటల్లో నల్ల సిరా పూసిన నదులు.

అరేబియా దేశానికి వెనుకటి కథలు కొన్ని చదివాను. అవన్నీ బలవంత ప్రణయాలే. ఎక్కడ పడుచుకత్తె కనిపించినా ఎత్తుకుపోవడమే. నదులూ ఉండవు. మక్కువలూ ఉండవు. మధుపానాల మత్తు, తప్ప అలాటి గాథలు స్నిగ్ధ ప్రణయ స్వరూపానికి చిత్రవధల వంటివి.

ఏకాలంలో మాటో ఎందుకూ, ఈకాలంలో కల్యాణం చేసుకుని కాపరానికి తీసుకొచ్చిన ఆడపిల్లల్ని - పట్టి పల్లార్చే పురుషుడు - చేసుకున్న పురుషుని గుండెలు పింజలు పింజలుగా ఏకి ఏకులు చుట్టే సుదతీ మణులు ఎందరో ఉంటారు. వారందరూ రాక్షస జాతికి చెందినవారే.

నాధుణ్ణినమ్మి నడిరోడ్డు

నాధుణ్ణినమ్మి నడిరోడ్డుమీద చావు

ఇలాటి గృహాలలో సక్కుబాయి అత్తలు కొందరుంటే - చింతామణి తల్లిలాటి శ్రీహరులు కొందరుంటారు.. వారికి ప్రణయ మేం తెలుసు. రాక్షస రణాలే తప్ప. ఇటీవలనే ఒకరింట్లో కోడల్ని - విషమిచ్చి బయటికి పంపించారుట. అటు పుట్టింటా కాకుండా, ఇటు అత్తింటా కాకుండా నడిరోడ్డు మీద ప్రాణాలు వదిలిందట.'

ప్రణయ స్మామ్రాజ్యానికి పూల సింహాసనాలైన పడకటిళ్ళే బలి పీఠాలవుతున్నాయి. కొన్నిచోట్ల కొందరు జాణలు కాపురాలు చేస్తున పురుషుల్ని పిట్టల్లాగా చేసి ఇట్టే తన్నుకుపోయి - వో ఎండు కొమ్మమీద చిలిపి గూడు కట్టి - వలపు పేరిట ఉచ్చులు బిగించి, మచ్చ మూసేస్తున్నారు. ఆ తొత్తు బిత్తరపోతూ జీవితమంతా గడిపివేస్తున్నారు. ఇలాటి రాక్షస ప్రణయాల్ని సంఘం ఉపేక్షించడం జరుగుతోంది. ఆ భీకర జీవుల్ని ఏ శిక్షా స్మృతులూ శిక్షించలేకపోతున్నాయి.

"స్నిగ్ధ ప్రణయం వర్ధిల్లాలి" అనే నినాదం నలుదిక్కులా వినిపించాలి.

(18 ' సెప్టెంబర్ 71, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**వీడ్కోలు సందర్భంలో** చాలా మంది సభలు జరుపుతారు. సాధ్యమైనంతవరకు ఆ వెళ్ళిపోతున్న పెద్దమనిషిని గురించి గొప్పగా వర్ణిస్తారు. నిజంగా ఆ వ్యక్తి బలి అవడం వల్ల ఆ ప్రాంతమంతా వట్టి "థార్ ఎడారి"గా మారిపోతుందనీ, అక్కడి ప్రజలంతా స్పృహతప్పి పడిపోవడానికి సిద్ధంగా ఉన్నారనీ, వర్ణిస్తారు.

ఒక ఉపన్యాసకుడు ఎంతో బలహీనంగా లేస్తాడు. "నిజంగా నాకు దుఃఖం ముంచుకు వచ్చేస్తోంది. ఆపడం కష్టంగా ఉంది. ఇలాటి మహనీయుడు ధర్మమూర్తి, పరోపకార పరాయణుడు, ఇలా హఠాత్తుగా నన్ను వదిలిపోవడం ఎంతో దురదృష్టకరం.

***వెళ్ళిపోతున్నారు - వెంకట చలంగారు***

ఆయన వచ్చిపట్టుమని మూడు సంవత్సరాలైనా కాలేదు. ఇంకో పదేండ్లయినా ఉంటాడనుకున్నా. కానీ ఇంతలోనే బదిలీ అవుతుందని కలలో కూడా అనుకోలా. ఈ బదిలీ ఆర్డర్లు వేసేవారికి కరుణా, జాలీ రెండు ఉండవనేది తెలిసిపోయింది. వెళ్ళిపోతున్నారు. వెంకటచలంగారు... వెళ్ళిపోతున్నారు... నేనిక మాట్లాడలేను.."

మరోకాయన లేస్తాడు... "ఇప్పుడు సీతాపతిగారు వెలిబుచ్చిన ఆవేదన విన్నారు కదా! వెంకటచలంగారి వంటివారు వెడుతున్నారంటే ఎంతో కష్టంగానే ఉంటుంది. అది సహజం. మరి ఆయనగారీనాడు మూడుసంవత్సరాలు మన ఊర్లో టీకాలు వేసే ఉద్యోగంలో మనకు చేసిన ఎనలేని సేవ మీకందరకూ తెలిసిందే

***టీకాలు వేస్తే ఆయనే వెయ్యాలి... అన్నీ ఒకే సైజు***

టీకాలు వేస్తే ఆయనే వెయ్యాలి. ఇలా వేస్తే అలా పొంగేవి. పిల్లలకు కూడా నొప్పి ఉండేది కాదు. అదేం ఆశ్చర్యమో ఆయన టీకాలు వేస్తే - అందరి చేతులమీద ఒకే సైజు మచ్చలు పడేవి. హెచ్చు తగ్గులు రవంత ఉండేవి కావు. కావాలంటే చూడండి - వారిచే టీకాలు వేయించుకున్న వారిక్కడ చాలామంది ఉంటారు. ఆయన టీకాలలో నిపుణుడు. మళ్ళీ అంతటి వాడు వస్తాడంటే నాకు నమ్మకం లేదు.

అయినా, ప్రస్తుతం వెళ్ళిపోక తప్పదంటున్నారు. కానీ మనం అంతమాత్రంతో వదలకూడదు - మంత్రివర్గం వద్దకు రాయబారమన్నా వెళ్ళి మళ్ళీ మూడు మాసాలలోగా వెంకట చలంగారి నిక్కడికి రప్పించుకోవాలి తప్పదు. " (హర్షధ్వానాలు)

సభలో ఏ ఒక్కరో లేచి "మనం టీకాల సమ్మె ప్రారంభిద్దాం. వెంకటచలంగారు తిరిగి వచ్చేదాకా దాన్ని నిర్వహిద్దాం. మన పట్టు ఎంతమాత్రం వదలవద్దు. భారతమాత పుత్రుల మనిపించుకుందాం" అని గంభీరోపన్యాసం చేస్తాడు.

కొందరు బదిలీ అయినప్పుడు ఎవరితోనూ చెప్పకుండా ఊరు విడిచి వెళ్ళడం కూడా జరుగుతూ ఉంటుంది. కారణం బదిలీ అయిందని తెలిస్తే అప్పులవాళ్ళు వెంటపడతారని భయం. అందుకని భార్యా, పిల్లల్ని ముందు పంపించి, ఏ తెల్లవారు ఝామునో సామాను పంపించి, ఊర్లో కాపురం ఉన్న తాళం పెట్టి, ఉంచి వెళ్ళిపోతూ ఉంటారు.

***ఆయన వెళ్ళిపోయాడు – అయిదురూపాయల వ్యక్తి***

అలా వెళ్ళిపోయిన తర్వాత ఊర్లో వాళ్ళు కొందరు అనుకుంటూ ఉంటారు. "పాపం అలా చెప్పకుండా వెళ్ళిపోయాడు. మనతో చెబితే ఆ బాకీలన్నీ రద్దు చేయించి వీడ్కోలు సభ జరిపి, చక్కగా పంపించేవాళ్ళం. ఎందుకంటే ఆయన ఉన్నన్ని రోజులూ మన పనులు అన్నీ చక్కగా జరిగినాయి. అయిదు రూపాయిలిస్తే ఎంత పనయినా చేసేవాడు. అంత మంచివాడు మళ్ళీ దొరకడం కష్టం" అని –

ఒక స్కూల్లో పనిచేసే మాస్టరుగారు ఒకాయన అనుకోకుండా బదిలీ అయ్యాడుట. ఆయన చండశాసనుడుగా ఉండేవాడుట. బదిలీ వార్త విని విద్యార్థులు ఎంతో సంబరాలు పడ్డారట. ఆయన వద్దకు వెళ్ళి పెద్ద ఎత్తున వీడ్కోలు సభ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

"నాకేం అక్కరలేదు. నన్ను వెళ్ళనివ్వండి అదే చాలు. నాకెప్పుడూ వీడ్కోళ్ళూ, స్వాగతాలు అలవాటు లేవు. జీతం కోసం పనిచేసేవాళ్ళకి సంబరాలు దేనికి?" అని ఆయన అంగీకారం ఇవ్వలేదుట. అయినా విద్యార్థులు వదలలేదు. బ్రతిమాలి ఒప్పించారు.

***గట్టిగా పట్టుకుని వీడ్కోలు పత్ర సమర్పణ***

తలో రెండు రూపాయలు చందావేసుకుని పెద్దగా ఏర్పాట్లు చేశారుట. మాస్టారు గారికి ఒక కాశ్మీరు శాలువా తెచ్చి కప్పారట. ఆయనగారు లోలోపల ఉప్పొంగి పోయాడుట.

తర్వాత సన్మానపత్ర సమర్పణ, వీడ్కోలు పత్రం చదవడం ప్రారంభించారుట. వీడ్కోలు పద్యాలు ఇలా ఉన్నాయట.

**"ఇప్పటికైనను తొప్పెలే నీ పోరు**
**పీడ తప్పినదయ్య నేడు మాకు**
**మా పాఠశాలలో మహిషాసురుండవై**
**కణకన నిప్పులు గ్రక్కినావు**
**ఎంత వోర్చినగాని, ఎంత తిట్టినగాని**
**ఏన్నాళ్ళ శనిలాగ ఏలినావు**

... అంటూ ఒకరు చదవడం ప్రారంభించేసరికి ఆ మాస్టారుగారికి ఎక్కడలేని కోపం వచ్చి ప్రక్కనున్న భార్యను లేవదీసుకుని పారిపోవడానికి ప్రయత్నించాడుట. అలా జరగడానికి ఎంతమాత్రం వీలులేదు. మా సన్మానాలన్నీ పొంది తీరవలసిందేనని నలుగురు విద్యార్థులు ఆయన్ని, నలుగురు విద్యార్థినులు ఆయన భార్యను పట్టుకుని కూర్చోపెట్టి కార్యక్రమమంతా యధావిధిగా నెరవేర్చారుట. హతోస్మి అని ఉపాధ్యాయులవారు అప్పుడు కొంపకు చేరి ఆ రాత్రి ప్యాసింజరులో బదిలీ ఊరుకు ప్రయాణమై చక్కాపోయారుట.

వీడ్కోలు సభలు జరపడంతో కొంత ఆప్యాయత ఉండకపోదు. కానీ, అంత ఖర్చు పెట్టడంలో అమితంగా పొగడడంలో మాత్రం అర్థం ఉండదు.

**(1 ' ఆగస్ట్ 76, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

''వంకలు పెట్టని జీవితం మీతో గడపాలని ఉన్నదండీ! ఒక్క వరం ఇవ్వండి'' అని ఒక ఇల్లాలు భర్తను ఒకానొక సంతోష సమయంలో కోరిందట.

''వంకలు పెట్టడంలో గల రహస్యం నువ్వు గ్రహించలేదన్నమాట. వంకలు పెట్టడం దేనికి?.. ఇతరులలో గల కూలంకష ప్రజ్ఞ బయటపెట్టడం కోసం.. నిర్వహించే పనులు అకుంటిత దీక్షతో నిర్వహించేందుకు ఒక్క ముక్కలో చెప్పాలంటే మరింతగా రుచిని, అందాన్ని. ప్రతిభను బయట పెట్టించి - రస జగత్తులో చెట్టాపట్టాలు వేసుకుని షికార్లు చేసేందుకు'' - అని ఆయనగారో ఉపన్యాసం ఇవ్వబోతుండగా..

- ఆమెగారు ''దయచేసి ఆపండి. అంతలా సమాసాలు వేసి మాట్లాడుతుంటే నాకు అసలే అర్ధంకాదు.. ఆలు మగల మధ్య అంత భాష దేనికి?

ఊసులే చాలు..

నీ మూగభాసలే చాలు..

- అన్నాడొక ఆధునిక కవి కుమారుడు. కనుక దయవుంచి సామాన్య భాషలోకి రండి'' - అన్నదామె.

''అంటే..?'' అని ఆయన కోపంగా అడిగాడు. ''శిష్ట భాష ఇంట్లో మాట్లాడకూడదా?'' అని వెంటనే ప్రశ్నించాడు.

### ***'చిటికె వేసేచోట చిఱతలెందుకండీ!'***

''అయ్యయ్యో! మీకు అంత కోపమైతే ఎలాగండీ? శిష్ట, విశిష్ట భాషలకోసం వెతుక్కుంటూ మాట్లాడుతారటండీ ఇల్లాలితో.. భావాలు అర్ధం చేసుకోవడానికేగా భాష - అందులో కలసి మెలసి సంసారం చేస్తున్న వాళ్ళ భావాలందించడానికి అంత కంఠశోష దేనికండీ!.. నవ్వులోనే నాలుగు భాషలున్నాయి. చూపుల్లో చెప్పలేనన్ని భాషలున్నాయి'' అని వ్రాయలేదండీ పెద్దలు.

''ఇంతకోపమంటావు.. ఎక్కడా మంచి శబ్దం పడకుండా పొడిపొడిమాటలతో మాట్లాడమంటావు. నీకు మాసాంతాల మీద (జీతంకోసం) అభిమానమేగాని సమాసాల మీద లేదన్నమాట!''

''తమరి చమత్కారాలు చాలులెండి. నేను వంకలు పెట్టని జీవితం ఒక్క నెల అని అడిగితే ఇంత గొడవ చేస్తున్నారు. చిటికెలతో సరిపోయేదానికి చిరుతలెందుకు? భజనలెందుకు? వంకలమాటేమంటారు?'' అన్నదామె.

''నువ్వు చేసే పనులు వగైరాలు ఏమన్నా బాగుండలేదని వంకలు పెట్టానేమోగాని, నిన్ను ఎపుడూ ఎలాంటి పరిస్థితుల్లో వంకపెట్టలేదు. జిహ్వాచాపల్యం కొంచెం అధికం గనుక వంట విషయంలో ఏమన్నా అన్నానేమో.. నువ్వు వంకలేని వ్యక్తివి'' అన్నాడాయన.

''ఏమీ వంక పెట్టకూడదు.. నేనేదో పుస్తకం వ్రాయాలనుకుంటున్నా. దానికో నెలరోజులు పడుతుంది. ఈనెలా మిమ్మల్ని వంట చెయ్యమంటే బాగుండదు కనుక - వంక పెట్టకుండా తినిపోవాలి'' అన్నదామె.

### ***వంకెల వడ్డాణం - చంకలో చంటివాడు***

ఆయనగారు మందస్మిత వదనారవిందుడయ్యాడు. వంకలు పెట్టడం మానుకుంటానని వప్పుకున్నాడు. వంకలు కేవలం సరసం కోసం మాత్రమేనని తెలియపరిచాడు. తను జీవితంలో కోరిన తరహా భార్య రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలియచేశాడు. ఆమె కొంచెం సంతృప్తి పరిచింది.

అప్పుడు చెప్పాడు ''మా అమ్మ నా మనసులో గీసిన చిత్రపటం ఎప్పటికీ అలాగే ఉంటుంది. ఆవిడ చెప్పేది ''కొంచెం బొద్దుగా ఉండాలి కోడలు.. వంకెల వడ్డాణం ధరించాలెప్పుడూ.. చంకలో చంటివాణ్ణి వేసుకుని కాసేపు సావిట్లో తిరగాలి.. కాసేపు వాకిటి గుమ్మంలో నిలబడాలి అని. నే కోరింది అదే'' అన్నాడాయన.

ఆమె వెంటనే మాట అందుకుని "ఎప్పుడూ చెప్పలేదేం. మీకంటే మీ అమ్మగారే చాలా ఫార్వర్డ్. ఆవిడ పిల్లాణ్ణి చంకనేసుకుని వంటింట్లోకి వెళ్ళమనలేదు" అన్నదామె.

"ఏదీ అందాక రాలేదుగా. వస్తే చెపుదామనుకున్నాను" అని ఆయన ముసిముసి నవ్వులు నవ్వాడు.

***కత్తిపీట విరగగొట్టి దొడ్లో పారేస్తా***

ఒక ఇల్లాలు ఎంత బాగా కూర వండినా ఆయనగారు ఏదో వంకపెట్టి సణుగుతూ సాంతం తినేసేవాడు. ఒక్కరోజు కూడా సంతృప్తి ప్రకటించేవాడు. కాదు మెచ్చుకుంటే భార్యకెక్కడ గర్వం వస్తుందోనని భయం. అందువల్ల "ఏం కూర నా బొంద కూర. రుచీలేదు పచీలేదు. నువ్వు వండటం - నే తినడం -" అంటూ తినడం ఆయనకు అలవాటు.

"కొందరు లొట్టలతోనే పొట్టనింపుకుంటారు. ఈయన లొట్ట వేయడం నేచూడలేదు. పొట్టకు అన్యాయం చేయడం చూడలేదు" అని ఆమెగారు ఎంతో కోపం వెలిబుచ్చుతూ ఉండేది.

ఒకరోజున పతి చామదుంపల కూర తిని ఇంకా వెయ్యమన్నాడుట. ఆవిడకోసం అట్టిపెట్టుకున్న రెండు ముక్కలు కూడా వేసేసిందిట. కర్మం చాలక ఆ రెండింటిలో ఒకటి కొంచెం గట్టిగా ఉంది.

దాంతో ఆయన గలాటా ప్రారంభించాడుట. "ఏమిటీ కూర వండటం? గట్టిగా తగలడిందేం ఈ దుంప? ఆ మాత్రం చూసుకోనక్కర్లే.. శాకాల్ని బొమికల క్రింద మారుస్తారు -" అని ఆ గొడవ సారాంశం.

అంతకూర తిని ఊరుకున్నా పోయేది, ఆవిడ వంతు కూడా తిని అలా సణుగుతుంటే ఆవిడ భరించలేకపోయింది. 'అవి నాకోసం ఉంచుకున్న దుంపలు. మెత్తటివి ఏరి వేశాను మీకు. అక్కడితో ఆగితే బాగుండేది. మళ్ళీ తెమ్మంటే ఇవి వేశాను. ఆలి మీద జాలీ గ్రటా ఏం ఉండక్కర్లా. ఏం తింటుందో చూడక్కర్లా? ఆఫీసుకు పోయేటప్పుడు వచ్చి నేనేం తినబోతున్నానో చూశారా ఒక్క రోజైనా తినబోయే ముందు? పోనీ నువ్వు కూడా ఇద్దరం తిందాం అన్నారా ఒక్కరోజైనా?

- రేపటినుండి నేను కూర వండనే వండను. కత్తి పీట విరగ్గొట్టి దొడ్లో పారేసి ఏ ఊరగాయో వేసి పెడతా! ఒళ్ళు విరుచుకుని ఎంత చాకిరీ చేస్తే మాత్రం ఏం లాభం?

***కాలికి మువ్వలు లేని భరతనాట్యం***

ప్రతిరోజూ రెండుపూటలా వంటింట్లో కాలికి మువ్వలు లేని భరతనాట్యం.. పోనీ నవ్వులన్నా ఉంటే బాగుండనుకుంటే నాటికి బదులు ఇలా సణుగుళ్ళు"

అసలా భరతముని వంటింట్లో ఆడవాళ్ళ అభినయం - సావిట్లో మొగవాళ్ళ చిందులూ చూచే నాట్యశాస్త్రం వ్రాశాడేమో. అసలు, ఒకరోజు మగవాళ్ళూ, ఒకరోజు ఆడవాళ్ళూ వంటపని చేస్తూ ఉండాలనే షరతుతో పెళ్ళిళ్ళు చేసుకుంటూ ఉండాలి.

ఆ రోజుల్లో ఆడవాళ్ళకు సంపాదన ఉండేది కాదు గనుక - వండి పెట్టడం తప్పేది కాదు. ఇప్పుడు అంతా సంపాదిస్తున్నారు. అంతా సమానమేనని గ్రహించారు. కనుక మాటలు మాత్రం పడరు.. ఈ యుగంలో ఎవరూ ఎవరికీ తలవంచరు. జంటలుగా కుదరడం తప్పదుగనుక - జీవితాలు యుగళగీతాలుగా సాగిపోవలసిందే - అని ఆమె గట్టిగా చెప్పేసిందిట.

***గేటు దగ్గరుండండి నే ఈల వేస్తా...***

ఒక ఇల్లాలు ఇటీవల స్వయంగా చెప్పింది. వాళ్ళ ఆయనకు ఆఫీసు నుంచి వచ్చేటప్పటికి టేబుల్ మీద కాఫీ సిద్ధంగా ఉండాలిట. అది కొంచెం వేడిగా ఉంటే. "ఇదేం గొంతుక అనుకున్నావా! ఇనుప గొట్టం అనుకున్నావా? " - అని అరుస్తాడుట. కొంచెం చల్లారితే "ఈ ఐస్ కాఫీ.. ఇంట్లో గాస్ అయిపోయిందా. నీలో ప్రేమ తరిగి పోయిందా?" - అని బొబ్బలు పెడతాడట.

ఆ సార్వభౌముడు సావిట్లో ఏవేళప్పుడు అడుగు పెడతాడో తెలియదాయె. సమపాళంగా కాఫీ ఉంచడానికి ఎలా కుదురుతుంది? ఫ్లాస్కులో పోసినా - వేడిగా ఉన్నా కేకలే. చల్లారినా కేకలే. సంవత్సరాల తరబడిగా ఇలా తిట్లు తిని తిని ఆమె మొన్ననే చెప్పిందిట.. "మీరు గేటు దగ్గరకు రాగానే ఈలవేయండి. నేను కాఫీ సమపాళంగా ఉండగా నేను ఈలవేస్తా. ఒక్క అంగలో వచ్చి మీరు త్రాగాలి. ఆలస్యం చేస్తే అపరాధ మీదే ఈల విని వచ్చి గోలచేయకుండా తాగండి.." అని.

(17 జూలై 76, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**ఎంత వద్దని బ్రతిమాలుకున్నా** ఏ మాత్రం లక్ష్యం చేయకుండా వ్యక్తి వయస్సు పెరుగుతూనే ఉంటుంది జీవితకాలం తరుగుతూనే ఉంటుంది. వయస్సు పెరిగిన కొద్దీ వాంఛలు తరగాలని - ముసలితనంలో జీవితం మోడులాగా మారాలనీ - చితారు కొమ్మన చివురాకులు రెండు ఉంటాయనీ - అవి భక్తికి సంబంధించినవనీ చెపుతారు.

ఎన్ని వ్యామోలు సడలినా, వాంఛలు వదిలినా - భక్తి భావన మాత్రం మిగలాలని వేదాంతుల అభిప్రాయం. ఆ భావాలు ఎల్లకాలం చివుళ్ళుగానే ఉంటాయి. ముక్తిసాధించ కలిగితే పువ్వులలాగా మారిపోతాయి. చివరకు మనిషితోపాటు మాయమైపోతాయి.

కోరికలు తగ్గించుకో నాయనా! కొంత విశ్రాంతి చిక్కుతుందీలోకంలో - అంటే వినేవారెవరుంటారు? బ్రతికి ఉన్నంతవరకూ కోర్కెలే! ముసలితనం, కాళ్ళూ చేతులూ కట్టిపడేసినా, మిగిలిన కొంచెం నెత్తురును తోడేసినా - కోర్కెలు మాత్రం తరగవు పెరుగుతూనే ఉంటాయి.

***"బుర్రలు మారవు బుద్ధులు చెరగవు"***

"కాలెండరు కాగితం మారినప్పుడల్లా జీవితం గమ్యానికి దగ్గరవుతోందని తెలుసు కానీ ఏది చివర కాలెండరో తెలియదు. ఏ తేదీ ఈ జీవితానికి స్వస్తి చెపుతుందో తెలియదు కానీ గుండెలు సరిగ ఉన్నంతసేపూ కోర్కెలు గుత్తులు గుత్తులుగా వ్రేలాడుతూనే ఉంటాయి" అన్నాడొక మహారచయిత.

ఇలాంటి సత్యాలెన్ని తెలిసినా నరులకు బుర్రలు మారవు బుద్ధులు చెరగవు. ముసలితనంలో కూడా రోషాలు పెరిగిపోతూ ఉంటాయి. చిన్నతనంలో అలవాటైన పిచ్చివేషాలు అలాగే ఉంటాయి. ధనపిపాస పెరుగుతూనే ఉంటుంది. అహంకారం అంతకన్నా పెరుగుతూనే ఉంటుంది దుర్బుద్ధులు కూడా కొల్లేట దుబ్బుల్లాగా పెరుగుతూనే ఉంటాయి, తరిగేది ఆయువు ఒక్కటే.

ఒక అరవై యేళ్ళ వృద్ధుణ్ణి "ఏం తాతా! ఇంకా ఎన్నేళ్ళు బ్రతకాలని ఉంది నీకు?" అని ఎవరో ప్రశ్నించారట ఆయన నవ్వి "ఇంకొక్క అరవైయేళ్ళయితే చాలు" అన్నాడుట.

"అప్పటికి సంతృప్తిగా, శాంతంగా జీవితాన్ని ముగించగలవా?" అని ప్రశ్న.

"ప్రయత్నిస్తాను ఈ అరవైఏళ్ళలో జారిపోయిన సుఖాల్ని సంపాదించి తిరిగి అనుభవించడానికి మరో అరవై యేళ్ళు అవసరం కదా తర్వాత ఎలా ఉంటుందో - అప్పుడు ఆలోచించిగాని చెప్పలేను" అన్నాడుట ఎన్నేళ్ళు జీవించినా కోర్కెలు ఇలా పెరుగుతూనే ఉంటాయి గాని - తరగడం ఉండదు -

ఒక గొప్ప గృహస్తుడున్నాడు. ఆయనగారింటికి వెళ్ళాను ఏదో ఆలోచనలో ఉన్నాడు కూర్చోమన్నాడు గాని - బుర్రలో ఏదో తొలుస్తోందిగా వల్లు - గోకుతూ ఆలోచిస్తున్నాడు" "మీరేదో ఆలోచిస్తున్నారల్లే ఉంది నే వెళ్ళి వస్తాను" అన్నాను.

***సిమెంటు రెకులు వేసి సింగిల్ మిషన్‌కు ఇవ్వాలి***

"ఏం లేదు - వాకిట్లో ఒక మూలగా నాలుగైదు గజాల స్థలం ఉంది వృథాగా ఉంచడం దేనికి? అక్కడొక చిన్న సిమెంటు షెడ్డు వేసి ఎవరికైనా సింగర్ మిషన్ వాళ్ళకిస్తే ఓ యాభై రూపాయలిస్తారు ఒక మిషను పడుతుంది. ఒక కట్టింగ్ బల్లక్కూడా స్థలం ఉంటుంది" అన్నాడాయన ఎంతో ఆలోచనగా.

"మీ ఆలోచన బాగానే ఉంది. ఇంకొక్క పనికూడా చెయ్యండి మిషను కూడా మీరే కొని ఇవ్వండి దానికో యాభై అద్దె వస్తుంది వాటికి చాలా గిరాకీ ఉంది" అన్నాను.

"మీరు చెప్పింది బాగానే ఉంది మరో ఆలోచన తట్టింది నాకు. మిషన్ కుట్టేందుకు ఒక కురవాణ్ణి పెడితే చాలు మా ఆవిడకు కట్టింగ్సు బాగా వచ్చు ఊరికే కూర్చుంటోంది ఇంట్లో నిక్షేపంగా ఉంటుంది టైలరింగ్ వ్యాపారం పెడితే" అని ముఖం ఇంత చేసుకున్నాడు.

ఆవిణ్ణి పిలిచి తన ఆలోచన చెప్పేశాడు షెడ్డును వెంటనే ప్రారంభిస్తానన్నాడు సింగర్ మిషన్ కంపెనీకి ఫోను చేసి ధర కనుక్కున్నాడు. ఆ సంతోషంలో నాకో అరకప్పు కాఫీ ఇప్పించాడా ఇల్లాలి చేత. ఆయనకు ఇంటిమీద అప్పటికి వస్తున్న అద్దె సుమారు పద్దెనిమిది వందలు.

వ్యాపారంలో ఉపాయం చెప్పినందుకు నాకు కాఫీ సత్కారం జరిగింది కొంచెసేపు చిరునవ్వుల జల్లు కురిసింది. అదే ఏ వేదాంతమో, కవిత్వమో చెపితే - మంచినీళ్ళు కూడా పుట్టేవికావు. ఆయన కోరిక ఒకటే సిరి పెరగడం ఇతర విషయాలన్నీ మరవడం.

సరి సిరి పెరగడం ఒక్కటే లక్ష్యంగా పెట్టుకున్న ఆ మహనీయుని జీవితంలో ఎన్ని సుగుణాలు తరుగుతున్నాయో లెక్కచెప్పేదెవరు. ఉన్నది చాల్లేవయ్యా ముక్కుమూసుకు కూర్చో - ముక్కంటిని స్మరించుకొమ్మని బలవంతం చేసేదెవరు?

*"మూడో లక్షపూర్తి కాకుండా కన్నుమూశాడు మూర్ఖుడు"*

వెనుకటి ఒక పెద్దమనిషి - చిన్నప్పటి నుంచి పదిరాళ్ళు సంపాదించడమో పరమావధిగా పెట్టుకుని, దానికోసం వీలైనన్ని అక్రమాలు, అన్యాయాలూ చేశాడు. ఆలి మెళ్ళో తాళిబొట్టు కొంక నులకతాడు కట్టించాడు. సిరిని పెంచడంలో గల కిటుకులన్నీ నేర్చుకుని - మూటగట్టి దాచాడు.

కాలం తీరింది. కన్ను మూశాడు. కుమార రత్నం అంతా లెక్కకట్టి చూసుకున్నాడు. మూడో లక్ష పూర్తికాలేదు అతనికి ఎంతో కోపం వచ్చింది తండ్రిని వట్టి మూర్ఖుడి క్రింద జమకట్టాడు. ఆ కాస్తా పూడేదాకా ఎందుకు బ్రతక్కూడదూ? లేదా పోతానని గ్రహించి మరింత తొందరగా మూడో లక్ష ఎందుకు పూర్తిచెయ్యకూడదూ!? - అని తిట్టిపోశాడుట ఆయనకు తగిన శాస్తి చెయ్యాలని కర్మకాండలకు స్వస్తిచెప్పాడు.

సంపాదించినంత మాత్రాన సర్వసుఖాలు లభిస్తాయనే మాట అబద్ధం. సిరి మీద ఆశగలవాడు తను సుఖపడడు ఇంకోళ్ళను సుఖపడనివ్వడు (తను బ్రతికి ఉండగా) - చివరకు మిగిలేది చివాట్లే! ఎంతసేపూ వీరిని ఆరాధిస్తాడే గాని - హరిని గురించి ఆలోచించేందుకు అవకాశమెక్కడ ఉంటుంది? .. నెత్తురు విరిగినా చిత్తం మారదు. 'ధోవళీ కట్టుకుని జావళీలు పాడాడట'

వెనుకటికి ఒక వృద్ధుడు ఎంతసేపూ ఐహికాలలోనే పడి కొట్టుకుంటూ ఉండేవాడుట. అందరూ చులకనగా చూడటం ప్రారంభించారు. ఎక్కడన్నా స్త్రీ కనిపిస్తే కాళ్ళు తడబడేవిట. కళ్ళు వెంటపడేవిట. ముసలి ఒళ్ళు మెలికలు తిరిగేదట.

ఈ పరిస్థితి చూచి చనువైన వాళ్ళు మందలించారుట కొందరు ధైర్యం చేసి నిందించారట భార్య బ్రతిమాలి చెప్పిందట. కొందరు ధైర్యం చేసి నిందించారట. భార్య బ్రతిమాలి చెప్పిందట మీరిలా మాటలు పడుతుంటే వినలేకుండా ఉన్నాను. దయవుంచి ఆ చెడ్డ

అలవాటు తగ్గించుకోండి - లేకపోతే నేను ఆత్మహత్య చేసుకుంటానని "అబ్బే నాకేం అలవాట్లున్నాయి అయినా ఊళ్ళో నీకంటె అందకత్తెలెవరున్నారు? " అన్నాడట.

తల్లి పడే ఆవేదన చూడలేక కొడుకులు కూడా తండ్రిని చివాట్లు పెట్టారుట చివాట్లతో అలవాట్లు తప్పుతాయా? ఆయనగారెంత మాత్రం మారలేదు. వాళ్ళకి ఎక్కడలేని కోపం వచ్చింది.

బజారు పోయి ఒక ధావళీ కొని తెచ్చారుట ఇంట్లో వాళ్ళ తాతగారు తిప్పిన తావళం ఉంటే వెతికితీశారుట. తండ్రి చేత బలవంతగా ధావళీ కట్టించారు. తావళం చేతికిచ్చారు ఒకగదిలో కూర్చోపెట్టారు.

మర్యాదగా ఇలా చెప్పారు. "నాన్నగారూ మీరు ఎక్కడికీ వెళ్ళక్కరలేదు. బాధ్యతలన్నీ మేం చూసుకొంటాం. పరిచర్యలు కావాలంటే చేస్తాం. మీరు హాయిగా తావళం తిప్పుతూ హరినామస్మరణ చేసుకోండి తరించండి - అన్నం వేళకు పిలుస్తాం మీరు అందాకా బయటికిరాకండి. అమ్మ మీరు కలిసి అప్పుడప్పుడు గుడికి వెళ్ళివస్తూ ఉండండి. అని ఆయన అన్నాడట "కొడుకులు ఇంత హామీ ఇస్తుంటే ఇంకేం కావాలిరా నా జన్మ తరించింది. అమ్మ నేనూ గుడికి రెండు పూటలా వెడతాం. నాక్కావలసింది ముక్తి నా నాయనలారా" అని.

వాళ్ళు అవతలకు వెళ్ళారుట. భార్య కొంచెం సంతోషించిందట - ఇకనైనా ఆయనకి కుదురు వస్తుందని ఆ గదిలో మరో పంచ లేకపోవడం వల్ల ఆయన ధావళితోనే ఉండక తప్పలేదు. కాని తావళాన్ని అవతల పారేశాడు. చేతులతో తాళం వేస్తూ హాయిగా జావళీలు పాడుతూ కూర్చున్నాడట. ఎవరు మారుస్తారాయన్ని. వ్యామోహాలు తగ్గించడం ఒకరికి సాధ్యమా? వయస్సు పెరగక తప్పదు - బుద్ధి తరగకా తప్పదు అలాటి ప్రబుద్ధులకు.

***మనుమరాలా నిన్ను మనువాడగ వస్తి***

ముసలితనంలో కూడా కోరికలు ముసరడం వాళ్ళమీద చిత్తజతోనుడు పూలబాణాలు విసరడం ఎప్పుడూ ఉంది ఒక జానపద గేయంలో తాత మనుమరాలిని చూచి

'మానికా నిండాను
మాడలోను కొని
మనుమరాలా నిన్ను
మనువాడగవస్తి" - అంటాడు
"వాడిన్న పువ్వులు
వాసనలు గలవా!
వదయ్యా వో తాత
వద్దు నీ మనువు. "

అని మనుమరాలు మెత్తగా మందలించింది. అక్కరమాలిన కోరికలిలా పెరుగుతూనే ఉంటాయి, రక్కస కంపల్లాగా.

**(3' జూలై 76, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**"అమ్మా! అమ్మా నే సినిమాకు వెడుతున్నా"**

"ఏం సినిమారా! రోజూ అదే పనా? నీ దగ్గర డబ్బులుంటే ఒక్కరూపాయి ఇయ్యి. అర్జంటు పని వచ్చింది."

"మన బడ్జెట్ చాలా లోటమ్మా ఇవ్వాళ టిక్కెట్టు డబ్బులు బొటాబొటి - డ్రింకుకు స్వస్తి."

"ఏం సినిమారా! ఒక్క రూపాయి కావాలిరా. మీ నాన్న రాగానే తీసుకుని ఇస్తారా."

"నాన్న ఉన్నాడుగా నీకు కాషియర్. మధ్య నన్ను బాధపెడతావెందుకమ్మా. టైం అయింది. నా వంతు భోజనం టేబుల్ మీద పెట్టు. టా...టా"

"అంత గొప్ప సినిమా వచ్చిందేమిట్రా ఒక్కరోజు ఆగలేవూ?"

"లేదమ్మా! సినిమా చూడకపోతే శివుడికి కోపం వస్తుంది" మూడో కన్ను తెరుస్తారు.

"బాగానే ఉంది నీ ధోరణి. అసలేమిటా సినిమా! పోనీ రెండో ఆటకు నే కూడా వస్తాలే. అది పురాణమా? సాంఘికమా? జానపదమా!"

***నాంచారయ్య సమర్పించు నా అంతవాణ్ణి నేను.***

"నా అంతవాణ్ణి నేను.. "

"నీ అంతవాడవి నువ్వేలేరా! అయినా కడుపున పుట్టావు కద్రటా. "

"అదే పొరపాటు ! అయినా ఏం చేస్తాం మరిచిపో తల్లీ ఆ వృత్తాతం. "

"మర్చిపోకేం చేస్తాను. నీ అంతవాడివి నువ్వంటున్నావుగా. "

"అవును మాతా! ఈరోజుల్లో ఎవడంతవాడు వాడే ఒకళ్ళతో పోలిక లేదు. ఇది నవయుగం. అందుకే నాంచారయ్య సమర్పించు `నా అంతవాణ్ణి నేను` సినిమాకు వెడుతున్నా."

"మీ అంతవాళ్ళు మీరు కావాలి నాయనా! మా అంతవాళ్ళుగా ఎందుక్కావాలి? నీ అంతవాడివి నువ్వయి నీ సంతానం నీకంటె గొప్పది... "

"సంతానం మాట ఎత్తకమ్మా! చాలా డేంజర్ మరో పదేళ్ళలో జనాభా రెండింతలవుతోందని పత్రికల్లో అంతంతక్షరాలతో అచ్చువేస్తున్నారు. చూడటంలా! నా సంతానం మాట ఎత్తుతావేవిటమ్మ... ఈ బాల భీష్మణ్ణి ఇలా బ్రతకనియ్యవమ్మ. "

***మానవులంతా ఒకటే కుటుంబం తల్లీ***

"పెళ్ళి చేసుకోకపోతే ఎలాగురా! వంశం ఏమైపోతుందిరా? ఎప్పటినుంచో వస్తున్న పరంపరరా ఇది.."

"ఏం పరంపర అమ్మా వీటితోనే మానవజాతి చర చరా పెరిగిపోతోంది. కొన్నిటికి ఫుల్‌స్టాప్ పెట్టాలమ్మా. "

"ఏమిటా అర్ధంలేని ప్రలాపాలు. మీ నాన్నదగ్గిర ఉంది మన వంశ వృక్షం చూడు ఎలాటి వాళ్ళు జన్మించారో. మహాపురుషులు పుట్టిన వంశంరా"

"మహర్షులు పుట్టిన దేశంలో మహాపురుషులు పుట్టక ఏం చేస్తారమ్మా! అయినా ప్రతి పురుషుడూ మహాపురుషుడు కావాలంటే ఎలా?"

"ఈ సోదంతా ఏమిట్రా! నేను కోడల్ని చూసుకో అక్కర్లా? మనుమడిని ఎత్తుకో అక్కర్లా. వంశం ప్రతిష్టతో ముందుకు పో అక్కర్లా"

"అమ్మా! నీ మాటలకు చింతిస్తున్నానమ్మా. కాలం మారిందనే విషయం కూడా గుర్తించకపోతే ఎలా చెప్పు. నాన్న సగం చదువుకున్నాడు. నువ్వు కేవలం నిశానీదారువు. ప్రపంచం సంగతి ఎలా తెలుస్తుందమ్మా! విండర్ విల్కీ అనే మహానుభావుడు ఎప్పుడో వ్రాశారు "ప్రపంచమంతా ఒకే కుటుంబం" అనే గ్రంథం."

"ఎవరో ఏదో వ్రాస్తూనే ఉంటారు. చేతులో కలం ఉంటే వ్రాతలకేం? డబ్బుంటే అచ్చుకూడా పడతాయి. నీబోటిగాళ్ళు కాలక్షేపం కోసం ఆ పిచ్చాపాటు చదువుతుంటారు. ఆ విల్కికి మన వంశ మర్యాదలేం తెలుస్తాయిరా. అసలే దేశం ఆయనది. "

"ఏం తిడుతూ ఉత్తరం వ్రాయిద్దామనా! చాలాదూరం లే ఇంతకీ నేను సినిమాకు వెళ్ళాలి. మాటల్లో పెట్టావు. "

***రూపాయిలోంచి పాపాయిల్లోకి వెళ్ళావు.***

"అయినా ఇదేంటి? రూపాయి కావాలని ప్రారంభించి, పాపాయిల దాకా వెళ్ళావు. రూపాయిలు సంపాదించాలి. తప్పదు. పాపాయిల మాట హుళుక్కి. ఈ సాంబశివరావుగారికి సంతాన ప్రాప్తి లేదు. విచారపడకు. నీకు అంతగా పిల్లలని పెంచాలనే వాంఛ తీవ్రంగా ఉంటే పిల్లల్ని పెంచలేని బీదవాళ్ళు చాలామంది ఉన్నారు. ఇద్దరు ముగ్గుర్ని తెచ్చి ఇంట్లో దించుతాను. చక్కగా పోషించు. నీ పేరు, బొమ్మా, పత్రికల్లో పడతాయి. ఆ బీద పిల్లలు ఇంత అన్నం తింటారు. "

"బాగానే ఉంది. పరాయివాళ్ళను పెంచితే నా వాళ్ళు అవుతారుట్రా! శాస్త్రం చెప్పినట్లుంది నీ సలహా. వాళ్ళు నన్ను అమ్మా అంటారా! బామ్మా అంటారా?"

"ఎందుకు అనరమ్మా. ప్రతిరోజూ వాకిట్లోకి ఎంతమంది బీదవాళ్ళు వచ్చి "అమ్మా! బిచ్చం, అమ్మా కాస్త అన్నం" అని అరవడంలా. నువ్వు వినిపించుకోవడంలేదు. కావాలంటే వాళ్ళచేత 'బామ్మ' అని కూడా పిలిపిస్తాను. ఇంకా నువ్వు పట్టుపడితే మన ఇంటిపేరు వాళ్ళక్కూడా పెడతాను. ఏం? సంతోషమేనా?

"నాకేం అక్కర్లేదులే. కడుపున కాయకాసింది. ఆ కాయలో నుంచి మరి కొన్ని కాయలు కాయాలి. వీటి తీపి బయటి వాటికి ఉంటుందిట్రా. 'మన' అనే మాట మరొకళ్ళను చూస్తే వస్తుందా.

"రానంతవరకూ మనం నిజమైన దేశభక్తులం కాదమ్మా. మనకిలాంటి స్వార్థాలుండబట్టే - ప్రభుత్వం ఎక్కువగా సిరిని తీసుకుని తక్కువ ఉన్నవాళ్ళకు పంచుతున్నారు. అంతే అవుతుంది మన పనికూడా. "

"ఇదంతా మీ నాన్న స్వార్జితం ఎలా తీసుకుంటారు.. నేనీ ఇంట్లో అడుగుపెట్టిన తర్వాతనే ఇంత సిరి కలిసి వచ్చింది. నే వచ్చిన మూడేళ్ళలో ఈ మేడకట్టారు మీ నాన్న. అంతకు ముందేం ఉంది - అద్దె కొంపేగా. "

"అదే నయం ఈ మేడకంటె. అది సరేగానీ మేడ ఎలా కట్టారమ్మా నాన్న? ఆ రహస్యం కొంచెం చెప్పగలవా? ఎవరితో చెప్పనులే. సంసారం విషయాలు ఈ సాంబశివరావు కూడా తెలుసుకోవచ్చుగా. మీ అబ్బాయినేగా. "

"అందరూ ఎలా కట్టారో ఆయనా అలాగే కట్టారు. ఇటికతో, సున్నంతో. "

***ఇటుకా, సున్నం ఎలా వచ్చెనో చెప్పగలవా!***

"నీ జవాబు బాగానే ఉంది మాతా! కానీ ఆ ఇటుకా, సున్నం ఎలా వచ్చెనో చెప్పగలవా? " అని సాంబశివరావు గంతులువేస్తూ పాట పాడటం ప్రారంభించాడు. తల్లి ముఖం చిట్లించుకుని వింటోంది.

"సినిమాలలో పాటలు తప్ప కృష్ణా రామా చేతకావు. ఏం లాభం? ఎక్కడన్నా ఉద్యోగం సంపాదించుకోరా అంటే వద్దంటావు. దేశసేవ అంటావు. ఇంత పెద్దదేశానికి చిన్న కుంకవు నువ్వేం సేవ చేస్తావు? నువ్వు చెయ్యకపోతే ఆగుతుందా?"

"సేవ చెయ్యలేకపోయినా, ద్రోహం మాత్రం చెయను తల్లీ. నన్ను కృష్ణా రామా అనుకోమంటున్నావా? మన ఇంట్లో ప్రతి ఇటుక రాతిమీదా పాండురంగడు వచ్చి నిలబడతాడనుకుంటున్నావా? నన్ను కన్న సాధ్వీమణీ మన్నించు. నా చేత ఇంకా మాట్లాడించకు. ఈ కుటుంబాన్ని ఇంతటితో ఆగిపోనీ. నేను మాత్రం పెళ్ళిచేసుకోను. నడిచిపోతాను ఏ హిమాలయాలకో.. ఎవరన్నా "మీరెవర"ని అడిగితే భారతీయుణ్ణి అని చెప్పుకుంటాను. దొరికితే ఎక్కడన్నా రెండు మెతుకులు తింటాను. లేకపోతే పస్తుంటాను. నా అంతవాణ్ణి నేనుగా

స్వంతంగా నవయుగ పౌరుడుగా జీవించాలనుకుంటున్నాను మాతా. నాన్నలాగా బ్రతకలేను. ఈ మేడకు మరో అంతస్తు వెయ్యలేను. నేను సినిమాకు వెడుతున్నా. అదృష్టవశాత్తు "నా అంతవాణ్ణి నేను" అనే ఫిలిం వచ్చింది చూసివస్తా."

"రూపాయి మాటేమిటిరా?"

"నాన్న నడగవమ్మ. ఆయన ఎందరినో అడిగి తెచ్చిన డబ్బు ఎంతో ఉంది. "

"గుళ్ళో కొబ్బరికాయ కొట్టాలిరా. మీ నాన్న వచ్చేసరికి ప్రొద్దుపోతుంది. "

"కోటి కొబ్బరికాయలు కొట్టినా చేసిన పాపం తీరుతుందని నమ్మకం లేదమ్మా! వస్తా. ఆరుదాటింది. నా అంతవాణి నేను..టా...టా. !!"

(21 ' సెప్టెంబర్ 71, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**కొందరు మిత్రులు,** బంధువులు కనిపించినప్పుడూ, ఉత్తరాలు వ్రాసినప్పుడూ "మీరు తప్పకుండా ఒకసారి మా ఇంటికి రావాలి - మేం కాపురం పెట్టిన తర్వాత మీరు రానేలేదు.. మేము ఇల్లు మారిన తర్వాత రాలేదు. క్రొత్త ఇల్లు కొన్న తర్వాత రాలేదు. ఒక్కరోజు వచ్చి తొంగిచూచి పొండి" అనడం మామూలు.

ఇలాంటి అభ్యర్ధనలు జ్ఞాపకం ఉంటాయి గాని - "వచ్చి తొంగిచూచిపొండి" అనేమాట మనస్సులో "అండర్ లైను" చేసుకోవడం మాత్రం జరగదు. అది మామూలుగా నమ్రతకోసం వాడిన మాటే అనుకుంటాం. అందువల్ల వారి అభ్యర్ధన విన్నప్పుడు, ఉత్తరాలు అందుకున్నప్పుడూ "వస్తా...వస్తా.. తప్పకుండా వస్తా" అనడం జరుగుతూ ఉంటుంది.

***ఎదురు చూడటంలో మనిషి సుస్తీపడతాడు***

నిజానికి వస్తానన్న మాటలు ఈరోజుల్లో చాలావరకు, మనిషిని అవతలకు పంపడానికి అనే మాటల క్రిందనే జమపడిపోతాయి. ఈ వస్తానన్నవాళ్ళ మాటలు నమ్ముకుని ప్రతిరోజు ఎదురు చూస్తూ కూర్చుంటే కావలసిన పనులు కాకుండా పోవడమే కాకుండా - ఆ ఎదురు చూడటంలో మనిషి సుస్తీ పడిపోతాడు.

ఒకసారి మా మల్లినాథ సూరిగారు సోమవారం ఉదయం ఆఫీసుకి రావడమే చురచురలాడుతూ వచ్చారు. "ఏమిటి స్వామి ఇంత కోపం వెంట పెట్టుకుని వచ్చారు. ఉదయ మందహాసం ఏమైంది?" అన్నాను.

"మందహాసం కాదు. మృత్యుహాసం. మీ వాగ్దానాలు నమ్మితే ఏమవుతుంది? నేనసలే మందమతిని. అందులో ఒకర్ని నమ్మడం అవస్థలు పాలు కావడం" అని కోపంగా అన్నారు. కోపం వచ్చినప్పుడు ఆయనగారికి నత్తి ఎక్కువ వచ్చేది. అయినా ఆ ఫోర్సులో దాన్ని పడగొట్టి పడేసేవారు - ట్రాక్టరుతో మట్టిగడ్డలు దొర్లించి పారేసినట్లు.

"నామీద అంత కోపమేమిటి స్వామీ! దయవుంచి సెలవియ్యండి" అని వినయపూర్వకంగా అడిగాను.

"అదికాదండీ. మొన్న శనివారం సాయంత్రం మిమ్మల్ని ఆదివారం సాయంత్రం వస్తారా? అని అడిగాను కదా. మీరు వస్తామన్నారుకదా. ఆ మాట నమ్ముకుని ఇంట్లో కూర్చున్నాను. 'ఇంకా వస్తారు.. ఇంకా వస్తారు' అని జపం చేస్తూ. నాలుగు గంటలకి వస్తామన్నారా!. అయిదింటిదాకా చూశా.

పోనీ ఎక్కడికన్నా పోకూడదూ. అలాగే కూర్చున్నా మీమీద విశ్వాసంతో. పెద్ద మనిషి అబద్ధమాడతాడా! త్రోవలో ఎవరో కనిపించారు కావన్ను - ఆలస్యమై ఉంటుంది. వెడితే మర్యాదగా ఉంటుందా అని కూర్చున్నాను. దాంతో వచ్చింది తిప్పలు'' అని ఆయన ఆపివేశారు.

***మీరొస్తానన్న వేళకు అప్పులవాడొచ్చాడు***

''నేను రావడానికి వీలు లేకపోయింది. అందుకు మీరు క్షమించాలి. కానీ నా మూలంగా తిప్పలు రావడమేమిటో కొంచెం సెలవియ్యండి'' అన్నాను.

''తిప్పలు కాదండీ మీకోసం ఎదురుచూస్తూ అరుగుమీద కూర్చుంటే అప్పులవాడు వచ్చాడు. వాడికి అందాను మీమూలంగా. ఇంట్లో ఉంటే లేనని చెప్పించేవాణ్ణి. ఆదివారాలు కూడా తిరుగుతూ ఉంటానని మా వాళ్ళు సణుగుతూ చెపితే వాడు నమ్మి చక్కా పోయేవాడు. నన్ను ఏకాఏకిని పట్టుకుని ఎన్ని దులపాలో అన్నీ దులిపి వదిలిపెట్టాడు. రేపు తెచ్చి ఇస్తానని వాగ్దానం చేశాను. ఇంకా టైపు ఏం చెయ్యను కూర్చుని - కాళ్ళూ చేతులూ వణుకుతుంటే?'' అన్నారాయన పాపం.

కొందరు మిత్రులు ఎక్కడైనా కలుసుకొన్నప్పుడు - ''వస్తాను.. మీ ఇంటికి రావాలని ఉంది. రేపు సాయంత్రం ఉంటారా! మీకు తీరికేగదా! అయితే రేపు సాయంత్రం తప్పకుండా వస్తా. నాకు పనేం లేదు. మా ఫ్రెండు కూడా ఉన్నాడు. రేపు అయిదున్నరకల్లా మీ ఇంటి దగ్గర ఉంటాం'' - ఒక నవ్వు, అది ఆపి ఒక నమస్కారం - అప్పుడు వెళ్ళడం.

ఆ సమయానికి అతగాడు రాడు. ఎవరో వచ్చి మాట్లాడుతుంటే - ''ఫలానావారు వస్తానన్నారు. అందుకని ఎదురుచూస్తున్నాడని మనం చెప్పడం.. తీరా వాళ్ళు రాకపోతే మనం అబద్ధమాడినట్లవడం జరుగుతూ ఉంటుంది. ఇలాటి అనుభవాలు కొన్ని అవడం వల్ల - వారి వస్తాలు వట్టి చాదస్తాల క్రింద జమకట్టి ఊరుకోవడం జరుగుతుంది.

***మీరెందుకు రావడం నేనే వస్తాలెండి.***

''రేపు మీతో మాట్లాడాలి నన్ను రమ్మంటారా? మీరు వస్తారా?'' అని ఒక పెద్దమనిషిని అడిగాను. ఆయనగారు కొంచెం కూడా ఆలోచించకుండా ''నేనే వస్తాలెండి.. అలా రావాలి ఎలాగూ పనివుంది. అట్లావచ్చి ఇట్లా మీ ఇంటికి వచ్చేస్తా''న్నాడు.

ఆయన మాట ప్రకారం ఆ రోజంతా ఎదురు చూశాను. రాలేదు. మర్నాడు చూశాను రాలేదు. నిజంగా ఆయనగారితో కొంచెం పనివుండటం వల్ల - ఆ మర్నాడు నేనే వెళ్ళాను వారింటికి.

ఆయన నన్ను చూచి ''ఇదేమిటి మీరెందుకొచ్చారు? అబ్బే నే వస్తానన్నాగా. మీరు వచ్చారేమిటి? చాలా శ్రమ తీసుకున్నారు. మీరు ఇంటికి పదండి. నేవచ్చి మాట్లాడతాను'' అన్నాడు.

నాకు కొంచెం ఆశ్చర్యం వేసింది. ''నేనెలాగూ వచ్చానుగదా పనిపెట్టుకుని, మళ్ళీ మీరు శ్రమతీసుకుని అక్కడికి రావడమేమిటి రెండు ముక్కలు మాట్లాడితే నే చక్కాపోతాను. మీరు మీ పనులు చూసుకోవచ్చు'' అన్నాను.

''అబ్బే! అదేం బాగుంటుంది? వస్తానన్నాను గనక మీ ఇంటికే వస్తాను. నాకేం శ్రమలేదు. నే వస్తానన్నాగా. తమరు పదండి. వచ్చేస్తా. ఒక గంటలో వచ్చేస్తా'' అన్నాడు.

వస్తానని రాకపోవడం ఒక్కటేకాకుండా అక్కడికి వెళ్ళినా మాట్లాడకుండా - ఆ వస్తా, వస్తా - వేలం పాట పాడటం. ఈ వస్తాలు తప్పించుకోవడానికి ఉపయోగపడే కిటుకులు.. లేదా ఒకపని చేస్తాను అనడంలో ఉండే ధీమా ''చేస్తేలో'' ఉండదనే సత్యాన్ని ఎక్కడో, ఎప్పుడో విని అట్లా దాన్ని పట్టుకుని వదలలేని దౌర్భాగ్యమో!

***చేస్తా.. చేస్తా.. ఇప్పుడేచేస్తా నే చేస్తాగా.***

విచిత్రమేమిటంటే - కొందరు నిముషంలో అయ్యే పనిని కూడా 'చేస్తా! చేస్తా' అంటూ కాలక్షేపం చేస్తారు. అందులో వారికి ఉన్న బద్ధకం వగైరాలు గోచరిస్తాయి పూర్తిగా. కొందరికి చెయ్యననడం బాగుండదని 'చేస్తా'నంటూ వాయిదాలు వేస్తే వారే చేసుకుంటారుగదా? అనే భావం ఏర్పడుతుంది. అవతల వాడు తెలివిగలవాడు అయితే ఒకటి, రెండు సార్లు అవడంతోనే గ్రహించి, తర్వాత తనే ఆ పని పూర్తిచేసుకుంటాడు.

కొందరు అతి తెలివిగలవాళ్ళు "అయ్యో మీరే చేసేశారేం? నే చెప్తానన్నాగా. చేతిలో ఉన్న కథ ఒక్కటి చదివి చేద్దామనుకున్నా. రేడియోలో పాట ఒక్కటి విని చేద్దామనుకున్నా. మీరే చేసేశారా?" అని ఓ మాట విసిరి ఊరుకుంటారు.

ఎవరైనా వచ్చి ఏదైనా కొంచెం వ్రాసి పెట్టమని అడిగినప్పుడు - నాకు తీరిక లేదు. నా పనే అవడంలేదు - అని చెప్పలేక "అలాగే.. అలాగే.. వ్రాస్తా" అంటూ ఉంటాను. వారు వ్రాస్తే తీసుకుపోదామని వస్తారు.

అప్పుడు చెపుతాను. "బొత్తిగా తీరుబడి ఉండటంలేదు వ్రాద్దామనుకుంటున్నా. రేపు వ్రాసివేస్తా" అంటాను - అప్పుడు కూడా వ్రాసే తీరికవుండదు. అయినా చెప్పలేను. "వ్రాస్తా" అనడమే జరుగుతుంది.

"ఎల్లుండి రమ్మంటారా?" అంటే "వో! షూర్" అనడం జరుగుతుంది. ఆ ఎల్లుండి మొండి పట్టుదల పట్టి వ్రాయడం జరుగుతుంది. చిన్న వాగ్దానాలు - పెరిగి పెరిగి మెడను పట్టుకుని వ్రేలాడుతాయి.

**(19' మార్చ్ 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**"సినిమా** హాల్స్ దగ్గర రైల్వే ప్లాటుఫారాల మీదా బస్సు స్టాండుల వద్ద, ఆడపిల్లల కాలేజీ గేట్లదగ్గర, మన్మధుడు షామియానాలు వేసుకుని, ఏవో కనిపించని బోర్డులు పెట్టుకుని - ఆందోళన సాగిస్తున్నాడు. తన కనీసపు కోర్కెలకోసం గందరగోళం చేస్తున్నాడు. బాణంలో సంధించడానికి అసలు పువ్వులు లభించకపోతే కాగితపు పువ్వులు సైతం వినియోగిస్తున్నాడు.

"ఆ కాగితం పువ్వులకే తట్టుకోలేక పోతున్నారు చాలామంది. విరహంలో తూలిపోతున్నారు. కాస్త విరహానికే తట్టుకోలేక చొప్పకట్టలుగా పడిపోతున్నారు. మన్మధుడి చుప్పనాతి తనం వాళ్ళనెంతో బాధపెడుతోంది" అని ఒకాయన వర్ణించాడు.

"మన్మధుడి మీద అమ్మాయి అభిప్రాయం?"

కాలేజీలో చదువుకుంటున్న ఒక అమ్మాయిని మన్మధుడి మీద ఆమె అభిప్రాయం చెప్పవలసిందిగా ఒక పత్రికా విలేఖరి ప్రశ్నించగా ఇలా చెప్పుకుని వచ్చిందిట.

"నిజానికి ఆయనంటే మాకేం కోపం లేదు. కాకపోతే ఆయన సమయా సమయాలు తెలియకుండా ప్రవర్తిస్తాడనేదే మా కోపం. మేం పిలిచినప్పుడు వచ్చి వద్దన్నప్పుడు దూరంగా పోతుంటే ఎంతో బాగుండును. ముఖ్యంగా పరీక్షలకు ముందు ఒక నెల రోజులు కాలేజీల ప్రాంతాలకు రాకుండా ఉండాలాయన.

వేధించుకుతినాలంటే వేసవి కాలపు సెలవులు బోలెడుంటాయి. బాణాలు విసరడానికి కావలసినన్ని మల్లెపూలుంటాయి. శీతలోపచారాలకు కావలసినంత ఐస్క్రీమ్ దొరుకుతుంది. క్లాసు పుస్తకాలు అవతల పారేసి, ఏ ప్రేమ కథలో చదువుకుంటూ కాలం గడపవచ్చు. ఇంట్లో ఉంటే వట్టి వ్రేళ్ళ తడికెలుంటాయి. లేకపోతే బయట చెట్ల క్రింద కుర్చీలు వేసుకుని నిర్భయంగా కూర్చోవచ్చు " అని ఆవిడ ఎంతో గర్వంగా చెప్పిందిట.

***మన్మధుని రాజ్యాంగం మారిపోయింది***

"మీరు చెప్పినదంతా బాగానే ఉంది. ప్రణయ సామ్రాజ్యంలో కులమత భేదాలు పాటించాలంటారా?" అని విలేఖరి ప్రశ్న.

"మీరే అలా ప్రశ్నిస్తే ఎలాగండీ. అక్కడ కూడా కులమత భేదాలేమిటి, చరిత్ర తిరగవేస్తే - అలాటి హద్దులు లేవనే సత్యం మీకు బోధపడుతుంది. అయినా ఈనాడు మన్మధుడు కూడా చాలా మారిపోయాడు. పూర్వం ప్రజాస్వామ్య పద్ధతులు మంచివనే ఉద్దేశ్యంతో ఉండేవాడు.

"కొన్ని కొన్ని సందర్భాలలో మాత్రం తన ప్రత్యేకత నిలుపుకోవటానికి కానీ విపరీత చర్యలు జరుపుతూ ఉండేవాడు. దానికి తట్టుకోలేక అవతలవాళ్ళు అల్లరిపాలవుతూ ఉండేవారు. ఇప్పుడు ఆయన కూడా - తన రాజ్యాంగమంతా మార్చిపారేశాడు. కేవలం నియంతృత్వం అవలంబిస్తున్నాడు. అందర్నీ నిరంకుశుల్లా ప్రవర్తించమని హెచ్చరిస్తున్నాడు.

ఆయన బాణానికి ఎంతమాత్రం తిరుగు ఉండటం లేదు. తీరుబడిగా ఉన్నవాళ్ళ మీదనే తన ప్రభావం చూపించడంలేదు. బస్సులో వాళ్ళమీదా విసురుతున్నాడు. రైల్లో వాళ్ళమీదా విసురుతున్నాడు. నడిరోడ్డుమీదా విసురుతున్నాడు - నాధుడు ప్రక్క ఉన్న వాళ్ళమీదా విసురుతున్నాడు. నవ యవ్వనాంగులమీదా విసురుతున్నాడు. ఆయన నిజానికి చాలా యాక్టివ్‌గా ఉంటున్నాడీరోజుల్లో" అని ఆ యువతి ఒక చక్కని స్టేటుమెంట్ విసిరింది.

పత్రికాధిపతి ఒక యువకుని వద్దకు వెళ్ళి ఆయన అభిప్రాయం కూడా అడిగాడట. అతడిలా చెప్పాడుట.

***పదోక్లాసు వాళ్ళమీద కూడా బాణాలు***

"నిజం చెప్పాలంటే ఆ మన్మధుడి విషయం మాకు ఏమీ నచ్చడం లేదండీ. పూర్వం కొంచెం 'వయోజన పద్ధతి' అన్నా అవలంబించేవాడట. ఇప్పుడా విచక్షణ తీసిపారేశాడు. పదోక్లాసు కుర్రాళ్ళ మీద ఆయన తన బాణాల్ని పుంఖాను పుంఖాలుగా విసురుతున్నాడంటే - వాళ్ళగతి ఏంకావాలి చెప్పండి.

"పాఠ్య గ్రంధాలు ఎక్కడున్నాయో, ఎలా ఉన్నాయో, ఏం చదవాలో, ఏం వ్రాయాలో తెలియకుండా నానా అవస్థపడుతున్నారంటే నమ్మండి. స్కూలు నుంచి సరాసరి ఇంటికి వద్దామంటే వీలులేకుండా పోయింది. ఎక్కడనుంచి వచ్చి బాణాలు మీద పడతాయో తెలియకుండా ఉంది. చేతుల్లో పుస్తకాలు క్రింద పారేసి పిచ్చి చూపులు చూస్తూ నిలబడవలసి వస్తోంది.

"ఎంత అవస్థ అంటారది? ఆ పంచబాణుడు బడిపిల్లలన్న జాలికూడా లేకుండా దుంప తెంపుతుంటే అసలు చదువులేం సాగుతాయి? ఒక కుర్రవాడు కొంచెం తెలుగు భాష నేర్చుకున్నాడు. ఎప్పుడూ పరధ్యానంగా ఉంటాడు. అతణ్ణి అడిగాను "ఏమిటి అలా ఉన్నావు?" అని.

అతగాడు కొంచెం విచారం వెలిబుచ్చుతూ "మనసున పుట్టినవాడు నా మనస్సు చెడగొడుతున్నాడు" అన్నాడు. ఏం చేస్తాడు. అతడిమీద పరువు నష్టం దావా వేస్తాడా!

***ఈ మన్మధుడి మీద స్టే ఆర్డరెలా తేను?***

ఒక కుర్రవాడు పరీక్ష ముందు ప్రేమలో పడ్డాడుట. చదువు ధ్యాస సన్నగిల్లిపోయిందిట. తండ్రికి తెలిసింది. ఎంతో విచారపడ్డాడు. కొడుకు పరీక్ష తప్పితే ఏర్పడే పరిస్థితులు గ్రహించాడు. అతడిని ఏమంటే ఏం బాధపడతాడో, చెప్పకుండా ఇంట్లోనుంచి అదృశ్యుడవుతాడోననే భయం కలిగిందిట.

అందువల్ల తనలో తను ఇలా అనుకున్నాడట. " ఈ స్థితినుంచి వాణ్ణి తప్పించడమెలా? పరీక్ష నెగ్గించడమెలా? ఆ మన్మధుడికి ఒక రూపమన్నా ఏడిస్తే పోనీ కోర్టులో కొంతకాలం 'స్టే ఆర్డరన్నా' తెద్దును. వాడికి సమన్లు అందడమెలా? ఆర్డర్లు పాస్ చేయించడమెలా? హతోస్మి" అని ఆ తండ్రి నేలకూలి పోయాడుట.

"అయితే కాలేజీ కుర్రవాళ్ళ విషయంలో ఆ పూలబాణుడి వ్యవహారమెలా ఉంది?" అని పత్రికా విలేఖరి ప్రశ్నించాడట.

***కాలేజీ విద్యార్థులకు గడువు ఉంటుంది.***

"కాలేజీలో చేరిన తర్వాత ఫర్వాలేదండి. సెప్టెంబర్లు, మార్చిలూ ఉన్నాయి. పైగా ఇప్పుడు ప్రతి క్లాసుకు మధ్యా గడువు బోలెడుంటోంది. ప్రవేశపరీక్షలు పెడుతున్నారా! ఆ ఫలితాలు రావడం, మళ్ళీ క్లాసుల్లో చేరడం వీటితో ఎంతో గడువు ఏర్పడుతోంది. ఆ సమయంలో యువకులు మరీ డల్‌గా ఉండకుండా కొంచెం ప్రణయంలో పడటం మంచిదనిపిస్తోంది. అలాటి సందర్భాలలో ఆ పంచబాణుడు చాలా ఉపకరిస్తున్నాడు. యువకులు మన్ననలు పొందుతున్నారు.

"నిజానికి పేరు యువకులదే గాని ఆ అనంగుడు వయస్సు గమనించకుండా అందరి వెంటా పడుతున్నాడు అంతో, ఇంతో వయసు తప్పినవాళ్ళు చేత కూడా "ఆనందో బ్రహ్మ" అనిపిస్తున్నాడు. మన రాజ్యంలో ధరలు పెరుగుతున్నట్టే - అతని రాజ్యంలో మరులు పెరుగుతున్నాయి. రామరాజ్యం ఇంకా తొంగి చూడకపోయినా ప్రేమ రాజ్యం సుభిక్షంగా వర్ధిల్లుతోంది" అన్నాడా యువకుడు.

(14' జనవరి 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**తనతోనే ప్రపంచమంతా** నడుస్తోందని విర్రవీగే ఘటాలు చాలా ఉంటాయి లోకంలో. అలాటివారందరికీ, కొంచెం ఆలస్యంగానో అనతి కాలంలోనో తగిన గుణపాఠం చెప్పబడుతూ ఉంటుంది. వీళ్ళకు మూల పురుషుడు - కొన్యూట్ మహారాజు.

ముసలమ్మ 'కుంపటి - కోడి' కథ చాలామందికి తెలుసు. ఇలాటి కుంపట్లో దాపరికం వాళ్ళు చాలామంది ఉంటారు. వెనుకటికి ఎవడో "నా మద్దెల లేకపోతేం, నువ్వేం ఎగురుతావే ఎలనాగా!" అన్నాడుట.

ఆ ఎలనాగ పగలబడి నవ్వి "నీ మద్దెలకోసం నే నెగరడంలేదురా నీలకంఠయ్యా!. ఎగురుతున్నాను గనుక వాయిస్తున్నావు. నువ్వు మానేస్తే నేనాగిపోను. నా గుండెల్లో కనపడని మద్దెళ్ళున్నాయి. అవి మ్రోగి నన్నాడిస్తున్నాయి. బయట వాళ్ళకు అవి వినిపించవు గనుక నీ మద్దెల కావలసివచ్చింది" అని గట్టిగా చివాట్లు పెట్టిందట.

***నా నూతిలో నీళ్ళు త్రాగనివ్వను.***

ఒక ఊళ్ళో మంచినీళ్ళ బావి ఉండేది. ఊరందరూ ఆ నూతి నీళ్ళు తోడుకు పోయి త్రాగేవాళ్ళు. నూతికి మంచిపేరు వచ్చింది. అతగాడికి అహం హెచ్చింది. నా నూతివల్ల కదా వీరందరూ బ్రతుకుతున్నారనిపించింది. ఊళ్ళో వాళ్ళతో ఏ ఒకరితో కొంచెం తగాదా వచ్చినా "నా నూతిలో నీళ్ళు తోడుకోవద్దు" అనేవాడు.

కొన్నాళ్ళకు ఆ హెచ్చరిక హెచ్చు మందికి జరిగింది. వాళ్ళ మనస్సులు విరిగాయి. తలో పదిరూపాయలు వేసుకుని క్రొత్త నుయ్యి త్రవ్వుకున్నారు. పాత నీళ్ళన్నీ ఆ త్రవ్వించినవాడికే మిగిలాయి. ఏం చేసుకుంటాడు? ఎన్నని తోడతాడు.

పిచ్చివాడిలాగా ఒక్కడే నిలబడి నీళ్ళు తోడి బయట పారబోస్తూ ఉండేవాడు. నూతి చుట్టూ మడుగు అయ్యేది. అలా తోడుతుంటే సంతృప్తి వచ్చేదికాదు. కొన్నాళ్ళ తరువాత ఒక ఉపాయం తట్టింది. ఊళ్ళోవాళ్ళ పేర్లు - ఇంటి ఇంటి వరుసగా చెప్పి

తోడిపోస్తూ ఉండేవాడు. ఎన్నాళ్ళిలా చెయ్యగలడు. చేతులు నొప్పులు పెట్టాయి. చేదలు ఎన్నో తెగిపోయాయి. దణ్ణం పెట్టి ఊరుకున్నాడు. నుయ్యి పాకుడు పట్టింది. దానికి "దెయ్యాల నుయ్యి" అని పేరు వచ్చింది.

ఇలా తమతోటే ఉంది ప్రపంచమనుకునేవారి మనస్సులు కూడా కొంత కాలానికి దయ్యపు నూతులు కాక తప్పవు. అహంభావాలతో అలాటి అయోమయ స్థితి కల్పించుకుంటూ ఉంటారు కొందరు ప్రబుద్ధులు.

***నేనుండగా ఈ ఇంటికేం ఫర్వాలేదు.***

"నేనుండగా ఇంటికేం ఫర్వాలేదు - పోయిన తర్వాత దీనిగతి ఏమవుతుందో తెలియదు" అని గృహస్థులు తమ ఔన్నత్యాన్ని ప్రదర్శించుకుంటూ ఉంటారు. నిజానికి చాలామంది విషయంలో వారు పోయిన తర్వాతే ఆ ఇంటి పరిస్థితులు బాగుపడటం తటస్థిస్తూ ఉంటుంది. కానీ అలా తనతోనే ఉందని అరిచిన పెద్దమనిషికి ఆ మార్పు తెలియదుగా!

కొన్ని సంస్థల విషయంలోనూ అంతే!. ఏదో ఉద్యోగరీత్యా అక్కడ చేరినవాడు - తనే మతా చేసేస్తున్నానని - తన మూలంగానే ఆ సంస్థ నడుస్తోందనీ - "తాను ఉండగా" ఎలాటి లోపం రాదనీ - గొప్పగా చెప్పుకుని గుటకలు మ్రింగుతూ ఉంటాడు. అంతేగాని తానొక "కోన్‌కిస్కా" అనే సత్యాన్ని గుర్తించడు.

వెనుకటికి ఒక మహారాజుండేవాడట. ఆయన దగ్గర ఒక విదూషకుడుండేవాడట. అతగాడు రాజ్యం అంతా తనే నడిపిస్తున్నానని అక్కడా ఇక్కడా చెప్పుకుని తిరుగుతూ ఉండేవాడట. రాజుగారేపని చేసినా "ఆ సలహా నేనే ఇచ్చా" అనే వాడట ఆ విదూషకుడు. ఆ సంగతులన్నీ రాజుగారి చెవినిపడ్డాయి. ఆయనకు ఎక్కడలేని కోపం వచ్చింది.

ఒకరోజు ఆ విదూషకుణ్ణి పట్టి ఖైదులో పెట్టమనీ, పదిరోజుల తర్వాత తలతీసెయ్యమని ఆజ్ఞాపించాడట. ఆ మాట వచ్చి విదూషకుడికి చెప్పారు - అతగాడు మామూలు ప్రకారం - "ఈ సలహా కూడా నేనే చెప్పాను" అన్నాడుట. అది విన్నవారికి ఆశ్చర్యం వేసి "తలతీసి వెయ్యమని ఉత్తరువులిచ్చినా, సలహా నీదేనంటావేమిటి?" అన్నారుట ఆశ్చర్యంగా.

"అవును, రేపో, ఎల్లుండో శత్రువులు వచ్చి దేశం మీద పడుతున్నారు అప్పుడు బయట ఉంటే నన్నూ పట్టుకుపోతారు రాజుతో కూడా! జైల్లో ఉంటే ఆ ప్రమాదం తప్పుతుంది. తర్వాత శత్రువులు వచ్చి విడుదల చేస్తారు. నా విదూషకత్వం నాకే ఉంటుంది" అన్నాడుట. రాజుగారికి ఆ మాట తెలిసి "వీడు చాలా ప్రమాదకరంగా ఉన్నాడు శత్రురాజులు వస్తే వాళ్ళతో చేరాలని చూస్తున్నాడు. కనుక ఆలస్యం చెయ్యకుండా వాడి తల తీసి వెయ్యాల్సిం"దని ఉత్తరువు చేశాడట.

***విదూషకుడి విషాదయోగం***

అది విని విదూషకుడు తబ్బిబ్బయి తన తప్పు క్షమించమని ప్రార్థించాడట. "నామూలంగానే రాజ్యం నడుస్తోందని చెప్పుకుని గర్వపడుతూ వచ్చాను మహాప్రభూ! తమరు ఉదాసీనంగా ఉండటం వల్ల అలాటి ప్రగల్భాలు పలికాను. నన్ను క్షమించి వదిలివెయ్యండి. నా పదవి నాకు దక్కేలాగా చెయ్యండి. బ్రతికి ఉన్నన్ని నాళ్ళూ మీ కీర్తిని పొగుడుతాను" అన్నాడుట. తప్పు తెలుసుకున్న వాళ్ళను దండించటం న్యాయం కాదని రాజుగారు వదిలివేశారుట. కొంచెం స్థానమిస్తే ఒళ్ళు మరిచిపోయే ఉలిపి ఘటాలు చాలా సంస్థల్లో ఉంటాయి.

***ఈ ఇంట్లో పిల్లి దూరడానికి వీల్లేదు.***

మా బంధువుల్లో ఒకాయన ఉండే వాడు. ఆయన ఎప్పుడూ వాకిలి గుమ్మంలో కుర్చీ వేసుకుని కూర్చునేవాడు. "ఈ ఇంటికి యజమానిని నేను. నా పర్మిషన్ లేకుండా పిల్లి లోపలికి పాకకూడదు. ఒక పిల్లగాని, పిల్లాడుగానీ బయటకి పోకూడదు" అని ఎంతో హోదాగా చెపుతూ ఉండేవారు.

ఇంట్లోవారు కూడా ఏదైనా చెపితే "వాకిట్లో ఉన్నారుగా! ఆయన్ని అడగాలి" అనేవారు. ఎవరైనా ఎదురింటివాళ్ళు ఏ పిండి జల్లెడ కోసమో బదులు వస్తే "వాకిట్లో ఉన్నారుగా! వారితో చెప్పండి. తర్వాత ఇస్తాం" అనేవాళ్ళు. ఆయన్ని అడిగే తెచ్చుకునేవారు జల్లెడ కానివ్వండి, జంతికల గొట్టాం కానివ్వండి.

*ఒక పిల్లమాత్రం లేచిపోయింది.*

అలా స్ట్రిక్ట్‌గా పరిపాలన చేశాడాయన. ఆయన గట్టితనానికి అందరూ మెచ్చుకునేవారు. నిజానికి ఆ ఇంటికి వెళ్ళడమే భయంగా ఉండేది చాలామందికి. ఆ ఇంట్లో నుంచి ఆయన పర్మిషన్ లేకుండా ఏ వస్తువా బైటికి వెళ్ళని మాట మాత్రం నిజమే. కానీ ఒక పదహారేళ్ళ పడుచు మాత్రమే - తప్పించుకుని పారిపోయి - ఎక్కడో పాణిగ్రహణం చేసుకుంది. అక్కడితో ఆయన కీర్తికి గ్రహణం పట్టింది.

"తక్కువేమీ మనకూ రాముండొక్కడుండు వరకూ!" అని ఆ పరాత్పరుణ్ణి నమ్ముకుని పాటలు పాడుకోవడంలో కొంత పరమార్థం ఉందిగాని - రామయ్యొక్కడుండు వరకూ సుబ్బయ్యొక్కడుండువరకూ" అనుకోవడంలో ఏం శాంతి ఉంటుంది.

పైగా ఆ రామయ్యలూ, సుబ్బయ్యలూ తమంతట తామే "నేనుండగా మీకేం ఫర్వాలేదని చెప్పుకోవటంలో ఏం అందం వారందరూ తమ సంగతి తాము గ్రహించకుండా విర్రవీగే శాఖకు చెందిన మహనీయులు.

**"ఉండవురా నరుడా! నీ**<br>
**వుండవురా!...**<br>
**ఉండునురా జగమిట్లే**<br>
**ఉండునురా**

- అన్న తత్వం గ్రహించుకునే తీరిక లేక అలా అమాయకత్వంలో పడి అహంకారం ప్రదర్శించుకునేవారిని గురించి ఏం చెప్పగలం?

**(29 ' జూన్ 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**ఒకసారి పాండవ విజయ** నాటకం ప్రదర్శించబడుతోంది. కృష్ణార్జునులు ప్రసిద్ధ నటులు. ప్రేక్షకులు క్రిక్కిరిసి ఉన్నారు. అదుగో ద్వారక అంటూ అర్జునుడు ప్రవేశించాడు. 'ఒన్సుమోర్'లు ప్రతిధ్వనించాయి. మళ్ళీ పాడాడు అర్జునుడు.

తెర ఎత్తారు. కృష్ణుడు పవళించి ఉన్నాడు. అర్జునుడు వెళ్ళి కూర్చున్నాడు. కృష్ణుడు 'బావా ఎప్పుడు వచ్చితీవు' అని పద్యం పాడాడు. ఒన్సుమోర్‌లు పడ్డాయి. తప్పనిసరిగా పాడాడు. అర్జుని వంక తిరిగి వీపు మీద తట్టి "బావా ఎప్పుడు వచ్చితీవు" అని పద్యం ముగించాడు రాగయుక్తంగా.

*ఇద్దరం కలిసేవచ్చాంగా!*

అర్జున పాత్రధారికి ఆ ప్రశ్నవేసినందుకు కోపం వచ్చింది. "ఏమిటి ఎప్పుడొచ్చావని అన్నిమాట్లు అడుగుతుండావు. ఇద్దరం ఒక జట్కాలోనే వచ్చాంగా హాలుకి" అన్నాడుట. ప్రేక్షకులు పకపకా నవ్వడం ప్రారంభించారు. ఆ పాత్రధారులు వచ్చేటప్పుడు కొంచెం పుచ్చుకు వచ్చారనీ ఆ మత్తులో పాండవమధ్యముడు అలా చెప్పాడని తెలిసింది.

కృష్ణునికి కొంచెం మత్తు తక్కువగా ఉండటం వల్ల - నాటకం అభాసైపోతుందనిపించి తన చేతిలో ఉన్న కొరడా చివళ్ళతో పార్థుని పాదాలమీద ఒక చురక అంటించాడంట. దానితో ఆయన మైకం వదిలి "నందకుమారా యుద్ధమున నా రథమందు వసింపుమయ్యా" అని పద్యం ఎత్తుకున్నాడు. అక్కడితో జట్కా ఉదంతం వెనకపడిపోయింది.

ఒకసారి కలెక్టరుగారి పర్సనల్ అసిస్టెంటు నాటక సమాజంలో చేరి, బాహుకుడి వేషం వేయడానికి అంగీకరించాడు. బాగాపాడగలడు. అతడు సమాజానికి సహాయ కార్యదర్శికూడా. అయితే అసలు కార్యదర్శితో చిక్కువచ్చింది.

ఆయన నలుడు వేషం ఎన్నుకున్నాడు. కలెక్టరుగారి అసిస్టెంటు అదే వేషం కావాలన్నాడు. చివరకు సభ్యులందరూ చేరి రాజీకుదిర్చారు. దాని ప్రకారం ఒకరు నలుడివేషం, ఒకడు బాహుకుని వేషం వెయ్యాలన్నారు.

***ఫైలుకోసం బాహుకుడు...***

నాటకంనాడు అసిస్టెంటు ఆరుగంటలకే బాహుకుడి వేషం ధరించి సిగరెట్లు కాలుస్తూ కూర్చున్నాడు. ఏడుగంటలకల్లా కలెక్టరుగారి దగ్గరనుంచి కబురువచ్చింది. అతణ్ణి అర్జంటుగా తీసుకురావలసిందని. ఏదో ఫైలు కావలసివచ్చిందిట. ఎంత వెతికినా దొరకలేదట. అందువల్ల కబురు పంపారు.

ఏం చేస్తాడు ఆ వేషంతోనే గుర్రం బండిలో కలెక్టరుగారింటివద్దకు వెళ్ళాడు. బండి దూరంగా ఆపి గేటు తీసుకుని లోపలకు వెళ్ళాడు.. వాకిట్లో భార్యా పిల్లలూ కుర్చీలు వేసుకుని కూర్చున్నారు. కలెక్టరుగారు స్నానం చేస్తున్నారట.

చీకట్లో ఆ బాహుకుణ్ణి చూచి వారందరూ ఒక్క కేకపెట్టి లోపలికి పరుగెత్తారట. అతడు 'నేనండి! పర్సనల్ అసిస్టెంట్‌ని' అన్నాడుట. కానీ వాళ్ళకు భయంలో ఆ మాటలు వినిపిస్తేగా!

అమ్మగారి కేకలు విని నౌకర్లు పరుగెత్తుకు వచ్చి అతణ్ణి గట్టిగా పట్టుకున్నారట.

"నేను ఖాసిం.. అసిస్టెంటును.. నేను అంజయ్యా. అసిస్టెంటును.. వదలండి" అని ఎంత అరిచినా వాళ్ళు వదలలేదు, కలెక్టరుగారు కలెక్టరమ్మగారు ఇంతలో పోలీసులకు కబురంపింది.

***బాహుకుని అరెస్టు.***

కలెక్టరుగారు కూడా హాజరయ్యారు రంగంలోకి. గుమాస్తా బాహుకుడి వేషం వేస్తున్నాడనీ ఆయనక్కూడా తెలియదు. అందువల్ల 'అరెస్టు అరెస్టు' అని అరుస్తున్నారట.

అసిస్టెంటు ఇకలాభం లేదని, విగ్గుతీసి "సార్.. నేనండి! ఇవ్వాళ నాటకం వేస్తున్నానండి సరదాకు. తమరు కబురు పంపారు. ఆలస్యం చేస్తే బాగుండదని వచ్చేశాను" - అన్నాడుట.

కలెక్టరుగారు అతి విధేయతకు సంతోషించారట. బాహుకుడి వేషంలో అంతమారిపోయినందుకు మెచ్చుకుని పదిరూపాయలు బహుమతి ఇచ్చాను. తను కూడా కుటుంబ సహితంగా నాటకానికి విచ్చేయడం జరిగింది తర్వాత.

ఒక ప్రసిద్ధ నటుడు రాజువేషం వేసినప్పుడు భార్యగా ఒక క్రొత్త నటుడు నటించడం సంభవించింది. సంభాషణలు సరిగా చెప్పక చంపడం ప్రారంభించాడాయన. ఎంతసేపు చెప్పినా ఒకటే డైలాగు - 'ప్రాణనాధా' అని.

***ఇంకా ప్రాణాలెక్కడున్నాయి.***

ఆ నటుడికి ప్రాణం విసిగిపోయింది. ప్రాణనాథా! అన్నప్పుడు - 'ఇంకా ప్రాణాలెక్కడ ఉన్నాయి? అన్నిటినీ మొదటి సీనులోనే త్రుంచిపారేశావు' అన్నాడట స్టేజిమీదనే.

మా కాలేజీలో ఒకసారి పాండవోద్యోగవిజయాలలో రెండు సీనులు వేశారు. టైంలేక పోవడంవల్ల ఎవరి పోర్షను వారినే క్షుణ్ణంగా చదువుకురమ్మన్నారు తెలుగు మాష్టరుగారు.

***'తనలో' నువ్వు వినకూడదు.***

ఇద్దరూ నిలబడి నాటకం ఆడుతున్నారు. ఇంతలో ఒకడికి తనలో అనే వాక్యాలు వచ్చాయి. రెండవవాడు దగ్గర బాగా ఉన్నాడు. అతడివంక చూచి "కొంచెం దూరంగా ఉండు.. ఇవి తనలో మాటలు నువ్వు వినకూడదు" అన్నాడు. ప్రేక్షకులు ఎంతసేపు నవ్వుకున్నారు.

ప్రేక్షకులు కూడా ఒక్కొక్కప్పుడు అమాయకత్వం వల్ల కొంత వినోదం కల్పిస్తూంటారు. ఒకసారి బందరులో చిత్రనళీయం ప్రదర్శిస్తున్నారు. పోష్టర్లలో చిత్రనళీయము లేక నలదమయంతి అని వేశారు. ఒక ప్రేక్షకుడు తొమ్మిదిగంటలకు హాలుకు వచ్చి చూశాడు - పోష్టరు వంక.

'ఇంకా వీళ్ళకు ఏ నాటకం వేసేదీ' తేలలేదన్నమాట. తేలిన తర్వాతే టిక్కెట్టు కొంటాను వీళ్ళ మోసాలకు పడతావేమిటి? తీరాకొంటే ఏది మొదలుపెడతారో? అని అక్కడున్న ఒక బల్లమీద కూర్చున్నాడు.

(17' ఫిబ్రవరి 65, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**నిజం చెప్పకపోతే నిద్రపట్టదు నాకు**

ఊతపదాల్లో జాతిరత్నాలవంటి మాటలు కూడా కొన్ని ఉంటాయి.

ఒక తాత ఏం మాట్లాడినా ముందు "నిజం చెప్పకపోతే నాకు నిద్రపట్టదు" అనడం మామూలు. ఊరికే అనడమేకాదు - నిజం కూడా చెప్పేసేవాడు.

ప్రక్కనున్న వాడెవడైనా తన ఆస్తిని గురించో, అధికారాన్ని గురించో కొంచెం అబద్ధం చెబితే వెంటనే ఈ తాతగారు అందుకుని "నిజం చెప్పకపోతే నాకు నిద్రపట్టదు - ఆయన జీతం ఆరువందలు కాదు. మూడు వందల యాభై" అనేసేవాడు.

ఎవరింటికైనా వెళ్ళినప్పుడు - (క్రొత్తవాళ్ళ ఇంటికి) వాళ్ళతో మాట్లాడుతూ ఆ యజమానివంక చూసి "నిజం చెప్పకపోతే నాకు నిద్రపట్టదు - మీ ఇల్లు చాలా బాగుంది కానీ మీ ముఖం అంత బాగాలేదు. అసలు నాకు మీవంక చూడాలనిపించడంలేదు గానీ, మొహమాటానికి చూస్తున్నా" అనేవాడు.

ఎవరింటికైనా పెళ్ళికి వెళ్ళినప్పుడు లగ్నం పూర్తికాకముందే పిల్లనూ, పిల్లవాణ్ణి చూసి "నిజం చెప్పకపోతే నాకు నిద్రపట్టదు. పెళ్ళికూతురు బాగుందికానీ పెళ్ళికొడుకు నాకేం నచ్చలా!. ఈడు కుదిరినా జోడు కుదరలా! ముందుముందా అమ్మాయి చాలా విచారపడుతుంది" అనేసేవాడు.

అందుకని ఆయన్ని పెళ్ళిళ్ళు వగైరాలకు పిలవడానికి సందేహించేవారు. కానీ బంధుత్వరీత్యా తప్పేదికాదు. ఆయన ఏదో అనక మానేవాడు కాదు. ఆ ఊతపదం పుణ్యమా అంటూ బోలెడు సత్యాలు గుమ్మరిస్తూ ఉండేవాడు ప్రతినిత్యం.

***ధాతుష్టికాంతీ, ధగభగలు వాడటం తెలుసు.***

మరొకాయన ఏదైనా చెప్పాలంటే ముందుగా ఇవతలివాళ్ళ చెయ్యి గట్టిగా పట్టుకునేవాడు. కొంచెం చెప్పి "ఏం నే చెప్పేది వింటున్నావా?" అనేవాడు.

"ఆ! ఆ! వింటున్నా" అనేవారు అవతలివారు.

"నేను వంకాయలు వండవే కొరివీ" అని దాంతో చెప్పి బజారు వచ్చా. వెళ్ళేసరికి ఆ మండోదరి చామదుంపలు వండి ఊరుకుంది. ఏం నేచెప్పేది వింటున్నావా..?"

"నేవినకేమండీ. మీ ఆవిడ వినకుండా చామదుంపలు వండిందిని!"

"నిజమే వండేసింది. నా జీర్ణకోశం చెడిపోవడం, అజీర్తి ప్రవేశించడం, బావన జీలకర్ర దాతుని క్రాంతీ దగభగలు వాడటం దానికి తెలుసుకదా! ఏం నేను చెప్పేది వింటున్నావా?"

"వింటున్నానండీ. అప్పచెప్పమంటే అంతా అప్పచెపుతా!"

"అప్పచెప్పక్కర్లా, ఆ మాత్రం శ్రద్ధ ఉంటే అంతేచాలు. ఆ చామదుంపలు వేసుకుని తినడమా! చావగొట్టి ఇవతలికి రావడమా! ఈ ఆలోచనలో పడిపోయా చాలాసేపు. నువ్వాలోచిస్తున్నావేమిటి? అయితే చెప్పేది వినడం లేదన్నమాట."

"విన్నానండీ. వినబట్టే ఆలోచిస్తున్నా. ఒక ఆలోచనకాదు రెండు"

"ఏమిటవి"

"మీరు చామదుంపలు తినడమా మానడమా? అనేది ఒకటి. నేను మీ దగ్గరనుండి తప్పించుకోవడమెలాగా? అనేది ఒకటి.."

***దుంపకూరా.. చెంపదెబ్బలూ..***

"తప్పించుకుంటే ఎలా సొంతం విని తప్పించుకో. చివరికేం చేశానో తెలుసా! చామదుంపలు నావంటికి పడవు. చెంపదెబ్బలు గానీ వంటికి పడవు. అందుకని చారూ, మజ్జిగ పోసుకుని తిని మాట్లాడకుండా ఇవతలకు వచ్చేశా! దాంతో జంకిపోయి మర్నాడు ప్రొద్దున వంకాయ కూర వండేసింది"

"మరో కూరలేదుగావాల్ను ఇంట్లో."

"లేకపోతే తెచ్చేవాణ్ణి లేకపోతే ఊరుకుంటుందా! అలా చెప్పిన పనిచెయ్యకపోతే ఊరన్నా పోతానంటుంది. నే చెప్పింది వింటున్నావా?"

"వింటున్నానండి. మీ ఆగడాలతో నా తల వాచిపోతోంది. వెళ్ళిరానా?"

"వెళ్ళిరా. మళ్ళీ కనిపిస్తావుగా!"

"మరి చెయ్యి వదలండి."

"వదులుతా. అదెంతసేపు? ఒకసారి రేపు కనిపించు. వింటున్నావా నా మాట.!"

"వినకేం చేస్తానండి. చెయ్యీ, చెప్పూ రెండూ మీ స్వాధీనమైపోయాయి. గుంజుకుపోదామంటే మొహమాటం గుండెల్లో పీట వేసుకుని కూర్చుండే చెయ్యి వదలండిక - వెళ్ళివస్తా."

ఆయనగారి చెయ్యి వదిలి "ఆ వెళ్ళే ఆయన్నిట్లా కొంచెం పంపించి వెళ్ళు. నే చెప్పింది వింటున్నావా?"

"చెయ్యి వదిలిన తర్వాత కూడా వినమన్నావా? చెయ్యివదలగానే చెంపమీద పెట్టలేదు. అది ఆలోచించు" అని అతగాడు వడివడిగా నడిచిపోతాడు.

***నా కుడిమీసం తీస్తా! నీ ఎడం మీసం తియ్యి.***

ఒకాయన మాట్లాడుతూ ప్రతిదానికీ పందెం కడుతూ ఉంటాడు. ఏమిటా పందెం? - "అది అలా జరిగితే నా కుడి మీసం తీస్తా. జరక్కపోతే నీ ఎడం మీసం తీసేస్తావా?" అని.

ఫలానా మంగమ్మ కూతురికీసారి మొగపిల్లాడు పుట్టి తీర్తాడు. పందెం వేస్తావా! నా కుడిమీసం - నీ ఎడం మీసం. ఫలానా ఆయన్ని మంత్రిగా తీసుకుంటారీ సంవత్సరం ఈ పంచాయతీలు బాగుపడటం కష్టం - పార్టీలు ఎక్కువైపోతున్నాయి. నా కుడిమీసం నీ ఎడం మీసం. ఇలా రోజుకో యాభై పందాలు వేస్తునే ఉంటాడాయన.

మొగవాళ్ళతోనే కాదు. ఆ ఉద్రేకంలో ఆడవాళ్ళతో కూడా ఇదే పందెం. "ఏం శాంతమ్మా. నీకొడుకీసారి బి.ఏ.పాసయితే నా కుడి మీసం - నీ ఎడం మీసం" అనేసేవాడు.

ఆవిడ నవ్వుకుని "వెనుకజన్మలో ఎన్నో పందాలు వోడి రెండు మీసాలూ వదిలేశా నాయనా! నాతో పందెం దేనికి? " అన్నదట.

అలాగే మీసాలు తీసేసిన ఒక చైనులుగారితో పందెం వేశాడు. ఆయనగారు "మీసాలు తీసి చాలాకాలమైంది నాయనా" అన్నాడట. దానికా పెద్దమనిషి "పందెం పందెమే అంతగా అయితే పెంచి మళ్ళా తీసెయ్యి" అని సలహా ఇచ్చాడట.

***మీకు కోపం వస్తే చెప్పలేను***

మాఊళ్ళో ఒకావిడ గంటలతరబడి సోది చెపుతూ మధ్య మధ్య "మీకు కోపం వస్తే నే చెప్పలేను" అంది. వంటవాళ్ళు కొంచెం మొహమాటం లేనివాళ్ళయితే "కోపం రావడమేమిటమ్మ. వచ్చి గంట అయింది. వచ్చికూడా ఏం చెయ్యలేకపోతున్నా" అనేవారు.

ఎవరో ఆవిణ్ణి పట్టుకుని తెగతిట్టారట - పట్టుకుంటే వదలదని. ఆమెకావార్త తెలిసింది. సరాసరి ఆయన దగ్గరికి వెళ్ళింది "మీరన్నమాటలు విన్నాను. నాకు నిజంగా కోపం వచ్చింది. మీకు కోపం వస్తే నే చెప్పలేను" అంది.

"నాక్కోపం రాకపోతే ఎందుకంటావమ్మా! నీక్కోపం వచ్చి మళ్ళీ పలకరించవేమో అనుకున్నా దానికి బదులు - రెండు కోపాలు (నాక్కోపం వచ్చింది మీక్కోపం వస్తే చెప్పలేను) వెంట పెట్టుకు వచ్చావాయె! ఇంకేం చేసేది" అన్నాడు.

ఒకావిడ ఏది చెప్పినా "ఎక్కడోపాడు" అనడం అలవాటు. భర్త వచ్చి ఏదో కోటో ఉత్తరీయమో కొనుక్కొచ్చానని సంతోషంగా చెపితే "కొన్నారేమిటి? " అనేది ముఖంలోకి వెలుతురు తెచ్చుకుని.

"అవునే గజం ఆరున్నర" అనేవాడాయన, ఆ వెలుతురు దోచుకోవాలనీ, మనస్సు దోచుకోవాలనీ.

"ఆరున్నరే! ఎక్కడోపాడు" అనేది.

"పాడంటావేమిటే? ఫస్టక్లాస్ పాప్లెన్ తెచ్చుకుంటే" అని ఆయన సంజాయిషీ

"పాప్లెన్ తెచ్చారు సరే. ఈ చారలేమిటి ఎక్కడో పాడు?" అని సమాధానం.

***పురుషుల అందాలేమిటి ఎక్కడో పాడు***

"మళ్ళీ పాడేమిటే? నీకు ఏది చెప్పినా పాడే, ఏది చూసినా పాడే ఇదెక్కడ దొరికిందో ప్రారబ్ధం కొద్దీ" అని ఆయన సణుగుడు.

"ఇప్పుడు నేనేమన్నానండీ. చారలు లేకుండా కొనుక్కోకపోయారా అన్నాను. చారలవి మీకు బాగుండవు. నల్లని నలుపాయె! ఎర్రటి వాళ్ళకైతే"

"పులివేషంలాగా ఉంటుంది. స్త్రీకి పురుషుల అందాలు తెలియాలని లేదు - భర్త అందాలు తప్ప.."

"పురుషుల అందాలేమిటి? ఎక్కడో పాడు. "

"ఎక్కడో పాడటమెందుకు ఇక్కడే పాడతాలేవే. నువ్వు పాడమన్న తర్వాత తప్పుతుందా? పాడనా మన ప్రణయ గేయాలు" అని ఆయన నివేదిక.

ఇలా పాపం చాలామంది వాటి అర్థం తెలియకుండా, అవతలవాళ్ళు బాధపడుతున్నారని గ్రహించకుండా ఊతపదాల్ని విసిరి కొడుతూ ఉంటారు. పచ్చిమిరపకాయో, అరటికాయా, వంకాయ, ఉల్లిపాయ, బంగాళదుంప ముక్కలు లేకుండా ఎలా ఉండవో అలాగే వారికి ఊతపదాలు లేకుండా వాక్యాలుండవు పాపం.

(8 ' మార్చ్ 72, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**మొన్న ఏదో ఫిలిం** చూస్తూంటే అందులో నాయికా నాయకులు ఒకరివెంట ఒకరుపడి - "మనం ఈ జన్మలో విడిపోవద్దు. విడిచి ఒక్క క్షణం బ్రతకలేం" అని డైలాగులు చెప్పుకుంటూ నిట్టూర్పులు విడవడం ప్రారంభించారు.

"ఎందుకు వాళ్ళంత అవస్థపడతారు. అక్కడ ఎవరూలేరుగా. తీరిగ్గా చెప్పుకోవచ్చుగా విషయాలేవైనా ఉంటే ప్రేమించుకున్న తర్వాత కూడా అంత గుండెలు బిగించుకోవడం దేనికి?" అని ఒక ప్రేక్షకుడు బిగ్గరగా అరిచాడు.

"ఏం చేస్తారు పాపం. ఆ అతనుడు అట్లా ఏడిపిస్తూన్నాడు వాళ్ళను" అని మరో ఆయన జవాబు చెప్పాడు.

"అతనుడా! ఆయనెవడు?" అని మొదటి వ్యక్తి ప్రశ్నించాడు.

***అతనుడయ్యా!... ఆయన్ని ఎరగవు?***

"అతనుడయ్యా!.ఆయన్నే ఎరగవు? ఏం? నీ జోలికి రాలేదేమిటి? చాలా విచిత్రపుమనిషిలాగా ఉన్నావే" అన్నాడు రెండో ఆయన.

"అతనుణ్ణి ఎరగని ఒక అతనున్నాడన్నమాట! ఎంత విచిత్రంగా ఉంది?" అన్నాడు మరో ఆయన. ఇంతలో ఇంటర్ వెల్ వచ్చింది.

"అతను... అతను అంటారేమిటి గొడవ. వాడెవడో చెప్పరాదూ!. నేనెరుగున్నానో లేదో చెపుతాను" అన్నాడు మొదటి వ్యక్తి.

"అతనుడు అంటే మన్మధుడయ్యా - ఆ మాత్రం తెలియదు? వాడి ఫోర్సు లేకుండానే జీవితం నడుపుతున్నావేమిటి?" అన్నాడు మూడో వ్యక్తి.

"మన్మధుడా! ఆయనకు అన్ని పేర్లున్నాయని నాకేం తెలియదు - నేనేం పండితుణ్ణికాదు" అన్నాడు మొదటి వ్యక్తి.

"పోనీ ఇప్పుడైనా తెలిసిందా?" అని ఒకరు.

"ఎప్పుడైనా నీ వెంటపడ్డాడా?"

"పువ్వులు బాణాలు గుప్పాడా నీమీద?"

"వంటరితనంలో చల్లారని నిప్పులు ఎప్పుడైనా చెరిగిపోశాడా నీమీద?"

"స్త్రీకి చెప్పుచేతుల్లో ఉండమని బుద్ధిచెప్పాడా ఎప్పుడైనా."

ఇలా తలో ప్రశ్నా వేశారాయన్ని - బెల్ కొట్టి దీపాలు ఆర్పేదాకా. పాపమా వ్యక్తి సిగ్గుపడిపోయాడు. చీకట్లో అతని ముఖం కనిపించలేదుగానీ - అతని పొడిదగ్గు మాత్రం వినిపించిది. పది నిమిషాల తర్వాత ఏమనుకున్నాడో ఆట వదిలి బైటికి వెళ్ళిపోయాడు.

***పదహారు పద్యాల్లో బరువైన విరహం***

ఈ కాలంలో వారు మన్మధుణ్ణి కూడా మరిచిపోతున్నారు చాలావరకు కొంత కాలం క్రిందటి వరకూ - మన్మధస్తుతి, ప్రస్తుతి వగైరాలమాట అలా వుంచి - విరహగీతాలైనా వినిపిస్తూ ఉండేవి. ప్రబంధాలలో, విరహానికి ఒక అశ్వాసం తక్కువకాకుండా వదిలి పెట్టేవారు. బాహుకుడి విరహాన్ని పదహారు పద్యాల్లో కూర్చారు నాటక కర్త.

అప్పటికి నిజానికి బాహుకుడి విరహంలో పదోవంతు అయ్యేదో, లేదో? కానీ ప్రేక్షకుల్ని అంతకన్నా బాధపెట్టడం మంచిది కాదని ఊరుకున్నాడు నాటక కర్త. "ఒక మకుటం పెట్టి శతకం చేసే బాగుండేది. హాల్లో వాళ్ళు పిల్లిమొగ్గలు వేసేవారు చక్కగా" అని ఒకాయన విమర్శించారు.

పూర్వం వాళ్ళు ఏదైనా ప్రేమకలాపంలో పడితే బయటపడక తప్పనిసరి తటస్థపడితే ఆ తప్పు తమ మీద వేసుకోవడమెందుకని పంచబాణుడి మీద నేరం మోపి ఆయన్ని జయిచడానికి నీ సహాయం కావాలంటూ "యుద్ధసంధి" అమలులో పెట్టమని ప్రార్ధించేవారు పాపం.

"మారుజారి కోర్వజాలరా!" అని నాయక కూడా నేరం ఆ మన్మధుని మీద పారేసి - ప్రియుణ్ణి ఆశ్రయం కోరేవారు. ఆపదలో ఉన్న మగువను కాపాడటం ఆత్మధర్మంగా భావించి - అభయమిచ్చేవారు పురుషులు. తమలోపమేమీలేనట్లే ప్రవర్తించేవారు.

***తను తాళలేదు ... ఇతరుల్ని తాళనియ్యదు.***

భామాకలాపం వగైరాలలో చూడాలి తమాషా! ఆవిడ విరహబాధంతా బయట పెట్టి నాయకురాలు చుట్టుపక్కల ఉన్నవాళ్ళను కూడా దుంపతెంపి పారేస్తోంది. అలా బయట పడటానికి ఎంతమాత్రం సంకోచించరు. మొదట్లో మెల్లగా "చెలీ! ఈ విరహబాధకు నే తాళలేనే!" అని జాలిపడేటట్లు ప్రారంభించడం జరుగుతుంది.

"పోనీ పాపం అవస్థపడుతుంది - ఎవరికైనా వస్తూంది ఇలాటి బాధ "అనుకుని ఊరడించడం ప్రారంభిస్తూంది ప్రక్కన ఉన్న చెలికత్తె. కాస్త జాలిపడేటప్పటికి ఆ విరహం. ఇంకింతగా ఉబుకుతుంది మనస్సులోనుంచి. 'ఎన్నోదిగడా.. దీని దుంపతెంపి వదిలిపెడతా' నన్నట్లు.

వేడి నిట్టూర్పులూ, వేదనార్బటులు, విషాదజ్వాలలు - ముంచెత్తడం ప్రారంభించి - అక్కడితోనూ తృప్తిపడక నే తాళలేనే.. నే తాళలేనే అంటూ మూడోకాలంలోకిపోయి చిందులు తొక్కుతూ ఆ వాతావరణాన్నీ, ఎదటివాళ్ళ హృదయాన్నీ చిందరవందర చేసిగానీ వదిలి పెట్టదు. ఆ దృశ్యం చూస్తే మన్మధుడు మరీ పోకిరీ రూపంలో వచ్చి ఆవిణ్ణి పూలబాణంతో కాకుండా - హంటర్‌తో చావబాదుతున్నట్టనిపిస్తూంది.

***ఈ మన్మథ బాధ.. బల్ల యజమాని బాధ***

నా చిన్నప్పుడు - రుక్మాంగద నాటకం చూశాను. మోహిని వచ్చి రుక్మాంగదుణ్ణి గిలిగింతలు పెట్టి వెడుతుంది. అంతటితో ఆ మహారాజుకి ఎక్కడలేని అవస్థా ఏర్పడుతుంది. కామజ్వరంతో కళ్ళు మూసుకుపోతాయి.

ఇకచూడాలి - అతడి అట్టహాసం "హా మన్మథా! వో మన్మథా! హా మన్మథా' అంటూ ఊరిలో ఎవరింట్లోనుంచో బదులు తెచ్చిన బల్లలు బద్దలుకొట్టడం మొదలుపెట్టాడు.

"బల్ల అద్దెకిచ్చిన పెద్దమనిషి, నాటకం వేయిస్తున్న ఊరి పెద్దలూ - ఇదేం కర్మం అలా చిందులు తొక్కుతాడు. పోనీ క్రిందకు దిగినా బాగుండును. మన్మధుణ్ణి వీడెక్కడ పట్టుకుంటాడు. వెర్రికేకలు తప్ప?" అని ఎంతో దిగులుపడుతూ ఉంటారు.

ఇలా ప్రబంధాలలో మన్మథభావనతో గంతులు వేయడం మాములుగా కనిపిస్తూ ఉంటుంది. ఆయనగారికి బహిరంగంగా అంతులేని అప్పీళ్ళు చేస్తూ ఉంటారు. వెన్నెలరాత్రులలో, వెయ్యివిధాల తలుచుకుని గొడవచేస్తూ ఉంటారు.

యుద్ధాలు చేసిన మహావీరులు చాలా మంది శత్రురాజుల్ని ఒక్క దెబ్బతో గెలిచి మొక్కవోని పరాక్రమాన్ని ప్రకటించి వచ్చి మన్మధుడి చేతిలో పడతారు. అంతటి పరాక్రమవంతుణ్ణి అతగాడు తుక్కుతుక్కుగా ఓడించి పారేస్తాడు.

ఆ సందర్భంలో ఎవరి సహాయమో కోరవలసివస్తూంది. సర్వం సహాచక్రవర్తి ఒక చక్కదనాలరాసికి మ్రొక్కవలసి వస్తూంది. అంతపనిచేస్తేగానీ మారడు అక్కడినుంచి పారిపోడు.

***అవస్థపెట్టి అర్జంట్ టెలిగ్రామ్ ఇప్పిస్తాడు.***

ఎంత అల్లరిచేస్తే మాత్రం అతణ్ణి కోప్పడే వారున్నారా! అదుపులో పెట్టేవారున్నారా! చేతికి దొరక్కుండా చేశాడు శివుడు. అక్కడితో అతని చేష్టలు మరీ ఎక్కువైనాయి. ఇంట్లో ఎప్పుడు ప్రవేశిస్తాడో తెలియదు. వంట్లో ఎప్పుడు ప్రవేశిస్తాడో తెలియదు. కంట్లో మసక చూపులు కల్పిస్తాడు.

అంతో ఇంతో బలంగా ఉన్న వాళ్ళక్కూడా బలహీనత కల్పించి అర్జెంటు టెలిగ్రాములు కొట్టిస్తాడు. ఆధునిక యుగంలో అతడు కొన్ని క్రొత్త కేంద్రాలు కల్పించుకున్నాడు వాటిని గురించి ఈసారి.